

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 74

గురువారం 5-6-2025

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మరో రెండేళ్లలో కుల గణన

2027 మార్చి 1 నుంచి జాతీయ జన గణన ప్రారంభం

-6లో



జూలై 21 నుంచి పార్లమెంట్

జస్టిస్ వర్మ అభిశంసన తీర్మానానికి చర్యలు చేపడతాం: కేంద్రం

-6లో

న్యూస్‌రీల్

మొబైల్ మహారాణులు



తెలంగాణ రాష్ట్రం స్మార్ట్‌గా దూసుకెళుతోంది. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ వినియోగం దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలోనే ఎక్కువగా ఉందని వెల్లడైంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు, యూపీఐల ద్వారా నగదు చెల్లింపులు తెలంగాణలోనే ఎక్కువగా జరుగుతున్నాయని సర్వేలో తేలింది.

- వివరాలు 16లో▶

స్వచ్ఛంగా భారత ఇం'ధనం'!



పర్యావరణ కాలుష్యం రోజురోజుకీ పెరుగుతున్న వేళ స్వచ్ఛ ఇంధనం ప్రాధాన్యత పెరుగుతోంది. అందుకే మనదేశం కూడా గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టింది. అంతేకాదు, ప్రపంచానికి మార్గదర్శకంగానూ నిలుస్తోంది. మన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 232 గిగావాట్లకు చేరుకుంది.

- వివరాలు 2లో▶

సీఐడీ చీఫ్‌గా చారుసిన్హా


చారుసిన్హా


శిఖా గోయల్

కేంద్ర సర్వీసుల నుంచి ఇటీవలే రాష్ట్ర కేడర్‌కు వచ్చిన ఐపీఎస్ అధికారి చారుసిన్హాకు సీఐడీ అడిషనల్ డీజీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. మరో సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్‌ను గతంలో ఉన్న కొన్ని పోస్టింగుల నుంచి తప్పించి.. టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా నియమించింది.

- వివరాలు 2లో▶

నదుల్లో ఇసుక 'తోడే'ళ్లు

రాష్ట్రంలో జోరుగా అక్రమ దందా.. సర్కారు ఆదాయానికి భారీగా గండి

గోదావరి, మంజీరా, కృష్ణా నదుల్లో అధికారిక ఇసుక క్వారీలు

- ఎక్కడికక్కడ అంతా కుమ్మక్కు.. అడ్డగోలుగా దోపిడీ
- లారీల్లో నింపే ఒక్కో అదనపు బకెట్‌కు రూ.1,500 చొప్పున వసూలు
- అసలు ఆన్‌లైన్ ఆర్డర్ కాపీ లేకుండానే తరలింపు
- లారీకి ఏక మొత్తంగా రూ.50 వేల వరకు దోచేస్తున్న కాంట్రాక్టర్లు
- ఒక ఆర్డర్ కాపీ మీద మూడు, నాలుగు ట్రిప్పుల్లో సరఫరా
- ప్రజా ప్రతినిధుల అండదండలు..చూసీ చూడనట్టుగా అధికారులు.... 'ఉచితం' ముసుగులోనూ అక్రమాలు.. రోజుకు రూ.50 కోట్ల దందా?

ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఇప్పగూడెం, యాకన్న గూడెం ఇసుక రీచ్‌లో జేసీబీలతో టిప్పర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం



సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. చాలా రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు లేవు. ఉన్నతస్థాయి పర్యవేక్షణ లేదు. దీంతో ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తున్నారు. ఒక్క రోజులోనే లక్షల రూపాయల విలువైన ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. ఆ మేరకు సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారిక ఇసుక రీచ్‌లకు

మిగతా 3వ పేజీలో ▶

టన్నుల కొద్దీ అక్రమాలు...

రాష్ట్రంలోని 32 అధికారిక రీచ్‌ల వద్ద అక్రమాలు జరుగుతున్నాయని లారీ డ్రైవర్లు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం..ఆర్డర్ కాపీ మేరకు.. ఆరు టైర్ల లారీలో 7–8 క్యూబిక్ మీటర్లు (11.5–12.5 టన్నులు), 10 టైర్ల వాహనంలో 12 క్యూబిక్ మీటర్లు (19.5 టన్నులు), 12 టైర్ల లారీలో 16 క్యూ.మీ. (26 టన్నులు), 14 టైర్ల వాహనంలో 20 క్యూ.మీ. (32 టన్నులు) మాత్రమే నింపాలి. కానీ సామర్థ్యానికి మించి, అలాగే బుక్ చేసుకున్న దాని కంటే అధికంగా సగటున 3 బకెట్ల వరకు ఇసుక అదనంగా నింపుతున్నారు. బకెట్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేస్తున్నారు. కొన్ని రీచ్‌ల వద్ద ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బంది.. లారీల్లో అదనంగా ఇసుకను నింపుకోవాలని, అందుకు డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇసుక లోడింగ్ సమయంలో ఒక్కో లారీకి (బకెట్ డబ్బులు కాకుండా) రూ.1,000–1,500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



విజయోత్సవంలో ఘోర విషాదం

బెంగళూరులో ఆర్‌సీబీ జట్టు సంబరాల్లో తొక్కిసలాట

11 మంది మృతి | **33 మందికి గాయాలు**

- ఫైనల్ జరిగిన 24 గంటల్లోపే సంబరాలకు సిద్ధమైన ఆర్‌సీబీ జట్టు
- స్టేడియానికి పోటెత్తిన అభిమానులు..
- ప్రధాని మోదీ, కర్ణాటక సీఎం దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం... దుర్ఘటనపై దర్యాప్తునకు సీఎం సిద్ధరామయ్య ఆదేశం

2 లో


అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

పెద్ద ధన్వాడలో ఫ్యాక్టరీ వాహనాలపై స్థానికుల దాడి



ఉత్పత్తికి ముందే మండుతున్న ఇథనాల్

పరిశ్రమలకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలు

- గతంలో దిలావర్‌పూర్.. తాజాగా పెద్ద ధన్వాడలో ఆందోళన
- ఈ పరిశ్రమలతో కాలుష్యం పెరిగిపోతుందని ఆగ్రహం
- ధాన్యం ఆధారిత ఇథనాల్ తయారీపైనే అభ్యంతరాలు
- రాష్ట్రంలో ఇథనాల్ తయారీ కోసం 31 సంస్థలు దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇథనాల్ తయారీ యూనిట్ల ఏర్పాటుపై ప్రజల నిరసన జ్వాలలు చల్లారడం లేదు. గతంలో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజలు తిరగబడటంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసింది. తాజాగా జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలోనూ ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను

మిగతా 5వ పేజీలో ▶

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్.. ఇంకా జాప్యమే!

15 తర్వాతే షెడ్యూల్... అధికారుల నిర్ణయం

- ఏఐసీటీఈ నుంచి ఇప్పటికీ రాని అనుమతి
- రాష్ట్ర వర్సిటీ అనుబంధ గుర్తింపునకూ బ్రేకులు
- ఇతర రాష్ట్రాల వైపు విద్యార్థుల చూపు
- యాజమాన్య కోటా సీట్లకు గండిపడే అవకాశం
- భారీగా విద్యార్థులను ఆకర్షిస్తున్న ప్రైవేట్ కాలేజీలు



సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్ ఇంకా విడుదల కాని కారణంగా ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. మే 11వ తేదీనే సెట్ ఫలితాలు విడుదల చేశారు. సాధారణంగా ఈఏపీసెట్ ఫలితాలు విడుదలైన వెంటనే షెడ్యూల్ ప్రకటిస్తారు. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం ముందే కౌన్సెలింగ్ చేపడతామని, క్లాసులు కూడా త్వరగా ప్రారంభిస్తామని ఉన్నత విద్యామండలి ఆరునెలల క్రితమే చెప్పింది. కానీ సెట్ ఫలితాలు విడుదలై నెల కావొస్తున్నా ఇంతవరకూ

మిగతా 2వ పేజీలో ▶


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు

ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

మంత్రివర్గ సమావేశంలో నివేదిక సమర్పిస్తాం

- ప్రతి సమస్యకూ తప్పకుండా పరిష్కారం కనుగొంటాం
- ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థిక కసరత్తు చేస్తున్నాం..
- ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యతని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి సమస్యకూ తప్పకుండా పరిష్కారం కనుగొంటామని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో ఉపసంఘం సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తదితరులు

మిగతా 2వ పేజీలో ▶

యూరియాపై చేతులెత్తేసినట్టేనా..?

- జూన్ నాటికి రాష్ట్రానికి రావాల్సింది 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు వచ్చింది 2.19 లక్షల మెట్రిక్ టన్నులే
- యూరియా కోసం మూడుసార్లు కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖలు

5 లో

ఇదండీ సంగతి



ఇది వరకు మూడు నాలుగు రోజులు తీసుకునేవాళ్లం... ఇప్పుడు ఓ పదిరోజులు తీసుకుందామా సార్!!


తిరుపతిలో 'వెన్నుపోటు దినం' ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

బాబు సూపర్ 6 వెన్నుపోటుపై తిరుగుబాటు

ఏపీలో కూటమి ప్రభుత్వ మోసాలపై కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం



తల్లికి వందనం పేరుతో వెన్నుపోటు పొడిచారంటూ గుంటూరులో నిరసన తెలుపుతున్న విద్యార్థి

వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ఉప్పెనలా కదలివచ్చి.. కదంతొక్కిన జనం

సూపర్ సిక్స్ పేరుతో మహిళలు, రైతులు, నిరుద్యోగ యువకులు.. ఇలా ప్రతి ఒక్కరికీ వెన్నుపోటు పొడిచావు

నువ్వు మోసం చేయని వర్గం అంటూ ఉందా బాబూ?

వైఎస్ జగన్ ఇస్తున్న పథకాలన్నింటినీ ఎత్తేశావు

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు.. శాంతి భద్రతలను నిర్వీర్యం చేశావు

నీ అబద్ధపు హామీలతో అందరినీ వంచించావు

ప్రశ్నించే గొంతును నొక్కేయడానికి రెడ్ బుక్‌తో టెర్రర్ సృష్టిస్తున్నావు

7 లో

కుట్రలు ఆపి.. ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ఊరూరా ప్రజల డిమాండ్... ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకోవడానికి పోలీసుల విఫలయత్నం

కూటమి సర్కార్ కుట్రలు.. పోలీసుల ఆంక్షలను ఛేదించుకుని నిరసనల్లో పాల్గొన్న ప్రజలు.... సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన 143 హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్


ఏపీవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ అధికారులకు డిమాండ్ పత్రాలు అందజేత

'వెన్నుపోటు దినం' గ్రాండ్ సక్సెస్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం

క్లుప్తంగా...

గోసంరక్షణ చట్టం అమలు చేస్తున్నారా?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గోసంరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారా? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని డీజీపీ, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. రాష్ట్రంలో గోసంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలేదంటూ వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఇండియా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్రంలో గోవధ, గోమాంసం అక్రమ రవాణాను నిరోధించేలా అధికారులను ఆదేశించాలని ఫెడరేషన్ కోరింది. ఈ నెల 7న బక్రీద్ సందర్భంగా గోవులను వధించే అవకాశం ఉన్నందున జంతు సంరక్షణ చట్టం 1977 అమలుకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై తాము మే 22, 28, 30వ తేదీల్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పరిగణనలోకి తీసుకోలేదని ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషన్‌లో వివరించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.శరత్ బుధవారం విచారణ చేపట్టారు. గతంలో ఇదే అంశంపై హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, ఆదేశాలు జారీ చేసినా అమలు కావడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. కాగా, గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

బక్రీద్‌కు గోవులను తరలిస్తున్నా ప్రభుత్వం స్పందించదా?

విశ్వహిందూ పరిషత్ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: బక్రీద్ సందర్భంగా గోవులను వధించేందుకు తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం సరైన రీతిలో స్పందించడం లేదని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, తెలంగాణ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గోరక్ష చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ తరఫున గురువారం రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తున్నట్టు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాలలో శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఆయా జిల్లా కలెక్టర్లకు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు పేర్కొన్నారు. వేములవాడ రాజన్న గోశాలలో నిరంతరం గోమాతల మృత్యుఘోష కొనసాగుతున్నా.. నివారణ చర్యలు చేపట్టకపోవడంపైనా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ.. శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

జీఎస్టీ కుంభకోణంపై సీఐడీ విచారణ వేగవంతం


త్వరలో మాజీ సీఎస్ సోమేశ్ విచారణ



సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ కుంభకోణం కేసులో సీఐడీ విచారణను వేగవంతం చేసింది. పన్ను ఎగవేతలతో వాణిజ్య శాఖకు చెందిన కొందరు అధికారులు దాదాపు రూ.1,400 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్న ఆరోపణలపై.. తెలంగాణ సీఐడీ అధికారులు హైదరాబాద్ సీసీఎస్ కేసు ఆధారంగా దర్యాప్తు చేపట్టడం తెలిసిందే. కమర్షియల్ ట్యాక్స్ యాప్స్, మాడ్యూల్స్ తయారీ, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సహా మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ సభ్యునిగా ఉన్న 'స్పెషల్ ఇనీషియేటివ్స్' వాట్సాప్ గ్రూపు వివరాలను సీఐడీ సేకరిస్తోంది. సమగ్ర దర్యాప్తులో భాగంగా వాణిజ్య పన్నుల రాష్ట్ర కమిషనర్ శ్రీదేవి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో భాగంగా బుధవారం ముగ్గురు టెక్నికల్ రిసోర్స్ పర్సన్లను విచారించారు. ఈ క్రమంలోనే మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌ను, మరికొందరిని మరోసారి ప్రశ్నించనున్నట్లు తెలిసింది.

స్వచ్ఛంగా భారత ఇం'ధనం'!

పర్యావరణ కాలుష్యం రోజురోజుకీ పెరుగుతున్న వేళ స్వచ్ఛ ఇంధనం ప్రాధాన్యత పెరుగుతోంది. అందుకే మనదేశం కూడా గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టింది. ప్రపంచానికి మార్గదర్శకంగానూ నిలుస్తోంది. మన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 232 గిగా వాట్లకు చేరుకుంది. తద్వారా ఈ రంగంలో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిదారుగా నిలిచింది. 2014లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 75.52 గిగావాట్లు మాత్రమే. అంటే పదేళ్లలో సామర్థ్యం మూడింతలు పెరిగిందన్న మాట. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ ఇంధన రంగంలో మనదేశం సాధించిన పురోగతిపై ప్రత్యేక కథనం.



2030 నాటికి 500 గిగావాట్ల సామర్థ్యాన్ని అందుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఏటా 50 గిగావాట్లకుపైగా గ్రీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని జోడించాల్సి ఉంటుంది. భారత పునరుత్పాదక ఇంధన రంగం 2020 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ మధ్య సుమారు 20 బిలియన్‌డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందుకుంది. 2047 నాటికి మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 1,800 గిగావాట్ల మైలురాయికి చేరాలన్నది భారత ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం. అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. అందుకు నిదర్శనం.. ఈ రంగంలో ప్రభుత్వం చేస్తున్న వ్యయం పెరగడమే. 2019–20 నుంచి 2023–24 నాటికి... పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.3,193 కోట్ల నుంచి రూ.6,119 కోట్లకు పెరిగింది.

టాప్‌లో సోలార్ పవర్..

సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడవ, పవన విద్యుత్ రంగంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించడం విశేషం. 2023లో మొత్తం పునరుత్పాదక విద్యుత్ 18.5 గిగావాట్లు, 2024లో 25 గిగావాట్లు అదనంగా వచ్చి చేరింది. 2014లో దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కేవలం 2.63 కోట్లే. కానీ, ప్రభుత్వ చర్యల ఫలితంగా 2025 నాటికి ఏకంగా 108 గిగావాట్లకు ఎగసింది. అంటే 41 రెట్ల పెరుగుదల అన్నమాట. దీంతో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 51 గిగావాట్లకు పెరిగింది. 2014లో ఇది 21 గిగావాట్లు.

మాడ్యూల్స్ తయారీలో..

సౌర విద్యుదుత్పత్తి విషయానికి వస్తే సోలార్ మాడ్యూల్స్ తయారీ సామర్థ్యం దేశంలో 2014లో 2.3 గిగావాట్లు మాత్రమే. 2024 నాటికి ఇది 90 గిగావాట్లను తాకింది. 2030 నాటికి 150 గిగావాట్లకు చేరుకోవాలని భారత్ ఆకాంక్షిస్తోంది. దశాబ్దం క్రితం దేశీయంగా సోలార్ సెల్స్, వేఫర్‌ల ఉత్పత్తి పరిమితంగా ఉండేది. నేడు సోలార్ సెల్స్ ఉత్పత్తిలో 25 గిగావాట్లు, వేఫర్ ఉత్పత్తిలో 2 గిగావాట్లతో భారత్ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి స్వయం సమృద్ధి గల దేశంగా మారే ప్రయత్నంలో మన దేశం 2030 నాటికి సోలార్ సెల్స్ ఉత్పత్తిలో 100 గిగావాట్స్, వేఫర్ ఉత్పత్తిలో 40 గిగావాట్ల సామర్థ్యాన్ని అందుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.24,000 కోట్లతో చేపట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం సౌర విద్యుత్ రంగానికి ఊపునిచ్చింది.

దూకుడుగా ప్రభుత్వం..

2025 ఫిబ్రవరి నాటికి దాదాపు 176 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. 70.21 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులకు టెండర్లు దాఖలయ్యాయి. సముద్రం లేదా సరస్సులో ఏర్పాటు చేసే ఆఫ్‌షోర్ పవన విద్యుత్ ప్రాజెక్టుల విభాగంలో 2030 నాటికి 37 గిగావాట్ల మేర టెండర్లను ఆహ్వానించాలని భారత్ నిర్ణయించింది. గుజరాత్, తమిళనాడులో పైలట్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆర్ ఈ–ఇన్వెస్ట్ 2024 వేదికగా భారత స్వచ్ఛ ఇంధన రంగంలో 2030 నాటికి రూ.32.45 లక్షల కోట్ల పెట్టుబడులకు వివిధ దేశాలకు చెందిన కంపెనీలు ముందుకు వచ్చాయి. ఇక దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో శిలాజేతర విద్యుత్ సామర్థ్యం వాటా 2014తో పోలిస్తే 32.5% నుండి గత ఏడాది 47.37%కి పెరిగింది. ప్రధానమంత్రి సూర్య ఘర్ ప్రాజెక్టును 2024 ఫిబ్రవరిలో కేబినెట్ ఆమోదించింది. 2026–27 నాటికి దేశంలో ఒక కోటి గృహాలకు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేయడానికి మొత్తం రూ.75,021 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా అదనంగా 30 గిగావాట్ల సౌర సామర్థ్యం లభిస్తుందని అంచనా. రూ.19,744 కోట్లతో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను మంత్రివర్గం ఆమోదించింది. 2030 నాటికి ఈ మిషన్ కింద 125 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అదనంగా చేరనుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

గ్రీన్ ఎనర్జీలో రాజస్తాన్ నెం.1	రాజస్తాన్	గుజరాత్	తమిళనాడు	కర్ణాటక	మహారాష్ట్ర	ఆంధ్రప్రదేశ్	హిమాచల్ ప్రదేశ్	మధ్యప్రదేశ్	తెలంగాణ	ఉత్తర ప్రదేశ్
	33,468	32,924	24,585	23,075	21,584	11,623	11,462	10,367	7,688	6,182

(సామర్థ్యం మెగావాట్లు) 2025 ఫిబ్రవరి 28 నాటికి.. ఆధారం: రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం

విజయోత్సవంలో ఘోర విషాదం

బెంగళూరులో ఆర్‌సీబీ జట్టు సంబరాల్లో తొక్కిసలాట

- 11 మంది మృతి, 33 మందికి గాయాలు
- ఫైనల్ జరిగిన 24 గంటల్లోపే బెంగళూరులో సంబరాలకు సిద్ధమైన ఆర్‌సీబీ జట్టు
- ఫలితంగా స్టేడియానికి పోటెత్తిన అభిమానులు.. ఈ క్రమంలోనే తొక్కిసలాట



చిన్నస్వామి స్టేడియం వద్ద క్రికెట్ అభిమానుల తోపులాట

సాక్షి, బెంగళూరు: గెలుపు సంబరాల్లో ఘోరం చోటుచేసుకుంది.. అభిమానుల కేరింతలు, కోలాహలంతో సందడిగా ఉన్న ప్రాంగణం ఒక్కసారిగా ఆర్తనాదాలతో మార్మోగింది. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం తొలిసారి ఐపీఎల్ టైటిల్ నెగ్గిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయోత్సవాలకు అసంఖ్యాకంగా అభిమానులు తరలిరావడంతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద పరిస్థితి అదుపుతప్పి భారీ తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 11 మంది మృతిచెందగా 33 మంది గాయపడ్డారు. ఈ విషాదంపట్ల ప్రధాని మోదీ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య... మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), ఆర్‌సీబీ టీమ్ మేనేజ్‌మెంట్ కలిసి రూ. 5 లక్షల చొప్పున అందిస్తామని ప్రకటించాయి.

ఏం జరిగిందంటే?

ఆర్‌సీబీ అభిమానులు మంగళవారం రాత్రి నుంచే బెంగళూరులో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆర్‌సీబీ జట్టు తమ హోం గ్రౌండ్‌లో అభిమానుల సమక్షంలో ఆనందం పంచుకోవాలని భావించింది. అహ్మదాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరులోని హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి జట్టు సభ్యులు వచ్చారు. ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేరుగా హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి వెళ్లి వారికి స్వాగతం పలికారు. షెడ్యూల్ ప్రకారం ముందుగా విధాన సౌధ వద్ద కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అక్కడ కార్యక్రమం సజావుగానే సాగింది. అక్కడి నుంచి ఓపెన్ టాప్ బస్సులో 'విక్టరీ పరేడ్'తో చిన్నస్వామి స్టేడియానికి ఆటగాళ్లు చేరుకోవాల్సి ఉంది. అయితే అభిమాన ఆటగాళ్లను చూసేందుకు అప్పటికే భారీ సంఖ్యలో అభిమానులు స్టేడియానికి పోటెత్తడంతో మైదానం పూర్తిగా నిండిపోయింది. అయినప్పటికీ బయట కూడా భారీగా ఫ్యాన్స్ నిరీక్షిస్తూ ఉండిపోయారు. చివరకు ఇదే తొక్కిసలాటకు దారితీసింది. వారిని నియంత్రించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ తోపులాటలో శ్వాస అందక కొందరు సొమ్మసిల్లారు. అస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలించేందుకు కూడా వీల్లేని స్థితిలో అభిమానులు పోటెత్తారు. చివరకు క్షతగాత్రులను బౌరింగ్ ఆస్పత్రికి, వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ప్రణాళికా లోపమే కారణం...

దాదాపు ఏడాది క్రితం భారత టీ20 జట్టు వరల్డ్ కప్ గెలిచి వచ్చిన తర్వాత ముంబైలో ఓపెన్ టాప్ బస్సులో విజయ యాత్ర జరిగింది. అయితే అంతటి మహానగరంలో కూడా ఎక్కడా ఎలాంటి సమస్య రాకుండా అధికారులు, పోలీసులు చక్కటి ఏర్పాట్లు చేశారు. కానీ ఇప్పుడు ఆర్‌సీబీ వేడుకలో అపశ్రుతి చోటుచేసుకుంది. నిజానికి టీమ్ మేనేజ్‌మెంట్ చాలా హడావుడిగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఫైనల్ జరిగిన 24 గంటల్లోపే బెంగళూరు వచ్చేసి ఇలాంటి ఈవెంట్ చేయాల్సిన అవసరం ఏమాత్రం లేదు. సన్నాహాలకు కనీస సమయం కూడా ఇవ్వకుండా ప్రోగ్రామ్ వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి టీమ్ ఫ్యాన్స్‌కు పిలుపు ఇచ్చేసింది. మంగళవారం రాత్రి నుంచి ఇంకా గెలుపు ఆనందంలోనే ఉన్న అభిమానులకు ఈ కార్యక్రమం దానికి కొనసాగింపులా కనిపించి అంతా ఒక్కసారిగా దూసుకొచ్చారు. పోలీసులు చివరకు పరిస్థితిని వివరించి ఓపెన్ టాప్ బస్సు ర్యాలీ జరగకుండా నిలువరించినా... అప్పటికే పెద్ద నష్టం జరిగిపోయింది. ఒకవైపు తొక్కిసలాటతో మైదానం బయట పరిస్థితి విషాదం నెలకొన్నప్పటికీ మరోవైపు స్టేడియంలో వేడుకలు కొనసాగాయి. అయితే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ ఆర్‌సీబీ అధికారులకు ఫోన్ చేసి వెంటనే కార్యక్రమం ఆగిపోయేలా చేశారు. జనాన్ని అదుపు చేయడం చాలా కష్టంగా మారిందని, పోలీసులు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఇది చాలా దురదృష్టకరమని.. నిర్వాహకులు సరైన ప్రణాళికతో కార్యక్రమం చేయాల్సిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అభిప్రాయపడ్డారు. మరోవైపు ఈ ఘటనపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పరస్పర రాజకీయ విమర్శలకు దిగాయి.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారని.. ఇందులో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. 'కొన్నేళ్లుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్నీ ఒకేసారి చేయలేకపోయాం. ఇక ఎక్కువ కాలం పెండింగ్‌లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలనేదే ప్రభుత్వ ఆలోచన'అని భట్టి ఉద్యోగ సంఘాలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని.. అయినా ఉద్యోగులకు సాధ్యమైన మేర మేలు చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని భట్టి చెప్పారు. ఇప్పటికే ప్రతినెలా మొదటి తారీఖున జీతాలు చెల్లిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నామని.. ప్రభుత్వ ఆదాయం.. ఖర్చు, చేయాల్సిన పనులను బేరీజు వేసుకుంటూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఎం ముందుకు వెళ్తున్నారని భట్టి వివరించారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై ఇప్పటికే కేబినెట్ సహచరులం అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న అంశంపై ఎవరికీ భిన్నాభిప్రాయం లేదన్నారు. గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో త్రిసభ్య కమిటీ నివేదిక, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి ఇస్తామన్నారు. ఈ సమావేశంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్, సభ్యులు లోకేష్ కుమార్, కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తాం

తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న జగదీశ్వర్. చిత్రంలో శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లకు సంబంధించిన పూర్తిస్థాయి సమస్యలను ప్రభుత్వానికి నివేదించామని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తామన్నారు. బుధవారం మంత్రివర్గ ఉపసంఘంతో సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ త్రిసభ్య కమిటీతోపాటు త్రివర్గ ఉప సంఘం కూడా ఉద్యోగుల విషయంలో సానుకూలంగా ఉందని చెప్పారు. ఉద్యోగుల సమస్యల్లో ప్రధానంగా ఆర్థికేతర అంశాలను వేగవంతంగా పరిష్కరించాలని.. ఆర్థికపరమైన అంశాలను విడుదలవారీగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులతోపాటు ఉద్యోగుల హెల్త్ స్కీంపై వేగంగా నిర్ణయం ప్రకటించాలని కోరారు. గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం అనంతరం ఈ నెల 9న జేఏసీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని చెప్పారు.

పోలీసులు నడిరోడ్డు మీద థర్డ్ డిగ్రీ ప్రదర్శించవచ్చా?

హోంమంత్రి దాన్ని సమర్థిస్తూ మాట్లాడవచ్చా?
సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ పోస్టు



సాక్షి, అమరావతి: తెనాలి పోలీసులు యువకులను నడిరోడ్డు మీద బూటుకాలితో తొక్కిపెట్టి లాఠీలతో కొట్టిన ఘటనపై సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ ఎక్స్‌లో బుధవారం స్పందించారు. పోలీసులు నడి రోడ్డు మీద థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. దీన్ని హోంమంత్రి అనిత సమర్థించడాన్ని ఆయన ఆక్షేపించారు. 'అరికాళ్ల మీద లాఠీలు, మోకాళ్ల మీద తొక్కుడు కాళ్లు అనుభవించిన ఆ యువకులకు కులం లేదు.. లాఠీల తొక్కుడుకాళ్ల భటులకు కులం లేదు, ఒప్పుకుందాం. వాళ్ల ఎస్కోబార్ అంతటి నార్కోడాన్స్, అదీ ఒప్పుకుందాం.. ఏపీ హోం మంత్రికి, ముఖ్యమంత్రి కులం లేదు అదీ ఒప్పుకుందాం'.. కానీ పోలీసులు అట్లా నడిరోడ్డు మీద థర్డ్ డిగ్రీ ప్రదర్శన చేయవచ్చా? దాన్ని హోంమంత్రి సమర్థిస్తూ మాట్లాడవచ్చా, ముఖ్యమంత్రి కూడా నర్మగర్భంగా సపోర్ట్ చేయవచ్చా? అని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్, రఘురామరాజు విషయంలో ఏం మాట్లాడారో మరచిపోవచ్చా అని పేర్కొన్నారు. కులం మరచి, దెబ్బలతో మైమరచి, కేరింతలు కొట్టండి అంటూ ప్రభుత్వానికి చురకలు వేశారు.

సీఐడీ చీఫ్‌గా చారుసిన్హా

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా శిఖాగోయల్
పలువురు ఐపీఎస్‌లకు పోస్టింగులు..స్థాన చలనం

సాక్షి హైదరాబాద్: డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లి ఇటీవలే రాష్ట్ర కేడర్‌కు తిరిగి వచ్చిన 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి చారుసిన్హాకు సీఐడీ అడిషనల్ డీజీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. మరికొందరు ఐపీఎస్‌లను బదిలీ చేయడంతో పాటు కొందరికి పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.1994 బ్యాచ్‌కి చెందిన మరో సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖాగోయల్‌ను గతంలో ఉన్న కొన్ని పోస్టింగుల నుంచి తప్పించి.. టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా, టీజీఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా నియమించారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న అభిలాష బిస్త్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మైనార్టీ సంక్షేమ శాఖలో స్పెషల్ సెక్రటరీగా పనిచేస్తున్న తఫ్సీర్ ఇక్బాల్ చార్మినార్ జోన్ డీఐజీగా బదిలీ అయ్యారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న డీవీ శ్రీనివాసరావును మెదక్ జిల్లా ఎస్పీగా నియమించారు. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా పని చేస్తున్న పాటిల్ కాంతిలాల్ సుభాష్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లో స్పెషల్ బ్రాంచి డీసీపీగా పనిచేస్తున్న ఎస్.చైతన్యకుమార్ నగర సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ అయ్యారు.

గ్రేటర్‌లో భూగర్భ విద్యుత్ లైన్లు



- సెక్షన్ల వారీగా చేపట్టిన సర్వే దాదాపు పూర్తి
- ఒక్కో సెక్షన్‌కు రూ.100 కోట్లు !

సాక్షి, రంగారెడ్డి జిల్లా: హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన రహదారులు, వీధుల్లో వేలాడుతున్న ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను తొలగించి, వాటిస్థానంలో భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు సెక్షన్ల వారీగా ఉన్న సబ్‌స్టేషన్లలోని ఫీడర్ల వారీగా వివరాలను సేకరిస్తోంది. ఈ ప్రక్రియ ఇప్పటికే దాదాపు పూర్తి కావొచ్చింది. ఒక్కో సెక్షన్‌కు రూ.వంద కోట్ల చొప్పున.. గ్రేటర్‌వ్యాప్తంగా రూ. 22 వేల కోట్లకుపైగా అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసింది. మెట్రోజోన్ పరిధిలోని హైదరాబాద్ సెంట్రల్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో డిస్ట్రిబ్యూషన్ లైన్లు మినహా 33/11 కేవీ లైన్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. మేడ్చల్ (హబ్సిగూడ, మేడ్చల్ సర్కిల్), రంగారెడ్డి (సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్) జోన్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇప్పటికీ ఓహెచ్ (ఓవర్ హెడ్‌లైన్లు) కనిపిస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి తరచూ తెగిపడుతూ.. అటుగా వచ్చి వెళ్లేవారిపై పడి అమాయక ప్రజల మృత్యువాతకు కారణమవుతున్నాయి. ప్రమాదాలను నియంత్రించడంతోపాటు వేలాడే కరెంట్ తీగలు కనిపించని నగరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఆ మేరకు నగరమంతా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇటీవలే డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం బెంగళూరులో పర్యటించి, ఆ మేరకు భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను పరిశీలించింది. సెక్షన్ల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడంతో ప్రాజెక్ట్ విభాగం సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనుంది.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్.. ఇంకా జాప్యమే!

▶ మొదటి పేజీ తరువాయి

కౌన్సెలింగ్‌పై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జాప్యానికి వారు అనేక కారణాలు చెబుతున్నారు. ఈ నెల రెండో వారం వరకూ షెడ్యూల్ మాత్రం ఇచ్చే ప్రయత్నం చేస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. రానురాను ప్రక్రియ ఆలస్యమవుతున్న కారణంగా ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు యాజమాన్య కోటాలో చేరాలనుకునే వారు ఇతర రాష్ట్రాల వైపు చూస్తున్నారు.

ఏఐసీటీఈనే కారణమా? : కాలేజీల్లో సీట్లు, బ్రాంచ్‌లకు సంబంధించి ప్రతీ కాలేజీకి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి అవసరం. ఏటా ఏప్రిల్ నెలాఖరు, లేదా మే మొదటివారంలోనే ఈ గుర్తింపు ఇస్తుంది. తమతో సంప్రదించిన తర్వాతే సీట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని అన్ని రాష్ట్రాలూ ఏఐసీటీఈకి లేఖలు రాశాయి. అనుమతి ఇచ్చినా, రాష్ట్ర పరిధిలోని విశ్వవిద్యాలయాలు కొత్త సీట్లు, బ్రాంచ్‌కు అనుబంధ గుర్తింపు నిరాకరిస్తున్నాయి. ఇది న్యాయ వివాదానికీ కారణమవుతోంది. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని ఈసారి ఏఐసీటీఈ ఆచితూచి అడుగులేస్తోంది. ఈ కారణంగానే అనుమతి ఇవ్వడానికి ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 13లోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని ఏఐసీటీఈ తెలిపింది. దీంతో రాష్ట్రంలో ఎన్ని ఇంజనీరింగ్ సీట్లు ఉంటాయనే దానిపై స్పష్టత వస్తుంది. ప్రస్తుతం 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. గత ఏడాది దాదాపు 12 వేల సీట్ల పెంపునకు కాలేజీలు ముందుకొచ్చాయి. 3 వేల సీట్లు పెంచినా రాష్ట్ర ప్రభుత్వం అనుమతించలేదు.

ఖరారు కాని ఫీజులు : ఇంజనీరింగ్ ఫీజులు ఖరారవ్వకపోవడమూ కౌన్సెలింగ్‌కు అడ్డంకిగా మారింది. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ ప్రతీ మూడేళ్లకోసారి ఇంజనీరింగ్ ఫీజులను సమీక్షిస్తుంది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి కొత్త ఫీజులు ఖరారు చేయాల్సి ఉంది. ప్రైవేట్ కాలేజీలు సమర్పించిన గడిచిన మూడేళ్ల వార్షిక నివేదికలపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫీజుల పెంపు నిర్ణయాన్ని ఎఫ్‌ఆర్‌సీ ప్రభుత్వానికి తెలిపింది. సర్కార్ నుంచి ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. కౌన్సెలింగ్ చేపట్టే సమయంలో ఏ కాలేజీలో ఎంత ఫీజు అనే వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఫీజులపై స్పష్టత లేని కారణంగా కౌన్సెలింగ్ సాఫ్ట్‌వేర్‌లో వివరాలు ఫీడ్ చేయలేమని అధికారులు అంటున్నారు.

ప్రైవేట్ కాలేజీల హడావిడి

రాష్ట్ర కౌన్సెలింగ్ ఆలస్యమవ్వడం, విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో సీట్లపై ఆరా తీయడంతో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో గుబులు మొదలైంది. దాదాపు 35 వేల సీట్లు యాజమాన్య కోటా కింద భర్తీ అవుతాయి. కన్వీనర్ సీట్ల భర్తీ తర్వాతే మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ చేయాలి. దీంతో కాలేజీలు ముందే సీట్ల రిజర్వేషన్‌పై ఆరాట పడుతున్నాయి. పీఆర్వోలు, కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకొని సీట్లు అనధికారికంగా భర్తీ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ముందుకు సాగని అనుబంధ గుర్తింపు

కౌన్సెలింగ్ నాటికి వర్సిటీలు సీట్లు, బ్రాంచ్‌లు ఖరారు చేసి, అనుబంధ గుర్తింపు ఇవ్వాలి. ఈ జాబితాను సాంకేతిక విద్యావిభాగానికి పంపాలి. వీటి ఆధారంగానే సాఫ్ట్‌వేర్ రూపొందిస్తారు. విద్యార్థులు కన్వీనర్ కోటాకు ఆప్షన్లు ఇవ్వడానికి వీలుంటుంది. ఇప్పటికే కాలేజీల తనిఖీలు పూర్తి చేసిన జేఎన్‌టీయూహెచ్.. కొన్నింటిపై అభ్యంతరాలు లేవనెత్తింది. ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ సరిగా లేదని పేర్కొంది. వీటిని సరిచేసుకునేందుకు గడువు కూడా ఇచ్చింది. మరోవైపు కొత్త సీట్ల పెంపుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఇవన్నీ అఫ్లియేషన్ల ప్రక్రియను ముందుకు కదలనివ్వడం లేదు. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీకి జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు పెట్టింది. అయినా రాష్ట్ర కౌన్సెలింగ్ ముందుకు కదిలేట్టు లేదు.

నదుల్లో ఇసుక 'తోడే'ళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్ ఆర్డర్ కాపీ తీసుకుని వచ్చే లారీలో అదనంగా ఇసుక నింపి అక్రమ వసూళ్లకు పాల్పడటం ఒక రకమైన దోపిడీ అయితే, అసలు ఆర్డర్ కాపీయే లేకుండా ఈ రీచ్‌ల నుంచి ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక అనధికారిక రీచ్‌ల నుంచి తరలిపోయే ఇసుకకు లెక్కాపత్రమే ఉండకపోవడం గమనార్హం. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండగా.. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది లేకపోవడంతో ఇసుక అక్రమ దందా జోరుగా సాగిపోతున్నట్లు 'సాక్షి' పరిశీలనలో తేలింది. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధుల అండదండలు, కనుసన్నల్లోనే ఈ దందా సాగుతోందనే ఆరోపణలున్నాయి. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తమ వంతు పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం.

ఆ నదుల్లో..

ప్రస్తుతం రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 32 ఇసుక రీచ్‌లు అధికారికంగా నడుస్తుండగా, అనధికారికంగా 52 వరకు ఉన్నట్టు తెలుస్తోంది. గోదావరి, మంజీరా, కృష్ణా నదుల్లో అధికారిక ఇసుక క్వారీలు ఉన్నాయి. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెంలో 12, ఉమ్మడి వరంగల్‌లో 9, కరీంనగర్‌లో 6 ఉండగా, ఖమ్మం, మంచిర్యాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, నల్లగొండల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఇసుక కావాల్సిన వారు క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ.650 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లిస్తే ఆ మేరకు ప్రభుత్వం ఆర్డర్ కాపీ (ఓఆర్డీ) ఇస్తుంది. ఈ ఆర్డర్ కాపీ తీసుకుని రీచ్‌కు వెళితే కాంట్రాక్టర్ సిబ్బంది జేసీబీల ద్వారా లారీలో ఇసుకను నింపుతారు. ఈ విధంగా యంత్రాలు, సిబ్బందిని ఏర్పాటు చేసినందుకుగాను ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు క్యూబిక్ మీటర్‌కు రూ.110 చొప్పున చెల్లిస్తోంది. ఒకవేళ గిరిజన సొసైటీల నిర్వహణలో రీచ్‌లు ఉన్నట్లైతే వాటికి క్యూబిక్ మీటర్‌కు రూ.250 చొప్పున ఇస్తోంది. ఈ క్రమంలో రీచ్‌ల వద్ద మైనింగ్ (టీజీఎండీసీ), రెవెన్యూ శాఖలకు సంబంధించిన సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఉండాలి. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసిన ప్రకారమే ఇసుక నింపుతున్నారా? అక్రమాలకు పాల్పడుతున్నారా? అనేది చూడాలి. ప్రతి వాహనాన్ని జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయాలి. కానీ అలా జరగడం లేదనే ఆరోపణలున్నాయి.



పెద్దపల్లి జిల్లాలో వాగులనుంచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు, తరలింపు

ఓఆర్డీ అసలే లేకుండా, ఒక్కో ఆర్డర్‌పై నాలుగైదు లారీల్లో..

చాలా క్వారీల్లో సిబ్బంది ఎటువంటి ఓఆర్డీలు లేకుండానే లారీకి రూ.50 వేలు తీసుకుని ఇసుక నింపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఒక్కరి పేరు మీద పర్మిట్ తీసుకుని, దానిపైనే నాలుగు, ఐదు లారీలల్లో ఇసుక సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కాగా అలా నింపిన లారీలను ఎలాంటి ఆటంకం లేకుండా గమ్యస్థానం చేరేలా స్థానిక నేతల అండదండలతో మైనింగ్, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులను మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అనధికారిక రీచ్‌లలో ఏం జరుగుతోంది?

అనధికారిక రీచ్‌లు పూర్తిగా చట్ట విరుద్ధం. చాలావరకు గతంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి విరమించుకున్న ప్రాంతాల్లోనే ఈ దందా సాగుతోంది. దీనిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై ములుగు టీజీఎండీసీ ప్రాజెక్టు అధికారి విష్ణువర్ధన్, భూపాలపల్లి పీవో శ్రీకాంత్ నుంచి 'సాక్షి' ఫోన్ ద్వారా వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

మంత్రి ఇలాకాలో ఇసుకాసురులు!

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మంత్రి ఇలాకాలో యథేచ్ఛగా ఇసుక దందా నడుస్తోంది. వెంకటాపూర్, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లోని గోదావరి రీచ్‌ల నుంచి సాగుతున్న ఈ దందాకు సదరు మంత్రి అనుచరుల్లో కొందరి అండదండలు ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. అయితే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ ప్రచారం నిజమేననే వాదన విన్పిస్తోంది. పై స్థాయి ప్రజాప్రతినిధుల అండదండలు ఉండబట్టే.. కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా గోదావరిలోకి రోడ్లు వేసి మరీ ఇసుక తోడుతున్నారని, మామూళ్లు తీసుకుంటూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తే తమపైనే అక్రమ కేసులు బనాయిస్తారని స్థానికులు భయపడుతుండటం గమనార్హం.



ఇది జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల ఏలికేశ్వరం ఇసుక రీచ్. బుధవారం ఇక్కడి నుంచి 7,356 టన్నుల ఇసుక తరలించేందుకు 228 ఆన్‌లైన్ ఆర్డర్లు బుక్ అయ్యాయి. అంటే 228 లారీల ద్వారా ఈ ఇసుకను తీసుకెళ్తారన్న మాట. లారీ సైజును బట్టి ఒక్కో దానిలో 16 టన్నుల నుంచి 35 టన్నుల వరకు లోడ్ చేస్తుంటారు. అయితే ప్రస్తుతం రీచ్ వద్ద సీసీ కెమెరాలు లేవు. మైనింగ్ విభాగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో ఒక్కో లారీలో నాలుగు నుంచి ఆరు బకెట్ల (జేసీబీ ఒక్కసారి తోడే ఇసుక) ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్టు సమాచారం. ఇందుకోసం బకెట్‌కు రూ.1,500 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ఒక్కో లారీలో సగటున మూడు బకెట్లు వేశారనుకుంటే మూడు బకెట్లకు రూ.4,500 చొప్పున 228 లారీలకు గాను రూ.10.26 లక్షలు దోచుకుంటున్నారన్న మాట.

ఉచితం పేరిట యథేచ్ఛగా..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక సరఫరాకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పథకాల (ఇందిరమ్మ) కింద ఇళ్లు నిర్మించునే వారు కేవలం రూ.1400 చెల్లిస్తే అతడికి రిజిస్టర్డ్ ట్రాక్టర్ యజమాని ఇంటికి వచ్చి ట్రాక్టర్ ఇసుక పోసి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విధానంతో పేదలైన లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక లభిస్తుండగా, మరోవైపు స్థానిక ట్రాక్టర్ యజమానులకు ఉపాధి దొరుకుతోంది. అయితే ఈ విధానాన్ని అనుకూలంగా మలచుకుని ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో గ్రామాల్లో ఉన్న చోటా మోటా నేతలు స్థానిక వాగులను తోడేస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో ఇసుకను డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ఆ ఇసుకను లారీల్లో ఇతర జిల్లాలకు, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ప్రతిరోజూ ఒక్కో జిల్లాలో ట్రాక్టర్ల ద్వారా 500 నుంచి 800 ట్రిప్పుల ఇసుకను 'ఉచితం' పేరిట తోడుతూ ఇష్టారాజ్యంగా అమ్మేసుకుంటున్నారే ఆరోపణలున్నాయి. ఇలా రోజుకు రూ.50 కోట్లకు పైగా విలువైన ఇసుక పక్కదారి పడుతున్నట్టు అంచనా. కొన్ని జిల్లాల్లో ఈ అక్రమ దందాను గ్రామ కమిటీలు వేలం ద్వారా కూడా నిర్వహిస్తుండటం గమనార్హం.

హైదరాబాద్‌కు ఇలా..

అక్రమంగా తోడేస్తున్న ఇసుక హైదరాబాద్‌కు, ఇతర ముఖ్య నగరాలకు వస్తోంది. వాస్తవానికి గ్రేటర్ హైదరాబాద్‌లో రియల్ వ్యాపారం ఊపందుకోవడంతో ప్రభుత్వం ఇసుకను తక్కువ ధరకు అందించడానికి 'తెలంగాణ ఇసుక బజార్'లను ఏర్పాటు చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి అబ్దుల్లాపూర్ మెట్, వట్టినాగులపల్లి, బౌరంపేట, ఆదిభట్లలో నాలుగు ఇసుక బజార్లను ప్రారంభించారు. త్వరలో శామీర్‌పేట్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు చేస్తామని టీజీఎండీసీ ప్రకటించింది. బ్లాక్ మార్కెట్‌లో ఇసుక ధరలు విపరీతంగా పెరిగి.. వ్యాపారులు టన్ను ఇసుకను రూ.2,000 నుండి రూ.3,000 వరకు విక్రయిస్తున్న నేపథ్యంలో.. ఈ దందాను అరికట్టడానికి ఈ బజార్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఈ బజార్‌ల లో అందుబాటులో ఉండేది. వాస్తవ అవసరాలతో పోల్చుకుంటే నామమాత్రమేనని బహిరంగ రహస్యం.

నదిలో రోడ్లు వేసి మరీ..

- నారాయణపూర్ జిల్లాలో ఇసుక నిలువు దోపిడీ
- సరిహద్దులు దాటించి కర్ణాటకకు తరలింపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఇసుకాసురులు కృష్ణానది గర్భాన్ని తోడేస్తున్నారు. 'హద్దులు'దాటి తెలంగాణ ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. వర్షాలు పడడంతో ప్రస్తుతం నదిలో వరద నీరు పారుతుండగా.. దందా నిలిచిపోయింది. కానీ అంతకుముందు తెలంగాణ–కర్ణాటక రాష్ట సరిహద్దు నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్న బాగోతంలో విస్మయ పరిచే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండలం టైరోడ్ సమీపంలో కృష్ణా పరివాహకంలోని ఓ ఆశ్రమం వద్ద మాఫియా ఆధ్వర్యంలో నదిలో రెండుచోట్ల, ముడుమాల్ వద్ద నదిలోనూ రోడ్డు వేశారు. వరద నీరు వచ్చినా సజావుగా వెళ్లేలా సిమెంట్ పైపులతో తూములు ఏర్పాటు చేశారు. ఐదు అనధికార రీచ్‌లలో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి రోజుకు వందలాది ట్రిప్పుల చొప్పున ఇసుకను భారీ వాహనాల్లో హిందూపూర్ మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలించారు. రెండు నెలలకు పైగా పగలు, రాత్రనక ఇసుక తవ్వకాలు జరిగాయి. రోజుకు సుమారు 180 నుంచి 200 వరకు లారీల్లో కర్ణాటకకు తరలించారు. ఐదు ప్రాంతాల్లో మూడు కిలోమీటర్ల పొడవు, అర కిలోమీటర్ వెడల్పులో 20 అడుగుల లోతు వరకు ఇసుక తవ్వినట్లు అంచనా. ఇసుకను కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న ఓ భారీ పారిశ్రామికవాడకు తరలించగా.. వాహనానికి రూ.35 వేల నుంచి రూ.40 వేల చొప్పున పలికినట్లు సమాచారం. కాగా దందా జరిగిన సమయంలో నారాయణపేట జిల్లాలో ఓ ప్రాధాన్య శాఖకు సంబంధించి రోజుకు రూ.4 లక్షలు..మిగిలిన విభాగాలకు చెందిన పలువురికి రూ.2 లక్షల చొప్పున మామూళ్లు అందినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రోజుకు దాదాపు వంద టిప్పర్ల చొప్పున 45 రోజులకు లెక్కేసుకున్నా..ప్రభుత్వానికి రూ.5.40 కోట్ల మేర నష్టం కూరేవని అంచనా. ఈ వ్యవహారంలో నారాయణపేట జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఓ నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి, దేవుడి పేరు గల నేత కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై టాస్క్‌ఫోర్స్‌లోని రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, టీజీఎండీసీ తదితర అధికారులను ప్రశ్నించగా.. 'మాకు తెలియదు.. మా పరిధిలోకి రాదు..'అంటూ సమాధానాలు దాటవేశారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌ది ఎగవేతల ప్రభుత్వం

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఎగవేస్తోందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తోందని, అయితే పాలనంతా ఎగవేతలతోనే నిండిందని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేరు ఎగవేతల రేవంత్‌రెడ్డిగా మారిందని ఎద్దేవా చేశారు. తాజా కేబినెట్ సమావేశంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం ఎలా? అనేది ఎజెండాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఏడాదిన్నర కాలంలో రైతులను నిలువునా ముంచారని, ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. ఒక సీజన్లో పూర్తిగా ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. ప్రతి ఎకరానికి రైతులకు చెల్లించాల్సిన బాకీని తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆస్థాన గుత్తేదారుల సంక్షేమం కోసమే మంత్రివర్గ సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. రైతు బీమా పథకానికి సంబంధించి ప్రీమియంను ఎల్‌ఐసీకి చెల్లించడం లేదని, ఫిబ్రవరి తర్వాత మరణించిన రైతులకు బీమా డబ్బులు ప్రభుత్వం ఇస్తుందా? అని ప్రశ్నించారు. రుణమాఫీ పథకంలో రైతులకు ఇంకా రూ.10 వేల కోట్లు బకాయిపడ్డారని, మహాలక్ష్మి పథకం ఎందుకు ముందడుగు పడడంలేదని, మహారాష్ట్రలో లాడ్లీ బహెన్ పథకంకింద రూ.2,500 చొప్పన ప్రతి మహిళకు ఇస్తున్నారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి కన్నుమూత



శామీర్‌పేట్/సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు మాగం రంగారెడ్డి అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్సీగా పనిచేశారు. మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీలోని అంతాయిపల్లికి చెందిన రంగారెడ్డి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అంతాయిపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో గురువారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రంగారెడ్డి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ఎన్‌ఎస్‌యూఐ ఉమ్మడి ఏపీ అధ్యక్షునిగా, పార్టీ నేతగా ఆయన కాంగ్రెస్‌లో చాలా కాలం పనిచేశారని వారు పేర్కొన్నారు.

పార్టీ పరిశీలకులు గ్రామాలకు వెళ్లాలి

- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- కార్యకర్తలకు భరోసా కల్పించాలి.. వారి సమస్యలను పరిష్కరించాలి
- పార్టీ కమిటీల నియామకాలను పూర్తి చేయాలి
- పీసీసీ పరిశీలకులతో మీనాక్షి సమావేశం
- జై భీమ్.. జై బాపూ కార్యక్రమంపై నేతలకు ప్రశంసలు
- హాజరైన పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: పార్టీ పరిశీలకులుగా నియమితులైన నేతలందరూ గ్రామాలకు వెళ్లాలని, కార్యకర్తలకు భరోసా కల్పించే దిశలో తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కోరారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆమె 'జై భీమ్.. జై బాపూ.. జై సంవిధాన్'కార్యక్రమ సమన్వయకర్తలు, పీసీసీ పరిశీలకులతో సమావేశమయ్యారు. జిల్లాల వారీగా పరిశీలకులతో భేటీ తర్వాత ఆమె వారితో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం గురించి ఆమె.. నేతలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో పరిశీలకులు బాధ్యతగా పనిచేయాలని, మండల కమిటీలను ఎంపిక చేసే ప్రక్రియను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలోని 5 గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యకర్తల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రతి యూనిట్‌కు ఒకరు చొప్పున మండల కమిటీలోకి తీసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నాయకుల్లో నామినేటెడ్ పోస్టులకు అర్హులెవరన్న దానిని గుర్తించాలని సూచించారు. జై బాపూ, జై భీమ్.. కార్యక్రమం తెలంగాణలో బాగా జరుగుతోందని, దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందున్నామని చెప్పిన ఆమె, సమన్వయకర్తలకు రాహుల్ గాంధీ పక్షాన ప్రశంసలు తెలియజేశారు.

ఫోన్ చేసి మాట్లాడిన మీనాక్షి

సమావేశంలో భాగంగా ప్రతి జిల్లాలో పార్టీ కమిటీల నియామకం ఎంత వరకు వచ్చిందన్న అంశాన్ని మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. పరిశీలకులు సమర్పించిన నివేదికలు చూసిన ఆమె, బాగా పనిచేసిన నేతలకు అభినందనలు తెలిపారు. కమిటీల నియామకంలో తాత్సారం చేస్తున్నారన్న నివేదికల మేరకు మహబూబ్‌నగర్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, నల్లగొండకు చెందిన ఓ ఎమ్మెల్సీకి ఆమె నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. పార్టీ కమిటీల నియామకాలను వాయిదా వేయవద్దని వారికి సూచించారు.

మంత్రితో ముఖాముఖి

కాగా, బుధవారం గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి'కార్యక్రమం జరిగింది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దాదాపు మూడు గంటల పాటు గాంధీభవన్‌లో ఉండి ప్రజల నుంచి వారి సమస్యలపై దరఖాస్తులు తీసుకున్నారు. మొత్తం 100కు పైగా వినతిపత్రాలు వచ్చాయని, తక్షణమే పరిష్కరించగలిగిన వాటిపై అధికారులతో అప్పటికప్పుడే మాట్లాడి పరిష్కరించారని, మిగిలినవి ఆయా శాఖలకు పంపామని మంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, కరెంటు బిల్లులు, ఇతర సంక్షేమ పథకాల కోసం ప్రజలు దరఖాస్తులిచ్చారని తెలిపారు. కాగా, మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కూడా మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడెల మరణం రాష్ట్రానికి అరిష్టం

- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్/నర్సాపూర్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కోడెల మరణం రాష్ట్రానికి అరిష్టమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్తులు దేవునికి మొక్కుల కింద సమర్పించిన కోడెలు వరుసగా చనిపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని, కోడెల మరణంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు. వరుసగా ఇప్పటివరకు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వలేదని, గురువారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతుబంధు పథకానికి నిధులు విడుదల చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సేకరించిన భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయి పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆయన ఆరోపించారు.

మీ వల్లే వేములవాడకు అరిష్టం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనవల్లే అరిష్టం జరిగి.. వేములవాడ ఆలయాన్ని ఇంకా పట్టి పీడిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆలయం గోశాలలో కోడెల మరణాలను కూడా రాజకీయాలకు వాడుకోవాలని చూడటం హరీశ్‌రావు దుర్బుద్ధికి నిదర్శనమని ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజన్న గుడికి ఏటా రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ హామీని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు కూడా నెరవేర్చలేదని, రాజన్న గుడికి అణాపైసా ఇవ్వలేదని గుర్తుచేశారు. పాలు మరువని లేగదూడలు, అనారోగ్యంతో ఉన్న కోడెలను కొందరు భక్తులు వదిలి వెళ్తున్నారని చెప్పారు. ఆరోగ్య సమస్యలతోనే అవి మరణిస్తున్నాయని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకులారా ఖబడ్దార్.. కేసీఆర్‌కు నోటీసులిస్తారా?

- 16 టీఎంసీల నుంచి 141 టీఎంసీలకు పెంచినందుకా ఈ నోటీసులు?
- కాళేశ్వరం కమిషన్ కాదు.... అది కాంగ్రెస్ కమిషన్
- ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్/కవాడిగూడ: తెలంగాణ సస్యశ్యామలం కావాలని 16 టీఎంసీల నుంచి కాళేశ్వరం ప్రాజెక్టును 141 టీఎంసీలకు పెంచినందుకా మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడమంటే యావత్ తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్టేనని ధ్వజమెత్తారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్‌తో నోటీసులు జారీ చేయించిన కాంగ్రెస్ నాయకులారా ఖబడ్దార్ అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ కాదు..అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ అని విమర్శించారు. కమిషన్‌పై మాకు నమ్మకం ఉందని, కాంగ్రెస్ పార్టీపై ఎటువంటి విశ్వాసం లేదన్నారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసు జారీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జాగృతి కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత ప్రసంగించారు. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, కేసీఆర్‌ను బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని, 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్‌హౌస్‌లు నిర్మించిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు జలదోపిడీ చేసినా బీజేపీ ప్రశ్నించడం లేదు

ఏపీ సీఎం చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జలదోపిడీ చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో ఉన్న ఈటల రాజేందర్ కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదని, తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు.

హైదరాబాద్‌కు జస్టిస్ పినాకి చంద్రఘోష్

- రేపు ఈటల రాజేందర్, 9న హరీశ్‌రావుల క్రాస్ ఎగ్జామినేషన్
- 11న రావాలని కేసీఆర్‌కు సమన్లు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఆయన మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. అలాగే ఈనెల 9న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్ రావును బరాజ్‌ల నిర్మాణంలో ఆయన పాత్రపై ప్రశ్నించనున్నారు. కాగా, ఈ నెల 11వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణకు హాజరు కావాలని కమిషన్ సమన్లు పంపించింది. వాస్తవానికి కేసీఆర్‌ను ఈ నెల 5న క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కమిషన్ సమన్లు పంపగా, ఆయన గడువు కోరడంతో కమిషన్ సమ్మతించింది. మాజీ సీఎం, ఇద్దరు మాజీ మంత్రుల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయితే కమిషన్ విచారణ ప్రక్రియ దాదాపుగా పూర్తవుతుందని సమాచారం. ఇదిలా ఉండగా కమిషన్ గడువును ప్రభుత్వం జూలై 31వ తేదీ వరకు పొడిగించింది. ఆలోగా ప్రభుత్వానికి కమిషన్ నివేదిక అందించే అవకాశముంది.

కమీషన్లతో బతికే వారికి కమిషన్ విలువ ఏం తెలుస్తుంది?

- ఆధారాల మేరకే కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులు
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్
- యాష్కీ నివాసంలో సీనియర్ నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: కమీషన్లతో బతికేవాళ్లకు కమిషన్ విలువ ఏం తెలుస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని, ఆమెకు డ్యామ్‌కు, టన్నెల్‌కు మధ్య ఉన్న తేడా కూడా తెలియదని వ్యాఖ్యానించారు. బుధవారం తన నివాసం వద్ద మధుయాష్కీ మీడియాతో మాట్లాడుతూ, రిటైర్డ్ న్యాయమూర్తితో ఏర్పాటు చేసిన కమిషన్‌ను గౌరవించే సంస్కారం కూడా ఆమెకు లేదా అని ప్రశ్నించారు. న్యాయబద్ధంగా విచారణ జరిపేందుకే కమిషన్‌ను ప్రభుత్వం నియమించిందని, అన్ని ఆధారాల మేరకే కమిషన్ కేసీఆర్‌కు నోటీసులిచ్చిందని చెప్పారు. జైలుకు వెళ్లి మొన్ననే వచ్చిన కవిత మళ్లీ ఎన్నాళ్లు జైలుకు వెళుతుందో తెలియదని, త్వరలోనే కవిత నాన్న, అన్న, ఆ ఇద్దరి తర్వాత కవిత బావ కూడా జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. గోదావరి, కృష్ణా నదులు కూడా కేసీఆర్ వచ్చిన తర్వాతే పుట్టినట్టు కవిత మాట్లాడుతున్నారని మధుయాష్కీ ఎద్దేవా చేశారు.

తెలంగాణ ఉద్యమంపై డాక్యుమెంటరీ

అంతకుముందు యాష్కీ నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నేతల భేటీ జరిగింది. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.కేశవరావు, కె.జానారెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ విజయశాంతిలు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొందిన సమయంలో లోక్‌సభ సభ్యులుగా ఉన్న వీరంతా అప్పటి విషయాలను నెమరువేసుకున్నారు. అనంతరం మధుయాష్కీ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రపై డాక్యుమెంటరీ రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఎంపీగా ఏనాడూ కేసీఆర్ తెలంగాణ గురించి మాట్లాడలేదని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎంపీలుగా తాము చేసిన పోరాటాన్ని డాక్యుమెంటరీ రూపంలో తీసుకువస్తున్నామని మధుయాష్కీగౌడ్ చెప్పారు.

సాక్షి

గురువారం, 5 జూన్ 2025

కొరియా నేతకు పెను సవాళ్లు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై నియంతృత్వం ప్రతిష్ఠించటానికి ప్రయత్నించిన మితవాద పక్ష నాయకుడు, మాజీ అధ్యక్షుడు యూన్ సెక్‌–యోల్‌కు దక్షిణ కొరియా ప్రజానీకం తగిన బుద్ధి చెప్పారు. భవిష్యత్తులో ఏ నాయకుడూ నియంత పోకడలకు పోకుండా మంగళవారం జరిగిన ఎన్నికల్లో గట్టి గుణపాఠం నేర్పారు. ఇటీవలి దశాబ్దాల్లో కనీవినీ ఎరుగని భారీ మెజారిటీ కట్టబెట్టి మధ్యేవాద వామపక్షమైన డెమాక్రటిక్ పార్టీని అందలం ఎక్కించారు. ఆ పార్టీ అభ్యర్థి లీ జే మ్యూంగ్ బుధవారం అధ్యక్షుడిగా ప్రమాణం చేశాక చెప్పినట్టు దక్షిణ కొరియా ఆర్థికంగా గడ్డుస్థితిలో వుంది. ఇందుకు యోల్ అస్తవ్యస్త పాలన కారణం. దీన్ని కప్పిపుచ్చుకోవటానికే ఆయన నిరుడు డిసెంబర్‌లో ఒక చీకటిరాత్రిలో అత్యయిక స్థితిని ప్రకటించి, సైనిక పాలన విధించారు. తనకెదురులేకుండా చేసుకోవటానికి మ్యూంగ్‌పై ముందే దేశద్రోహంతోసహా రకరకాల ఆరోపణలతో కేసులు రూపొందించారు. కానీ ఆ నిశిరాత్రి వేళే దేశమంతా రోడ్లపైకి రావటంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టింది. రాత్రికి రాత్రి విధించిన సైనిక పాలనను తెల్లారుజాముకే తొలగించక తప్పలేదు. ఆ ప్రహసనానికి తెగించకపోతే యోల్ 2027 వరకూ అధికారం చలాయించేవారు. యోల్ తన చేష్టలకు చెప్పిన కారణాలు చిత్రమైనవి. పొరుగునున్న శత్రుదేశం ఉత్తరకొరియాకు చెందిన కమ్యూనిస్టు పాలకులతో విపక్షాలు కుమ్మక్కయి, దేశాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయన్నది ఆయన ఆరోపణ. అయితే ఆయన్ను, ఆ పార్టీనీ మెజారిటీ జనం నమ్మలేదు.

కొత్త అధ్యక్షుడు మ్యూంగ్ ముందున్న సవాళ్లు తక్కువేమీ కాదు. అంతర్గతంగా దేశం కుడి, ఎడమలుగా చీలిపోవటం, ఆర్థికవ్యవస్థ కుంగుబాటులో ఉండటం, జనాభాలో యువత శాతమే తక్కువనుకుంటే వారికి కూడా ఉపాధి కల్పించే స్థితి లేకపోవటం వంటివి ఆయన దక్షతను పరీక్షించబోతున్నాయి. మరోపక్క అంతర్జాతీయంగా పరిస్థితులు తారుమారయ్యాయి. దక్షిణ కొరియాకు ఆది నుంచీ అన్నివిధాలా బాసటగా వున్న ఏకైక దేశం అమెరికా. కానీ మ్యూంగ్ ఆ మధ్య చెప్పినట్టు అక్కడ మొన్న జనవరిలో డోనాల్డ్ ట్రంప్ పీఠం ఎక్కాక అంతర్జాతీయంగా 'ఆటవిక పాలన' నడుస్తోంది. స్వపర భేదం లేకుండా అందరిపైనా సుంకాల భారం మోపేందుకు ఆయన తహతహలాడుతున్నారు. తమ సైన్యం రక్షణ కోరుకునే దేశాలు అందుకు భారీయెత్తున డబ్బు చెల్లించాలంటున్నారు. దక్షిణ కొరియాలో అమెరికా సైన్యం గణనీయంగానే ఉంది. అంతమాత్రాన మ్యూంగ్ ఆ దేశానికి దాసోహం అనే స్థితి ఉండకపోవచ్చు. అలాగే గతాన్ని మరిచి జపాన్‌తో సాన్నిహిత్యం పాటించాలన్న అమెరికా సలహాను యోల్ శిరసా వహించిన మాదిరిగా మ్యూంగ్ అంగీకరించకపోవచ్చు. డెమాక్రటిక్ పార్టీ మొదటి నుంచీ జపాన్ తన తప్పులు అంగీకరించి వలసపాలనలో కొరియా వాసులపై సాగించిన దుష్కృత్యాలకు క్షమాపణ చెప్పాలని, అందుకు మూల్యం చెల్లించాలని డిమాండు చేస్తోంది.

ఆర్థికవ్యవస్థ బాగుకు చైనా సహాయం స్వీకరించాలని మ్యూంగ్ అనుకుంటున్నా అమెరికాతో స్నేహానికి అది అవరోధం అవుతుంది. మితవాదులు మొదటి నుంచీ దీన్నే ప్రచారం చేస్తూ వచ్చారు. ప్రాంతీయ భద్రతలో భాగంగా అమెరికా, జపాన్‌లతో సాన్నిహిత్యం కొనసాగుతుందని డెమాక్రటిక్ పార్టీ ఆ మధ్య ప్రకటించింది. చైనా, ఉత్తర కొరియాలతో వచ్చిన విభేదాల పరిష్కారానికి కృషి చేస్తానని మ్యూంగ్ తాజాగా తెలిపారు. కానీ ఆచరణలో అదెంత వరకూ సాధ్యమన్నది చూడాల్సి ఉంది. మొత్తానికి గత అధ్యక్షులెవరికీ లేనంత బలం ఆయనకు సమకూడింది. చట్టసభలో సైతం ఆయన పార్టీదే పైచేయి. దీన్ని ఆయన ఎలా ఉపయోగిస్తారన్నదే అందరిలోనూ ఉన్న సంశయం. ఎందుకంటే ఇంతవరకూ కొత్త అధ్యక్షుడు రాగానే గత అధ్యక్షుడిపై రకరకాల ఆరోపణలతో కేసులు పెట్టడం రివాజుగా మారింది. అయితే దేశాన్ని నియంతృత్వంలోకి నెట్టాలని చూసి యోల్ తన గొయ్యి తానే తవ్వుకున్నారు. ఆయనకు గుదిబండగా మారటానికి ఆ కేసు ఒక్కటీ చాలు.

'యుద్ధంలో విజయం సాధించటం చాలా ముఖ్యమే. కానీ అసలు యుద్ధం లేకుండానే విజయం సాధించటం అంతకన్నా ఎన్నో రెట్లు కీలకమైనది' అని మ్యూంగ్ ఇటీవల ప్రకటించారు. చైనా, ఉత్తర కొరియాల విషయంలో దీన్ని ప్రయోగించే అవకాశం ఎటూ ఉంది. కానీ అంతర్గత వ్యవహారాల్లో కూడా ఈ నీతి పాటిస్తారా? దేశంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూసేది దాని గురించే! ఎందుకంటే గతంలో జాతీయవాదం పేరిట యోల్ విద్వేషాలు రెచ్చగొట్టారు. ఉత్తర కొరియాతో ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నదన్న అభిప్రాయం కలగజేశారు. దానికితోడు ఫెమినిస్టులపై ఆయన ద్వేషం అవధులు దాటింది. దేశ ఆర్థికవ్యవస్థ పతనానికి కూడా వారే కారకులన్న స్థాయిలో యోల్ ప్రచారం చేశారు. అదెంతగా పనిచేసిందంటే ఆ విషయంలో ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతో డెమాక్రటిక్ పార్టీ మౌనం వహించింది. కానీ దేశంలో హింసాత్మక ఘటనల్లో అత్యధిక బాధితులు మహిళలు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, వివక్ష ఏమేరకు తగ్గినా వారు సంతోషిస్తారు. యువతకు ఉపాధి, పడిపోయిన జననాల రేటును పట్టాలెక్కించటం కూడా పరిష్కరించాల్సిన సమస్యలే. ఇక పింఛన్లు తీసుకునేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 80,000 కోట్ల డాలర్ల పింఛన్ నిధి క్రమేపీ ఆవిరవుతున్న దశలో ఉత్పాదకత పెంచి ఖజానా కళకళలాడేలా చేయటం ఎలా అన్నది అంతుబట్టడం లేదు. ముందు సుస్థిరత సాధించి, ఈ సమస్యలపై దృష్టి సారిస్తే తప్ప మ్యూంగ్ తనకొచ్చిన జనాదరణను నిలబెట్టుకోవటం అంత సులభమేమీ కాదు!

కోర్టులోనూ అమెరికాది అదే పాట!

విశ్లేషణ



వివేక్ కాట్జూ



> ◆ అమెరికా వాణిజ్య మంత్రి హవర్డ్ లట్‌నిక్ ఒక అమెరికన్ కోర్టులో ఇచ్చిన డిక్లరేషన్... భారత్‌–పాక్‌ల మధ్య కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయం ఏమీ లేదని భారత్ చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా ఉంది.
>
> ◆ అమెరికా వాణిజ్య మంత్రి లట్‌నిక్ కోర్టుకు తప్పుడు వాఙ్మూలం ఇచ్చారని మోదీ ప్రభుత్వం కనుక గట్టిగా చెబితే ఈ వ్యవహారం మరింత ముదిరి పెద్దదయ్యే అవకాశం ఉంది.
>
> ◆ అమెరికా, బ్రిటన్, యూఏఈ, సౌదీ అరేబియా, తుర్కియే, చైనా జోక్యం చేసుకున్న ఫలితంగా కాల్పుల విరమణ సాధ్యమైందని పాకిస్తాన్ వెల్లడించింది.

భారత్‌–పాకిస్తాన్‌లను ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరింపజేసింది తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టముకు వేసుకోవడంపై ఏర్పడిన వివాదం ఇప్పట్లో సమసిపోయేలా కనిపించడం లేదు. ఆయన మాటల్లో వాస్తవం లేదని భారత్ చెబుతున్నా, ట్రంప్ మాత్రం తాను శాంతి దూతగా వ్యవహరించినట్లు చెప్పుకుంటూనే ఉన్నారు. ''ఈ ఒప్పందం కుదర్చగలగడం నాకెంతో గర్వంగా ఉంది. ఎందుకంటే, బులెట్లకు బదులు వాణిజ్యం ద్వారా భారత్‌–పాకిస్తాన్‌లను దారికి తేగలిగాను. ఆ రెండింటి మధ్య ఘర్షణ అణ్వస్త్ర యుద్ధంగా పరిణమించకుండా ఆపగలిగాను'' అని ట్రంప్ మే 30న ప్రకటించారు.

నేనే శాంతిదూతను!

మే 10న ప్రకటించిన కాల్పుల విరమణ సందర్భంగా ఆయన చెప్పిన మూడు అంశాల సారాంశంగా ఈ వ్యాఖ్య నిలుస్తోంది. ఒకటి – తానే పెద్దమనిషిగా వ్యవహరించినట్లు చెప్పుకోవడం. రెండు – ఘర్షణ అణు యుద్ధంగా మారగల అవకాశం ఎంతైనా ఉందని భావించడం. మూడు – రెండు దేశాలతోను వాణిజ్య సంబంధాలను తెగతెంపులు చేసుకుంటానని తాను హెచ్చరించినట్లు చెప్పడం. ఆ విధంగా రెండు దేశాలను కాల్పుల విరమణకు అంగీకరించేట్లు చేయడం.

పాకిస్తాన్‌కు చెందిన సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డీజీఎంఓ) భారత్‌లోని తన సహచరునికి మే 10న ఫోన్ చేసిన తర్వాతనే దాడి ప్రతిదాడులు ఆగాయని భారత్ ప్రకటించింది. ఘర్షణ సంప్రదాయ చట్రం లోపలికే పరిమితమైందనీ, అణ్వస్త్రాన్ని బయటకు తీస్తాననే సంకేతం పాక్ నుంచి ఏమీ రాలేదనీ కూడా భారత్ తేటతెల్లం చేసింది.

''ఆపరేషన్ సిందూర్ మే 7న మొదలైనప్పటి నుంచి, కాల్పులు, సైనిక చర్యను నిలిపివేయాలని మే 10న ఒక అవగాహనకు వచ్చేంత వరకు, మారుతూ వస్తున్న సైనిక పరిస్థితులపై భారత్‌–అమెరికా నాయకుల మధ్య సంభాషణలు కొనసాగుతూ వచ్చాయి. ఈ మాటల్లో వాణిజ్య అంశం ప్రస్తావనకు రానేలేదు'' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మే 13న చెప్పిన సంగతి గమనార్హం.

కాల్పుల విరమణ కుదిర్చేందుకు ట్రంప్ వాణిజ్య అంశాన్ని లేవనెత్తారని అమెరికా వాణిజ్య మంత్రి హవర్డ్ లట్‌నిక్ ఒక అమెరికన్ కోర్టులో వాఙ్మూలం ఇచ్చిన సంగతిని మే 29న జైస్వాల్ దృష్టికి తెచ్చినపుడు, ''కోర్టు ఉత్తర్వును కూడా మీరు చూసే ఉంటారు'' అని ఆయన జవాబిచ్చారు. తర్వాత, జైస్వాల్ తాను మే13న చేసిన వ్యాఖ్యలనే పునరుద్ఘాటించారు. కోర్టు ఉత్తర్వు గురించి ప్రస్తావించడంలో ఆయన తొందరపడ్డారనిపించింది. ఎందుకంటే, అమెరికాలోని మరో హైకోర్టు అదే రోజు (మే 29)న దిగువ కోర్టు ఉత్తర్వుపై స్టే ఇచ్చింది. ఆ అధికార ప్రతినిధి భారత్ వైఖరిలోని సత్యసంధతను నిరూపించేందుకు దిగువ కోర్టు నిర్ణయంపై ఆధారపడకుండా ఉండాల్సింది.

ఇంకో ఆరు దేశాలు!

వివిధ దేశాలు జోక్యం చేసుకున్న ఫలితంగా కాల్పుల విరమణ సాధ్యమైందని పాకిస్తాన్ వెల్లడించింది. పాకిస్తాన్ సైనిక దళాల సంయుక్త కమిటీ చైర్మన్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా, గత వారం సింగపూర్‌లో సాగిన షాంగ్రి–లా డైలాగ్ సందర్భంగా, ఆరు దేశాల పేర్లను ప్రస్తావించారు. అవి – అమెరికా, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, తుర్కియే, చైనా. తాను కుదిర్చిన ఉత్తమ 'ఒప్పందానికి' మొత్తం ఘనత తనదేనని చెప్పుకుంటున్న ట్రంప్‌కు ఆ మాటలు ఇంపైనవి కావని వేరే చెప్పనవసరం లేదు.

ఈ ఘర్షణ సంప్రదాయ చట్రం పరిధిని మించగల ప్రమాదం ఉందని ఇస్లామాబాద్ అనలేదు. జోక్యం చేసుకునేందుకు విదేశీ శక్తులు తగినంత సమయాన్ని వెచ్చించకపోతే, భారత్ చలన శక్తి, పరస్పర అణ్వాయుధ ప్రయోగాలకు దారితీయగల అవకాశముందని తనకున్న సాధారణ ఆందోళనను పాక్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఘర్షణలను నిలిపివేయకపోతే వాణిజ్య సంబంధాలను నిలిపివేస్తానని బెదిరించినట్లు ట్రంప్ చెప్పుకోవడంపై పాకిస్తాన్ ఏ విధమైన వ్యాఖ్యా చేయలేదు. మరోవైపు పాకిస్తాన్‌–అమెరికాల మధ్య వాణిజ్య చర్చలకు రంగం సిద్ధమైంది.

వాణిజ్యానికి సంబంధించి భారత్ సంవేదనలపై ట్రంప్ ప్రభుత్వం ఎందుకంత ఉపేక్ష వహించినట్లు? పైగా, లట్‌నిక్ ఒక అమెరికా కోర్టుకు మే 23న సమర్పించిన అఫిడవిట్‌లో కూడా దాన్ని ఎందుకు చేర్చినట్లు? ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల విధానాలకు ఎదురవుతున్న చట్టపరమైన సవాల్‌కు సంబంధించిన కేసు అది. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐ.ఇ.ఇ.పి.ఏ.) అని అమెరికాలో ఓ చట్టం ఉంది. దానికింద, ట్రంప్ సుంకాల విధానాలను సమర్థించుకుంటున్నారు.

సాంకేతికంగా చూస్తే, లట్‌నిక్ ఒక డిక్లరేషన్ ఇచ్చినట్లే లెక్క. ''అంతకుముందు పేర్కొన్న మాటలు సత్యమైనవి, సరైనవి'' అని ఆయన ప్రకటించారు. కాల్పుల విరమణను అమలులోకి తెచ్చేందుకు వాణిజ్యాన్ని ఆయుధంగా వాడుకున్నట్లు ట్రంప్ చేసిన లాంటి రాజకీయ ప్రకటనను ఒక దేశం లీగల్ డాక్యుమెంట్‌గా మార్చడం కనివిని ఎరుగనిదని నా దౌత్యపరమైన అనుభవం సూచిస్తోంది. దీని వల్ల ట్రంప్ చెప్పుకుంటున్న గొప్పను అమెరికా కాదనలేని అనివార్య స్థితి ఏర్పడుతోంది. ట్రంప్ నోటికి ఏది వస్తే అది మాట్లాడేస్తూ ఉంటారు. తరచూ తన ప్రకటనలకు తానే విరుద్ధంగా మాట్లాడుతూంటారు. కానీ, లీగల్ డాక్యుమెంట్‌ను తారుమారు చేయడం కుదరదు. పైగా, భారత్‌–అమెరికాలు వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగిస్తున్న సమయంలో, అమెరికా అలాంటి వాఙ్మూలం ఇవ్వడం ఈ అంశంపై భారత్ వైఖరికి విరుద్ధంగా ఉంది.

స్నేహం ఉన్నట్టేనా?

''పూర్తి స్థాయి యుద్ధాన్ని నివారించేందుకు అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకుని అమెరికాతో వాణిజ్య సౌలభ్యాన్ని రెండు దేశాలకు ఇవ్వచూపబట్టే కాల్పుల విరమణ సాధ్యమైంది. ఈ కేసులో, అధ్యక్షుడి అధికారాన్ని నిరోధించే విధంగా ఎటువంటి ప్రతికూల తీర్పునిచ్చినా, ట్రంప్ ఇచ్చిన ఆఫర్ చట్టబద్ధతను భారత్‌–పాకిస్తాన్‌లు ప్రశ్నించగల స్థితి తలెత్తుతుంది. అది ఒక మొత్తం ప్రాంత భద్రతకు, కోట్లాది మంది జీవితాలకు ముప్పుగా పరిణమిస్తుంది'' అని కూడా లట్‌నిక్ పేర్కొన్నారు.

లట్‌నిక్ డిక్లరేషన్‌పై మే 29న అడిగిన మరో ప్రశ్నకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మొహం ముటకరించుకుని ''నేను నా వైపు నుంచి పరిస్థితిని వివరించాను. రెండు వైపుల దేశ పతాకాలను పెట్టుకుని, భారతదేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధిగా నేను ఆ పని చేసినట్లు లెక్క. దానికి పర్యవసానాలుంటాయి. అవి చాలా పెద్దవిగా ఉంటాయని అర్థం చేసుకోవాలి'' అన్నారు.

నిజమే! అమెరికా వాణిజ్య మంత్రి ఒక అమెరికన్ కోర్టులో తప్పుడు డిక్లరేషన్ ఇచ్చారని మోదీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తే, వ్యవహారం మరింత పెద్దదవుతుంది.

భారత్ విషయానికి వస్తే – ఆపరేషన్ సిందూర్ నుంచి ట్రంప్ చర్యలు, ప్రకటనలు చూసి, నమ్మక ద్రోహానికి గురయ్యామని భావించడం తప్ప చేయగలిగింది లేదు. హిందీ సినిమా 'సంగమ్' లోని 'దోస్త్ దోస్త్ న రహా...' పాట నేటి భారత్ స్థితికి అద్దంపడుతుంది. 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్' అంటూ జబ్బలు చరుచుకున్న ఘట్టాల రోజులు ఇపుడు సుదూర జ్ఞాపకాలుగానే ఉంటాయి.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఇంత చవకా?



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయయాత్రలో భాగంగా బెంగళూరులో జరిగిన అనవసర తొక్కిసలాటలో అమాయకులు బలి కావడం ఘోరం. మన సమాజంలో, మన దేశంలో ప్రాణాలకు ఏ పాటి విలువ ఉందో ఇది చెబుతోంది. పశ్చాత్తాపం లేని కఠినమైన సమాజం ఇది.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ప్రాజెక్ట్ ఆకర్ష...



యూఎస్ ఉద్దేశపూర్వకంగా వెళ్లగొడుతున్న అత్యద్భుతమైన ప్రతిభను ఆకర్షించడానికి చైనా దూకుడుగా అడుగులు వేస్తోంది. శాస్త్రవేత్తలను అది నిలుపుకోగలుగుతుందో లేదో చూడాలి. అది ఆసక్తికరం.

– నితిన్ పాయ్, పబ్లిక్ పాలసీ నిపుణుడు

ఎలాంటి సమితి?



15 సభ్య దేశాలతో కూడిన ఐక్య రాజ్యసమితి కౌంటర్ టెర్రరిజం కమిటీకి వైస్‌–చైర్‌గానూ, తాలిబన్ ఆంక్షల కమిటీకి చైర్‌గానూ పాకిస్తాన్ వ్యవహరించనుంది. వెరసి, ఐరాస భద్రతామండలి అనేది నవ్వులాటగా తయారైంది.

– స్మితా ప్రకాశ్, జర్నలిస్ట్

గొప్ప లక్ష్యం



పన్నెండో తరగతి వరకు ఉచిత అత్యున్నత నాణ్యమైన విద్య ప్రతి భారతీయ చిన్నారి హక్కు కావాలి. ఇది ప్రభుత్వాలు తీర్చడానికి ప్రయత్నించాల్సిన అత్యంత గొప్ప లక్ష్యం! దీనిపై పోరులు ఎలుగెత్తాలి.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

మనమింతే!




భారతీయుల మనస్తత్వం ఎలాంటిదంటే – జ్ఞాపకశక్తిని పెంచుకోవడం కోసం ఉదయాన్నే నానేసిన బాదాములు తినాలనుకుంటారు, కానీ రాత్రి వాటిని నానబెట్టడం మరిచిపోతారు.

– అభిషేక్, వ్యంగ్య వ్యాఖ్యాత

పర్యావరణాన్ని కాపాడాలి!

సందర్భం



డా॥ సి.వి. సర్వేశ్వర శర్మ

మన చుట్టూ ఉన్న సహజ, మానవ నిర్మిత అంశాలన్నీ కలిపి ఒక జీవి యొక్క జీవితాన్ని ప్రభావితం చేసే వాతావరణమే పర్యావరణం. నేల, నీరు, గాలి మానవ మనుగడకు అత్యంత ఆవశ్యకాలు. ఈ మూడూ ఇప్పుడు కలుషితం అవుతూ ఉండడం భూమి మీద ఉన్న సకల జీవరాశికీ ప్రాణసంకటం అయ్యింది. పర్యావరణంలోకి విడుదల అవుతున్న ఇతర కాలుష్య కారకాలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ వ్యవస్థల్ని మరింతగా ధ్వంసం చేస్తున్నాయి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని సమర్థంగా ఎదుర్కోడానికి ప్రపంచ దేశాలన్నీ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కొందాం' అనే నినాదంతో 2025 సంవత్సరపు పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5న జరుపుకోవాలని ఐక్య రాజ్య సమితి కోరింది.



వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్ చేరడంవల్ల వాతావరణం వేడెక్కి దాని ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. వేడి వాతావరణంలో కాలుష్య కారకాలు, పుప్పొడిరేణువుల సంచారం బాగా పెరుగుతుంది. కాలుష్యం పెరగడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. కంటి జబ్బులు కూడా వస్తున్నాయి. ఈ వేడికి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ఉప్పెనలు వస్తున్నాయి. పర్యావరణ వ్యవస్థలో మరొక సమస్య ఆమ్లవర్షాలు. నేల మీద విడుదలై ఆకాశాన్ని చేరుతున్న కలుషిత గాలుల్లో సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ ఉన్నాయి. ఇవి వర్షపు జల్లులతో కలసి ఆమ్లవర్షాలుగా కురుస్తున్నాయి. ఈ వర్షాలు నేలపై పడేసరికి ఆ నేలలు సేద్యానికి యోగ్యం కాకుండా పోతున్నాయి. కప్ప వంటి ఉభయచరాలు చిన్న చిన్న గుంటల్లో గుడ్లు పెడతాయి. అక్కడికి ఆమ్లవర్షం చేరితే గుడ్లు నాశనమై పిల్లలు పుట్టవు. నీటిలో నివసించే చేపలు, రకరకాల కీటకాలు, ఈ ఆమ్లవర్షాలకు బతకలేవు. ఈ వర్షం ఆహారపు గొలుసును తునాతునకలు చేస్తుంది.

రవాణా కోసం మోటారు సైకిళ్ళకు బదులుగా ప్రజారవాణా సదుపాయాన్ని వినియోగించుకోవాలి. నడక, సైకిళ్ల వాడకం మంచిది. రక్షిత నీటి సరఫరాకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. దోమలను నియంత్రించే విధానాలపై దృష్టి పెట్టాలి. నీరు పారే ప్రాంతాలలో ఎటువంటి మలినాలు లేకుండా చూడాలి. పర్యావరణంలోకి చేరే వ్యర్థాలలో అధిక భాగం ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వ్యర్థాలే! ఏటా విడుదలవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలలో 46 శాతం వ్యర్థాలు భూమిని కలుషితం చేస్తుంటే, దాదాపు 23 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాలు, నదులను కలుషితం చేస్తున్నాయి. ప్లాస్టిక్ పదార్థాలు నేలలో కలసిపోవు. నేలను నాశనం చేస్తాయి. సాధ్యమైనంతవరకు రీసైకిల్ చేయడానికి వీలున్న ప్లాస్టిక్ వస్తువులనే వాడాలి. అలా కానివాటి వాడకాన్ని నిషేధించాలి. ఇప్పుడు శబ్దకాలుష్యం ఎక్కువ అయ్యింది. ఈ కాలుష్యాన్ని హరించేందుకు చెట్ల పెంపకం చేపట్టాలి. రైతులు పంటల దిగుబడి పెరిగేందుకు కృత్రిమ రసాయనాలను ఎరువులుగా వాడే బదులు సేంద్రియ ఎరువులు వాడాలి. మరుగుదొడ్ల వాడకం పెరగాలి.

వ్యాసకర్త పాపులర్ సైన్స్ రచయిత

(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

అన్నిటికీ తమిళమే అంటే ఎలా?

'కన్నడ భాష తమిళం నుంచి పుట్టింది' అంటూ కమలహాసన్ చేసిన కామెంట్‌ను కన్నడ హైకోర్ట్ ఖండించింది. ఆ మాటల్ని వెనక్కు తీసుకోమని కూడా సూచించింది. అయితే ఆయన అందుకు నిరాకరించారు. అది ఆయన ఇష్టం. అయితే భాషలపై ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కొత్తేమీ కాదు. 'హిందీ భాష డైపర్లు వేసుకున్న చిన్న పిల్లాడి వంటిది అనీ; హిందీతో పోలిస్తే తమిళ భాషకు చాలా చరిత్ర ఉంద'నీ గతంలో కూడా అన్నారు.



రచయిత్రి రంగనాయకమ్మ అన్నట్లు 'ఫొనెటిక్స్ ప్రకారం గానీ, లింగ్విస్టిక్స్ ప్రకారం గానీ ఒక భాష గొప్పదనీ, ఇంకో భాష తక్కువదనీ ఏమీ ఉండదు. అన్ని భాషలూ సమానమైనవే. ఒక్కో భాష ఒక్కో ప్రాంత అవసరాన్ని తీరుస్తుంది. దేని ఉపయోగం దానికి ఉంటుంది. బ్రిటీష్ వాళ్ళు ప్రపంచాన్ని పరిపాలించారు కాబట్టి, ఇంగిలీషు ప్రపంచపు భాష అయ్యింది. అదే జర్మనీ వాళ్ళే పరిపాలించి ఉంటే, అప్పుడు జర్మనీ ప్రపంచపు భాష అయ్యి ఉండేది. అంతకు మించి ఇంగిలీషుకి ఏ ప్రత్యేకతా లేదు'.

అలాగే – హిందీ అయినా అంతే! తమిళం అయినా అంతే! తెలుగు అయినా అంతే! కోయవాళ్ళ 'కోయతూర్' భాషనే తీసుకుంటే... ఆ భాష మాట్లాడే వాళ్లకు దానికి బదులు తమిళం తెచ్చిపెడితే అప్పుడు కోయవాళ్ళ 'భాషావసరం' తీరుతుందా? తమిళానికి 'ప్రాచీన చరిత్ర' ఉంది కాబట్టి, 'తమిళం చాలా గొప్ప భాష' అని, ఆ కోయవాళ్ళు తమిళాన్ని మెచ్చుకుంటారా? వాళ్ళు మెచ్చు కోలేదు కాబట్టి, తమిళం తన 'ప్రత్యేకతను' కోల్పోతుందా? ఇంత చిన్న విషయాలు కూడా కమల్ హాసన్ లాంటి వాళ్లకు అర్థం కాకో, తెలియకో కాదు. ఇలాంటి వివాదాలు వాళ్లకి అవసరం. ప్రజల్లో 'ప్రేమ' ఉన్నట్లుగానే 'ద్వేషం' కూడా ఉంటుంది. ద్వేషానికి చాలా కోణాలు ఉంటాయి. 'భాషా ద్వేషం' అనేది కూడా ఒక కోణమే. సమాజంలో 'సంస్కృతి' అనే దానికి దేని ప్రత్యేకతలు దానికి ఉండవచ్చు. కానీ 'భాష'కు ఉండవు. ఉండ కూడదు. అయినా ప్రత్యేకతలు అనేవి గుర్తించడానికీ, నేర్చుకోడానికీ మాత్రమే ఉండాలి గానీ, ద్వేషించడానికి కాదు.


తమిళ భాషకూ, తమిళ సాహిత్యానికీ 'ప్రాచీన చరిత్రే' ఉండవచ్చు. ఆ మాటను భాషా పరిశోధకులు, చరిత్రకారులు కూడా అన్నారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం అలాగే ఇంకా కొన్ని భాషల్ని కలిపి 'ద్రావిడ భాషా కుటుంబం' అని అన్నారు. అంతే తప్ప, ద్రావిడ ప్రాంతాల్లోని అన్ని భాషలూ 'తమిళం నుంచి పుట్టాయి' అని మాత్రం ఎక్కడా ఎవ్వరూ అనలేదు. మిడిమిడి జ్ఞానంతో ఏదంటే అది మాట్లాడే వారి తమిళ దురభిమానాన్ని కాసేపు పక్కనబెడదాం. 1816లో 'ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్' మొదటగా కొన్ని దక్షిణభారత (ద్రవిడ) భాషల మధ్య సంబంధం ఉందని కనుగొన్నారు. ఈయన కూడా 'తమిళం అన్నిటికీ తల్లి భాష' అని ఎక్కడా అనలేదు. ఈయనే కాదు దక్షిణ భారత దేశ భాషల మధ్య 'వ్యాకరణ సంబంధాల్ని' పరిశోధించి 'ద్రావిడ' అనే పదాన్ని మొదటగా ఉపయోగించిన (1856) 'రాబర్ట్ కాల్డ్‌వెల్' అనే ఆయన కూడా మన కమలహాసన్ లాగా ఏమీ చెప్పలేదు. అంతే కాకుండా 'ద్రావిడ భాషలకీ సంస్కృతానికీ మధ్యన ఎలాంటి జన్యు పరమైన సంబంధం కూడా లేదని' తేల్చి చెప్పేశాడు. అప్పటికి కొన్ని వందల ఏళ్లగా 'సంస్కృతం మిగతా అన్ని ద్రావిడ భాషలకూ మూలం' అంటూ భారతీయ పండితులు అనుకొంటున్న దాన్ని ఈయన కూకటి వేళ్ళతో పెకలించి వేశాడు.

ఈయన తన పరిశోధన కోసం స్కాట్లాండ్‌ను విడిచిపెట్టి వచ్చేశాడు. ముందు ఎల్లిస్ ఏడు ద్రావిడ భాషల్ని గుర్తిస్తే... కాల్డ్‌వెల్ 12 భాషల్ని గుర్తించాడు. ద్రావిడ భాషల్లోని హల్లుల్ని 'నాలుక కొసల ద్వారా పలికే విధానాల్ని' గుర్తించాడు. వాళ్ళందరూ కూడా తమిళాన్ని 'పురాతనమైన సాహిత్య భాష'గా మాత్రమే గుర్తించారు. అంతే తప్ప 'వీటన్నిటికీ మూలం తమిళం' అని ఎక్కడా చెప్పలేదు. మొదట్లైతే మనుషులుగా పుట్టాం. పోనీ పరిణామం చెందాము. ఆ తరువాత సైగలు, శబ్దాలు. మనుషులంతా ఒకేచోట పుట్టనట్లుగానే భాషలు కూడా ఒకేసారి, ఒకేచోట పుట్టవు. మనుషుల్లో ఎదుగుదల ఒకే రకంగా లేనట్లుగానే భాషల్లో కూడా ఎదుగుదల ఒకే రకంగా ఉండదు. ఎగుడు దిగుడులు ఉంటాయి. ముందూ వెనకలు ఉంటాయి. అంత మాత్రాన ఒక భాష గొప్పా, ఒకటి తక్కువా అనుకోకూడదు. తమిళం అవసరాన్ని తెలుగు తీర్చదు. మలయాళం అవసరాన్ని కన్నడం తీర్చదు. పోనీ వీటన్నిటి అవసరాన్ని హిందీ తీర్చదు. అందరి దాహాన్నీ మంచి నీళ్లు తీర్చినట్లుగా అందరి అవసరాల్నీ ఏ ఒక్క భాషా తీర్చదు. ఆ జ్ఞానం అందరికీ ఉండాలి. ముఖ్యంగా కమలహాసన్ వంటి బహుభాషా నటులకు ఎక్కువగా ఉండాలి. అది తెలుసుకొని ఇకనైనా కమలహాసన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పడం మంచిది.

– నన్నూరి వేణుగోపాల్ । మానవహక్కుల కార్యకర్త । 98494 49012

అద్వైతం

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ద్వైతం కానిది అద్వైతం. అంటే రెండు అనే భావన పోయి ఉన్నది ఒకటే అని భావించగలగటం అద్వైతమవుతుంది. అయితే ఉపాధులన్నీ సమానమని అర్థం కాదు. పాపపుణ్య కర్మ ఫలితంగా వచ్చిన ఉపాధులు పరస్పరం భిన్నమైనవే. అవి పూర్తిగా నశించిపోయేవే. నశించనిది, నిత్యసత్యమైనది ఉపాధిగతమైన ఆత్మ ఒక్కటే. ఈ విషయం గ్రహించటమే సమదర్శి స్వభావం.

నిత్యసత్యం, వ్యవహార సత్యం అనేవి రెండున్నాయని గ్రహించాలి. మనకు కనబడే ప్రపంచమంతా వ్యవహారంలో సత్యం. కాని నిత్యసత్యము మాత్ర కాదు. ప్రపంచం నిత్యసత్యమని తెలిస్తే అది భ్రాంతి అనక తప్పదు. ఈ అద్వైత జ్ఞానం వల్ల తానంటూ వేరే ఉండక అంతట తననే చూడటం, తనలోనే సర్వాన్ని చూడటం జరుగుతుంది. 'ఆత్మ వత్సర్వభూతాని సర్వభూతాని చాత్మని' అనే దాని కర్థం అదే. ఈ జ్ఞానం ఒక్క గురుబోధ, గురుసేవ వల్లనే లభ్యం. కేవలం గ్రంథ పఠనం చాలదు.

ఒక గురువు గారు తన శిష్యుడికి 'అద్వైతం' గురించి పాఠం ప్రారంభించారు. 'భగవంతుడు ఒకడే. ఆయన సర్వాంతర్యామి. ఆయన సంకల్పంతో సృష్టి జరిగింది. ఆయనొక్కడే నిత్య సత్యం. ఈ కనబడేది అంతా భ్రాంతి వల్ల కనబడుతున్నది కాని నిజానికి ఇదేదీ లేదు. అని మొదట్లో బోధించటం జరిగింది.

ఈ జ్ఞానం శిష్యులలో స్థిరపడటానికి ఇంకా సమయం కావాలి. గురువిచ్చే అనుభవం సంపాదించాలి. అప్పుడుగాని అర్థమైనట్లు కాదు. ప్రాథమిక దశలోనే ఉన్న ఈ శిష్యుడు ఒకసారి అడవికి వెళ్ళి వస్తూ ఉన్నాడు. దారిలో ఒక మదపుటేనుగు ఎదురుగా వస్తున్నది. దానిపై ఉన్న మావటివాడు, ఈ ఏనుగు ఇది పూర్తిగా మచ్చిక కాని మదపుటేనుగు పక్కకు తప్పుకో అని అరిచాడు. ఆ శిష్యునికి అద్వైతం పాఠం గుర్తుకొచ్చింది. 'ఈ కనబడేదంతా బ్రహ్మమే. రెండవదంటూ లేదు.' కాబట్టి ఈ కనబడే ఏనుగు భ్రాంతి జన్యమైంది. కనుక నేను తప్పుకోవలసిన పని లేదని ముందుకు నడిచాడు. ఏనుగు రానే వచ్చింది, తొండంతో అతణ్ణి విసిరి అవతల పారవేసింది.

అప్పుడు ఆ శిష్యుడికి అర్థమైందో లేదో కాని మనకు మాత్రం బాగా అర్థమవ్వాల్సింది ఏమిటంటే... 'ఉపాధులన్నింటిలోనూ ఉన్న అంతర్యామి ఆత్మ ఒక్కటే అయినా, ఉపాధిగత భేదం భేదమే'అని!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.దశమి రా.3.04 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తర ఉ.5.32 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ప.2.41 నుండి 4.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** రా.1.07 నుండి 2.53 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగ తగిలి బాలుడి మృతి
- జడ్చర్ల సరస్వతీ నగర్ కాలనీలో విషాదం



శ్రేయన్స్

జడ్చర్ల: కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పదేళ్ల బాలుడిని బలి తీసుకుంది. ఈ విషాద ఘటన జడ్చర్ల పట్టణంలో చోటుచేసుకుంది. సరస్వతీనగర్ కాలనీకి చెందిన కీర్తి, రాఘవేందర్ దంపతులకు ఇద్దరు కుమారులు బొక్కా శ్రేయన్స్ (10), అవిక్ష్. బుధవారం శ్రేయన్స్, అతడి సోదరుడు అవిక్ష్ వేర్వేరుగా సైకిళ్లపై సమీపంలోని కిరాణా షాప్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఇంటికి వచ్చే క్రమంలో కాలనీ ముఖద్వారం వద్ద శ్రేయన్స్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు దూసుకెళ్లింది. అప్పటికే అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగ బాలుడికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు బాలుడిని రక్షించే ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతిచెందిన కుమారుడిని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ క్రమంలో తల్లి స్పృహ తప్పడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. కాగా, విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృత్యువాత పడ్డాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నోసార్లు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలని కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తల్లి శశికళ బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మృతిచెందిన బాలుడి తండ్రి రాఘవేందర్‌ను ఎమ్మెల్యే ఫోన్‌లో పరామర్శించారు.


బీబీపేట్ శివారులో చిరుత దాడి

- ఆవు దూడ మృతి
- తప్పించుకున్న రైతు

కల్హేర్(నారాయణఖేడ్): చిరుత పులి దాడి చేసి ఆవు దూడను చంపింది. రోజూ పశువులకు కాపలా ఉంటూ.. అక్కడే నిద్రించాల్సిన రైతు ఇంటికి రావడంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. బీబీపేట్ శివారులో మంగళవారం రాత్రి జరిగిన సంఘటనపై స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు జుమ్మ బీర్‌గోండ.. ఎప్పట్లాగే వ్యవసాయ పొలం వద్ద పశువులను కట్టి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికి.. చిరుత పులిలో మృతి చెందిన ఆవు దూడ కనిపించింది. సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ కలాలి కృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించారు. దూడ మృతదేహాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని బాధితుడు బీర్‌గోండ కోరాడు. కృష్ణాపూర్, ఖానాపూర్(కె), ఖాజాపూర్, బాచేపల్లి, రాపర్తి, కడ్పల్, సిర్గాపూర్ తదితర ప్రాంతాల్లో అటవీ ప్రాంతం ఉండటంతో చిరుత పులి సంచరిస్తోంది. దాదాపు అయిదేళ్లుగా పులి దాడి చేసి పశువులను చంపుతుండటంతో.. పరిసర గ్రామాల ప్రజలు, వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు.

రాయచెరువులో మహావీరుని శిల్పాలు

- జైన తీర్థంకర శిల్పాలుగా గుర్తించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం



బెజుగామలో జైన తీర్థంకర శిల్పంతో పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్

గజ్వేల్ రూరల్: మహావీరుల చరిత్రను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో వేర్వేరు కాలాలకు చెందిన 24వ జైన తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుని 2 శిల్పాలను ఈ బృందం బుధవారం గుర్తించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి శిల్పం గ్రామంలోని రాయచెరువులో ఉందని, ధ్యాన ముద్రలో ఉన్న ఈ మహావీరుని తలపై ఉష్ణీషం చెక్కి ఉండటం అరుదైన విషయమని, కోలముఖంతో కనిపిస్తున్న ఈ శిల్పం 8, 9వ శతాబ్దాలకు చెందిన శైలిలో బ్లాక్ కోరైట్ రాయిపై చెక్కబడి ఉందని, రెండోది గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో చెత్తకుప్పలో కూరుకుపోయి విరిగిపోయి కనిపిస్తోందని తెలిపారు. ఈ శిల్పం గుండ్రని ముఖంతో చిన్న ఉష్ణీషంతో 10, 11వ శతాబ్దాలకు చెందిన శైలిలో చెక్కబడి ఉన్నట్లు తెలిపారు. ఈ గ్రామంలో 11వ శతాబ్దానికి(1072కు) చెందిన కళ్యాణి చాళుక్యపాలకుడు భువనైక మల్లదేవర కాలంలో పంప పెర్మానడిగల్ బెజగం దేవునికి చేసిన దాన శాసనం ఒకటి, అదే కాలానికి చెందిన మరో శాసన శకలం ఉన్నాయన్నారు. ఆ శాసనంలో పేర్కొన్న బెజగాం దేవుడు జైనతీర్థంకరుడు అయ్యుండొచ్చని, చెరువులో ఉన్న శిల్పం నీటిలో మునగకముందే కట్టపైకి చేర్చి తమ గ్రామ చరిత్రను కాపాడుకోవాలని కొలిపాక శ్రీనివాస్ కోరారు.

యూరియాపై చేతులెత్తేసినట్టేనా..?

- జూన్ నాటికి రాష్ట్రానికి రావాల్సింది 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు వచ్చింది 2.19 లక్షల మెట్రిక్ టన్నులే
- యూరియా కోసం మూడుసార్లు కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖలు
- విదేశీ యూరియా కేటాయింపులతో సరఫరా సమస్య
- మరమ్మతులతో రామగుండంలో ఆగిన ఉత్పత్తి
- రెండుమూడు రోజులలో ఢిల్లీకి వ్యవసాయశాఖ డైరెక్టర్



సాక్షి, హైదరాబాద్: యూరియా కోసం అన్నదాతలు దుకాణాల ముందు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి తప్పేలా లేదు. వానకాలం సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియాను సరఫరా చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వమే ఆందోళన వ్యక్తం చేస్తుండడంతో రైతులు దిక్కులు చూసే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో యూరియా కేటాయింపులు పెంచాలన్న రాష్ట్ర విజ్ఞప్తిని పట్టించుకోని కేంద్రం.. గత సీజన్‌లో మాదిరిగానే 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది. ఈ మేరకు నెలవారీ సరఫరా ప్రణాళికను రాష్ట్రానికి పంపించింది. దాని ప్రకారం ఏప్రిల్ నుంచే కోటాను పంపించాలి. గత సంవత్సరం సీజన్ ప్రారంభానికి ముందే 5 లక్షల టన్నుల యూరియాను పంపింది. అదే తరహాలో ఈ ఏడాది కూడా సీజన్ ఆరంభానికి ముందే 5 ఎల్ఎంటీ యూరియాను నిల్వ ఉంచుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ చేసిన ప్రయత్నం ఫలించలేదు. జూన్ నాటికి రాష్ట్రానికి 5 ఎల్ఎంటీ యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటివరకు వచ్చింది 2.19 ఎల్ఎంటీ మాత్రమే. మే, జూన్ నెలల్లో 3.70 ఎల్ఎంటీ రావాలి. కానీ, 1.14 ఎల్ఎంటీ కోత పడుతోందని అధికారులు తెలిపారు.

మంత్రి లేఖ రాసినా స్పందన కరువు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశంతో రాష్ట్రంలో యూరియా కొరతపై గత నెల 19న వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు విజయ్‌కుమార్ ఢిల్లీకి వెళ్లి ఉన్నతాధికారులతో చర్చించారు. జూన్‌లో కంపెనీలవారీ కేటాయింపులు జరిగే సమయంలో మే 26న మరోసారి ఢిల్లీకి వెళ్లి చర్చలు జరిపారు. గత రెండు నెలల కేటాయింపులలో ఎక్కువభాగం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే యూరియా ఉండటం, అది సరైన సమయానికి రాకపోవడంతో సమస్య తలెత్తుతోంది. దీంతో జూన్ కోటాలో అయినా స్వదేశీ యూరియా సరఫరా చేయాలని మంత్రి తుమ్మల లేఖల ద్వారా కేంద్రాన్ని కోరారు. కేంద్రం జూన్‌లో కేటాయించిన 1.70 ఎల్ఎంటీలో 67 శాతం ఇంపోర్టెడ్ యూరియానే కేటాయించింది. గత రెండు నెలల కేటాయింపులలో తక్కువగా సరఫరా చేసిన 1.14 ఎల్ఎంటీపై కూడా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో రెండుమూడు రోజుల్లో వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఢిల్లీకి పంపిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ముందుగానే రావటంతో జూన్ వరకు కేటాయించిన మొత్తాన్ని నిర్ణీత సమయంలో సరఫరా చేయాలని కేంద్రానికి తుమ్మల మూడోసారి లేఖ రాశారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నిలిచిన ఉత్పత్తి

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో వార్షిక మరమ్మతుల కారణంగా మే 6 నుంచి ఉత్పత్తి నిలిచిపోయింది. హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్, అమ్మోనియా పైప్‌లైన్లు, ఇతర యంత్రాల నిర్వహణ కోసం ఈ రిపేర్లు చేపట్టారు. జూన్ రెండో వారంలో ఉత్పత్తి పునఃప్రారంభమయ్యే అవకాశం ఉంది. గత ఏడాది ఆర్ఎఫ్‌సీఎల్‌లో 11.94 ఎల్ఎంటీ యూరియా ఉత్పత్తి అయితే, రాష్ట్రానికి 4.68 ఎల్ఎంటీ సరఫరా చేసింది. మిగతాది నేషనల్ పూల్‌లో భాగంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసింది. ఈసారి ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాను ఎక్కువగా తమకే ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇంకా స్పందన రాలేదు.

తెలంగాణకు నెలవారీగా యూరియా కేటాయింపులు (లక్షల మెట్రిక్ టన్నులలో)

నెల	కేటాయింపులు	సరఫరా	కోత
ఏప్రిల్	1.70	1.22	0.48
మే	1.60	0.94	0.66
జూన్	1.70	0.03 (ఇప్పటివరకు)	

ఇథనాల్ ఫ్యాక్టరీపై ప్రజాగ్రహం

- గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో రణరంగం
- పరిశ్రమ వద్ద కంటైనర్‌ను తగలబెట్టిన గ్రామస్తులు
- కర్రలు, రాళ్లతో దాడి.. వాహనాలు, సామగ్రి ధ్వంసం
- పలువురు గ్రామస్తుల అరెస్టు

రాజోళి: ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన ఆందోళన రణరంగంగా మారింది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రతిపాదనను పెద్ద ధన్వాడతోపాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 7 నెలలుగా శాంతియుతంగా నిరసన కొనసాగిస్తున్నారు. కొంతకాలం ఆగిపోయిన పనులను ఇటీవల మళ్లీ మొదలుపెట్టడంతో గ్రామస్తులు ఆగ్రహంతో దాడులకు దిగారు. కర్రలు, రాళ్లతో ఫ్యాక్టరీ సిబ్బందిని తరిమికొట్టారు. ఫ్యాక్టరీ సామగ్రిని తగులబెట్టి, వాహనాలను ధ్వంసం చేశారు.

కొత్త వ్యక్తులను చూసి రెచ్చిపోయిన గ్రామస్తులు

ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ నిరాహార దీక్షలు చేసిన గ్రామస్తులను అధికార పార్టీ నాయకులు, అధికారులు నచ్చజెప్పి గతంలో దీక్ష విరమింపజేశారు. ఈ క్రమంలో గద్వాల ఆర్డీఓ కార్యాలయంలో ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి, ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య చర్చలు జరిగాయి. ఎట్టి పరిస్థితుల్లో ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేయనివ్వబోమని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఆ తర్వాత కొంతకాలం స్తబ్దత కొనసాగింది. అయితే, మంగళవారం ఫ్యాక్టరీ వద్దకు ఒక కంటైనర్‌తో 20 మంది దాకా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వచ్చారు. దీంతో మళ్లీ ఫ్యాక్టరీ పనులు మొదలవుతున్నాయని భావించిన గ్రామస్తులు రోడ్డుపై ధర్నాకు దిగారు. సీఐ టాటా బాబు, ఎస్ఐ జగదీశ్‌లు సర్దిచెప్పటంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. బుధవారం ఉదయమే పోలీసులు గ్రామంలోకి రావడంతో ఫ్యాక్టరీ పనులకు సహకరించేందుకే వచ్చారని భావించిన గ్రామస్తులు దాదాపు 400 మంది ఏకమై ఫ్యాక్టరీ పనులు జరిగే ప్రాంతానికి వచ్చారు. అక్కడ ఉన్న కంటైనర్‌ను తోసి పడేసి నిప్పు పెట్టారు. టెంట్లు, షెడ్లను తొలగించి తగలబెట్టారు. కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో ఒక బొలెరో వాహనం, టిప్పర్, రెండు కార్లు ధ్వంసమయ్యాయి. ఆ క్రమంలో కొందరు గ్రామస్తులకు కూడా గాయాలయ్యాయి. దీంతో ఫ్యాక్టరీ వద్దకు వచ్చిన కొత్త వ్యక్తులు వెళ్లిపోయారు. పోలీసులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా గ్రామస్తులు శాంతించలేదు. ఉద్రిక్తత నేపథ్యంలో అదనపు బలగాలను రప్పించారు. దాడులకు పాల్పడిన పలువురు గ్రామస్తులను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఆధార్ కార్డులు, ఫోన్‌నంబర్లు తీసుకొని 35 మందిని రాత్రి 10 గంటల సమయంలో వదిలేశారు. మరో 10 మంది పోలీసుల అదుపులోనే ఉన్నారు. గ్రామస్తుల అరెస్టును అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తీవ్రంగా ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దాడులు చేసేందుకు బౌన్సర్లు వచ్చారు



ఫ్యాక్టరీ వద్దన్నందుకు గ్రామస్తులపైన దాడులు చేసేందుకు బయట ప్రాంతాల నుంచి బౌన్సర్లను తీసుకువచ్చారు. 20 మంది దాకా బౌన్సర్లు మంగళవారం నుంచి ఫ్యాక్టరీ నిర్మించే చోటే ఉంటున్నారు. అనుమానం వచ్చి బుధవారం పనులు చేయొద్దని చెప్పడానికి ఫ్యాక్టరీ వద్దకు వెళితే.. వారు కయ్యానికి కాలు దువ్వారు. దీంతో గ్రామస్తులందరూ తిరగబడాల్సి వచ్చింది. – కుమార్, పెద్ద ధన్వాడ

ఉత్పత్తికి ముందే మండుతున్న ఇథనాల్

▶ మొదటి పేజీ తరువాయి

అడ్డుకునేందుకు స్థానికులు దాడులకు దిగారు. ఇథనాల్ ఫ్యాక్టరీల ద్వారా వాయు, జల కాలుష్యం ఏర్పడి తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లా చిత్తనూరులోనూ ఇథనాల్ యూనిట్ ఏర్పాటుపై నిరసనలు వ్యక్తమైనా, నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించింది. నారాయణపేట జిల్లా హిందూపూర్, జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఇథనాల్ తయారీ ఫ్యాక్టరీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న ప్రైవేటు సంస్థలు.. ప్రజల నిరసనల నేపథ్యంలో పనులు చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం.

తెలంగాణ లక్ష్యం 43 కోట్ల లీటర్లు

విదేశాల నుంచి శిలాజ ఇంధనాల దిగుమతిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో 'నేషనల్ బయో ఫ్యూయల్ పాలసీ'ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా 'ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్'కింద 2025–26 నాటికి మొలాసిస్ లేదా ధాన్యం నుంచి 1,080 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించింది. తెలంగాణకు 43 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఇచ్చింది. ఈ లెక్కన తెలంగాణలో రోజుకు 5,256 కిలో లీటర్ల (కేఎల్‌పీడీ) ఇథనాల్ ఉత్పత్తి కావాలి. ఇథనాల్ తయారీ యూనిట్లు ఏర్పాటుచేసే సంస్థలకు 'ఇథనాల్ ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్ స్కీమ్'కింద కేంద్రం వడ్డీలో రాయితీ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో 31 సంస్థలు ఇథనాల్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రాగా, 2018–2022 మధ్య 28 సంస్థలకు అనుమతులు వచ్చాయి. అయితే, అనుమతి పొందిన సంస్థల్లో ఎన్ని నిర్మాణ పనులు ప్రారంభించాయనే సమాచారం తమ వద్ద లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. గతంలో ఉమ్మడి జాబితాలో ఉన్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ చట్టం (ఐడీఆర్ యాక్ట్) ప్రకారం ఇథనాల్ తయారీ కేంద్ర జాబితాలో చేరింది. దీనిని గతంలో 16 బీజేపీ పాలిత రాష్ట్రాలు ఆమోదించినా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దూరంగా ఉన్నాయి. అయితే, ఇథనాల్ తయారీని ఉమ్మడి జాబితాలో చేర్చి రాష్ట్రాలకు పర్యవేక్షక బాధ్యత అప్పగించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి సూచించింది. అయినా రాష్ట్రంలో ఇథనాల్ తయారీ యూనిట్ల అనుమతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పరిమితమైంది. లైసెన్స్, రవాణా, మార్కెటింగ్, భూ కేటాయింపులు వంటి అంశాలతో తమకు సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

ధాన్యం ఆధారిత ఇథనాల్‌పైనే వ్యతిరేకత

రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమలు చెరకును గానుగ ఆడించడం ద్వారా వచ్చే మొలాసిస్‌తో ఇథనాల్ తయారు చేస్తున్నాయి. గాయత్రి (45 కేఎల్‌పీడీ), గణపతి (30 కేఎల్‌పీడీ), మధుకాన్ (60 కేఎల్‌పీడీ), కృష్ణవేణి (120 కేఎల్‌పీడీ) ఇథనాల్‌ను తయారు చేస్తున్నాయి. చెరకు ఫ్యాక్టరీకి రాని సీజన్‌లో ధాన్యం ఆధారిత మొలాసిస్ ద్వారా కూడా ఈ ఫ్యాక్టరీల్లో ఇథనాల్ తయారు అవుతోంది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ కింద ఏర్పాటయ్యే యూనిట్లు వరి, మొక్కజొన్న, జొన్న తదితర ధాన్యాల నుంచి మొలాసిస్‌ను తయారు చేసే ప్రక్రియలో నీటి వినియోగం, దుర్వాసన, కాలుష్య వ్యర్థాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ రకమైన పరిశ్రమలపైనే స్థానికుల్లో వ్యతిరేకత వస్తోంది. ప్రజలకు సరైన అవగాహన లేనందునే వ్యతిరేకత వస్తోందని పారిశ్రామికవర్గాలు చెప్తున్నాయి.

అనుమతులు రద్దు చేయాలి

పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతుల వెనుక అధికార పార్టీ అండదండలున్నాయి. రైతుల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే అనుమతులు రద్దు చేయాలి. రైతులపై పోలీసు కేసులు, అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– డాక్టర్ ఆంజనేయగౌడ్, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్

12 గ్రామాలకు ఇబ్బంది

పచ్చని పంట పొలాల నడుమ కాలుష్య చిచ్చును పెట్టే ఫ్యాక్టరీ వద్దంటున్నా పనులు చేపడుతున్నారు. గతంలో అధికారులకు ఎన్నోమార్లు వినతులు ఇవ్వడంతో పాటు నెలల తరబడి ఆందోళన చేస్తున్నాం. 12 గ్రామాల ప్రజలను ఇబ్బంది పెట్టేలా ఫ్యాక్టరీ నిర్మించాలనే ప్రతిపాదన విరమించుకోవాలి.

– విజయ్‌కుమార్, రాజోళి, గద్వాల జిల్లా

పదేళ్లుగా తిరుగుతున్నా.. పట్టించుకుంటలేరు

- రెవెన్యూ సదస్సులో అధికారులపై రైతు ఆగ్రహం
- చేయిపట్టి రైతును బయటకు లాక్కెళ్లిన ఏఎస్ఐ
- ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్.. ఏఎస్ఐపై సస్పెన్షన్ వేటు



రైతును లాక్కెళుతున్న ఏఎస్ఐ రాంచందర్

ఖానాపూర్: 'నా భూ సమస్యను పట్టించుకోరా..పదేళ్లకుపైగా తిరుగుతున్న. ఏదో ఒకటి ఇప్పుడే తేలిపోవాలి.. నాకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న అరెకరం భూమి నాకు ఇప్పించాలి. ఎన్నిసార్లు తిరగాలి. ఇప్పుడైనా న్యాయం చేస్తరా.. చేయరా.. ఎవరూ పట్టించుకుంటలేరు. ఎప్పుడు చేస్తరు.. మోకా మీద నేనే ఉన్నా కనిపించడం లేదా'అంటూ నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన భూభారతి చట్టం రెవెన్యూ సదస్సులో రైతు అల్లెపు వెంకటి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే... బుధవారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో భూ సమస్యపై రైతు వెంకటి కుమారుడు అల్లెపు పీటర్ దరఖాస్తు అందజేసి వెళ్లారు. ఆ తర్వాత అల్లెపు వెంకటి సదస్సుకు వస్తూ వస్తూనే పంచాయతీ కార్యదర్శి భోజన్నను భూ సమస్యపై ప్రశ్నించసాగాడు. దీంతో తహసీల్దార్ సుజాత జోక్యం చేసుకొని సమస్య ఏదైనా ఉంటే చెప్పాలని వారించే ప్రయత్నం చేశారు. అయినా రైతు వినిపించుకోకుండా ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో బయటకు తీసుకెళ్లాలని పోలీసులను ఆదేశించారు. ఏఎస్ఐ రాంచందర్ దరఖాస్తు పత్రంతో రావాలని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. 'నువ్వేం పోలీసువు'అంటూ ఆయన్ను ప్రశ్నించే ప్రయత్నం చేయగా బలవంతంగా బయటకు లాక్కెళ్లాడు. రైతు ప్రతిఘటించడం, ఏఎస్ఐ లాక్కెళ్లిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన బాసర డీఐజీ ఏఎస్ఐపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఇదీ భూ సమస్య నేపథ్యం..

అల్లెపు వెంకటికి మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఓ వ్యక్తికి 14 ఏళ్ల క్రితం ఎకరం భూమిని విక్రయించాడు. అయితే ఆయన ఎకరన్నర భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆలస్యంగా గుర్తించిన వెంకటితోపాటు కుటుంబ సభ్యులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండెకరాల్లో తానే ఉన్నానని, అర ఎకరం భూమి తనకే వచ్చేలా చూడాలని కోరుతున్నాడు. కాగా, 'వృద్ధ రైతు పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా.. మీరు చెబుతున్న ప్రజాపాలన ఇదేనా'అంటూ మాజీమంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

పేదలకు 'పట్టా'భిషేకం



ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న వారితో మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

ఖమ్మం రూరల్: ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 520 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. అందులోని పలువురికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పత్రాలు అందజేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పట్టాలు అందజేశాక మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న వారి కళ్లలో ఆనందం చూస్తుంటే భావోద్వేగానికి లోనయ్యానన్నారు. ఇళ్లు రాని వారు ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. చివరి అర్హులకు ఇల్లు దక్కే వరకు మంజూరు ప్రక్రియ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం మంజూరు పత్రాలు అందుకున్న వారితో మంత్రి ఫొటో దిగారు.

కుర్రాళ్లతో కుర్రాడై..



వాలీబాల్ సర్వీస్ చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: నిత్యం అధికారిక పర్యటనలు, సమావేశాలతో హడావుడిగా ఉండే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొద్దిసేపు ఆటవిడుపుగా యువకులతో వాలీబాల్ ఆడారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండల పర్యటనలో భాగంగా ఆయన నర్సింహులగూడెం వద్ద మైదానంలో వాలీబాల్ ఆడుతున్న యువకులను చూశారు. దీంతో తన కాన్వాయ్ ఆపి 'నాకూ ప్లేస్ ఇవ్వండి.. ఆడతాను'.. అంటూ కాసేపు వాలీబాల్ ఆడారు. ఆ తర్వాత యువకుల చదువుపై ఆరా తీశాక డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఉద్బోధించారు. అలాగే, క్రికెట్ కిట్ కొనుక్కోవాలని చెబుతూ నగదు అందజేశారు.

అంగన్‌వాడీల్లో నమోదు పెరగాలి

- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదు సంఖ్యను పెంచాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఒక్కో కేంద్రంలో ప్రస్తుతమున్న సంఖ్య కంటే కనీసం 25 శాతం నమోదు పెరగాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆడిటోరియంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమథన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల్లో చిన్నారులను ఆకర్షించే విధంగా ప్రత్యేకంగా మెటీరియల్ రూపొందించినట్లు మంత్రి తెలిపారు. బడిగంట తరహాలో అంగన్వాడీ కేంద్రాల్లోనూ గంట ఏర్పాటు చేయాలని, దీంతో చిన్నారుల్లో ఉత్సాహం, క్రమశిక్షణ పెరుగుతాయన్నారు.

పర్యావరణ విలాపం

యుద్ధాలతో మరింత సంక్లిష్టంగా మారుతున్న వాతావరణ సంక్షోభం

- ఇజ్రాయెల్ మొదలు, ఉక్రెయిన్–రష్యా యుద్ధాల దాకా అన్నీ పర్యావరణ విధ్వంసకాలే
- విశ్వవ్యాప్తంగా సాయుధ కార్యకలాపాలతో పెరిగిన కర్బన ఉద్గారాలు
- 40 శాతం కొత్త ఘర్షణలతో వివాదాల సుడిగుండంలోకి సహజవనరులు

యుద్ధం కొనసాగినన్ని రోజులూ రణ క్షేత్రాల్లో ఎక్కడ చూసినా రక్తతర్పణమే. సైనికుల రుధిరంతో తడిసి ముద్దయిన భూములు మాత్రమే కాదు పరోక్షంగా కోట్లాది ఎకరాల్లో సాగుభూమి, జనావాస ప్రాంతాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ), 2024 నివేదిక స్పష్టంచేసింది. హౌతీల తిరుగుబాటు, హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్–రష్యా యుద్ధంతోపాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాలు, ఘర్షణలు చివరకు పర్యావరణ సంక్షోభాగ్నుల్ని మరింత ఎగసిపడేలా చేస్తున్నాయని యూఎన్ఈపీ నివేదిక వెల్లడించింది. సరిహద్దు వివాదాలు మొదలు అంతర్జాతీయ విధానాలదాకా పొరుగు దేశాలు, శత్రుదేశాల మధ్య వైరం తుదకు పర్యావరణాన్ని మరింతగా నాశనం చేస్తోందని నివేదిక హెచ్చరిస్తోంది. దశాబ్దాల క్రితమే జీవాయుధాలు ప్రయోగించి కిలోమీటర్ల కొద్దీ జనావాసాలను విషవాయువులతో గరళమయం చేసిన దేశాల దుష్టాంతాలనూ నివేదిక గుర్తుచేసింది. యుద్ధాల వేళ శత్రు దేశాల జలాశయాలను, ఆనకట్టలపై బాంబులేసి నేలమట్టంచేయడంతో వందల కోట్ల లీటర్ల తాగు,సాగునీరు దిగువ ప్రాంతాలను ముంచేసి లక్షల ఎకరాల సాగుభూములు నీటమునుగుతున్నాయి. ఆనకట్టల నీరు సమీప ప్రాంతాల్లో గనుల తవ్వకాన్ని స్తంభింపజేస్తోంది. ఆయా నదీ ప్రవాహాల వెంట జీవవైవిధ్యం సైతం ధ్వంసమవుతోంది. మైదాన ప్రాంతాలు, పీఠభూములు సైతం నామరూపాల్లేకుండా నాశనమవుతున్నాయి. ఇలా ఆయా దేశాల్లో పర్యావరణం పతనమవుతోంది.

జీవవైవిధ్యానికి గొడ్డలిపెట్టు

1990 దశకం నుంచి చూస్తే ఇప్పటిదాకా ఎన్నో యుద్ధాలు మరెన్నో రకాలుగా పర్యావరణ విధ్వంసానికి ప్రధాన కారణమయ్యాయి. 1990 దశకంలో యుద్ధంలో భాగంగా కువైట్‌లోని 700కుపైగా చమురు బావులకు ఇరాక్ సేనలు నిప్పు పెట్టాయి. దీంతో రోజుకు 50 లక్షల బ్యారెళ్ల చమురు అగ్నికి ఆహుతై నల్లటి మేఘాలు యావత్ ప్రాంతంలో కమ్మేశాయి. దీంతో అంతులేని పర్యావరణ విధ్వంసం జరిగింది. చమురుబావులు ఏకధాటిగా ఏడు నెలలపాటు తగలబడి చరిత్రలో ఎన్నడూ లేనంతటి పొగను సహజావరణలోకి వెదజల్లాయి. సమీప సముద్ర ఉపరితలజలాలు సైతం విస్తృతంగా పరుచుకున్న చమురు తెట్టతో పాడైపోయాయి. దీంతో పర్యావరణ సమతుల్యత బాగా దెబ్బతింది. కువైట్‌లోని 99 శాతం మంచినీటి సరస్సులు కాలుష్యకాసారాలుగా మిగిలిపోయాయి. వాయుకాలుష్యానికితోడు ఆ రీజియన్‌లో మెజారిటీ ప్రజలకు శ్వాససంబంధ వ్యాధులు ప్రబలాయి. ఈ ఘటనతో ప్రపంచం ఆర్థికగాయాలను చవిచూడాల్సి వచ్చింది. ఆతర్వాతి నుంచే ముడి చమురు ధరలు వడివడిగా పెరగడం మొదలైంది.

ఆనకట్టల పేల్చివేతతో అంతులేని విధ్వంసం

ఉక్రెయిన్‌పైకి దురాక్రమణ జెండాతో దూసుకొస్తున్న రష్యా వైమానిక దళాలు 2023లో కఖోవ్కా ఆనకట్టను రాత్రికిరాత్రే పేల్చేశారు. దీంతో డ్యామ్‌లోని అపార జలరాశి దిగువ ప్రాంతాల్లోకి వృథాగా పోయింది. దిగువ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. 5 లక్షల ఎకరాల్లో పంటభూములు పూర్తిగా నాశనమయ్యాయి. గనులు, చమురు బావులు, పారిశ్రామిక వ్యర్థాలు మొత్తం డినిప్రో నది, నల్లసముద్ర పరీవాహక ప్రాంతాల్లోకి కొట్టుకొచ్చి పర్యావరణ విధ్వంసాన్ని మరింత పెంచాయి. ఇలా ఒక్క కఖోవ్కా డ్యామ్ పేల్చివేతతో దాదాపు వేయికిపైగా ప్రాంతాల్లో పర్యావరణం కోలుకోనంతగా పాడైపోయిందని నివేదిక పేర్కొంది. జీవవైవిధ్యం ధ్వంసమవడంతోపాటు వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

తాజాగా గాజాలో..

గాజాలో ఇజ్రాయెల్ విధ్వంసం ఇంకా కొనసాగుతోంది. భవనాలు, రోడ్లను పేల్చేయడంతో గాజా అంతటా ఎక్కడ చూసినా కాంక్రీట్ శిథిలాల కుప్పలే కనిపిస్తున్నాయి. 2023–24 కాలంలో గాజాలో దాదాపు 4 కోట్ల టన్నుల చెత్త పెరిగింది. అంటే ప్రతి చదరపు మీటర్‌కు 107 కేజీల చెత్త అదనంగా వచ్చి చేరింది. గాజాలో పచ్చదనం దాదాపు పూర్తిగా కనుమరుగైంది. గాజా సమీప ప్రాంతాల్లో 80% చెట్లు కూలిపోయాయి. మూడింట రెండొంతుల సాగుభూమి బాంబులు, ఫిరంగి గుళ్లు, క్షిపణి శకలాలతో నిండిపోయి సాగుకు పనికిరాకుండా పోయాయి. తూర్పు మధ్యధరా ప్రాంతంలో భూమాత ఊపిరితిత్తులుగా ఖ్యాతిగాంచిన 'వాడీ గాజా' చిత్తడి నేలలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. ఇక్కడి 150 రకాల సకశేరుక జీవులు, 70 రకాల ప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.


యుద్ధ విధ్వంసం (ఫైల్‌ ఫొటోలు)



దళాలు.. పర్యావరణ దోషులు

రోజూ ప్రపంచవ్యాప్తంగా వందల పౌరవిమానాలు కోట్ల లీటర్ల ఇంధనాన్ని మార్గమధ్యంలో ఆకాశంలో మండిస్తూ పొగను వెదజల్లుతూ పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. సముద్రమార్గాల్లో ప్రయాణిస్తూ సరుకు రవాణా నౌకలు సైతం ఇదే పనిచేస్తున్నాయి. వీటిని మించి యుద్ధాల ద్వారా దేశాల సాయుధబలగాలు అత్యధికస్థాయిలో కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల విడుదలలో యుద్ధాల్లో పాల్గొన్న దేశాల మిలటరీల వాటా 5.5 శాతానికి పెరిగింది. ఇందులో ఒక్క అమెరికా వాటానే ఒక శాతం ఉండటం గమనార్హం. యుద్ధ ట్యాంక్‌లు, శతఘ్నులు, జెట్ విమానాలు, సైనిక రవాణా వాహనాలు కోట్ల లీటర్ల ఇంధనాన్ని తాగేస్తూ పొగ, అత్యధిక స్థాయిలో కర్బన ఉద్గారాలను వెలువరిస్తున్నాయి. గాజాలో పేలుళ్లతో పేరుకుపోయిన 1.5 కోట్ల టన్నుల కాంక్రీట్ శిథిలాలు సైతం పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించనున్నాయి. సహజ వనరులు నాశనం కావడానికి కొత్తగా పొడచూపుతున్న యుద్ధాలు 40 శాతం కారణమని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇకనైనా పర్యావరణ విధ్వంసాలకు ఆయా దేశాలను బాధ్యులను చేస్తూ నష్టపరిహార, సహాయక చర్యలు తీసుకోవాలని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ కొన్ని సూచనలు చేసింది. అవేంటంటే..

- → విస్తృతస్థాయిలో, ఎక్కువ మంది పౌరులను ప్రభావితంచేసే ఘర్షణలను ఇకపై అంతర్జాతీయ నేరంగా పరిగణించాలి
- → ఐరాస వాతావరణ మార్పుల ముసాయిదా సమావేశం(యూఎన్ఎఫ్‌సీసీసీ) నిబంధనలను అనుసరిస్తూ ఇకపై ప్రతిదేశం తమ సైన్యం ఏ స్థాయిలో కర్బన ఉద్గారాలను వెదజల్లిందో ఆ డేటాను నిష్పాక్షికంగా బహిర్గతం చేయాలి
- → అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతిపాదించినట్లుగా ఘర్షణలు సద్దుమణిగాక యుద్ధంతో దెబ్బతిన్న పర్యావరణానికి పునరుజ్జీవం కల్పించేందుకు 20 శాతం నిధులను కేటాయించాలి
- → ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సులో భారత్ చేసిన '' ఒకే భూమి, ఒకే కుటుంబం' ప్రేరణగా సమీకృత వాతావరణ దౌత్య వేదికనూ నెలకొల్పాలి. సరిహద్దుల వెంట నిరాయుధీకరణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి
- → 2024లో అన్ని దేశాల సైనిక బడ్జెట్లు 2.4 ట్రిలియన్ డాలర్లకు పెరిగినట్లే.. జీవవైవిధ్య పరిరక్షణా నిధులనూ దేశాలు పెంచాలి

\- సాక్షి, నేషనల్ డెస్క్

2027 మార్చి 1 నుంచి జన గణన

దేశంలో తొలిసారిగా జన గణనతోపాటు కుల గణన

- హిమాలయ పర్వత ప్రాంతాల్లో 2026 అక్టోబర్ 1నే శ్రీకారం
- కేంద్ర హోంశాఖ అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జన గణనతోపాటే కుల గణన దిశగా అడుగులు పడుతున్నాయి. 2027 మార్చి ఒకటో తేదీ నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్ర హోంశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జనాభా లెక్కల సేకరణలో అంతర్భాగంగా కులాల వారీగా జనాభా గణాంకాలు కూడా సేకరించాలని నిర్ణయించడం దేశంలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈసారి రెండు దశల్లో జన గణన నిర్వహించనున్నారు. హిమాలయ పర్వత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 2026 అక్టోబర్ 1న జన గణన ప్రారంభించాలని నిర్ణయించారు. జన గణన, కుల గణన అంశాన్ని ఈ నెల 16వ తేదీన గెజిట్‌లో ప్రచురించే అవకాశం ఉంది.

16 ఏళ్ల తర్వాత మళ్లీ జన గణన

సెన్సెస్ యాక్ట్–1948, సెన్సెస్ రూల్స్–1990 ప్రకారం దేశంలో ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కల సేకరణ చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. చివరిసారిగా 2011లో జన గణన జరిగింది. దేశంలో 121 కోట్లకు పైగా జనాభా ఉన్నట్లు అప్పట్లో తేలింది. జనాభా వృద్ధి రేటు 17.7 శాతంగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. 2021లో మళ్లీ జన గణన జరగాల్సి ఉండగా కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి, లాక్‌డౌన్ వల్ల అనివార్యంగా వాయిదా పడింది. 16 ఏళ్ల తర్వాత మళ్లీ జనాభా లెక్కల సేకరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈసారి జరిగే జన గణనకు విశేషమైన ప్రాధాన్యం ఉంది. కులాల జనాభా లెక్కల కూడా సేకరించబోతున్నారు. కుల గణన కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. బిహార్, తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా కుల గణన నిర్వహించాయి. దీంతో దేశమంతటా ఈ ప్రక్రియ ప్రారంభించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. కుల గణన వివరాల ఆధారంగా ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తే ఆయా వర్గాలకు మేలు జరుగుతుందని మేధావులు, నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కుల గణనకు ఆమోదం తెలిపింది.

1971 నుంచి లోక్‌సభ సీట్ల సంఖ్య యథాతథం

దేశంలో లోక్‌సభ నియోజకవర్గాలు, రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన వ్యవహారం పెండింగ్‌లో ఉంది. జన గణన పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. తాజా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులు మారే అవకాశం ఉంది. అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. అయితే, నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందా? లేదా? అనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రాజ్యాంగం ప్రకారం .. జనాభా లెక్కల సేకరణ జరిగిన ప్రతిసారీ నియోజకవర్గాల సంఖ్య, సరిహద్దుల్లో మార్పులు చేర్పులు చేయాలి. 1976 నుంచి నియోజకవర్గాల సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయకుండా నిలిపివేశారు. జనాభాను నియంత్రణను ప్రోత్సహించాలన్నదే దీని అసలు ఉద్దేశం. వాస్తవానికి నియోజకవర్గాల సంఖ్య పెంపుపై నిషేధం 2001 దాకానే అమలు కావాలి. కానీ, 2026 దాకా పొడిగించారు. 2001 తర్వాత నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ, ఎస్టీల రిజర్వ్‌డ్ స్థానాల్లో మార్పులు జరిగినప్పటికీ మొత్తం నియోజకవర్గాల సంఖ్య మారలేదు. ఈ సంఖ్య 1971 నుంచి 543గానే కొనసాగుతోంది. అప్పటితో పోలిస్తే దేశ జనాభా రెండు రెట్లకు పైగానే పెరిగింది. నియోజకవర్గాల సంఖ్యలో మాత్రం మార్పులేదు.



దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

మరోవైపు జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య పెంచితే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. ఉత్తరాదిన జనాభా పెరగడం, దక్షిణాదిన తగ్గడమే ఇందుకు కారణం. ఇప్పుడున్న నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా కొనసాగించి జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు 26 సీట్లు కోల్పోతాయని, ఉత్తరాది రాష్ట్రాలకు అదనంగా 31 సీట్లు లభిస్తాయని అంచనా. ఒకవేళ 2019లో ప్రతిపాదించినట్లుగా లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 848కు పెంచి, పునర్విభజన చేపట్టినా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయమే జరుగుతుంది.

ఆ గురుద్వారా అలాగే ఉండనివ్వండి

- తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు
- ఢిల్లీ వక్ఫ్ బోర్డు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని షాదారా ప్రాంతంలో ఉన్న గురుద్వారా స్థలం తమదేనని, దాన్ని తమకు అప్పగించాలని కోరుతూ ఢిల్లీ వక్ఫ్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అక్కడ చాలా ఏళ్లుగా గురుద్వారా ఉంది కాబట్టి దాన్ని అలాగే ఉండనివ్వండి అని తేల్చిచెప్పింది. ఒకవేళ ఆ స్థలం మీదేనని మీరు భావిస్తే ఆ అభిప్రాయం మానుకోండి అని సూచించింది. షాదారా గురుద్వారా స్థలం 'మసీదు తకియా బబ్బర్ షా'కు చెందుతుందని పేర్కొంటూ ఢిల్లీ వక్ఫ్ బోర్డు తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఢిల్లీ హైకోర్టు 2010 సెప్టెంబర్‌లో ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ ఢిల్లీ వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఆ స్థలంలో గురుద్వారా చాలా ఏళ్లుగా ఉందని మీరే చెబుతున్నారు కాబట్టి దాన్ని అలాగే కొనసాగనివ్వాలని పిటిషనర్‌కు స్పష్టంచేసింది. పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలియజేసింది. ఆ స్థలంలో 1947 నుంచి గురుద్వారా ఉన్నట్లు ఢిల్లీ హైకోర్టులో విచారణ సందర్భంగా ఓ సాక్షి చెప్పిన విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

సైన్యాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదు

రాహుల్‌పై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం

లక్నో: భావ ప్రకటనా స్వేచ్ఛ కూడా కొన్ని సహేతుకమైన పరిమితులకు లోబడి ఉంటుందని అలహాబాద్ హైకోర్టు తేల్చిచెప్పింది. భారత సైన్యాన్ని గానీ, ఇతర వ్యక్తులను గానీ కించపరుస్తూ ఇష్టానుసారంగా మాట్లాడే స్వేచ్ఛను భావ ప్రకటనా స్వేచ్ఛగా పరిగణించలేమని స్పష్టంచేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరును న్యాయస్థానం తప్పుపట్టింది. 2022లో భారత్ జోడో యాత్ర సమయంలో భారత సైన్యాన్ని కించపర్చేలా రాహుల్ గాంధీ మాట్లాడారని ఆరోపిస్తూ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ రిటైర్డ్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ లక్నో కోర్టులో ఫిర్యాదు చేశారు. దాంతో కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ సమన్లు కొట్టివేయాలని కోరుతూ రాహుల్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) పౌరులకు వాక్ స్వాతంత్య్రపు హక్కు కల్పించినట్లు గుర్తుచేసింది. అయినప్పటికీ సైన్యాన్ని, వ్యక్తులను కించపర్చేలా మాట్లాడే హక్కుల ఎవరికీ లేదని పేర్కొంది. రాహుల్ గాంధీ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కింది కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది.



జూలై 21 నుంచి ఆగస్టు 12 దాకా వర్షాకాల సమావేశాలు

జస్టిస్ వర్మ అభిశంసనకు తీర్మానం

- అందుకు చర్యలు చేపడతాం: కేంద్రం
- ప్రతి పార్టీతోనూ చర్చిస్తున్నాం: రిజిజు
- 'ప్రత్యేక భేటీ'కి మోదీ సర్కారు భయపడింది
- అందుకే ముందస్తుగా తేదీల ప్రకటన: విపక్షాలు

సాక్షి, న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు దొరికిన ఉదంతంలో ఆయన అభిశంసనకు చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు బుధవారం ప్రకటించారు. జూలై 21 నుంచి ఆగస్టు 12 దాకా పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సారథ్యంలో జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలపై సమగ్ర చర్చ కోసం పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలంటూ కాంగ్రెస్‌తో పాటు 16 విపక్షాలు ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారమే లేఖ రాయడం తెలిసిందే. ఈ డిమాండ్‌పై రిజిజు స్పందిస్తూ ప్రభుత్వానికి ప్రతి సమావేశాలూ ప్రత్యేకమేనన్నారు. విపక్షాలు కోరుతున్న అన్ని అంశాలనూ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టవచ్చని సూచించారు. కానీ పార్లమెంటు ప్రత్యేక భేటీ నుంచి మోదీ సర్కారు పారిపోయిందని కాంగ్రెస్, టీఎంసీ తదితర పార్టీలు ఎద్దేవా చేశాయి. అందుకే వర్షాకాల భేటీల తేదీలను ఏకంగా 47 రోజుల ముందు వెల్లడించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. కేంద్రానికి పార్లమెంటోఫోబియా పట్టుకుందని తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ విమర్శించారు.

ఏకగ్రీవంగా 'అభిశంసన'

జస్టిస్ వర్మ అభిశంసనకు వర్షాకాల సమావేశాల్లోనే పార్లమెంటు ఆమోదం లభిస్తుందని రిజిజు ఆశాభావం వెలిబుచ్చారు. ''న్యాయవ్యవస్థలో అవినీతిని రాజకీయ దృక్కోణం నుంచి చూడలేం. అందుకే అభిశంసన తీర్మానాన్ని పార్టీలన్నీ ఏకగ్రీవంగా ప్రవేశపెట్టాలన్నది కేంద్రం ఉద్దేశం. దీనిపై ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నిస్తున్నాం. ప్రధాన పార్టీలకు ఇప్పటికే నేను స్వయంగా మేరకు సమాచారమిచ్చా. చిన్న పార్టీలను కూడా సంప్రదిస్తున్నా''అని మంత్రి తెలిపారు. తీర్మానాన్ని ఏ సభలో ప్రవేశపెట్టాలో నిర్ణయించాల్సి ఉందన్నారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం ప్రకారం తీర్మానాన్ని సభ అనుమతించాక అభియోగాలపై విచారణకు ముగ్గురు సభ్యులతో సభాపతి ఒక కమిటీని నియమిస్తారు. అందులో భారత ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రఖ్యాత న్యాయ కోవిదుడు సభ్యులుగా ఉంటారు. ఆ కమిటీ సమర్పించే నివేదికపై సభ చర్చించిన అనంతరం అభిశంసన ప్రక్రియ చేపడుతుంది. అయితే జస్టిస్ వర్మ ఉదంతంపై సీజేఐ కమిటీ ఇప్పటికే నివేదిక సమర్పించిందని రిజిజు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో కూలంకషంగా చర్చించి ఓ నిర్ణయానికి వస్తామన్నారు.

'స్వదేశీ' సత్తా చాటాం: మోదీ

న్యూఢిల్లీ: ''స్వదేశీ ఆయుధాలు ఆపరేషన్ సిందూర్‌లో అద్భుతంగా సత్తా చాటాయి. ప్రపంచంలో ఏ దేశానికీ తీసిపోమని నిరూపించుకున్నాయి'' అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. భారత దాడుల్లో కోలుకోలేని నష్టాలు చవిచూసినట్లు పాక్ అంగీకరించడమే ఇందుకు తాజా నిదర్శనమన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా కేంద్ర మంత్రిమండలి బుధవారం ఆయన అధ్యక్షతన సమావేశమైంది. మేకిన్ ఇండియాలో భాగంగా ఆయుధాలు, ఆయుధ వ్యవస్థల తయారీకి ప్రభుత్వం ఇస్తున్న అమితమైన ప్రాధాన్యం ఇకముందు కూడా కొనసాగుతుందని ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పలు మంత్రిత్వ శాఖల పనితీరుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ జరిగింది. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాల్సిందిగా మంత్రివర్గ సహచరులకు మోదీ పిలుపునిచ్చారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి గద్దెనెక్కి జూన్ 9కి ఏడాది పూర్తవుతున్నందున ఈ 12 నెలల్లో సాధించిన ఐదు ప్రధాన విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన ఆర్సీబీ జట్టుకు సన్మానం సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారికి మంత్రివర్గం సంతాపం తెలిపింది.

మలేసియాలో పారని పాక్ పాచిక

భారత దౌత్య బృందంతో చర్చలకు అనుమతి ఇవ్వొద్దని పాక్ అభ్యర్థన ● పాక్ అభ్యర్థనను పట్టించుకోని మలేసియా

కౌలాలంపూర్: మలేసియా గడ్డపై పాకిస్తాన్ చేసిన భారతవ్యతిరేక కుయుక్తులు నిష్ఫలమయ్యాయి. ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలను వివరిస్తూనే ఉగ్ర విషం చిమ్ముతున్న పాకిస్తాన్ వైఖరిని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు మలేసియాలో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష దౌత్య బృందం ఆ దేశాధికారులతో సమావేశమైంది. అయితే ఈ భేటీను అడ్డుకునేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. మతాన్ని అడ్డుగా పెట్టే ప్రయత్నం చేసి చివరకు భంగపడింది. జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని భారత అఖిలపక్ష దౌత్య బృందం మలేసియాలో 10 వేర్వేరు భేటీలకు సిద్ధమవగా ఈ కార్యక్రమాలకు అనుమతి ఇవ్వొద్దని మలేసియా ప్రభుత్వానికి అక్కడి పాకిస్తాన్ ఎంబసీ లేఖ రాసింది. '' మనం మనం ఒక్కటే. మన రెండు దేశాలూ ముస్లిం దేశాలే. భారత ప్రతినిధి బృందం చెప్పే అంశాలకు విలువ ఇవ్వకండి. అసలు వాళ్లకు అనుమతే ఇవ్వకండి. మొత్తం 10 వేర్వేరు కార్యక్రమాలను జరగనివ్వకండి'' అని ఆ లేఖలో పాకిస్తాన్ తన అక్కసు వెళ్లబోసుకుంది. అయినాసరే మలేసియా సర్కార్ భారత్‌కే మద్దతు పలికింది. మొత్తం 10 కార్యక్రమాలకూ అనుమతి ఇచ్చింది. మలేసియా పార్లమెంట్ స్పీకర్ వైబీ టాన్ శ్రీ దాటో జొహారీ బిన్ అబ్దుల్‌తో సంజయ్‌ఝా బృందం భేటీ అయి పాక్ ఉగ్రధోరణిని వివరించింది.

బిలావల్ భుట్టోకు చేదు అనుభవం

భారత్‌కు పోటీగా అమెరికాలో పర్యటిస్తున్న పాకిస్తాన్ దౌత్య బృందానికి సారథ్యంవహిస్తున్న ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్తాన్ పీపుల్స్‌పార్టీ(పీపీపీ) నేత బిలావల్ భుట్టో జర్దారీకి న్యూయార్క్‌లకు చేదు అనుభవం ఎదురైంది. పహల్గాం దాడి తర్వాత భారత్‌లో ముస్లింలను దూషించడం ఎక్కువైందని, వాళ్లను దయ్యాల్లా చూస్తున్నారని బిలావల్ అమెరికాలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఈయన వ్యాఖ్యలను ముస్లిం జర్నలిస్ట్ అహ్మద్ ఫథీ మీడియా సమావేశంలో లేవనెత్తి బిలావల్‌ను ఇరుకునపెట్టారు. '' పహల్గాం ఘటనను భారత ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా వాడుతోందనేది పూర్తిగా తప్పు. ఆపరేషన్ సిందూర్ వివరాలను భారత్ తరఫున ముస్లిం మహిళా నావికాధికారి మీడియాకు వివరించారు. ముస్లింలను భారత్ తన ప్రతినిధులుగా భావిస్తోందికదా?'' అని ప్రశ్నించారు. దీంతో బిలావల్ ముఖం ఎర్రబడింది. ఏం చెప్పాలో తెలీక నీళ్లు నమిలారు. భారత దాడి వివరాలను కల్నల్ సోఫియా ఖురేషి వివరించడం తెల్సిందే.

స్టీల్, అల్యూమినియంపై అమల్లోకి 50% సుంకాలు

వాషింగ్టన్: విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే స్టీల్, అల్యూమినియంపై అమెరికా ప్రభుత్వం విధించిన టారిఫ్‌లు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ టరిఫ్‌లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచేసిన సంగతి తెలిసిందే. దీని వల్ల అమెరికాలో స్టీల్, అల్యూమినియం లోహాల ధరలు విపరీతంగా పెరిగిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గృహ నిర్మాణం మరింత ఖరీదుగా మారనుంది. ఈ భారం అంతిమంగా వినియోగ దారు లు భరించాల్సిందే. తమ దేశంలో స్టీల్, అల్యూమినియం పరిశ్రమలను కాపాడుకొనేందుకు విదేశీ లోహాలపై టారిఫ్‌లు పెంచినట్లు ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

బీజేపీ 'ఆపరేషన్ బిహార్'

- అసెంబ్లీ ఎన్నికలకు కొత్త వ్యూహం
- 2.75 కోట్ల వలస ఓట్లపై కన్ను

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌పై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. అందుకోసం వినూత్నంగా 'దేశవ్యాప్త' వ్యూహం రూపొందించింది. ఉపాధి కోసం దేశవ్యాప్తంగా వలస వెళ్లిన 2.75 కోట్ల మంది బిహారీల ఓట్లను సాధించడమే లక్ష్యంగా పథకరచన చేసింది. ఇందులో భాగంగా పార్టీ నేతలు దేశవ్యాప్తంగా పర్యటించి వా రందరినీ వ్యక్తిగతంగా కలుసుకోనున్నారు. బిహార్‌లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ కనీసం 15 వేల నుంచి 20 వేల మంది వలసదారులున్నట్టు చెబుతు న్నారు. వారిలో కనీసం ఐదేసి వేల మందైనా బీజేపీకి ఓటేసేలా ప్రభావితం చేయాలన్నది టార్గెట్. ఈ దిశ గా బిహారీ వలసదారుల సమాచారాన్ని సేకరించను న్నారు. 'ఆమ్ బిహారీ ప్రవాసీ కీ జాన్‌కారీ' పేరు తో 14 ప్రశ్నలతో కూడిన జాబితాను బీజేపీ సిద్ధం చేసు కుంది. పేరు, చిరునామా, ఫోన్ నంబర్, వృత్తి, అసెంబ్లీ నియోజకవర్గం, బీజేపీ మద్దతుదారుడా కాదా, ఓటరు గుర్తింపు కార్డు ఉందా లేదా వంటి సమాచారాన్ని సేకరించనున్నారు. ఈ ఏడాది బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బిహారీ దివస్‌కు కొనసాగింపుగా కొనసాగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

న్యాయ వ్యవస్థలో అవినీతి అరికట్టాలి!

పదవీ విరమణ వెంటనే పదవులు తీసుకోవడం సరైంది కాదు ● సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన వంటివి ప్రజల విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. అంతిమంగా న్యాయ వ్యవస్థలో నిజాయతీ, సమగ్రతపై ప్రజలు నమ్మకం కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్ సుప్రీం కోర్టులో 'న్యాయ వ్యవస్థ సమగ్రత, ప్రజల విశ్వాసం కొనసాగింపు' అనే అంశంపై తాజాగా జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన వెంటనే ఎన్నికల్లో పోటీ చేయడాన్ని, ప్రభుత్వ పదవులు స్వీకరించడాన్ని తప్పుపట్టారు. ఇది నైతికతకు సంబంధించిన అంశమని, ప్రజల పరీక్షకు గురి కావాల్సి ఉంటుందని చెప్పారు. భవిష్యత్తులో దక్కబోయే పదవులను దృష్టిలో పెట్టుకొని జడ్జీలు తీర్పులు ఇస్తారని ప్రజలు భావించే ప్రమాదం ఉందన్నారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రత, నిష్పక్షపాతంపై సందేహాలు తలెత్తుతాయ న్నారు. పదవీ విరమణ తర్వాత ఎలాంటి పదవు లు స్వీకరించబోమంటూ తనతోపాటు మరికొందరు సహచరులు ప్రమాణం చేసినట్లు వెల్లడించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రత, విశ్వసనీయతను పరిరక్షించాలన్న ధ్యేయంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టంచేశారు. అలాగే న్యాయ వ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన వెలుగులోకి వచ్చినప్పుడు సుప్రీంకోర్టు జాప్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



ప్రభుత్వ జోక్యం వద్దు...

కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకంలో రాజకీయ, ప్రభుత్వ జోక్యం ఉండరాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. కొలీజియం వ్యవస్థను ఆయన సమర్థించారు. ఈ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండడం లేదన్న వాదనను ఖండించారు. రాజ్యాంగ పరిరక్షణ విషయంలో న్యాయ మూర్తుల స్వతంత్రత అనేది అత్యంత కీలకమని స్పష్టంచేశారు. శాసన లేదా కార్యనిర్వాహక వ్యవ స్థల చట్టబద్ధత బ్యాలెట్ ద్వారా ఏర్పడుతుందని గుర్తుచేశారు. కానీ, జ్యుడీషియరీ చట్టబద్ధత రాజ్యాంగ విలువల పరిరక్షణతో అనుసంధానమై ఉంటుందన్నారు.

బాబు వెన్నుపోటుపై తిరుగుబాటు

కూటమి ప్రభుత్వ మోసాలపై కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం • వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ఉప్పెనలా కదలివచ్చిన జనం

సాక్షి, అమరావతి : ఎన్నికల్లో సూపర్ సిక్స్ సహా 143 వాగ్దానాలతో నమ్మించి, ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగుర వేశారు. కూటమి ప్రభుత్వం కుట్రలు.. పోలీసుల ఆంక్షలను ఛేదించుకుని ఉప్పెనలా కదలివచ్చి బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 'వెన్నుపోటు దినం'లో కదం తొక్కారు. బాబూ ష్యూరిటీ–మోసం గ్యారంటీ.. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు.. అంటూ ప్లకార్డులు చేతబూని.. తక్షణమే హామీలు అమలు చేయాలని.. లేదా మోసం చేసిన సీఎం చంద్రబాబు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీల్లో నినదించడంతో దిక్కులు పిక్కటిల్లాయి. అన్ని నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించి.. తక్షణమే హామీలు అమలు చేయాలని కోరుతూ అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ పత్రాలను అందజేశారు. 'సూపర్ సిక్స్ పేరుతో మహిళలు, రైతులు, నిరుద్యోగ యువకులు.. ఇలా ప్రతి ఒక్కరికీ వెన్నుపోటు పొడిచావు. నువ్వు మోసం చేయని వర్గం అంటూ ఉందా బాబూ? వైఎస్ జగన్ ఇస్తున్న పథకాలన్నింటినీ ఎత్తేశావు.. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు.. శాంతి భద్రతలను నిర్వీర్యం చేశావు. నీ అబద్ధపు హామీలతో అందరినీ వంచించావు. ప్రశ్నించే గొంతులను నొక్కేయడానికి రెడ్ బుక్‌తో టెర్రర్ సృష్టిస్తున్నావు.. ఇక చాలు మీ నిర్వాకం. ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి'అని ఊరూరా ప్రజలు నిప్పులు చెరుగుతూ డిమాండ్ చేశారు. మండుటెండలను లెక్క చేయకుండా నిరసన ర్యాలీలకు ఊరూవాడ నుంచి తండోప తండాలుగా జనం కదలి రావడమే చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి శ్రీసత్యసాయి జిల్లా వరకూ 26 జిల్లాల్లోనూ వెన్నుపోటు దినం, నిరసన ర్యాలీలు గ్రాండ్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ కదనోత్సాహాన్ని మరింతగా రగిల్చింది.

ఆ పిలుపే ప్రభంజనమై..

సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి.. ఓట్లేయించుకుని చంద్రబాబు కూటమి విజయం సాధించి బుధవారం (జూన్ 4)తో సరిగ్గా ఏడాది పూర్తయింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వెలువడ్డ జూన్ 4ను వెన్నుపోటు దినంగా పాటించాలని.. కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీస్తూ అన్ని నియోజకవర్గాల్లో నిరసన తెలుపుతూ ర్యాలీలు నిర్వహించి, తక్షణమే హామీలు అమలు చేయాలని అధికారులకు డిమాండ్ పత్రాలు అందజేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. దీంతో వైఎస్ జగన్ పిలుపు ప్రభంజనమై.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అన్ని వర్గాల ప్రజలు కదం తొక్కడానికి సిద్ధమవుతున్నారని గ్రహించిన కూటమి ప్రభుత్వం దాన్ని విఫల యత్నం చేయడానికి కుట్రలు చేసింది. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం–నిరసన ర్యాలీలను అడ్డుకోవడానికి యథావిధిగా రెడ్ బుక్‌తో భయానక వాతావరణం సృష్టించేందుకు విఫలయత్నం చేసింది. ప్రశ్నించే గొంతును నొక్కేయడానికి పోలీసులను ఉసిగొల్పింది. బుధవారం ఉదయమే అనేక ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్ల వద్దకు చేరుకున్న పోలీసులు వారిని అడుగు బయట పెట్టనివ్వకుండా హౌస్ అరెస్టు చేశారు. మాచర్లలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని దిగ్బంధించిన పోలీసులు.. బయటకు వస్తే కేసులు పెడతామని నాయకులు, కార్యకర్తలను తీవ్ర స్థాయిలో బెదిరించారు. గుంటూరులో నిరసన ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలీసులు దౌర్జన్యం చేశారు. కూటమి కుట్రలు.. పోలీసుల ఆంక్షలను చిత్తు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జనం కదం తొక్కారు.



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో తమ వాహనాలతో కూటమి ప్రభుత్వంపై నిరసన తెలుపుతున్న రేషన్ వాహనాల డ్రైవర్లు



నెల్లూరులో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన పథకాల బోర్డులను ప్రదర్శిస్తూ నిరసన





వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో అన్ని ప్రాంతాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నిరసన తెలిపారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఆయా చిత్రాలివే..!

పెల్లుబికిన ప్రజా వ్యతిరేకత

'వెన్నుపోటు దినం' విజయవంతంపై వైఎస్ జగన్ హర్షం



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏడాదిగా టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను నిలదీస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో నిర్వహించిన నిరసన ర్యాలీలకు ప్రజలు ఉప్పెనలా కదలివచ్చి, కదంతొక్కి విజయవంతం చేయడంపై ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నిరసన ర్యాలీలను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను అభినందిస్తూ.. కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'సరిగ్గా ఏడాది క్రితం, జూన్ 4న చంద్రబాబు నాయుడు గొప్ప వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారు. కానీ ఒక్కటి కూడా నెరవేర్చకపోగా తనను నమ్మిన ప్రజలకే ద్రోహం చేశారు. మోసపు హామీలు, ఆయన తప్పుడు ప్రకటనలతో ప్రజలకు వెన్నుపోటు పొడవడం ద్వారా రాష్ట్రాన్ని నిరాశ, నిస్పృహల్లోకి నెట్టారు. అందుకే జూన్ 4ను మనం వెన్నుపోటు దినంగా పాటించాలని పిలుపునిచ్చాం. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ర్యాలీల్లో అన్ని వర్గాల ప్రజలు ఉప్పెనలా కదలివచ్చి.. తమ వేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇది కేవలం నిరసన కాదు. అబద్ధాలు చెప్పి మోసం చేస్తే మౌనంగా ఉండబోమంటూ శక్తివంతమైన సందేశాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ నిరసన ద్వారా చాటిచెప్పారు. మోసపోయిన ప్రజల బాధ, నిరాశ, ఆగ్రహం, పెల్లుబుకుతున్న వ్యతిరేకతను ఈ ర్యాలీలు ప్రతిబింబించాయి. ప్రజల హక్కులు, న్యాయం, గౌరవం కోసం వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ జనంతో కలిసి పోరాడుతూనే ఉంటుంది. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల తరఫున నిలదీస్తూ నిరసన ర్యాలీలను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు నేను హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని పేర్కొన్నారు.

పారిపోయినా.. పట్టువదలని సీఐడీ..

- ఫాల్కన్ కేసులో కీలక నిందితుడు సందీప్‌కుమార్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: వేలాది మంది అమాయకుల నుంచి రూ.కోట్లు కొల్లగొట్టిన ఫాల్కన్ కుంభకోణం కేసులో కీలక నిందితుడు, సదరు కంపెనీ ఆపరేషనల్ హెడ్ సందీప్‌కుమార్ తెలంగాణ సీఐడీ బృందానికి చిక్కాడు. తొలుత దుబాయ్‌కు అటు నుంచి తిరిగి భారత్‌కు వచ్చి పలు రాష్ట్రాల్లో తలదాచుకున్నా..పట్టువదలక గాలింపు కొనసాగించిన సీఐడీ బృందం ఎట్టకేలకు సందీప్‌కుమార్‌తోపాటు మరో నిందితుడు రవికుమార్‌ను ఈనెల 3న హైదరాబాద్‌లో అరెస్టు చేసింది. ఈ మేరకు సీఐడీ డీజీ శిఖాగోయల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన నిందితుడు సందీప్‌కుమార్ ఫాల్కన్ గ్రూప్ చైర్మన్, ఎండీ అమర్‌దీప్ (ఈ కేసులో ఏ–2)కు తమ్ముడు. ఫాల్కన్‌గ్రూప్ కంపెనీ మోసాలపై కేసు నమోదు కాగానే దుబాయ్‌కి పారిపోయాడు. అటు నుంచి నేపాల్‌కు చేరిన సందీప్‌కుమార్ భారత్–నేపాల్ సరిహద్దు ద్వారా కుటుంబంతో సహా అక్రమంగా పాట్నాకు మకాం మార్చాడు. సీఐడీ బృందానికి సమాచారం అందడంతో బిహార్‌కు వెళ్లి గాలించారు. విషయం తెలియడంతో సందీప్‌కుమార్ పారిపోయాడు. దీంతో సీఐడీ పోలీసులు సందీప్‌కుమార్ భార్య, తండ్రిని అరెస్టు చేశారు. బిహార్ నుంచి ఒడిషా, అటు నుంచి గోవాకు వెళ్లిన సందీప్ చివరకు హైదరాబాద్‌లో ఉంటున్న అతడి కజిన్ రవికుమార్ వద్దకు చేరాడు. విశ్వసనీయ సమాచారం అందడంతో సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు.



జాయ్ హోమ్స్ తాళం చెవుల అప్పగింత

సాక్షి, హైదరాబాద్: సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా.. జోయాలుక్కాస్ ఫౌండేషన్ కర్ణాటకలోని అట్టడుగు వర్గాల కుటుంబాలకు నిర్మించిన 50 కొత్త జాయ్ హోమ్స్‌కు తాళం చెవులను అందజేసింది. ఈ కార్యక్రమాన్ని కర్ణాటక హోం శాఖ మంత్రి జి.పరమేశ్వర ప్రారంభించగా, జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలూక్కాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్ ప్రాపర్టీస్ సీఈవో మహమ్మద్ రిహాన్ నవాబ్, మహమ్మద్ రిజ్వాన్ నవాబ్ (కేఎస్ఆర్టీసీ), బెంగళూరు జ్యూవెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చేతన్ కుమార్ మెహతా, జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యూ హాజరయ్యారు.

ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనపై ప్రభుత్వం సీరియస్

- ఆసుపత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- డైట్ కాంట్రాక్టర్ తొలగింపు
- కలుషిత ఆహారంతోనే రోగులకు అస్వస్థత: నిజనిర్ధారణ కమిటీ



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్/శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో కలుషితాహారం తిని ఒకరు మృతి చెందడంతోపాటు 92 మంది అస్వస్థతకు గురైన ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటన గురించి తెలుసుకున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ఉదయం ఆసుపత్రిని సందర్శించారు. సంఘటనకు గల కారణాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితను అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన రోగులను పరామర్శించిన ఆయన, జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేశారు. కాగా, ఆసుపత్రికి కలుషిత ఆహార పదార్థాలను సరఫరా చేసిన డైట్ కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిని తొలగించాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. అధికారులు అస్వస్థతకు గురైన వారిలో 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉస్మానియాలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఈ నెల రెండున రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున అందించిన ఒక స్వీట్ వల్లే ఇది జరిగిందని వైద్య సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఇతర ఆహార పదార్థాలతోపాటు వాటి శాంపిల్స్ కూడా పరీక్షలకు పంపించామని మంత్రి తెలిపారు. పరీక్షల అనంతరం వచ్చిన నివేదిక ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నిజనిర్ధారణకోసం డీఎంఈతో కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే బోరబండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో ఇలాంటి సంఘటన జరగడం, ఓ రోగి చనిపోవడం బాధాకరమని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కలుషిత ఆహారం వల్లే ఘటన..

రోగుల అస్వస్థతకు ప్రధాన కారణం కలుషిత ఆహారమేనని నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. డీఎంఈ డాక్టర్ రాజేంద్రకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితలు విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ పద్మజను ఆ విధులనుంచి తప్పించి.. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. అలాగే ఆమె స్థానంలో ఉస్మానియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ బి.శంకర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది.

ప్రభుత్వాస్పత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా

మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యసేవలకు అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయంలో ప్రభుత్వ ఆస్పత్రులలో నిరంతర విద్యుత్ సరఫరాపై ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించారు. గతవారం జహీరాబాద్‌లో మధ్యాహ్నం వేళ మబ్బులు పట్టిన సమయంలో సెల్‌ఫోన్ లైట్ వెలుగులో వైద్యం అందించినందుకు గాను ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేశారు. అయితే అత్యవసర వైద్య అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం తర్వాత సస్పెన్షన్ ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఆవశ్యకతపై మంత్రి విద్యుత్ అధికారులతో సమావేశమయ్యారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతమున్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్ల పనితీరు, వాటి సామర్థ్యంపై చర్చించారు. జనరేటర్ సౌకర్యం లేని ఆస్పత్రుల్లో ఆటోమేటిడ్ జనరేటర్‌లను సమకూర్చుకోవడానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులలో విద్యుత్ నిర్వహణకు తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లను నియమించుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అవసరమైన అత్యవసర పరికరాలు, సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రులలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై జిల్లా వైద్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని మంత్రి చెప్పారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ, మలేరియా, చికెన్ గున్యాలతోపాటు కోవిడ్ టెస్ట్ కిట్స్, అవసరమైన మందులను కొనుగోలు చేయాలని టీజీఎంఎస్ఐడీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా చొంగ్తూ, ఎస్పీడీసీఎల్ ఎండీ ముషరఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీందర్‌రెడ్డి, కాళోజీ నారాయణరావు వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా.నరేంద్రకుమార్, టీవీవీపీ కమిషనర్ డా.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త డైట్ కాంట్రాక్టుల బాధ్యత మహిళా సమాఖ్యలకే..

వైద్య విద్యా సంచాలకుడి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ సాధారణ దవాఖానాల్లో డైట్ కాంట్రాక్టులు ముగిసిన చోట మహిళా సమాఖ్యల ద్వారా భోజన సేవలు నిర్వహించాలని వైద్య శాఖ నిర్ణయించింది. ఈ మేరకు వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత మే 24న సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మహిళా సమాఖ్యలు/జిల్లా మహిళా సమాఖ్యలకు బాధ్యత ఇవ్వడం ద్వారా ప్రజా సేవల నిర్వహణలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మే 27న విడుదలైన ఉత్తర్వుల్లో, జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమాచారం మేరకు, డైట్ కాంట్రాక్టులు ముగిసిన అన్ని ప్రభుత్వ దవాఖానల్లో మహిళా సమాఖ్యల సేవలు వినియోగించుకోవాలని సూపరింటెండెంట్లకు సూచించారు. అయితే ఆ ఉత్తర్వులు అమలు కాలేదు. ఈ నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి తెచ్చి, డైట్ సేవల్లో విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



సీఎంతో ట్రైనీ ఐఏఎస్‌ల భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ కేడర్ 2024 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో సౌరభ్ శర్మ, సలోని చాబ్రా, హర్ష చౌదరి, కరోలిన్ చింగ్తియన్మయి, కొయ్యాడ ప్రణయ్‌కుమార్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వైస్ చైర్‌పర్సన్ శాంతి కుమారి, కోర్సు డైరెక్టర్ కె.ఉషారాణి ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి. చిత్రంలో వినోద్, కె.శ్రీనివాస్ రెడ్డి, రావి ప్రతిభ, కోదండరాం, నారాయణ, కూనంనేని తదితరులు

రావి నారాయణరెడ్డి గొప్ప గాంధేయవాది

కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి

బంజారాహిల్స్(హైదరాబాద్): కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయణరెడ్డి మానవత్వం మూర్తీభవించిన గొప్ప గాంధేయవాది కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి 118వ జయంతి వేడుకలను బుధవారం లోటస్‌పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ దున్నేవాడికే భూమి అని నినాదం ఇవ్వడమే కాదు..తనకున్న 500 ఎకరాల భూమి పేదలకు పంచడం ద్వారా భూదాన ఉద్యమానికే స్ఫూర్తి ప్రదాతగా రావి నారాయణరెడ్డి నిలిచారన్నారు. యువతకు అవకాశం కల్పించాలని తద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని భావించి 60 ఏళ్లకే ప్రత్యక్ష రాజకీయలను నుంచి నిష్క్రమించారని, కొంత ఆలస్యమైనా ఆయన స్ఫూర్తితోనే తాను కూడా ప్రత్యక్ష రాజకీయాలను నుంచి తప్పుకున్నానని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు తలకిందుల తపస్సు చేసినా కమ్యూనిజాన్ని ఆపలేరన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలన్నీ తిరిగి ఏకం కావాలని కోరారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఏక కాలంలో సామాజిక, ఆర్థిక సమానత్వం, రాజకీయ స్వేచ్ఛ కోసం సాగించిన సాయుధ పోరాటం వల్ల నిజాం గద్దె దిగినా, ఆ తర్వాత మాత్రం జరిగిన పరిణామాలు ఆశించినట్టు ముందుకు సాగలేదన్నారు. హైదరాబాద్‌లో రావి నారాయణరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు ఎల్బీనగర్‌లో నిర్మిస్తున్న కొత్త ఆస్పత్రికి ఆయన పేరుపెట్టి సముచిత గౌరవం కల్పించాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ట్రస్టు సభ్యులు పల్లా వెంకటరెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, రావి ప్రతిభ, ఉజ్జిని రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనా వైఫల్యం ప్రగతికి శాపం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనా వైఫల్యం తెలంగాణ ప్రగతికి శాపంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర రాజధానిలో పాలన పడకేసిందని, స్వచ్ఛ నగరానికి కాంగ్రెస్ తెగులు వచ్చిందని విమర్శించారు. అందాల పోటీలతో నగరానికి అందం రాదని, నగరం అందంగా ఉంటేనే రాష్ట్రానికి శోభ వస్తుందని బుధవారం 'ఎక్స్'వేదికగా పేర్కొన్నారు. గురుకులాల్లో విద్యార్థులకే కాకుండా.. మానసిక రోగులకూ కలుషిత ఆహారమే అందిస్తున్నారని ఆయన ఆరోపించారు. కళాశాలల్లో పుస్తకాల జాడలేదని, నెలన్నర దాటితే గానీ విద్యార్థులకు పుస్తకాలు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హోం శాఖ, విద్యాశాఖ, పురపాలకశాఖ, నీటిపారుదల, వైద్య శాఖ, వ్యవసాయశాఖ అని విధాలుగా విఫలం అయ్యాయని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

- కొంత ముట్టజెప్పితే చేతికి పక్షం రోజుల్లో కార్డు
- లేనిపక్షంలో పెండింగ్‌లో క్షేత్రస్థాయి విచారణ
- ఇదీ గ్రేటర్‌లో కొత్త రేషన్‌కార్డుల పరిస్థితి

కొత్త రేషన్ కార్డుల దందా!

మధ్యవర్తులుగా మీ సేవ కేంద్రాల ఆపరేటర్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల దందా బాహాటంగా కొనసాగుతోంది. సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుండడంతో పేదలు పెద్ద ఎత్తున మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇల్లు, వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెల్ల రేషన్‌కార్డు (ఆహార భద్రత)తో ముడిపడి ఉండడంతో ప్రాధాన్యం పెరిగినట్లయింది. దీంతో పేద కుటుంబాలు మీ సేవ కేంద్రాలను ఆశ్రయించి కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ.. క్షేత్రస్థా విచారణ మాత్రం ముందు సాగడం లేదు. దరఖాస్తుదారుల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లు దళారులుగా అవతారమెత్తి కనీసం కొంత ఖర్చు (రూ.3000 నుంచి 5,000 వరకు) భరించేందుకు సిద్ధమైతే పక్షం రోజుల్లో క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయించి కార్డు చేతిలో పెడతామని పేదలను నమ్మిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌర సరఫరాల సిబ్బంది సైతం మధ్యవర్తుల ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిశీలించి రేషన్ కార్డుకు అర్హులుగా సిఫార్సులు చేస్తున్నట్లు తెలుస్తోంది. సిఫార్సులు లేని దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టడం గమనార్హం.



2.66 లక్షలకుపైగా దరఖాస్తులు

గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో రెండు నెలలుగా కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా సుమారు 2.66 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పదేళ్లలో పెద్దగా రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో కొత్త కార్డుల కోసం తాకిడి పెరిగినట్లయింది. పెళ్లి చేసుకుని అత్తగారింటికి వచ్చిన కోడళ్లు, కొత్తగా జన్మించిన పిల్లలు రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న మొత్తం దరఖాస్తుల్లో ఇప్పటి వరకు క్షేత్రస్థాయి విచారణ పూర్తయి పదిశాతం మించి కార్డులు కూడా మంజూరుకు నోచుకోనట్లు తెలుస్తోంది. మెజార్టీ దరఖాస్తులు పెండింగ్‌లో మగ్గుతుండగా, సిఫార్సు దరఖాస్తులు మాత్రం స్పీడ్‌గా విచారణకు నోచుకొని మంజూరు అవుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

ప్రజాపాలన దరఖాస్తుల పరిస్థితి సైతం..

- ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆధారంగా సర్వేలో విచారణ పూర్తయిన వాటికి కూడా మధ్యవర్తుల సిఫార్సులు లేకుండా మోక్షం లభించడం లేదు. విచారణ పూర్తయిన దరఖాస్తులకు సిఫార్సు ఉంటే మాత్రం కార్డులు ఠంచన్‌గా మంజూరవుతున్న సంఘటనలు అనేకం. మిగిలినవి పెండింగ్‌లో మగ్గుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 5.73 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. సమగ్ర సర్వే ద్వారా మొత్తం 22 లక్షల కుటుంబాల వివరాలు సేకరించారు.
- అందులో రేషన్ కార్డులు లేని సుమారు 83 వేల కుటుంబాలను గుర్తించారు. వాటిపై నిబంధల ప్రకారం విచారణ నిర్వహించి 70 శాతం కుటుంబాలుగా అర్హులు అని తేల్చారు. పారదర్శకత కోసం వార్డు సభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటించిన తర్వాతే కార్డుల మంజూరుకు సిఫార్సు చేయాలని జీహెచ్ఎంసీ భావించినప్పటికీ.. తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో వార్డు సభలు వాయిదా పడి ప్రక్రియ ముందుకు సాగలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో లేని శివారు ప్రాంతాల దరఖాస్తుదారుల్లో అర్హుల జాబితా ప్రకటించారు. వాటి మంజూరుకు కూడా మధ్యవర్తుల సిఫార్సు తప్పడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

అబిడ్స్: ఈ నెల 8, 9వ తేదీల్లో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబం చేపట్టే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేప ప్రసాదం పంపిణీకి మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.50 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వేలాదిగా తరలివచ్చే ఉబ్బస రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రూ.2.2 కోట్లు కొట్టేశారు!

ఉగ్రవాద సంబంధిత కేసు పేరుతో బెదిరింపులు

- ఐపీఎస్ అధికారినంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు
- పోలీసులను ఆశ్రయించిన విశ్రాంత వైద్యురాలు



సాక్షి, సిటీబ్యూరో: ఉగ్రవాద సంబంధిత కేసు పేరుతో నగరానికి చెందిన విశ్రాంత వైద్యురాలిని ఫోన్లో బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.2.2 కోట్లు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. శ్రీనగర్ కాలనీకి చెందిన వైద్యురాలికి గత నెల 27న ఫోన్‌కాల్ వచ్చింది. లక్నో నుంచి మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి ప్రేమ్ కుమార్‌గా అవతలి వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. తమ పరిధిలో నమోదైన ఉగ్రవాద సంబంధ మనీలాండరింగ్ కేసులో వైద్యురాలి ప్రమేయం వెలుగులోకి వచ్చినట్లు చెప్పాడు.

ఈ నేపథ్యంలోనే ఆ కేసులో నిందితురాలిగా చేరుస్తున్నామని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఆమె ఈ షాక్ నుంచి కోలుకోకముందే వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. అప్పుడు మాట్లాడిన సైబర్ నేరగాడు తాను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ సదానంద్ అంటూ పరిచయం చేసుకున్నాడు. తాము కొందరు ఉగ్రవాదుల్ని అరెస్టు చేశామని, వారి నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో ఏటీఎం కార్డులతో పాటు కొన్ని ఫొటోలు ఉన్నాయని చెప్పాడు. ఆ ఫొటోల్లో 17 ఆర్మీ అధికారులవి అయితే.. ఒకటి మాత్రం సదరు వైద్యురాలిదని పేర్కొన్నాడు. ఇది ఉగ్రవాద సంబంధిత కేసు కావడంతో విషయం ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఉంచాలని స్పష్టం చేశాడు.

వెరిఫికేషన్ చేయాలంటూ..

- ఏటీఎం కార్డుల్లో కొన్ని మీ పేరుతో తెరిచిన ఖాతాలతో లింకై ఉన్నాయని, వాటి ద్వారా పెద్ద ఎత్తున జరిగిన మనీలాండరింగ్‌తో ఉగ్రవాదులకు నిధులు అందాయని భయపెట్టాడు. తాను ఏ తప్పు చేయలేదని, ఆ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, ఉగ్రవాదులతో తనకు ఎలాంటి సంబంధం లేదని బాధితురాలు ఎన్ఐఏ డైరెక్టర్‌గా చెప్పుకున్న వ్యక్తితో వాపోయారు. ఆ విషయం ఖరారు కావాలంటూ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుందని, దీనికోసం తాము చెప్పిన ఖాతాల్లోకి నిర్ణీత మొత్తం బదిలీ చేయాలని సూచించాడు. ఈ నగదు పూర్తిగా రిఫండబుల్ అని చెప్పిన కేటుగాడు వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత తిరిగి బదిలీ చేసేస్తామని చెప్పాడు.
- ఆమెను పూర్తిగా నమ్మించడానికి ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టు జడ్జి పేరుతో నకిలీ లేఖ కూడా సృష్టించి పంపారు. దీంతో నేరగాళ్ల వలలో పడిపోయిన వైద్యురాలు గత నెల 29 నుంచి 31వ తేదీ మధ్య వారు సూచించిన ఖాతాల్లోకి ఏకంగా రూ.2.2 కోట్లు బదిలీ చేశారు. తన బ్యాంకు ఖాతాల్లో ఉన్న మొత్తంతో పాటు ఫిక్సిడ్ డిపాజిట్లు విత్‌డ్రా చేసి, తెలిసిన వారి నుంచి కొంత తీసుకుని ఇలా బదిలీ చేశారు. ఆ మొత్తం రిఫండ్ రాకపోవడంతో పాటు వారి ఫోన్ నెంబర్లు పని చేయకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు నేరగాళ్లు వాడిన ఫోన్ నెంబర్లు, బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోగుల ఆరోగ్యంతో ఆటలు!

నాసిరకం బియ్యం, సైజు తగ్గిన గుడ్లు, నీళ్లలాంటి సాంబారు

- పలుచబడిన పాలు, రంగుమారుతున్న అరటి పండ్లు
- ఆస్పత్రుల్లో ఆహార సరఫరాపై కొరవడిన పర్యవేక్షణ
- పట్టించుకోని అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆహారం సరఫరా చేసే ఏజెన్సీలు రోగుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నాయి. రోగం నయం కావాలని ఆస్పత్రికి వచ్చిన వారికి కొత్త రోగాలు అంటగడుతున్నారు. కాంట్రాక్టు దక్కించుకోవడంలో చూపిన శ్రద్ధ రోగులకు సరఫరా చేసే ఆహారంలో నాణ్యతపై చూపడంలేదు. తొలుత అక్కడున్న అధికారులను ప్రసన్నం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం మెనూ పాటించినా, పాటించకున్నా ఎవరూ అడిగే సాహసం చేయడం లేదు. నిబంధనల ప్రకారం రోగికి అందించాల్సిన ఆహారం ఒక రకంగా ఉంటే కాంట్రాక్టర్ సరఫరా చేసిన భోజనం మరోలా ఉంటోంది. ఆయా ఆస్పత్రుల్లో ఉండేది అంతా పేద ప్రజలే కావడంతో గట్టిగా నిలదీసి అడిగే ప్రయత్నం చేయడం లేదు. ఎవరైనా అడిగినా సిబ్బంది తిరిగి ఎదుదాడికి దిగుతున్నారు. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశీలించగా కొన్ని చోట్ల కొంత మెరుగైన వాతావరణం ఉన్నప్పటికి కొన్ని ఆస్పత్రిల్లో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం..

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేది అధిక శాతం పేద ప్రజలే. చికిత్స పొందుతున్న సమయంలో పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆహారం సరఫరాకు టెండరుపిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఒక రోగికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నర్ కలిపి మొత్తం రోజుకు రూ.80 చెల్లిస్తోంది. గతంలో ఈ మొత్తం రూ.40గా ఉండేది. మూడేళ్ల క్రితం దీన్ని పెంచారు. పాలు, గుడ్లు, సాంబార్, రైస్, పండ్లు ఇలా అన్ని రకాలుగా ఏదీ ఎంత పరిమాణంలో ఉండాలి అనేది స్పష్టంగా ఉంది. గర్భిణి, బాలింత, సాధారణ రోగులకు అందించాల్సిన మెనూ ఐదు రకాలుగా విభజించారు. అయితే పంపిణీలో మాత్రం లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నగరంలో గాంధీ ఆస్పత్రి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, ఉస్మానియాలో పరిస్థితి కాస్త అటూఇటూగా ఉంది. మిగతా ఆసుపత్రుల్లో నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు కనిపిస్తున్నాయి. పిల్లల ఆస్పత్రికి ప్రసిద్ధి చెందిన నిలోఫర్‌లో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంగా పౌష్టికాహారం పలుచబడిపోతోంది.

డొనేషన్ల వసూళ్లను అరికట్టండి

సాక్షి, హైదరాబాద్: ఇష్టానుసారంగా డొనేషన్లు వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలను జైలుకు పంపాలని, కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపేక్షించడంతో కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇంజనీరింగ్ కళాశాలల్లోని మేనేజ్ మెంట్ కోటా సీట్లను.. ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా అమ్ముకొని రూ.కోట్లు ఆర్జిస్తూ ప్రతిభావంతులకు అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

కవిత ధర్నా నవ్వులపాలు

టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధర్నాను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ వ్యాఖ్యానించారు. కూలిపోయే 'కాళేశ్వరం' ప్రాజెక్టు కట్టి ప్రజల నోట్లో మట్టి కొట్టారని, అందుకే కేసీఆర్‌కు విచారణ కమిషన్ నోటీసులిచ్చిందన్నారు. ఆ నోటీసులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినవి కావని స్పష్టం చేశారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. తండ్రి దగ్గర మార్కులు కొట్టేయడం కోసమే కవిత ధర్నా చేశారని, అర్థం లేని ఆరోపణలు చేయడం ఆమె మానుకోవాలని హితవు పలికారు. కాళేశ్వరం విచారణ రాజకీయ కక్ష సాధింపు కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్ష సాధింపులుండవని దయాకర్ చెప్పారు.

ప్రేమ పేరుతో మోసం..

పోక్సో చట్టం కింద నిందితుడి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతితో సన్నిహితంగా ఉన్న తర్వాత...మరో యువతిని వలలో వేసుకున్న ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు...బిహార్‌కు చెందిన సునీల్‌యాదవ్ గచ్చిబౌలిలోని హైహోమ్ బుజా అపార్ట్‌మెంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ యువతి బతుకు దెరువు నిమిత్తం ఏడు నెలల క్రితం హైదరాబాద్‌కు రాగా ఆమెకు సునీల్ యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సునీల్ తరచూ ఆమెను బంజారాహిల్స్ రోడ్డునెంబర్–5లోని దేవరకొండ బస్తీలో ఉన్న తన స్నేహితుడి గదికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇటీవల సునీల్ మరో యువతితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడాన్ని గమనించిన బాధితురాలు ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించి గొడవ పడి తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. అందుకు నిందితుడు నిరాకరించడంతో తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సునీల్‌యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6
(ప్రాథమిక ప్రకటన)

(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10 ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం.A/39 /2025. తేది: 04.05.2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.G/2499/ 2025 తేది: 04.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యాదాద్రి భువనగిరి తేది: 27.05.2025
ఫైల్ నెం.A/14/2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం **యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మక్త అనంతారం గ్రామములో** విస్తీర్ణం ఎ.12.22 1/4 గుంటల భూమిప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం.108 I&CAD (LA.R&R/A2) Department, 31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి ప్రాజెక్ట్ పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్) గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం **యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం మక్త అనంతారం గ్రామములో** విస్తీర్ణం ఎ.12.22 1/4 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : బీబీనగర్ గ్రామం : మక్త అనంతారం

సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు	అనుభవదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు	విస్తీర్ణం (ఎ.గుం)	చెట్లు/ కట్టడములు
30 ఖుష్కి / పట్టా 0.03	దర్శబోయిన పెంటయ్య తండ్రి మల్లయ్య	దర్శబోయిన పెంటయ్య తండ్రి మల్లయ్య	0.03	-
	రెడ్డ బోయిన నాగమ్మ భర్త శంకరయ్య	రెడ్డ బోయిన నాగమ్మ భర్త శంకరయ్య		-
	రెడ్డ బోయిన శంకరయ్య తండ్రి రామస్వామి	రెడ్డ బోయిన శంకరయ్య తండ్రి రామస్వామి		-
31 ఖుష్కి / పట్టా 0.02	దర్శబోయిన పెంటయ్య తండ్రి మల్లయ్య	దర్శబోయిన పెంటయ్య తండ్రి మల్లయ్య	0.02	-
	రెడ్డ బోయిన శంకరయ్య భర్త రామ స్వామి	రెడ్డబోయిన శంకరయ్య భర్త రామ స్వామి		-
32 ఖుష్కి / పట్టా 0.24	పసులాది సత్తయ్య తండ్రి అచ్చయ్య	పసులాది సత్తయ్య తండ్రి అచ్చయ్య	0.24	-
	దర్శబోయిన పెంటయ్య తండ్రి మల్లయ్య	దర్శబోయిన పెంటయ్య తండ్రి మల్లయ్య		-
	పసులాది రాంచందర్ తండ్రి సత్తయ్య	పసులాది రాంచందర్ తండ్రి సత్తయ్య		-
	పసులాది కుమార్ తండ్రి సత్తయ్య	పసులాది కుమార్ తండ్రి సత్తయ్య		-
	రెడ్డ బోయిన నాగమ్మ తండ్రి శంకరయ్య	రెడ్డ బోయిన నాగమ్మ తండ్రి శంకరయ్య		-
	రెడ్డబోయిన శంకరయ్య తండ్రి రామస్వామి	రెడ్డబోయిన శంకరయ్య తండ్రి రామస్వామి		-
38 ఖుష్కి / పట్టా 0.0550	తూపెళ్ళి జనార్దన్ రెడ్డి తండ్రి యాదగిరి రెడ్డి	తూపెళ్ళి జనార్దన్ రెడ్డి తండ్రి యాదగిరి రెడ్డి	0.0550	-
	తూపెల్లి జైపాల్ రెడ్డి తండ్రి యాదగిరి రెడ్డి	తూపెల్లి జైపాల్ రెడ్డి తండ్రి యాదగిరి రెడ్డి		-
	తూపెల్లి రాంరెడ్డి తండ్రి రామస్వామి	తూపెల్లి రాంరెడ్డి తండ్రి రామస్వామి		-
	తూపెల్లి ప్రభాకర్ రెడ్డి తండ్రి యాదిరెడ్డి	తూపెల్లి ప్రభాకర్ రెడ్డి తండ్రి యాదిరెడ్డి		-
39 ఖుష్కి / పట్టా 0.02	పసులాది రాంచందర్ తండ్రి సత్తయ్య	పసులాది రాంచందర్ తండ్రి సత్తయ్య	0.02	-
	పసులాది కుమార్ తండ్రి సత్తయ్య	పసులాది కుమార్ తండ్రి సత్తయ్య		-
	బాలబోయిన జంగయ్య తండ్రి కిష్టయ్య	బాలబోయిన జంగయ్య తండ్రి కిష్టయ్య		-
	బలబోయిన బాలనరసింహ్మా తండ్రి కిష్టయ్య	బలబోయిన బాలనరసింహ్మా తండ్రి కిష్టయ్య		-
	బాలబోయిన శ్రీశైలం తండ్రి కిష్టయ్య	బాలబోయిన శ్రీశైలం తండ్రి కిష్టయ్య		-
41 ఖుష్కి / పట్టా 0.02	బూత్కూరి యాదయ్య తండ్రి రామయ్య	బూత్కూరి యాదయ్య తండ్రి రామయ్య	0.02	-
	బూత్కూరి సాయిలు తండ్రి రామయ్య	బూత్కూరి సాయిలు తండ్రి రామయ్య		-
	బూత్కూరు సత్తయ్య తండ్రి రామయ్య	బూత్కూరు సత్తయ్య తండ్రి రామయ్య		-
	బూత్కూరు నర్సింహ్మా తండ్రి రామయ్య	బూత్కూరు నర్సింహ్మా తండ్రి రామయ్య		-
	బూత్కూరు బుచ్చమ్మ భర్త స్వామి	బూత్కూరు బుచ్చమ్మ భర్త స్వామి		-
	బూత్కూరి సత్తయ్య తండ్రి మదార్	బూత్కూరి సత్తయ్య తండ్రి మదార్		-
	బూత్కూరి పోచమ్మ భర్త యాదయ్య	బూత్కూరి పోచమ్మ భర్త యాదయ్య		-
	బూత్కూరి బాలయ్య తండ్రి సాయిలు	బూత్కూరి బాలయ్య తండ్రి సాయిలు		-
	బూత్కూరి ఆగమ్మ తండ్రి పోచయ్య	బూత్కూరి ఆగమ్మ తండ్రి పోచయ్య		-
	బూత్కూరి మల్లమ్మ భర్త బూత్కూరి పెంటయ్య	భూత్కూరి మల్లమ్మ భర్త బూత్కూరి పెంటయ్య		-
	బూత్కూరి రమేష్ తండ్రి యాదగిరి	బూత్కూరి రమేష్ తండ్రి యాదగిరి		-
	బూత్కూరి రాజు తండ్రి బీ బాలయ్య	బూత్కూరి రాజు తండ్రి బీ బాలయ్య		-
	బూత్కూరి వెంకటేష్ తండ్రి బీ బాలయ్య	బూత్కూరి వెంకటేష్ తండ్రి బీ బాలయ్య		-
	బూత్కూరి భిక్షపతి తండ్రి లేట్ బీ నర్సింహ	బూత్కూరి భిక్షపతి తండ్రి లేట్ బీ నర్సింహ		-
42 ఖుష్కి /లావుని పట్టా 0.19	మొహమ్మద్బాబిరా తండ్రి సయ్యద్ అలీ	మొహమ్మద్బాబిరా తండ్రి సయ్యద్ అలీ	0.19	-
	రాపోలు నర్సింహ్మా తండ్రి పోచయ్య	రాపోలు నర్సింహ్మా తండ్రి పోచయ్య		-
54 ఖుష్కి / పట్టా 0.20	దర్శబోయిన అచయ్య తండ్రి మల్లయ్య	దర్శబోయిన అచయ్య తండ్రి మల్లయ్య	0.20	-
	దర్శబోయిన దశరథ తండ్రి మల్లయ్య	దర్శబోయిన దశరథ తండ్రి మల్లయ్య		-
	దర్శబోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	దర్శబోయిన గందయ్య తండ్రి అచ్చయ్య		-
	దర్శబోయిన గణేష్ తండ్రి రామయ్య	దర్శబోయిన గణేష్ తండ్రి రామయ్య		-
	పసులాది రాజయ్య తండ్రి అచ్చయ్య	పసులాది రాజయ్య తండ్రి అచ్చయ్య		-
55 ఖుష్కి / పట్టా 0.0450	సాదు జనార్ధన్ రావు తండ్రి సీతారామారావు	సాదు జనార్ధన్ రావు తండ్రి సీతారామారావు	0.0450	-
	సాదు శ్రీధర్ రావు తండ్రి సీతారాం రావు	సాదు శరత్ చంద్ర తండ్రి సాదు శ్రీధర్ రావు తండ్రి సీతారాం రావు		-
48 ఖుష్కి / పట్టా 0.06	బూత్కూరి సాయిలు తండ్రి రామయ్య	బూత్కూరి సాయిలు తండ్రి రామయ్య	0.06	-
	బూత్కూరి సత్తయ్య తండ్రి రామయ్య	బూత్కూరి సత్తయ్య తండ్రి రామయ్య		-
	గుర్రాల సక్కుబాయి తండ్రి సత్యనారాయణ	గుర్రాల సక్కుబాయి తండ్రి సత్యనారాయణ		-
	గుర్రాల దర్శన్ తండ్రి గందయ్య	గుర్రాల దర్శన్ తండ్రి గందయ్య		-
	తుమ్మెంట బాలమణి భర్త తుమ్మెంట నరసింహ	తుమ్మెంట బాలమణి భర్త తుమ్మెంట నరసింహ		-
	బూత్కూరు నర్సింహ్మా తండ్రి రామయ్య	బూత్కూరు నర్సింహ్మా తండ్రి రామయ్య		-
	గుర్రాల చంద్రకళ తండ్రి యాదగిరి	గుర్రాల చంద్రకళ తండ్రి యాదగిరి		-
	ఈగ నాగేంద్ర తండ్రి ఎల్లయ్య	ఈగ నాగేంద్ర తండ్రి ఎల్లయ్య		-
	పెద్దింటి బుచ్చిరెడ్డి తండ్రి మాణిక్య రెడ్డి	పెద్దింటి బుచ్చిరెడ్డి తండ్రి మాణిక్య రెడ్డి		-
	బంగారి మౌనిక తండ్రి బాలకృష్ణ	బంగారి మౌనిక తండ్రి బాలకృష్ణ		-
51 ఖుష్కి / పట్టా 0.15	గుర్రాల సక్కుబాయి తండ్రి సత్యనారాయణ	గుర్రాల సక్కుబాయి తండ్రి సత్యనారాయణ	0.15	-
	గుర్రాల అంజనేయులు తండ్రి గందయ్య	గుర్రాల అంజనేయులు తండ్రి గందయ్య		-
	గుర్రాల దర్శన్ తండ్రి గందయ్య	గుర్రాల దర్శన్ తండ్రి గందయ్య		-
	గుర్రాల చంద్రకళ తండ్రి యాదగిరి	గుర్రాల చంద్రకళ తండ్రి యాదగిరి		-
	ఎమ్ నర్సింహ్మా తండ్రి వెంకటస్వామి	ఎమ్ నర్సింహ్మా తండ్రి వెంకటస్వామి		-
	గుర్రాల లింగస్వామి తండ్రి యాదగిరి	పెద్దింటి లింగస్వామి తండ్రి యాదగిరి		-
52 ప్రభుత్వ భూమి 0.35	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ భూమి	0.35	-
53 ఖుష్కి / పట్టా 1.18	పోచంపల్లి వెంకటరావు తండ్రి నారాయణరావు	పోచంపల్లి వెంకటరావు తండ్రి నారాయణరావు	1.18	-
	పోచంపల్లి మోహన్‌రావు తండ్రి నారాయణరావు	పోచంపల్లి మోహన్‌రావు తండ్రి నారాయణరావు		-
47ప్రభుత్వ భూమి 0.07	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ భూమి	0.07	-
56 లావుని పట్టా 0.1250	పసులాది సామయ్య తండ్రి రామయ్య	పసులాది సామయ్య తండ్రి రామయ్య	0.1250	-
	పసులాది రాందాసు తండ్రి రామయ్య	పసులాది రాందాసు తండ్రి రామయ్య		-
	పసులాది లక్ష్మి తండ్రి ఎల్లయ్య	పసులాది లక్ష్మి తండ్రి ఎల్లయ్య		-
	పసులాది రవి తండ్రి ఎల్లయ్య	పసులాది రవి తండ్రి ఎల్లయ్య		-
	పసులాది రమేష్ తండ్రి పసులాది కొండయ్య	పసులాది రమేష్ తండ్రి పసులాది కొండయ్య		-
	పసులాది ప్రేమ్‌చందర్ తండ్రి పసులాది కొండయ్య	పసులాది ప్రేమ్‌చందర్ తండ్రి పసులాది కొండయ్య		-
	పసులాది లింగస్వామి తండ్రి పసులాది కొండయ్య	పసులాది లింగస్వామి తండ్రి పసులాది కొండయ్య		-
	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ భూమి		
79 ఖుష్కి / పట్టా 0.27	గౌరెల్లి సాయిలు తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి సాయిలు తండ్రి తిరుపతయ్య	0.27	-
	గౌరెల్లి రాములు తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి రాములు తండ్రి తిరుపతయ్య		-
	గౌరెల్లి సత్తయ్య తండ్రి రామయ్య	గౌరెల్లి సత్తయ్య తండ్రి రామయ్య		
	గౌరెల్లి జగన్ తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి జగన్ తండ్రి తిరుపతయ్య		
29 లావుణి పట్టా 0.06	బింగి నర్సింహ్మా తండ్రి అచ్చయ్య	బింగి నర్సింహ్మా తండ్రి అచ్చయ్య	0.06	-
	దర్శబోయిన యాదగిరి తండ్రి ఈదయ్య	దర్శబోయిన యాదగిరి తండ్రి ఈదయ్య		-
	దర్శబోయిన [illegible] తండ్రి ఈదయ్య	దర్శబోయిన [illegible] తండ్రి ఈదయ్య		
	దర్శబోయిన జంగయ్య తండ్రి ఈదయ్య	దర్శబోయిన జంగయ్య తండ్రి ఈదయ్య		
	గ్యార పెంటయ్య తండ్రి భిక్షపతి	గ్యార పెంటయ్య తండ్రి భిక్షపతి		
	గ్యార ధానయ్య తండ్రి మైసయ్య	గ్యార ధానయ్య తండ్రి మైసయ్య		
	కందికంటి మల్లమ్మ తండ్రి పోచయ్య	కందికంటి మల్లమ్మ తండ్రి పోచయ్య		
	కుర్రి భిక్షపతి తండ్రి ఐస్తారి	కుర్రి భిక్షపతి తండ్రి ఐస్తారి		
	గ్యార శంకరయ్య తండ్రి ఎల్లయ్య	గ్యార శంకరయ్య తండ్రి ఎల్లయ్య		
	గ్యార సుందరం తండ్రి బాలయ్య	గ్యార సుందరం తండ్రి బాలయ్య		
	గ్యార మల్లేష్ తండ్రి ఎల్లయ్య	గ్యార మల్లేష్ తండ్రి ఎల్లయ్య		
	పటిగం శ్రీశైలం తండ్రి యాదయ్య	పటిగం శ్రీశైలం తండ్రి యాదయ్య		
	దర్శబోయిన మల్లయ్య తండ్రి నర్సయ్య	దర్శబోయిన మల్లయ్య తండ్రి నర్సయ్య		
	రాపోలు నర్సింహ్మా తండ్రి పోచయ్య	రాపోలు నర్సింహ్మా తండ్రి పోచయ్య		
	పటిగం రమేష్ తండ్రి యాదయ్య	పటిగం రమేష్ తండ్రి యాదయ్య		
	గ్యార అనసూర్య తండ్రి మైసయ్య	గ్యార అనసూర్య తండ్రి మైసయ్య		
	యాచారం బాల్లయ్య తండ్రి ముత్తయ్య	యాచారం బాల్లయ్య తండ్రి ముత్తయ్య		
	ధర్శ బోయినకృష్ణ తండ్రి నరసింహ్మా	ధర్శ బోయినకృష్ణ తండ్రి నరసింహ్మా		
	ధర్శ బోయిన నర్సయ్య తండ్రి నరసింహ్మా	ధర్శ బోయిన నర్సయ్య తండ్రి నరసింహ్మా		
	ధర్శబోయిన అంజనేయులు తండ్రి నరసింహ్మా	ధర్శబోయిన అంజనేయులు తండ్రి నరసింహ్మా		
	ధర్శబోయిన సత్యనారాయణ తండ్రి నరసింహ్మా	ధర్శబోయిన సత్యనారాయణ తండ్రి నరసింహ్మా		
	గ్యార రమేష్ తండ్రి చిన్న భిక్షపతి	గ్యార రమేష్ తండ్రి చిన్న భిక్షపతి		
	యాచారం బాలమ్మ తండ్రి నరసింహ్మా	యాచారం బాలమ్మ తండ్రి నరసింహ్మా		
	ఎల్లంకి లింగమ్మ తండ్రి దర్శన్	ఎల్లంకి లింగమ్మ తండ్రి దర్శన్		
	మీసాల మంజుల తండ్రి రాములు	మీసాల మంజుల తండ్రి రాములు		
	గ్యార కుమార్ తండ్రి చిన్న భిక్షపతి	గ్యార కుమార్ తండ్రి చిన్న భిక్షపతి		
	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ భూమి		
	ఇండ్ల స్థలాలు	ఇండ్ల స్థలాలు		
98 ఖుష్కి/ పట్టా 0.0575	బాత్కురి రవీందర్ తండ్రి సత్తయ్య	బాత్కురి రవీందర్ తండ్రి సత్తయ్య	0.0575	-
	గౌరెల్లి రాములు తండ్రి తిర్పతయ్య	గౌరెల్లి రాములు తండ్రి తిర్పతయ్య		
	బత్కురి రాంబాబు తండ్రి సత్తయ్య	బత్కురి రాంబాబు తండ్రి సత్తయ్య		
80 ఖుష్కి/ పట్టా 0.22	గౌరెల్లి సాయిలు తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి సాయిలు తండ్రి తిరుపతయ్య	0.22	-
	గౌరెల్లి రాములు తండ్రి తిర్పతయ్య	గౌరెల్లి రాములు తండ్రి తిర్పతయ్య		
	గౌరెల్లి జగన్ తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి జగన్ తండ్రి తిరుపతయ్య		
	గౌరెల్లి మహేష్ తండ్రి నర్సింహ్మా	గౌరెల్లి మహేష్ తండ్రి నర్సింహ్మా		
	గౌరెల్లి రమేష్ తండ్రి నర్సింహ్మా	గౌరెల్లి రమేష్ తండ్రి నర్సింహ్మా		
83 ఖుష్కి/ పట్టా 0.27	దర్శ బోయిన అచ్చయ్య తండ్రి మల్లయ్య	దర్శ బోయిన అచ్చయ్య తండ్రి మల్లయ్య	0.27	-
	దర్శ బోయిన దశరథ తండ్రి మల్లయ్య	దర్శ బోయిన దశరథ తండ్రి మల్లయ్య		
	దర్శ బోయిన గందయ్య అచ్చయ్య	దర్శ బోయిన గందయ్య అచ్చయ్య		
	దర్శ బోయిన గణేష్ తండ్రి రామయ్య	దర్శ బోయిన గణేష్ తండ్రి రామయ్య		
	పసులాది రాజయ్య తండ్రి అచ్చయ్య	పసులాది రాజయ్య తండ్రి అచ్చయ్య		
84 ఖుష్కి/ పట్టా 0.16	గౌరెల్లి రాములు తండ్రి తిర్పతయ్య	గౌరెల్లి రాములు తండ్రి తిర్పతయ్య	0.16	-
	గౌరెల్లి అందాలు తండ్రి నరసింహ్మా	గౌరెల్లి అందాలు తండ్రి నరసింహ్మా		
	అల్వాల్దార్ రాజు తండ్రి వెంకయ్య	అల్వాల్దార్ రాజు తండ్రి వెంకయ్య		
	అల్వాల్ రామరాజు తండ్రి బాల్‌రాజ్	అల్వాల్ రామరాజు తండ్రి బాల్‌రాజ్		
	బొందల లక్ష్మి శైలజ భర్త రాంబాబు	బొందల లక్ష్మి శైలజ భర్త రాంబాబు		
	పిట్టల హేమలత తండ్రి సుదర్శన్	పిట్టల హేమలత తండ్రి సుదర్శన్		
	గౌరెల్లి వరలక్ష్మి తండ్రి సైలు	గౌరెల్లి వరలక్ష్మి తండ్రి సైలు		
99 ఖుష్కి/ పట్టా 0.02	గుర్రాల సక్కుబాయి భర్త సత్యనారాయణ	గుర్రాల సక్కుబాయి భర్త సత్యనారాయణ	0.02	-
	గుర్రాల అంజనేయులు తండ్రి గందయ్య	గుర్రాల అంజనేయులు తండ్రి గందయ్య		
	గుర్రాల దర్శన్ తండ్రి గందయ్య	గుర్రాల దర్శన్ తండ్రి గందయ్య		
	గుర్రాల చంద్రకళ తండ్రి యాదగిరి	గుర్రాల చంద్రకళ తండ్రి యాదగిరి		
	పుల్లారి సంతోష్ కుమార్ తండ్రి పుల్లారి మల్లేశం	పుల్లారి సంతోష్ కుమార్ మల్లేశం		
135 ఖుష్కి/ పట్టా 0.02	మహంకాళి లక్ష్మి భర్త నరసింహ్మా	మహంకాళి లక్ష్మి భర్త నరసింహ్మా	0.02	-
	ఆముదాల వెంకటేష్ తండ్రి ఈశ్వరయ్య	ఆముదాల వెంకటేష్ తండ్రి ఈశ్వరయ్య		
	ఆముదాల కిష్టయ్య తండ్రి చిల్లయ్య	ఆముదాల కిష్టయ్య తండ్రి చిల్లయ్య		
	ఈగ జంగయ్య తండ్రి రామయ్య	ఈగ జంగయ్య తండ్రి రామయ్య		
	బాలబోయిన రామకృష్ణ తండ్రి రాములు	బాలబోయిన రామకృష్ణ తండ్రి రాములు		
	ఈగ వెంకటేష్ తండ్రి రాములు	ఈగ వెంకటేష్ తండ్రి రాములు		
	ఈగ పెంటయ్య తండ్రి రాములు	ఈగ పెంటయ్య తండ్రి రాములు		
	అజ్జబోయిన వినోద్ తండ్రి సురేందర్	అజ్జబోయిన వినోద్ తండ్రి సురేందర్		
142 మాఫీ ఇనామ్ 0.03	గ్యార పెంటయ్య తండ్రి భిక్షపతి	గ్యార పెంటయ్య తండ్రి భిక్షపతి	0.03	-
	గ్యార చెన్నయ్య తండ్రి భిక్షపతి	గ్యార చెన్నయ్య తండ్రి భిక్షపతి		
	గ్యార సుందరం తండ్రి భిక్షపతి	గ్యార సుందరం తండ్రి భిక్షపతి		
	గ్యార దానయ్య తండ్రి మైసయ్య	గ్యార దానయ్య తండ్రి మైసయ్య		
	గ్యార శంకరయ్య తండ్రి ఎల్లయ్య	గ్యార శంకరయ్య తండ్రి ఎల్లయ్య		
	గ్యార మల్లేష్ తండ్రి ఎల్లయ్య	గ్యార మల్లేష్ తండ్రి ఎల్లయ్య		
	గ్యార ఆశీర్వాదం తండ్రి బాలయ్య	గ్యార ఆశీర్వాదం తండ్రి బాలయ్య		
	గ్యార ప్రభాకర్ తండ్రి భిక్షపతి	గ్యార ప్రభాకర్ తండ్రి భిక్షపతి		
	గ్యార కిష్టయ్య తండ్రి పోషయ్య	గ్యార కిష్టయ్య తండ్రి పోషయ్య		
	గ్యార శాంతమ్మ తండ్రి భిక్షపతి	గ్యార శాంతమ్మ తండ్రి భిక్షపతి		
	పోతగోని వీరస్వామి తండ్రి రామస్వామి	పోతగోని వీరస్వామి తండ్రి రామస్వామి		
	యాచారం బాలయ్య తండ్రి ముత్తయ్య	యాచారం బాలయ్య తండ్రి ముత్తయ్య		
	గ్యార సుధాకర్ తండ్రి భిక్షపతి	గ్యార సుధాకర్ భిక్షపతి		-
	గ్యార రమేష్ చిన్న భిక్షపతి	గ్యార రమేష్ చిన్న భిక్షపతి		-
	యాచారం బాలమ్మ నరసింహ్మా	యాచారం బాలమ్మ నరసింహ్మా		-
	గ్యార కుమార్ తండ్రి చిన్న భిక్షపతి	గ్యార కుమార్ తండ్రి చిన్న భిక్షపతి		-
120 ఖుష్కి/ పట్టా 0.005	దర్శ బోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	దర్శ బోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	0.005	-
	కొల్లుల శ్రీశైలం తండ్రి పెంటయ్య	కొల్లుల శ్రీశైలం తండ్రి పెంటయ్య		
	దర్శ బోయన జగన్ తండ్రి గందయ్య	దర్శ బోయన జగన్ తండ్రి గందయ్య		
	కాషబోయిన కరుణాకర తండ్రి నర్సింహ	కాషబోయిన కరుణాకర తండ్రి నర్సింహ		
121 ఖుష్కి / పట్టా 0.01	దర్శబోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	దర్శబోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	0.01	
	కొల్లుల శ్రీశైలం తండ్రి పెంటయ్య	కొల్లుల శ్రీశైలం తండ్రి పెంటయ్య		
	దర్శ బోయన జగన్ తండ్రి గందయ్య	దర్శ బోయన జగన్ తండ్రి గందయ్య		
	కాషబోయిన కరుణాకర్ తండ్రి నర్సింహ	కాషబోయిన కరుణాకర్ తండ్రి నర్సింహ		-
122 ఖుష్కి / పట్టా 0.03	దర్శబోయిన రాములు తండ్రి నర్సింహ్మా	దర్శబోయిన రాములు తండ్రి నర్సింహ్మా	0.03	
	దర్శబోయిన మల్లేష్ తండ్రి రాములు	దర్శబోయిన మల్లేష్ తండ్రి రాములు		
	దర్శబోయిన అంజనేయులు తండ్రి రాములు	దర్శబోయిన అంజనేయులు తండ్రి రాములు		
	దర్శబోయిన కిష్టయ్య తండ్రి రాములు	దర్శబోయిన కిష్టయ్య తండ్రి రాములు		-
	దర్శబోయిన వెంకటేష్ తండ్రి బాల్ నర్సింహ	దర్శబోయిన వెంకటేష్ తండ్రి బాల్ నర్సింహ		
	దర్శబోయిన నాగరాజు తండ్రి బాల్ నర్సింహ్మా	దర్శబోయిన నాగరాజు తండ్రి బాల్ నర్సింహ్మా		
	దర్శబోయిన హనుమంతు తండ్రి బాల్ నర్సింహ్మా	దర్శబోయిన హనుమంతు తండ్రి బాల్ నర్సింహ్మా		
123 ఖుష్కి / పట్టా 0.02	పసులాది నర్సమ్మ తండ్రి నారాయణ	పసులాది నర్సమ్మ తండ్రి నారాయణ	0.02	
	పసులాది స్వామి తండ్రి రామయ్య	పసులాది స్వామి తండ్రి రామయ్య		
	పసులాది రాందాసు తండ్రి రామయ్య	పసులాది రాందాసు తండ్రి రామయ్య		
	పసులాది సీతారాములు తండ్రి నర్సింహ్మా	పసులాది సీతారాములు తండ్రి నర్సింహ్మా		
	పసులాది వెంకటేశం తండ్రి నర్సయ్య	పసులాది వెంకటేశం తండ్రి నర్సయ్య		
	పసులాది క్రిష్ణ తండ్రి సత్తయ్య	పసులాది క్రిష్ణ తండ్రి సత్తయ్య		
	పసులాది నర్సింహ్మా తండ్రి సత్తయ్య	పసులాది నర్సింహ్మా తండ్రి సత్తయ్య		
	గద్దె సువర్ణ తండ్రి శ్రీనువాస్	గద్దెక సువర్ణ తండ్రి శ్రీనువాస్		
	పసులది శివయ్య తండ్రి నరసింహ్మా	పసులది శివయ్య తండ్రి నరసింహ్మా		
	పసులాది శ్రీశైలం తండ్రి నర్సింహ్మా	పసులాది శ్రీశైలం తండ్రి నర్సింహ్మా		
	పసులాది సుదర్శన్ తండ్రి నర్సింహ్మా	పసులాది సుదర్శన్ తండ్రి నర్సింహ్మా		
	పసులాది నర్సింగ్‌రావు తండ్రి లక్ష్మయ్య	పసులాది నర్సింగ్‌రావు తండ్రి లక్ష్మయ్య		
	పసులాది అంజనేయులు తండ్రి లక్ష్మయ్య	పసులాది అంజనేయులు తండ్రి లక్ష్మయ్య		
	పసులాది రమేష్ తండ్రి కొండయ్య	పసులాది రమేష్ తండ్రి కొండయ్య		
	పసులాది ప్రేమ్ చందర్ తండ్రి కొండయ్య	పసులాది ప్రేమ్ చందర్ తండ్రి కొండయ్య		
	పసులాది లింగ స్వామి తండ్రి కొండయ్య	పసులాది లింగ స్వామి తండ్రి కొండయ్య		
	పసులది మహేష్ బాబు తండ్రి లేట్ భాస్కర్	పసులది మహేష్ బాబు తండ్రి లేట్ భాస్కర్		
	పసులది ఉదయ్ కిరణ్ తండ్రి లేట్ భాస్కర్	పసులది ఉదయ్ కిరణ్ తండ్రి లేట్ భాస్కర్		
	పసులది భాస్కర్ తండ్రి నారాయణ	పసులది భాస్కర్ తండ్రి నారాయణ		
129 ఖుష్కి / పట్టా 0.0150	బింగి నర్సింహ్మా తండ్రి అచ్చయ్య	బింగి నర్సింహ్మా తండ్రి అచ్చయ్య	0.0150	
	పుట్ట యాదగిరి తండ్రి రామయ్య	పుట్ట యాదగిరి తండ్రి రామయ్య		
	పుట్ట జనార్ధన్ తండ్రి పెద్ద రామయ్య	పుట్ట జనార్ధన్ తండ్రి పెద్ద రామయ్య		
	పుట్ట మోహన్ రాజు తండ్రి చిన్నరామయ్య	పుట్ట మోహన్ రాజు తండ్రి చిన్నరామయ్య		
	పుట్ట దస్‌రాజ్ తండ్రి చిన్న రామయ్య	పుట్ట దస్‌రాజ్ తండ్రి చిన్న రామయ్య		
	పుట్ట ముత్యాలు తండ్రి నర్సింహ్మా	పుట్ట ముత్యాలు తండ్రి నర్సింహ్మా		
	పుట్ట కృష్ణ తండ్రి నర్సింహ్మా	పుట్ట కృష్ణ తండ్రి నర్సింహ్మా		
	[illegible]	[illegible]		
136 ఖుష్కి / పట్టా 0.2250	[illegible]	[illegible]	0.2250	
137 ఖుష్కి / పట్టా 0.20	[illegible]	[illegible]	0.20	
138 ఖుష్కి / పట్టా 0.28	[illegible]	[illegible]	0.28	
141 ఖుష్కి / పట్టా 0.09	భీమనపల్లి ప్రకాష్ తండ్రి అశోక్	భీమనపల్లి ప్రకాష్ తండ్రి అశోక్	0.09	-
	భీమనపల్లి బస్వరాజు తండ్రి అశోక్	భీమనపల్లి బస్వరాజు తండ్రి అశోక్		
	భీమనపల్లి రాములు తండ్రి అశాలు	భీమనపల్లి రాములు తండ్రి అశాలు		
	భీమనపల్లి నవీన్ తండ్రి లక్ష్మయ్య	భీమనపల్లి నవీన్ తండ్రి లక్ష్మయ్య		
	వీర రాజు తండ్రి లేట్ బాలయ్య	వీర రాజు తండ్రి లేట్ బాలయ్య		
	పసులది వెంకటేష్ తండ్రి పసులది ఈశ్వర్	పసులది వెంకటేష్ తండ్రి పసులది ఈశ్వర్		
144 ఖుష్కి / పట్టా 0.01	దేవులపల్లి వీరాచారి తండ్రి విఠలాచారి	దేవులపల్లి వీరాచారి తండ్రి విఠలాచారి	0.01	-
	వడ్ల విఠలయ్య తండ్రి వీరయ్య	వడ్ల విఠలయ్య తండ్రి వీరయ్య		
143 ఖుష్కి / పట్టా 0.04	ఆముదాల వెంకటేష్ తండ్రి ఈశ్వరయ్య	ఆముదాల వెంకటేష్ తండ్రి ఈశ్వరయ్య	0.04	-
	ఆముదాల కిష్టయ్య తండ్రి చిల్లయ్య	ఆముదాల కిష్టయ్య తండ్రి చిల్లయ్య		
	ఆముదాల గణేష్ తండ్రి వెంకటయ్య	ఆముదాల గణేష్ తండ్రి వెంకటయ్య		
	ఆముదాల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య	ఆముదాల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య		
	బాలబోయిన రామకృష్ణ తండ్రి రాములు	బాలబోయిన రామకృష్ణ తండ్రి రాములు		
	ఈగ అందాలు తండ్రి ఉత్తరయ్య	ఈగ అందాలు తండ్రి ఉత్తరయ్య		
	వల్లప కృష్ణ తండ్రి నారాయణ	వల్లప కృష్ణ తండ్రి నారాయణ		
150 ఖుష్కి / పట్టా 0.0150	బాలబోయిన కిష్టయ్య తండ్రి పాపయ్య	బాలబోయిన కిష్టయ్య తండ్రి పాపయ్య	0.0150	-
	బాలబోయిన జగ్గయ్య తండ్రి కిష్టయ్య	బాలబోయిన జగ్గయ్య తండ్రి కిష్టయ్య		
	బాలబోయిన బాలనరసింహ్మా తండ్రి కిష్టయ్య	బాలబోయిన బాలనరసింహ్మా తండ్రి కిష్టయ్య		
	బాలబోయిన శ్రీశైలం తండ్రి కిష్టయ్య	బాలబోయిన శ్రీశైలం తండ్రి కిష్టయ్య		
151 ఖుష్కి / పట్టా 0.0150	బాలబోయిన కిష్టయ్య తండ్రి పాపయ్య	బాలబోయిన కిష్టయ్య తండ్రి పాపయ్య	0.0150	-
	బాలబోయిన జగ్గయ్య తండ్రి కిష్టయ్య	బాలబోయిన జగ్గయ్య తండ్రి కిష్టయ్య		
	బాలబోయిన బాలనరసింహ్మా తండ్రి కిష్టయ్య	బాలబోయిన బాలనరసింహ్మా తండ్రి కిష్టయ్య		
	బాలబోయిన శ్రీశైలం తండ్రి కిష్టయ్య	బాలబోయిన శ్రీశైలం తండ్రి కిష్టయ్య		
152 ఖుష్కి / పట్టా 0.04	మహమ్మద్ అఫ్జల్ తండ్రి సయ్యద్ లాల్	మహమ్మద్ అఫ్జల్ తండ్రి సయ్యద్ లాల్	0.04	-
	మహమ్మద్ హమీదా తండ్రి సత్తార్	మహమ్మద్ హమీదా తండ్రి సత్తార్		
	ఎండి నమీ అహ్మద్ తండ్రి మహమ్మద్ సాహెబ్	ఎండి నమీ అహ్మద్ తండ్రి మహమ్మద్ సాహెబ్		
	ఎండి నజీర్ తండ్రి మహమ్మద్ సాహెబ్	ఎండి నజీర్ తండ్రి మహమ్మద్ సాహెబ్		
	ఎండి నిసార్ తండ్రి మహమ్మద్ సాహెబ్	ఎండి నిసార్ తండ్రి మహమ్మద్ సాహెబ్		
	ఎండి నూర్ బాబా తండ్రి మెహమూద్ సాహెబ్	ఎండి నూర్ బాబా తండ్రి మెహమూద్ సాహెబ్		
	మొహమ్మద్ సమీర్ తండ్రి మహమ్మద్ నజర్	మొహమ్మద్ సమీర్ తండ్రి మహమ్మద్ నజర్		
153 ఇనామ్ 0.04	మేత కిష్టయ్య	మేత కిష్టయ్య	0.04	-
158 ఖుష్కి / పట్టా 0.04	గౌరెల్లి సాయిలు తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి సాయిలు తండ్రి తిరుపతయ్య	0.04	-
	గౌరెల్లి రాములు తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి రాములు తండ్రి తిరుపతయ్య		
	గౌరెల్లి సత్తయ్య తండ్రి రామయ్య	గౌరెల్లి సత్తయ్య తండ్రి రామయ్య		
	గౌరెల్లి జగన్ తండ్రి తిరుపతయ్య	గౌరెల్లి జగన్ తండ్రి తిరుపతయ్య		
159 ఖుష్కి / పట్టా 0.12	అర్జాపతి భిక్షపతి తండ్రి నందయ్య	అర్జాపతి భిక్షపతి తండ్రి నందయ్య	0.12	-
	అర్జాపతి లక్ష్మయ్య తండ్రి నందయ్య	అర్జాపతి లక్ష్మయ్య తండ్రి నందయ్య		
	వర్మాల అందాలు తండ్రి యాదయ్య	వర్మాల అందాలు తండ్రి యాదయ్య		
160 ఖుష్కి / పట్టా 0.14	నాశబోయిన యాదగిరి తండ్రి బాలయ్య	నాశబోయిన యాదగిరి తండ్రి బాలయ్య	0.14	-
	మాలగుండ్ల సీతాల్ తండ్రి కిషోర్‌బాబు	మాలగుండ్ల సీతాల్ తండ్రి కిషోర్‌బాబు		
165 ఖుష్కి / పట్టా 0.02	కంభం ప్రదీప్ కుమార్ తండ్రి లింగప్ప	కంభం ప్రదీప్ కుమార్ తండ్రి లింగప్ప	0.02	-
168 ఖుష్కి / పట్టా 0.04	నెల్లుట్ల పెంటయ్య తండ్రి సత్తయ్య	నెల్లుట్ల పెంటయ్య తండ్రి సత్తయ్య	0.04	-
	మర్రికొండ వినోద్ భర్త క్రిష్ణ	మర్రికొండ వినోద్ భర్త క్రిష్ణ		
174 ఖుష్కి / పట్టా 0.0150	దర్శబోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	దర్శబోయిన గందయ్య తండ్రి అచ్చయ్య	0.0150	-
	ఏలసాటి శివరాజ్ తండ్రి లక్ష్మయ్య	ఏలసాటి శివరాజ్ తండ్రి లక్ష్మయ్య		
	ఏలసాటి భార్గవి భర్త లేట్ గంగరాజు	ఏలసాటి భార్గవి భర్త లేట్ గంగరాజు		
176 ఖుష్కి / పట్టా 0.06	దర్శబోయిన నర్సింహ తండ్రి లింగయ్య	దర్శబోయిన నర్సింహ తండ్రి లింగయ్య	0.06	-
	[illegible]	[illegible]		
197 ఖుష్కి / పట్టా 0.05	[illegible]	[illegible]	0.05	-
198 ఖుష్కి / పట్టా 0.09	[illegible]	[illegible]	0.09	-
200 ఖుష్కి / పట్టా 0.03	[illegible]	[illegible]	0.03	-
201 ఖుష్కి / పట్టా 0.0850	[illegible]	[illegible]	0.0850	-
205 ఖుష్కి / పట్టా 0.0350	[illegible]	[illegible]	0.0350	-
	పసులాది సురేందర్ తండ్రి రాములు	పసులాది సురేందర్ తండ్రి రాములు		
	పసులాది లక్ష్మణ్ తండ్రి రాములు	పసులాది లక్ష్మణ్ తండ్రి రాములు		
		మొత్తము:	12.22 ½	

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా** వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా** గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి** గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏదైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/-
ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), అర్ అండ్ అర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా.

సం/-
అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి

సం/-
జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO No.201/LA-PP/Advt/Pub/2025-26



లక్ష్మీకాంతారావును పరామర్శిస్తున్న మంత్రి దామోదర

జుక్కల్ ఎమ్మెల్యేకు పరామర్శ

నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును బుధవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారక నాథ్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పరామర్శించారు. రెండ్రోజుల క్రితం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఫుడ్ పాయిజన్ కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఆస్ప త్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్నారు.

భద్రాద్రి కలెక్టర్‌కు కేంద్రం ప్రశంసలు

కొత్తగూడెం అర్బన్: కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జల సంచాయ్ జన భాగీధారి (జేఎస్‌జేబీ) కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు ఐరన్ మ్యాన్ ఆఫ్ జేఎస్‌జేబీగా ప్రశంసలు దక్కాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన భావనను అత్యంత ప్రభావవంతంగా ఆచరణలోకి తీసుకొచ్చిన జిల్లాగా గుర్తింపు పొందింది. జిల్లాలోని ప్రభుత్వ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు, జూనియర్ కళాశాలలు, రైతు వేదికలు, పోలీస్ స్టేషన్లు, పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు తదితర ప్రాంతాల్లో 29,103 నీటి గుంతలు నిర్మించగా మరో 2,581 నీటి గుంతలు ప్రగతిలో ఉన్నాయి. ఉపాధి పథకం ద్వారా అర్హులైన రైతులకు ఫాం పాండ్స్ (నీటి కుంటలు) మంజూరు చేశారు. ఈ మేరకు కృషి చేసిన కలెక్టర్‌ను కేంద్ర మంత్రిత్వ శాఖ, అధికారులు అభినందించారు.



నీటిగుంతకోసం మట్టి తవ్వుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్(ఫైల్)



ఏసీబీకి పట్టుబడిన డిప్యూటీ సర్వేయర్ మంజుల, చైన్‌మెన్ ఉదయ్‌కుమార్

ఏసీబీ వలలో రెవెన్యూ చేపలు

- భూమి సర్వేకు డబ్బులు డిమాండ్
- సర్వే చేయకపోవడంతో ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

మంచిర్యాల క్రైం: భూమి సర్వేకు డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు రెవెన్యూ సిబ్బందిని ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సర్వేయర్ పోలం మంజుల, చైన్‌మెన్ ప్యాగా ఉదయ్‌కుమార్ లంచం వసూలుపై అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని 307 సర్వేనంబరులో సర్వే చేయాలని ఓ వ్యక్తి దరఖాస్తు సమర్పించాడు. డిప్యూటీ సర్వేయర్ మంజుల డబ్బులు డిమాండ్ చేయడంతో ఒప్పందం ప్రకారం ఆమె వద్ద పనిచేసే చైన్‌మెన్ ప్యాగా ఉదయ్‌కుమార్‌కు దఫాల వారీగా రూ.16,500 ఫోన్ పే చేశాడు. మరో రూ.10 వేలు నగదు చెల్లించాడు. అయినా సర్వే చేయకుండా కాలయాపన చేస్తుండటం, మరో రూ.50 వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బాధితుడు మంజులతో మాట్లాడగా.. ఆమె రూ.50 వేలు డిమాండ్ చేశారు. చివరికి రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బుధవారం ఏసీబీ అధికారులు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ సర్వేయర్, చైన్‌మెన్ డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో రిమాండ్ చేస్తున్నట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

యోగా క్యాలెండర్ ఆవిష్కరణ

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం-2025'పై రూపొందించిన వాల్ పోస్టర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ డైరెక్టర్ హైమావతి పాల్గొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

● బ్యూటిప్స్

● రెండు టీ స్పూన్ల కోకో బటర్‌ను కరిగించి అందులో టీ స్పూన్ విటమిన్–ఇ ఆయిల్, టీ స్పూన్ నువ్వుల నూనె, 5–6 చుక్కల ఆరెంజ్ ఆయిల్, టీ స్పూన్ అల్లం రసం వేసి కలిపి వేడి చేయాలి. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని శరీరానికి మసాజ్ చేసుకొని స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగై, ఒత్తిడి నుంచి త్వరగా రిలీఫ్ లభిస్తుంది.



● పచ్చిపాలు, అలోవెరా జెల్, తేనె టీ స్పూన్ చొప్పున తీసుకొని, అందులో ఎసెన్షియల్ ఆయిల్ రెండు చుక్కలు కలపాలి. ముఖాన్ని చల్లని నీటితో శుభ్రపరుచుకొని, తడి లేకుండా తుడుచుకోవాలి. తర్వాత పాల మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని ముఖానికి రాసుకుంటూ మసాజ్ చేసుకోవాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.

● వివాహం

ఆలుమగలకు 5 కారణాలే విలన్లు

పెళ్లి భార్యాభర్తలను దగ్గరకు చేయాలి. రోజులు గడిచే కొద్ది అనుబంధం పెరగాలి. ఆకర్షణ నిలవాలి. 'కాని నేడు చాలా పెళ్లిళ్లలో ఆలుమగల మధ్య నిర్లిప్తత చోటు చేసుకుంటోంది' అంటున్నారు డాక్టర్ సప్నా శర్మ. పూణెలో చాలా గుర్తింపు పొందిన ఈ మేరేజ్ కౌన్సిలర్ ఆలుమగల మధ్య ఆకర్షణ నశించడానికి ఐదు ముఖ్యకారణాలను తెలియచేస్తున్నారు అవి...



'గతంలో మనకున్న ఉమ్మడి కుటుంబాలు పిల్లలకు పాఠశాలలుగా ఉండేవి. పెద్దవాళ్లు కష్టసుఖాల్లో ఎలా సర్దుకుపోయేవారో, ఒకరికి ఒకరు సపోర్ట్ ఎలా ఇచ్చేవారో గమనించి పిల్లలు నేర్చుకునేవారు. కాని ఇవాళ న్యూక్లియర్ ఫ్యామిలీలు ఉన్నాయి. పైగా పిల్లలకు తల్లిదండ్రులు చదువు తప్ప వేరే ఏ విషయం మీద ధ్యాస పెట్టనీకుండా చేస్తున్నారు. చదువు పూర్తయ్యి ఉద్యోగం రాగానే పెళ్లి చేస్తున్నారు. పెళ్లి గురించి, భార్యాభర్తలు ఉండవలసిన తీరు గురించి, పెళ్లి డిమాండ్ చేసే బాధ్యతల గురించి, అత్తమామలు ఇతర అనుబంధాలు తెచ్చే ఒత్తిడి గురించి ఏమాత్రం తెలియచేయకుండా సంసారంలో పడేస్తే వాళ్లు కన్‌ఫ్యూజ్ కారా?' అంటున్నారు డాక్టర్ సప్న శర్మ.

నాగపూర్‌లో జన్మించి ఐ సర్జన్‌గా పని చేసి తర్వాతి రోజుల్లో పర్సనాలిటీ కోచ్‌గా, మోటివేషనల్ స్పీకర్‌గా, మేరేజ్ కౌన్సిలర్‌గా గుర్తింపు పొందిన సప్న శర్మ భారతీయ ఆలుమగల మధ్య వస్తున్న ఘర్షణలకు కారణాలను అర్థం చేసుకుంటూ వాటిని తిరిగి సమాజానికి చెప్పి హెచ్చరికలు చేస్తున్నారు. ఆలుమగల మధ్య జీవితం నిస్సారం అనిపించడానికి ఐదు కారణాలను ఆమె తెలియ చేస్తున్నారు. అవి ఇవి:

1. అనురాగానికి ఆటంకాలు

పెళ్లయిన స్త్రీ, పురుషులు ఒకరితో మరొకరు ప్రేమగా బహిరంగంగా కనిపించడంపై మన సమాజంలో కనపడని నిషేధాజ్ఞలు ఉన్నాయి. పెళ్లయి జీవితం మొదలుపెట్టాక ఇంట్లో అత్తామామలో తల్లిదండ్రులో ఉంటే భార్యాభర్తలు సరదా భాషణం చేయడం, ఒకరినొకరు తాకడం తప్పు అనే భావన ఇంజెక్ట్ చేస్తారు. దాంతో ప్రేమగా ఉండటం ఏ అర్ధ రాత్రో తలుపు చాటున చేయవలసిన పనిగా మారుతుంది. అసలు భార్యభర్తలు తమ ప్రేమను ప్రదర్శించడానికి అవకాశమే లేనప్పుడు ప్రేమ జనించే అవకాశం ఎక్కడ? ఇది ఒక పెద్ద సమస్య.

2. దొరకని ఏకాంతం

భారతదేశంలో పెళ్లయ్యాక యువ జంట ఎక్కడికి ఆఖరుకు సినిమాకు వెళ్లాలన్నా ఎవరో ఒకరు తోడు ఉంటారు. కలిసి ఊళ్లకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లాల్సిందే తప్ప వీరు తమ మానాన తాము వెళ్లడం దోషంగా చెప్పబడుతుంది. ఇక ఒక రిద్దరు పిల్లలు పుట్టాక భార్యాభర్తలు ఆ పిల్లల్ని ఎక్కడైనా వదిలి నాలుగు రోజులు విహారంగా వెళ్లడం దాదాపు చోద్యంగా, పాపంగా పరిగణించబడుతుంది. భార్యాభర్తలు మనసు విప్పి మాట్లాడుకునే, ప్రేమను పెంచుకునే అవకాశాలే లేని కుటుంబ వ్యవస్థ వల్ల వారి మధ్య బంధం తప్ప ప్రేమతో కూడిన బంధం ఉండటం లేదు.

3. ఆసక్తి లేకపోవడం

వీటన్నింటి దరిమిలా భార్యాభర్తలకు ఒకరిపై మరొకరికి ఆసక్తి పోతోంది. చక్కగా తయారవడం అనేది బయటకు వెళ్లేటప్పటి సంగతిగా భావిస్తారు. మంచి బట్టలు, నగలు అన్నీ బయట వారికి చూపించడానికే. ఇంట్లో ఉన్నప్పుడు దారుణమైన బట్టలతో, సింగారం లేకుండా భార్య భర్తకు కనపడుతుంటుంది. భర్త కూడా ఏ పైజామో వేసుకుని తిరుగుతుంటాడు. ఇలాంటి అవతారాల్లో భార్యాభర్తలు ఒకరి ఎదుట మరొకరు ఉంటే ఎందుకు ఆకర్షణ కలుగుతుంది?

4. ఫిట్‌నెస్‌ను పట్టించుకోకపోవడం

పెళ్లి అయ్యే వరకు అబ్బాయి, అమ్మాయి ఎంతో కొంత ఫిట్‌నెస్ గురించి దృష్టి పెట్టినా మన దేశంలో పెళ్లయ్యాక ఆకారాలు ఎలా ఉన్నా పర్లేదులే అనే నిర్ణయానికి వస్తారు. ఫిట్‌నెస్‌ను పూర్తిగా వదిలేస్తారు. స్త్రీలు పిల్లలు పుట్టాక తిరిగి శరీరాన్ని ఫిట్‌గా మార్చుకుందాం అనుకోరు. పురుషులు బరువు పెరిగి, బొజ్జలు పెంచి వికారంగా ఉన్నామని తెలిసినా వ్యాయామం మాట ఎత్తకుండా ఉంటారు. ఇలా ఉండటం వల్ల భార్యాభర్తలు లోలోపల ఒకరిపై మరొకరు అసంతృప్తిని పెంచుకుంటారు.

5. ఒకరి ఆసక్తులు మరొకరివై

భార్యాభర్తలు భౌతిక ఆకర్షణను కోల్పోయినా మానసికంగా దగ్గరగా ఉంటే చాలా సమస్యలు పోతాయి. భర్త ఆసక్తులు భార్యకు పట్టకపోవడం భార్య ఇష్టాలు భర్తకు రుచించకపోవడం ఇద్దరూ కలిసి మాట్లాడుకునే ఉమ్మడి అభిరుచులే లేకపోతే వారి మధ్య అనుబంధం పెనవేసుకోవడం కష్టమవుతుంది. భర్తను భార్య మెచ్చుకోకపోగా సూటిపోటి మాటలు అనడం, భార్యను కాంప్లిమెంట్ చేయడం... హగ్ చేసుకోవడం భర్త 'అహాని'కి అడ్డుగా మారడం... ఇవి మానసిక బంధానికి విఘాతంగా మారుతున్నాయి.

భార్యాభర్తలే కాదు ఇంటి పెద్దలు కూడా ఈ కారణాలను కొడుకు కోడలు, కూతురు అల్లుళ్ల మధ్య గమనిస్తూ సరి చేయడానికి చేసుకోవడానికి ప్రయత్నించాలి.

అప్పుడే వివాహం నూరేళ్ల బంధం అవుతుంది.

● మన(సు)లో మాట

పెంపుడు కుక్క మరణంతో తీవ్ర మనోవేదన!

మా పెంపుడు కుక్క 12 సంవత్సరాల వయసులో ఈ మధ్యనే జబ్బు చేసి చనిపోయింది. మాకు పిల్లలు లేని కారణంగా, కుక్కతో మాకు చాలా అటాచ్ మెంట్ ఉండేది. నాకు బాధగా ఉన్నప్పటికీ, మా ఆయన మరీ డీలా పడిపోయారు! రోజు దానిని నడకకు తీసుకెళ్లడం, రాత్రి భోజనం పెట్టడం, స్నానం చేయించడం, ఆయన ఎంతో శ్రద్ధతో చేసేవారు. అది చనిపోయిన తరువాత ఆయన బాగా డల్ అయి మాటలు కూడా తగ్గాయి. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టే ఉంటున్నారు. రాత్రులు నిద్ర పట్టక గంటల తరబడి అటు ఇటు తిరుగుతున్నారు. బిజినెస్ మీద కూడా ముందున్న శ్రద్ధ పెట్టడం లేదు నా భర్తను కోల్పోతున్నానని, భయమేస్తోంది. దయచేసి నాకు సలహా ఇవ్వగలరు.

- మంజుశ్రీ, విశాఖ పట్టణం

మీ ఉత్తరంలో మీ భర్త ఎదుర్కొంటున్న తీవ్రమైన మానసిక వేదన స్పష్టంగా కనిపిస్తోంది. 12 సంవత్సరాలుగా అంతప్రేమగా పెంచుకున్న పెట్‌ని కోల్పోవడం మీ ఇద్దరికీ ఎంత బాధాకరమో నేను ఊహించగలను. దానికి రోజూ మార్నింగ్ స్నాక్స్, రాత్రి భోజనం, స్నానం వంటి రోజు వారికి కార్యాలు చేయించడం ఆయన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా అయినట్లు అనిపిస్తుంది. ఆయన మనోవేదన, ఒక కుటుంబ సభ్యుని

కోల్పోయినంత తీవ్రంగా ఉన్నట్లుంది. పెంపుడు జంతువులు అందునా ముఖ్యంగా కుక్కలు, మన భావోద్వేగ జీవితంలో ఒక అంతర్భాగం అవుతాయి. అని నిష్కపటమైన ప్రేమను పంచుతాయి. మీ భర్త ఒంటరితనం, నిద్రలేమి, పనిలో ఇబ్బందులు చూస్తే ఆయన 'కాంప్లికేటెడ్ గ్రాఫ్' అనే మానసిక రుగ్మతతో పోరాడుతున్నాడని అనిపిస్తుంది. మార్నింగ్ వాక్, కుక్కకు రాత్రి భోజనం పెట్టడం వంటిని ఆయనకు ఒక నిర్దిష్టమైన రొటీన్‌ను అందించాయి. అవి లేకపోవడం, వల్ల అతని దైనందిన జీవితంలో ఒక శూన్యత ఏర్పడినట్లుంది. కొన్నిసార్లు కుక్క చనిపోయినప్పుడు దాన్ని బతికించుకోలేకపోయాననే గిల్ట్ ఫీలింగ్ కూడా ఉండొచ్చు! మన సమాజం పురుషలను తమ దుఃఖాన్ని

బయటకు వెలిబుచ్చకుండా మనసుల్లో దాచుకొనేందుకు ఒత్తిడి చేస్తుంది. ఇది కూడా ఆయన ప్రస్తుత ప్రవర్తనకు ఒక కారణం కావచ్చు. ఆయన పడుతున్న వేదనను మీరు అర్థం చేసుకొని 'నేను నీకోసం నీతోనే ఉన్నాను' అనే విషయాన్ని ఆయనకు అర్థం అయేలా వ్యక్తం చేయండి. ఇది అతను ఓపెన్ అప్ అయ్యే అవకాశం ఇస్తుంది. మీ కుక్క జ్ఞాపకార్థం ఒక చెట్టు నాటడం లేదా ఫోటో ఆల్బమ్ తయారు చేయడం లాంటిని ఆయనతో చేయించండి. ఆయన రొటీన్‌ను కొనసాగించడానికి, ఉదయం నడకకు కలిసి వెళ్దామని సూచించండి. ఆయన నిద్రలేమి ఒంటరితనం, పనిలో ఇబ్బందులు కొనసాగితే ఒక సైకియాట్రిస్ట్‌కి చూపించి కౌన్సెలింగ్, ఇంకా అవసరం అయితే కొన్ని మందులు, వాడించండి. మీ కుక్కకు సంబంధించిన మంచి జ్ఞాపకాలు పంచుకోండి. మీ ప్రేమ, సాంగత్యం అతనికి శక్తిమంతమైన సపోర్ట్‌గా ఉంటాయి. మీరు ఆత్మస్థైర్యంతో ఈ పరిస్థితిని తప్పకుండా – అధిగమిస్తారని ఆశిస్తున్నాను.

ఆల్‌ది బెస్ట్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com

బులియన్ జూన్ 4న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,210
బంగారం (22 క్యారెట్లు)	90,820
వెండి	1,01,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	100,520
బంగారం (22 క్యారెట్లు)	90,900
వెండి	1,04,000
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,550
బంగారం (22 క్యారెట్లు)	90,338
వెండి	1,01,650
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,520
బంగారం (22 క్యారెట్లు)	93,630
వెండి	1,04,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,700
బంగారం (22 క్యారెట్లు)	88,960
వెండి	1,01,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	90,900
బంగారం (22 క్యారెట్లు)	99,160
వెండి	1,14,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



ఆకాశాన్ని అంటుతున్న పర్యావరణ ఉద్యమ భవనాన్ని చూస్తూ.... గొప్పగా మాట్లాడుకుంటాం. ఆ అమూల్యమైన భవనం రాత్రికి రాత్రి వెలిసింది కాదు. రాత్రనకా, పగలనకా ఎంతోమంది కష్టపడితే రూపుదిద్దుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది మహిళలు ఆ భవనానికి పునాదిరాళ్లు వేశారు. వారి అడుగుజాడలు ఆదర్శప్రాయం, అనుసరణీయం...

అడుగు జాడలు

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పక్షులను రక్షించుకుందాం



రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని గురించి విస్తృతంగా ప్రచారం చేసింది రేచెల్ కార్సన్. ఆధునిక పర్యావరణ వాదానికి స్ఫూర్తినిచ్చే వ్యక్తిగా గుర్తింపు పొందిన రేచెల్ 1962లోనే 'సైలెంట్ స్ప్రింగ్' అనే పుస్తకాన్ని రాసింది. రసాయన ఎరువుల వాడకం వల్ల పక్షులకు జరుగుతున్న ప్రాణ నష్టం గురించి ఈ పుస్తకంలో వివరించింది.

పర్యావరణ పార్టీ



మారినా సిల్వా తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులు చేసేది. పదహారేళ్ల వయసు వరకు చదవడం, రాయడం రాదు. ఆ తరువాత కష్టపడి చదువుకుంది. డిగ్రీ సాధించింది. చిన్న వయసులోనే సెనెటర్ అయ్యింది. బ్రెజిల్ పర్యావరణశాఖ మంత్రిగా స్ఫూర్తిదాయకమైన పనులకు శ్రీకారం చుట్టింది. అటవీ నిర్మూలన జరగకుండా చేసింది. ఎన్నికలలో 'పర్యావరణం' అనేది కీలక అంశం అయ్యేట్లు చేసింది. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని 'సస్టెయినబిలిటీ నెట్‌వర్క్' అనే రాజకీయ పార్టీని ప్రారంభించింది.

నిర్లిప్తత వదిలేలా...



'వియ్ యాక్ట్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ జస్టిస్' వ్యవస్థాపకురాలు పెగ్గీ షెపర్డ్. 1988 నుంచి మన్‌హట్టన్‌లో పర్యావరణ సంరక్షణకు సంబంధించి కార్యక్రమాలు ఎన్నో చేపట్టింది. అమెరికాలో ఎన్నో ప్రాంతాలు కాలుష్యానికి చిరునామాలుగా ఉండేవి. అయినప్పటికీ 'మనం ఏం చేయలేము' అనే నిర్లిప్తత జనాలలో ఉండేది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చి పర్యావరణ స్పృహ తీసుకు రావడానికి కృషి చేసింది షెపర్డ్. 'నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ జస్టిస్ అడ్వైజరీ కౌన్సిల్'కు తొలి మహిళా చైర్‌పర్సన్‌గా గుర్తింపు పొందింది.

తిరుగులేని యోధురాలు



'భయం లేని యోధురాలు'గా గుర్తింపు పొందిన మార్జరీ స్టోన్‌మన్ డగ్లస్ జర్నలిస్ట్, రచయిత్రి. స్త్రీవాదం, పర్యావరణవాదం కోసం తన శక్తిమంతమైన గొంతును వినిపించేది. 1947లో 'ది ఎవర్‌గ్లెడ్స్: రివర్ ఆఫ్ గ్రాస్' అనే ప్రసిద్ధ పుస్తకాన్ని రాసింది. పర్యావరణ సంరక్షణకు ప్రజా మద్దతు కూడగట్టడంలో క్రియాశీల పాత్ర పోషించింది.

అడవి తల్లి కోసం...



ఎమ్మీ అవార్డ్–విన్నింగ్ జర్నలిస్ట్ వెనెస హాక్ పదిహేను సంవత్సరాలకు పైగా పర్యావరణ సమస్యలను వెలుగులో తీసుకువచ్చింది. కేవలం రాతలకే పరిమితం కాకుండా ప్రజలలో పర్యావరణ స్పృహ కలిగించడానికి ఉద్యమ స్థాయిలో పనిచేసింది. పర్యావరణ సమస్యలపై ఇన్వెస్టిగేటివ్ యూనిట్ ఏర్పాటు చేసింది. 'మదర్ జంగిల్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి పర్యావరణ అంశాలపై క్షేత్రస్థాయిలో పనిచేసింది.

ఎన్నో దేశాలకు స్ఫూర్తినిచ్చేలా...



'గ్రీన్‌బెల్ట్ మూమెంట్' వ్యవస్థాపకురాలైన వంగరి మాథాయ్ ప్రపంచ ప్రసిద్ధ పర్యావరణ ఉద్యమకారులలో ఒకరు. నోబెల్ శాంతి బహుమతి పొందిన మొదటి ఆఫ్రికన్ మహిళ. మొక్కలు నాటే పనిని ఉద్యమ స్థాయిలో చేపట్టింది. మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు ఎంతో మంది మహిళకు ఉపాధి లభించింది. మాథాయ్ చేసిన పర్యావరణ ఉద్యమ కార్యక్రమాలు ఎన్నో ఆఫ్రికన్ దేశాలకు స్ఫూర్తిని ఇచ్చాయి.



పర్యావరణానికి మేలు చేయడానికి చిన్న చిన్న అడుగులు కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతాయి. రోజువారీగా మన ఇళ్లలో... గిన్నెలు శుభ్రం చేయడానికి, బట్టలు ఉతకడానికి, ఫ్లోర్ తుడవడానికి, వాష్ రూమ్‌లు, గాజు పరికరాలు శుభ్రం చేయడానికి... ఉపయోగించే క్లీనర్స్ సువాసన రావడానికి ఎయిర్ ఫ్రెషనర్స్.. అంటూ రకరకాల రసాయన ఉత్పత్తులను వాడుతుంటాం. శుభ్రత మాట ఎలా ఉన్నా ఇవన్నీ పర్యావరణానికి హానిచేసేవే ఉంటాయి. వ్యర్థాల నుంచి తిరిగి ఉపయోగించేలా వస్తువుల తయారీ ఎంత ముఖ్యమో, ఇంటి శుభ్రతలో రసాయనాలు లేని ఉత్పత్తుల వాడకమూ అంతే ముఖ్యం.

...ఇంటి నుంచే మొదలు

ఆల్ పర్పస్ క్లీనర్స్...



దినచర్యలో భాగంగా వంటగది, బాత్రూమ్.. ఇంటిలోని ప్రతి భాగాన్ని శుభ్రం చేయడానికి పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించడంపై దృష్టి పెట్టాలి.

● వెనిగర్‌లో బాక్టీరియా నశింపజేసే గుణం ఉంటుంది. కిచెన్, గ్లాస్, బాత్‌రూమ్ క్లీనర్ గానూ పనిచేస్తుంది.



● వంటలలో వాడే బేకింగ్ సోడాను ఇంటి శుభ్రతలోనూ వాడచ్చు. మరకలు తొలగించడానికి, దుర్వాసన పోగొట్టడానికి నీటిలో కలిపి ఉపయోగించవచ్చు.

● నిమ్మరసంలో యాసిడ్ గుణం ఉండటం వల్ల మరకలను తొలగించడంలో సహాయపడుతుంది. కూరగాయలు కట్ చేసే బోర్డ్స్, మెటల్ పాలిష్ రిమూవర్‌కి నిమ్మరసాన్ని ఉపయోగించవచ్చు.

● ఇంట్లో మంచి పరిమళాలు రావడానికి సుగంధనూనెలను ఉపయోగించవచ్చు.



ఈ నూనెలలో యాంటీబాక్టీరియల్ గుణాలు కూడా ఉంటాయి

● ఫ్లోర్ క్లీనర్‌గా 5 లీటర్ల నీటిలో అర కప్పు వెనిగర్ + స్పూన్ బేకింగ్ సోడా + కొన్ని చుక్కల ట్రీ ట్రీ ఆయిల్ కలిపి ఫ్లోర్‌ను తుడవాలి. ఫ్లోర్‌పై ఉన్న మరకలు, బాక్టీరియా శుభ్రపడుతుంది.

● ఆల్ పర్పస్ క్లీనర్‌ని ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. కప్పు వెనిగర్ + కప్పు నీరు + 10 చుక్కల నిమ్మ నూనె స్ప్రే బాటిల్‌లో కలిపి, గ్లాస్, కిచెన్ కౌంటర్‌లపై స్ప్రే చేసి, తుడవాలి. బాక్టీరియా దరిచేరదు. చక్కగా శుభ్రపడతాయి.

సొంతంగా క్లీనింగ్ ప్రొడక్ట్స్



గిన్నెలు కడగడానికి లిక్విడ్ డిష్ వాషర్‌కి పీకాకాయ, కుంకుడుకాయ పొడి, లెమన్‌పీల్ పొడర్, ఉప్పు, బూడిద కలిపి మిశ్రమం తయారుచేసి, దానినే ఉపయోగిస్తాను. ఆరెంజ్ పీల్, నీళ్లు, బెల్లం కలిపి ఒక పాత్రలో పోసి 3–4 నెలల పాటు అలాగే ఉంచుతాను. ప్రతి నాలుగైదు రోజులకు ఒకసారి స్పూన్‌తో కలుపుతాను. ఆ మిశ్రమాన్ని కొద్దిగా నీళ్లలో కలిపి, ఫ్లోర్ తుడవడానికి ఉపయోగిస్తాను. అలాగే, వాషింగ్ మెషిన్ లిక్విడ్, బాత్రూమ్ క్లీనింగ్ లిక్విడ్‌కి కుంకుడు కాయల నుంచి రసం తీసి ఉపయోగిస్తాను. ఒంటి శుభ్రతలోనూ సహజ ఉత్పత్తులనే ఉపయోగిస్తాను. దుస్తులకు డై చేయడంలో సహజసిద్ధమైన పద్ధతులనే ఎంచుకుంటాను. వీటి తయారీకి కొంత సమయం పడుతుంది. కానీ, పిల్లల ఆరోగ్యానికి మేలు చేసే పద్ధతులను వాళ్లు దోగాడటం నుంచి ఉపయోగిస్తున్నాను. సాఫ్ట్‌వేర్ జాబ్ నుంచి ఎకో ప్రింటింగ్ వైపుకు నా ఆలోచనను మార్చుకున్నది కూడా పర్యావరణ హిత ఉత్పత్తుల తయారీలో భాగం అవ్వడం కోసమే.

- సవిత అలంపల్లి, ఎకో ప్రింటర్, కిస్మత్‌పుర, హైదరాబాద్



ఆత్మీయ నేస్తం

పర్యావరణ ముప్పుకు చెక్ పెట్టే అతి పెద్ద రక్షణ 'చేతి సంచి. యూజ్ అండ్ త్రో పాలిథిన్ కవర్ల వాడకాన్ని తగ్గించడానికి క్లాత్‌తో లేదా జ్యూట్‌తో చేసిన సంచులను ఉపయోగించవచ్చు.

● స్ఫూర్తి

అమెరికా టు ముంబై

ఎక్కడ ఉండాలో తెలియదు, ఏమి చేయాలో తెలియదు. ఇండియా అంటే మాత్రం గుండెల నిండా అభిమానం. తట్టాబుట్టా సర్దుకొని ముంబైలో ల్యాండ్ అయింది ఎలిజా కరాజ, ఉద్యోగం వెదుక్కుంటూ ఇండియా నుంచి అమెరికాకు వెళ్లడం అనేది సాధారణం. 19 సంవత్సరాల ఎలిజా కరాజ మాత్రం అమెరికా నుంచి ఇండియాకు వచ్చింది. షికాగోలో పుట్టి పెరిగిన ఈ సిరియన్–అమెరికన్ ఆర్టిస్ట్ ముంబైలోని ఒక స్కూలులో ఆర్ట్ టీచర్‌గా చేరింది. ఆమె ఉద్యోగంలో చేరేనాటికి ముంబై గురించి బొత్తిగా తెలియదు. తన జీతం గురించి కూడా పట్టించుకోలేదు.

ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాది మంది ఫాలోవర్‌లు ఉన్న ఎలిజా కరాజ ఆర్టిస్ట్, స్టోరీ టెల్లర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది.



కట్ చేస్తే....

ఎలిజా కరాజ ముంబైకి వచ్చి పది సంవత్సరాలు అవుతుంది. ముంబై ఇప్పుడు తన సొంత ఇల్లు. హిందీ చాలా బాగా మాట్లాడుతుంది. ముంబైతో పది సంవత్సరాల అనుభవాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకుంది.

'హరకాత్' ఫ్యాషన్ లేబుల్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్‌లు ఉన్న ఎలిజా కరాజ ఆర్టిస్ట్, స్టోరీ టెల్లర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది.



క్వింటాల్ పత్తి రూ.7,500

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ పత్తి రూ.7,500 పలికింది. క్రయ విక్రయాలను ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి రాజా పర్యవేక్షించారు.



ధ్రువీకరణ ఉంటేనే దుకాణం

ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం ప్రతీ డీలర్ వ్యవసాయశాఖ నుంచి డీఏఈఎస్ఐ డిప్లొమా కోర్సు ధ్రువీకరణ పత్రం పొందాల్సిందేనని స్పష్టం చేసింది. 12లో▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

పరిషత్ సమరానికి సిద్ధం!

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కసరత్తు

- చర్యలు ప్రారంభించిన ఆయా జిల్లాల అధికారులు
- చకచకా ఓటర్ల తుది జాబితా, మార్పులు– చేర్పులు
- సిద్ధమవుతున్న పోలింగ్ స్టేషన్ల రూట్‌మ్యాప్‌లు
- ఈనెల 15 లేదా నెలాఖరున నోటిఫికేషన్ ?

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇటీవల పదవీకాలం ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో తిరిగి ఎన్నికలు నిర్వహించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు కసరత్తు ప్రారంభించారు. లోకల్‌బాడీ ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇటీవల సంకేతాలు వెలువడిన దరిమిలా.. ఎన్నికల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం. ఈమేరకు కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని జెడ్పీ సిబ్బంది ఇదే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం ఓటర్ల తుది జాబితాను మే 30వ తేదీన హైదరాబాద్‌కు



ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు

జిల్లా	ఎంపీటీసీ స్థానాలు	జెడ్పీటీసీ స్థానాలు
కరీంనగర్	170	15
జగిత్యాల	216	20
పెద్దపల్లి	140	13
రాజన్నసిరిసిల్ల	123	12
మొత్తం	649	60

పంపారు. ఇది పంపే ముందు.. ఇటీవల 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లను చేర్చడం విశేషం. ఆ తరువాత అందులో కొన్ని సవరణలు చేసి తిరిగి 31వ తేదీన మరోసారి ఓటర్ల జాబితాను హైదరాబాద్‌కు పంపారు.

జోరుగా ఏర్పాట్లు..

ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారని సమాచారం. ఈ నెల15న లేదా నెలాఖరులో నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఆ లోపు జిల్లా అధికారులు పూర్తిగా సంసిద్ధులు కావాలన్న ఆలోచనలో భాగంగానే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల ఖరారు చేశారు. పోలింగ్ స్టేషన్ల రూట్ మ్యాపింగ్ కూడా ఇప్పటికే సిద్ధం చేశారు. అదే సమయంలో అసెంబ్లీ నియోజకవర్గాలలోని పోలింగ్ స్టేషన్లను ఎంపీటీసీ, జెడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాలకు అనుగుణంగా సర్దుబాటు చేసే ప్రక్రియ కూడా దాదాపుగా కొలిక్కి వచ్చింది. ఈ ప్రక్రియపై వారాంతానికి స్పష్టత రానుంది. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల జెడ్పీ కార్యాలయ సిబ్బంది ఇదే పనిలో తలమునకలయ్యారు. ఈనెలలో ఏక్షణమైనా ఎన్నికలు జరుగవచ్చన్న ప్రభుత్వ ఆదేశాలతో అంతా సిద్ధమవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజకీయ నాయకులు సైతం ఉత్సాహంగా ఉన్నారు. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారంతా ఇక రంగంలోకి దిగేందుకు సిద్ధమతున్నారు.

సకాలంలో సాగు.. లాభాలు బాగు

- పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు
- అందరికీ కేంద్ర, రాష్ట్రాల పెట్టుబడి సాయం

'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

కరీంనగర్ అర్బన్: సకాలంలో సాగుతో అన్నదాతలు ఆదాయం గడించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) భాగ్యలక్ష్మి అన్నారు. నూతన సాంకేతిక విధానాలను పాటిస్తూ సాగుచేస్తే మంచి ఫలితాలుంటాయని వివరించారు. సేంద్రియ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయంతో పర్యావరణానికి మేలు చేసినవారవుతారని పేర్కొన్నారు. సీజన్‌కు ముందే పచ్చిరొట్ట ఎరువులు వాడటంతో భూసారం పెరుగుతుందని, అవసరమైన మేరకు విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ రంగ సమస్యలు.. ప్రభుత్వపర సాయంపై బుధవారం 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. రైతులు తమ సందేహాలను వివరించగా డీఏవో భాగ్యలక్ష్మి నివృత్తి చేశారు.



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

ప్రైవేట్ నర్సరీల్లో మిర్చినారు కొనుగోలు చేసి నాటితే కాత రావడం లేదు. ఏ రకం విత్తనాలు కొనుగోలు చేయాలి?

– పొద్దుటూరి వీరయ్య, జమ్మికుంట మాచన్‌పల్లి

డీఏవో: అధీకృత డీలర్ నుంచే మిర్చి విత్తనాలు కొనుగోలు చేయాలి. ఏ రకం విత్తనం నాటాలి? ఏ వెరైటీస్ అన్నది సమీప ఉద్యాన అధికారిని సంప్రదించండి.

ఎంటీయూ1010కు బదులు వేరే వెరైటీస్ ఉన్నాయా?

– జగదీశ్వర్‌రెడ్డి, వీణవంక

డీఏవో: ఎంటీయూ 1010 దిగుబడి బాగానే ఉంటుంది. కేఎన్ఎం118, జేజీఎల్ 24423 రకాలు అందుబాటులో ఉన్నాయి. ఐఆర్64 కూడా సాగు చేసుకోవచ్చు.

కల్లాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వపరంగా సాయం చేస్తున్నారా? విధి విధానాలు ఏంటి?

– రమణారెడ్డి, గన్నేరువరం, జీవన్, మానకొండూరు, రమేశ్, సైదాపూర్

డీఏవో: రైతులు పండించే పంట వృథా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కల్లాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఉపాధి హామీ పనుల్లో వీటిని నిర్మించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ కాగా ఇతర సామాజిక వర్గాలకు 90 శాతం రాయితీ ఇస్తారు. స్థానిక ఏఈవోకు దరఖాస్తు చేయాలి.

ఏటా నకిలీ విత్తనాల బెడద ఉంటోంది. వ్యాపారులపై పీడీ యాక్ట్ అమలు చేయండి.

– భాస్కర్‌రెడ్డి, అంజిబాబు, గంగాధర, శ్రీనివాస్, చొప్పదండి

డీఏవో: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గతంలో కేసులు నమోదు చేశాం. నకిలీ విత్తనాలను కట్టడి చేయడంతో పాటు దుకాణాలపై నిఘాను తీవ్రతరం చేశాం.

మహిళా రైతులకు యంత్రాలు ఇస్తామని దరఖాస్తులు తీసుకున్నారు.. వాటి ఊసే లేదు?

– వెంకటేశ్వర్లు, పోరండ్ల, మనోజ్, జమ్మికుంట

డీఏవో: ప్రభుత్వ ఆదేశాల క్రమంలో మార్చి నెలలోనే దరఖాస్తుల స్వీకరించారు. ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి తీసుకున్న అర్జీలకు నిధులను బట్టి యంత్రాలు ఇస్తాం.

యాసంగిలో కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. పరిహారం మాత్రం రాలేదు.?

డీఏవో: జిల్లాకు రూ.14 లక్షలు వచ్చాయి. నష్టపోయిన రైతులను గుర్తించాం. త్వరలోనే పరిహారం అందుతుంది.

జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడండి

– కొమురయ్య, నుస్తులాపూర్, నర్సింహరెడ్డి, చాకుంట, కొండయ్య, గంగాధర

డీఏవో: జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలను అందుబాటులో ఉంచాం. అవసరమైన విత్తనాలను రాయితీపై విత్తనాభివృద్ధి సంస్థ అందజేస్తుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కూడా ఇస్తున్నాం.

రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు. రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్నాం కానీ.. వడ్డీతో కలిపి 2 లక్షలు దాటింది. మాకు మాఫీ వర్తిస్తుందా.. లేదా?

– ప్రసాద్, కోరపల్లి, రాజయ్య, కొత్తగట్టు, చంద్రయ్య, రేకుర్తి, రాజిరెడ్డి, షానగర్

డీఏవో: రూ.2 లక్షల వరకు రుణాలున్నవారికి రుణ మాఫీ జరిగింది. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షలు దాటిన వారి విషయంలో స్పష్టత లేదు. అర్హులైన వారికి రుణమాఫీ వర్తిస్తుంది.

చిరు ధాన్యాలకు మద్దతు ధర ఉంటుందా? ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా?

– సయ్యద్, ఎలగందుల, భరద్వాజ, రాంపూర్, రోహన్‌రెడ్డి, వీణవంక, మల్లేశం, ఇందుర్తి, మహేందర్‌రెడ్డి, ఇల్లందకుంట.

డీఏవో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటించాయి. ఆమేరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాం. వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు ప్రభుత్వపరంగా కొనుగోళ్లు జరిగాయి. చిరుధాన్యాలు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తే ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నప్పటికీ ధరలు గతానికి ప్రస్తుతానికి పోలిస్తే రెట్టింపు అయ్యాయి. ఇదెక్కడి న్యాయం?

– కుమారస్వామి, తిమ్మాపూర్, రమణ, చిగురుమామిడి

డీఏవో: పచ్చిరొట్ట విత్తనాల ధర నిర్ణయం అనేది ప్రాక్యూర్‌మెంట్‌ను బట్టి ఆధారపడి ఉంటుంది. ఆమేరకే ప్రభుత్వం విత్తన ధరను నిర్ణయిస్తుంది.

సేంద్రియ సాగుకు ప్రభుత్వం ఏమైనా ప్రోత్సాహమిస్తుందా? గిట్టుబాటు ధర కల్పించే ఆలోచన ఉందా?

– మల్లయ్య, కొత్తపల్లి, ఉమ్మారెడ్డి, దుర్శేడ్

డీఏవో: మండలానికో గ్రామం చొప్పున సేంద్రియ సాగులో పంటలు పండించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని నిర్ణయించింది. సాగు నుంచి మార్కెటింగ్ వరకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది. సేంద్రియ సాగుతో మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ఎంతో ఉపయుక్తం.

దుకాణాల్లో స్టాక్ బోర్డు ప్రదర్శించడం లేదు. ఎంఆర్పీకి మించి విక్రయిస్తున్నారు?

–రాజయ్య,కరీంనగర్, మహేందర్‌రెడ్డి, తీగలగుట్టపల్లి

డీఏవో: ఏ దుకాణంలో నిబంధనలు పాటించడం లేదో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నాకు గానీ.. మండల వ్యవసాయ అధికారి లేదా ఏఈవోకు కూడా ఫిర్యాదు చేయొచ్చు. ఇప్పటికే విత్తన, ఎరువుల దుకాణాలు, గోడౌన్లను పరిశీలించాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

రైతుబంధు, కిసాన్‌సమ్మాన్ నిధి పెట్టుబడి సాయం అందలేదు. నాలుగెకరాలకుపైగా ఉన్న రైతులకు పథకాన్ని వర్తింపజేయడం లేదా.? ఎప్పటివరకు అందిస్తారు? పంటలు సాగు చేయాలంటే పెట్టుబడికి ఇబ్బందిగా ఉంది?

– కల్లెపల్లి జంపయ్య, కోరపల్లి, రాజేందర్, చొప్పదండి, మనోహర్, అల్గునూరు, తిమ్మాపూర్, మల్లయ్య, శంకరపట్నం, మహేశ్, చిగురుమామిడి, బక్కన్న, కాట్రపల్లి.

డీఏవో: రైతుబంధు డబ్బులు అందరికి వస్తాయి. ఒకవేళ రాలేదంటే రెవెన్యూశాఖ ధరణి పోర్టల్‌లో మార్పులు జరిగి ఉండవచ్చు. రైతుకు సంబంధించిన సర్వే నంబర్‌లో ఆన్‌సైన్ చేయడం, కరెక్షన్ వంటివి చేస్తే సైట్‌లో కనిపించవు. కాబట్టి వారికి రైతుబంధు పడటంలేదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అర్హులైన అందరి ఖాతాల్లో డబ్బులు ఖాతాల్లో జమఅవుతాయి. రైతుబంధుకు ఎటువంటి లిమిటేషన్ లేదు.

న్యూస్‌రీల్

మానవతా దృక్పథంతో సేవలందించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



నవజాత శిశువును ఆప్యాయంగా పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, వార్డులు, ఓపీ విభాగం, నవజాత శిశువుల వార్డును పరిశీలించి శిశువుల సమస్యల గురించి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యత, సాధారణ ప్రసవం ప్రాధాన్యం వివరించారు. అనంతరం ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది ఖాళీల వివరాలు సమర్పించాలన్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ క్యాంపును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మెప్మా, ఐకేపీ సిబ్బంది ద్వారా ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షల పట్ల మహిళలకు అవగాహన కల్పించి క్యాంపును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు రూ.50 వేలు ఖరీదు చేసే 47 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్న విషయం మహిళల్లోకి తీసుకెళ్లాలన్నారు. అంతకుముందు ఆస్పత్రి ఆవరణలో కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, ఆర్ఎంవో రమేశ్ పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలోని టేకుర్తి, కొత్తపల్లి మండలంలోని ఎలగందల్, వీణవంక మండలంలోని గన్ముక్ల మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లోఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిన మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీరాంమొండయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో ప్రభుత్వ ఆమోదం పొందిన ఇనిస్టిట్యూషన్స్‌లో ఏఎన్ఎం శిక్షణ పొందిన కరీంనగర్ జిల్లావాసులు అర్హులన్నారు. ఆయా మండలాల వారికి తొలిప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు కరీంనగర్‌లోని జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో బయోడేటాను సమర్పించాలని ఆయన సూచించారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు 11 కేవీ రామచంద్రాపూర్ ఫీడర్‌లో ఏవోఎస్ కాలనీ, సప్తగిరికాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.లావణ్య తెలిపారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్తపల్లి (హెచ్), రాణిపూర్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ జి.రాజు వివరించారు.

పునర్విభజన గజిబిజి

- ఇంటి నంబర్లతో గందరగోళం
- నేటి నుంచి అభ్యంతరాలు స్వీకరణ

కరీంనగర్ కార్పొరేషన్: 'కొత్తగా ఏర్పడిన 5వ డివిజన్‌లో 5–7–1 నుంచి 5–7–ముగింపు వరకు ఇండ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అంటే ఆ సీరీస్‌లో ఉన్న ఇంటి నంబర్లన్ని (5–7–1 నుంచి 5–7–1163 వరకు) 5వ డివిజన్‌లోనే ఉండాలి. కానీ.. మళ్లీ 23వ డివిజన్‌లో 5–7–501 నుంచి 5–7–600 వరకు ఇండ్లను చేర్చినట్లు పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డుకాలనీలోని 5–7– సీరిస్ మొత్తం 5వ డివిజన్‌లో ఉన్నట్లు పేర్కొని, మళ్లీ అదే సిరీస్‌లోని 5–7–501 నుంచి 5–7–600 వరకు ఇండ్లను 23వ డివిజన్‌లో చేర్చడంతో ఇందులో ఏది సరైందో అధికారులు వెల్లడించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.'

'61,62,63 డివిజన్‌లకు సంబంధించి పేర్కొన్న ఓట్లకు వాస్తవ ఓట్లకు తేడా ఉన్నట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 61వ డివిజన్‌లో జ్యోతినగర్, చైతన్యపురి, భాగ్యనగర్‌లలోని 1–10–837 నుంచి 2–10–1831 ఇండ్లకు చెందిన 5,320 ఓటున్నట్లుగా పేర్కొన్నారు. కానీ.. ఈ సీరిస్‌లో అపార్ట్‌మెంట్లు ఎక్కువగా ఉన్నాయని, ఓట్లు కూడా ఇంతకన్నా అధికంగా ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.. అలాగే 63వ డివిజన్‌లో 2–10–1832 నుంచి 2–10– 2142/ఏ ఇండ్లకు చెందిన 5,305 ఉన్నట్లు పేర్కొనగా, ఓట్లు అంతకన్నా తక్కువగా ఉన్నాయనే ప్రచారం ఉంది.'

నగరంలోని 66 డివిజన్‌ల పునర్విభజన గందరగోళంగా మారింది. 1 నుంచి 66 డివిజన్‌ల వరకు ఏ డివిజన్‌లో ఏ ఇండ్లున్నాయి, ఓట్లు ఎన్ని ఉన్నాయనే వివరాలతో బుధవారం డ్రాఫ్ట్ నోటీసు జారీ చేశారు. కాని శాస్త్రీయంగా కాకుండా, ఇష్టారీతిన,అవగాహన లేకుండా పునర్విభజనచేశారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కాగా... రెవెన్యూ బ్లాక్‌లు, భౌగోళిక హద్దులు(రెగ్యులర్ షేప్), ఈ ఏడాది జనవరి 6వ తేదీన పబ్లిష్ చేసిన ఓటర్ల జాబితా ఆధారంగా డివిజన్‌లను పునర్విభజన చేసినట్లు అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి అలా జరగలేదని విపక్ష నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గురువారం నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు.



డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను నగరపాలక సంస్థ కార్యాలయ బోర్డులో అతికిస్తున్న అధికారులు

ఇష్టారీతిన పునర్విభజన



నగరంలో చేపట్టిన డివిజన్‌ల పునర్విభజన ఇష్టారీతిన చేపట్టారు. ఐఏఎస్‌లను సైతం తప్పుదోవ పట్టించారు. జాబితాలో పేర్కొన్న ఇండ్లకు, ఓటర్లకు ఎక్కడా పొంతన లేదు. ఆర్ అండ్ బీ రోడ్లకు ఇరువైపులా ఒకే డివిజన్ ఉండరాదని నిబంధన ఉన్నా... పట్టించుకోకుండా రోడ్డుకు రెండు వైపులా ఉన్న ప్రాంతాలను కలిపి ఒకే డివిజన్ చేశారు. ఆర్ అండ్ బీ రోడ్లను ఎక్కడా హద్దులుగా తీసుకోలేదు. అసలు నగరపాలకసంస్థ పరిధిలో చూపించిన ఓట్లు కూడా సరైనవి కావు. క్షేత్రస్థాయిలో కాకుండా...హైదరాబాద్‌లో కంప్యూటర్‌లో డివిజన్‌లను పునర్విభజించారు. వెంటనే మళ్లీ డీలిమిటేషన్‌ను చేపట్టాలి.

– చల్ల హరిశంకర్, నగర అధ్యక్షుడు, బీఆర్ఎస్

బీఆర్ఎస్ తప్పులే కాంగ్రెస్ కొనసాగించింది



గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పులనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్‌ల పునర్విభజన కొనసాగించింది. కాంగ్రెస్, ఎంఐఎం మెజార్టీ స్థానాలు దక్కించుకొనేలా డీలిమిటేషన్‌ను అశాస్త్రీయంగా చేపట్టారు. డివిజన్‌లలో పేర్కొన్న ఇండ్లు, అందులో ఓట్లకు సంబంధం లేకుండా పోయాయి. క్షేత్రస్థాయిలో మ్యాప్ పరంగా, నిబంధనలకు అనుగుణంగా చేయాల్సిన డీలిమిటేషన్‌ను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తప్పుదోవ పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. నిబంధనల ప్రకారం శాస్త్రీయంగా డీలిమిటేషన్‌ను తిరిగి చేపట్టాలి.

– గుగ్గిళ్లపు రమేశ్, మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ నేత

అధికారులకే స్వేచ్ఛ ఇచ్చాం



డివిజన్‌ల పునర్విభజన ఎక్కడా జోక్యం చేసుకోలేదు. అధికారులకే పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. గతంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చి, ఇష్టారీతిన డీలిమిటేషన్ చేసిన విషయం అందరికి తెలిసిందే. కాని మేం అలాంటి తప్పులకు అవకాశం ఇవ్వలేదు. అధికారులపై ఎలాంటి ఒత్తిడి తేలేదు. ఒకవేళ ఏ డివిజన్‌లోనైనా పొరపాట్లు దొర్లితే, ఆధారాలతో అభ్యంతరాలు ఇస్తే అధికారులు వాటిని సరిచేస్తారు.

– కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు

రేపటి నుంచి బడిబాట

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి
- విద్యాశాఖ సమాయత్తం

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు	425
ప్రాథమికోన్నత పాఠశాలలు	75
ఉన్నత పాఠశాలలు	150
మొత్తం పాఠశాలలు	650
మొత్తం విద్యార్థులు	42,322

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా ఈనెల 6నుంచి 19వ తేదీ వరకు 'బడిబాట' నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు డీఈవో శ్రీరామ్ మొండయ్య వెల్లడించారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం పేరిట జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేసి ఇది వరకే కలెక్టర్ పమేలా సత్పతి నేతృత్వంలో సమావేశాలు నిర్వహించారు.

జిల్లా యంత్రాంగం సన్నద్ధం

కలెక్టర్ నేతృత్వంలో డీఈవో, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో జిల్లాస్థాయిలో కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై, కెపాసిటీ బిల్డింగ్ పేరిట జిల్లాలోని వివిధ కేటగిరీల ఉపాధ్యాయులకు ఇటీవల మూడు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల ప్రారంభం లోపు ఉచిత దుస్తులు, పుస్తకాలు అందించడంతో పాటు విద్యార్థుల నమోదును పెంచేందుకు కలెక్టర్ క్షేత్రస్థాయిలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. సామాజిక సేవాసంస్థలు, ఎన్జీవోలు తదితర వర్గాలను సమన్వయపరిచి బడిబాటను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

మండలస్థాయిలో

మండల పరిషత్ అధికారులు, ఎస్సైలు, ఇతర వర్గాల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఏ రోజు ఏం చేయాలనే కార్యాచరణను ఎంఈవో రూపొందిస్తారు. గ్రామస్థాయిలో కమిటీలు, బడిబాటపై అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తారు. స్థానిక నేతల భాగస్వామ్యంతో బడిబాటలో గుర్తించిన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ చేపడతారు.



బడిబాట కోసం ఏర్పాటు చేసిన ప్రచార రథం

షెడ్యూల్ ఇదీ..

- జూన్ 6న ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో గ్రామసభ
- 07న ఉపాధ్యాయుల ఇంటింటి సందర్శన, బడీడు పిల్లలను గుర్తించడం
- 08,09,10న కరపత్రాలతో ఇంటింటి ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన. బడిమానేసిన పిల్లలను గుర్తించి చేర్పించడం. ప్రత్యేకావసరాల పిల్లలను భవితకేంద్రాల్లో చేర్పించడం
- 11న నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష
- 12న అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించడం. పిల్లలకు పాఠ్య, రాత పుస్తకాల పంపిణీ, ఉచిత దుస్తుల అందజేత
- 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ
- 16న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల దినోత్సవం. తరగతి గదుల్లో విషయాల వారీగా అభ్యసనా సామర్థ్యాల గోడప్రతుల ప్రదర్శన. పిల్లలు రూపొందించిన చార్టులతో గదుల అలంకరణ. చదవడం, గణిత సంబంధిత వాటిపై క్విజ్ పోటీలు
- 17న సమీకృత విద్య, బాలికా విద్యా దినోత్సవం నిర్వహణ. బాలికా వివాహాలు, చిన్నారులపై వేధింపులను అరికట్టేందుకు ప్రతిజ్ఞ
- 18న తల్లిదండ్రులు, పోషకులు, గ్రామస్తులు, వార్డు సభ్యులను ఆహ్వానించి తరగతి గదుల్లో చేపట్టిన డిజిటలీకరణ, సౌకర్యాలు చూపించడం, మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని పిల్లలకు వివరించడం
- 19న బడిబాట ముగింపు సందర్భంగా పిల్లలకు క్విజ్ పోటీలు

విజయవంతం చేస్తాం



కలెక్టర్ ఆధ్వర్యంలో అన్నిశాఖలు, అన్నివర్గాల ప్రజల సమన్వయంతో బడిబాటను విజయవంతం చేసేందుకు కృషి చేస్తాం. ప్రణాళికను పాటిస్తూ, ఎక్కువ మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా పనిచేస్తాం. బడిబాటను విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

– శ్రీరామ్ మొండయ్య, డీఈవో

క్లుప్తంగా

'రియల్' వ్యాపారంలో నష్టాలు

- వ్యాపారి ఆత్మహత్య


సతీశ్‌కుమార్(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): రియల్ ఎస్టేట్ వ్యాపారం సరిగా సాగక నష్టాలు చవిచూసిన తెలుకుంట చెందిన రియల్టర్ కోడూరి సతీశ్‌కుమార్(38) ఆత్మహత్య చేసుకున్నాడు. బతుకు దెరువు నిమిత్తం కరీంనగర్ వచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా నష్టాలు రావడంతో చొప్పదండిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రారంభించాడు. అదికూడా కలిసి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై సనత్ కుమార్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి


రమేశ్(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాట్నపల్లి శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కూకట్ల రమేశ్(40) పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై ఎలిగేడు మండలం శివపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కాట్నపల్లి – శివపల్లి మధ్య అదుపు తప్పి బోల్తాపడ్డాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిచారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం


రాజవ్వ(ఫైల్)

పెగడపల్లి: మండలంలోని నర్సింహునిపేట గ్రామంలో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొని మ్యాన రాజవ్వ(75) మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్యాలకు చెందిన మ్యాన రాజవ్వ రెండ్రోజుల క్రితం తన తమ్ముడు అడెపు భూమయ్య ఇంటికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో మల్యాల వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చి బస్సు కోసం వేచి చూస్తోంది. కరీంనగర్ నుంచి పెగడపల్లి వెళ్లే బస్సు వచ్చి ఆగింది. రాజవ్వ బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా గమనించని డ్రైవర్ ముందుకు పోనిచ్చాడు. దీంతో రాజవ్వ బస్సు టైర్ల కింద పడి చనిపోయింది. బస్సు డ్రైవర్ కనుకయ్య నిర్లక్ష్యంతో తన తల్లి మృతి చెందిందని రాజవ్వ కొడుకు గంగాధర్ ఫిర్యాదుతో ఎస్‌హెచ్‌వో రవీందర్ కేసు నమోదు చేశారు.

డాక్టర్‌పై సస్పెన్షన్ వేటు

మంథని: పట్టణంలోని సామాజిక ఆస్పత్రిలో మత్తుమందు ప్రత్యేక వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌రావు.. ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం పేషెంట్ వద్ద లంచం డిమాండ్ చేసినందుకు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రచ్చపల్లి గ్రామానికి చెందిన పేషంట్ కొడాలి భాగ్య నుంచి ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం డాక్టర్ రూ.5వేలు లంచం డిమాండ్ చేస్తూ దొరికిపోయారని, ఆ డాక్టర్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదులు నమోదైన నేపథ్యంలో సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నాడు వైభవం.. నేడు కళావిహీనం

- కళ తప్పిన కాలనీలు.. శిథిలావస్థలో క్వార్టర్లు
- అస్తిత్వం కోల్పోయిన రామగుండం బీ థర్మల్
- మూతపడి ఏడాది.. అనుబంధం విస్మరించని ప్రజలు


గతేడాది విద్యుత్ వెలుగుల్లో..


మూతపడిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం



విద్యుత్ ఉత్పత్తిలో రికార్డు సాధించిన సమయంలో...

రామగుండం: పట్టణంలోని బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం మూతపడి ఏడాది పూర్తయింది. దానితో అనుబంధం కలిగి ఉన్న ప్రజలు ఆ భావోద్వేగాల నుంచి బయటపడడం లేదు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో పనిచేసే సుమారు 300 మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 70 మందిని యాదాద్రికి బదిలీ అయ్యారు. మరో రెండురోజుల్లో ఇంకో 50 మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. మిగతా ఉద్యోగులు.. ప్లాంట్ కూల్చివేత వరకూ ఇక్కడే ఉంటారని సమాచారం.

50ఏళ్ల క్రితమే..

సుమారు 50 ఏళ్ల క్రితమే ఏ-పవర్ ప్లాంట్ ప్రారంభించి.. అనతికాలంలోనే మూతపడగా అప్పటికే కొంత జనాభా తగ్గిపోయింది. ఇప్పుడు బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేతతో రామగుండం అస్తిత్వం పూర్తిగా కోల్పోయినట్లయ్యింది. దీనిప్రభావం ప్రత్యక్షంగా బ్యాంకు, కార్మికులు, కాంట్రాక్టర్లపై పడగా, పరోక్షంగా స్కూళ్లు, చిరు వ్యాపారులపై పడింది. ఉద్యోగులు తమ క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లిపోతుండడంతో అప్పటికే శిథిలావస్థకు చేరిన క్వార్టర్లు, అపరిశుభ్రంగా, చిత్తడిగా తయారయ్యాయి.


దేమ లక్ష్మీనారాయణ

➡ బీ థర్మల్ ఉద్యోగుల్లో అత్యధికులకు నా షాపులోనే ఖాతాలు ఉండేవి. ఇప్పటికే బదిలీపై వెళ్లిన 70 మంది ఉద్యోగుల్లో 40 మంది ఖాతాలు కోల్పోయా. మరోబదిలీ జాబితా వస్తే నా షాపులో గిరాకీ పూర్తిగా తగ్గిపోతుంది. మరోటి వచ్చేంత వరకు నా పరిస్థితి ఎలా ఉంటుందో.. భవిష్యత్‌ను తలుచుకుంటేనే భయంగా ఉందని ప్రముఖ కిరాణా వ్యాపారి దేమ లక్ష్మీనారాయణ ఆవేదన చెందుతున్నాడు.


సిరికొండ కోటి

➡ విద్యుత్ ప్లాంట్‌లో ఇరవై ఏళ్ల పాటు షట్‌డౌన్ తదితర ఓవర్‌హాలింగ్ పనులు చేసేవాడిని. సాంకేతిక పరిజ్ఞానం, సమస్యల సాధన పరిష్కారంపై పట్టు పెరగడంతో నామినేషన్ పద్ధతిపై చిన్నకాంట్రాక్టు పనులు తీసుకున్నా. ఇలా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించేవాడిని. ఇప్పుడు ప్లాంట్ మూతపడడంతో భరోసా కోల్పోయినట్లయ్యిందని సిరికొండ కోటి ఆవేదన చెందాడు.


ఆముల శ్రీనివాస్

➡ సుదీర్ఘకాలంగా పనులు చేయడంతో అధికారులతో అన్యోన్యత ఏర్పడింది. 25 ఏళ్లుగా బీ-థర్మల్‌లో పలు కాంట్రాక్టులు పొందిన. కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు నేను కూడా ఉపాధి పొందేవాడిని. సామర్థ్యానికి బీ-థర్మల్ సరిపోయేదని, ఇప్పుడు తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కాంట్రాక్టర్ ఆముల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు.


ఇరికిళ్ల రాజనర్సయ్య

➡ నేను ఇక్కడే పుట్టి ఇక్కడే ఉద్యోగం చేసి ఇక్కడే పదవీ విరమణ చేశా. ఐదు దశాబ్దాలపాటు పనిచేసే వారు, రిటైర్డ్ అయినవారితో బంధుత్వం ఏర్పడింది. ఆలయాలు, ఇళ్లలో జరిగే వేడుకలు, పర్వదినాల సందర్భంగా అందరం కలుసుకోవడం బాగుండేది. యాద్రాద్రికి బదిలీ అయినవారు కొందరు, ఉపాధి కోల్పోయి మరోచోటకు వెళ్లేవారు మరికొందరు.. బరువైన గుండెలతో వెళ్తుండడం చాలాబాధగా ఉందని రిటైర్డ్ ఉద్యోగి ఇరికిళ్ల రాజనర్సయ్య ఆవేదన చెందాడు.


ఎంఏ జావీద్

➡ బీ-థర్మల్ నడిచేటప్పుడు 300కుపైగా టీ విక్రయాలు జరిగేవి. ఇప్పుడు సగానికి పడిపోయాయి. మరి కొద్దిరోజుల్లో ఇంకొందరు ఉద్యోగులు బదిలీపై వెళ్తారని తెలిసింది. దీనిపై ఆధారపడ్డ మేమిద్దరం అన్నదమ్ములం.. మా ఉపాధి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని హోటల్ యజమాని ఎంఏ జావీద్ మనస్తాపం చెందాడు.

పూర్వ వైభవం తీసుకొస్తాం


మక్కాన్‌సింగ్ ఠాకూర్

బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మూతపడి అందరూ వెళ్తే.. నాకూ బాధగానే ఉంది. మా నాన్న కూడా రిటైర్ అయ్యాక ఎంతో బాధపడ్డాడు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే రామగుండానికి పూర్వవైభవం తీసుకొస్త. ఊరు పేరు నిలబెడుతా అన్నారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్.
– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

అనారోగ్యంతో రాజన్న కోడె మృతి

- వైద్యచికిత్సకు స్పందిస్తున్న కోడెలు
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

వేములవాడఅర్బన్: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్‌లోని గోశాలలో అనారోగ్యంతో బుధవారం ఒక కోడె మృతి చెందినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. రాజన్న గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలు వెటర్నరీ వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయన్నారు. కొన్ని కోడెలు ఆరోగ్యంగా మారాయన్నారు. అకాల వర్షాలు, అనారోగ్యం కారణంగా ఇప్పటి వరకు రాజన్న గోశాలలో 26 కోడెలు మృతి చెందినట్లు వివరించారు. గోశాలలో ఉన్న 1300 కోడెల్లో ప్రస్తుతం 14 కోడెలు అనారోగ్యంతో బాధపడుతున్నాయని, వీటికి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక ఒకరు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లో చేసిన అప్పు భయంతో మరొకరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు సిరిసిల్లలో బుధవారం విషాదం నింపాయి. పోలీసులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన అలువాల కనకయ్య(60) పాన్‌షాప్ నడిపేవాడు. ఇద్దరు బిడ్డలు, కొడుకు వివాహం చేశాడు. భార్యకు ఆరోగ్యం బాగా లేకుంటే చికిత్స చేయించాడు. అప్పులు పెరిగిపోవడంతో తీర్చే మార్గం కనిపించక ఈనెల 2వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతని గురించి ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. స్థానిక కార్గిల్‌లేక్ చెరువులో బుధవారం శవంగా తేలాడు. మృతుని కొడుకు మారుతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ లోన్‌యాప్ అప్పుతో..

జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన రాపెల్లి రామకృష్ణ(24) జల్సాలకు అలవాటుపడి ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌లో అప్పు చేశాడు. మంగళవారం అర్ధరాత్రి వరకు బయట తిరిగి ఇంటికొచ్చాడు. అందరూ పడుకున్న తర్వాత ఉరివేసుకున్నాడు. ఉదయం కుటుంబీకులు చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోన్‌యాప్‌లో రూ.35వేలు అప్పు ఉందని, వేధింపులతోనే చనిపోయినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. మృతుని తండ్రి రాపెల్లి లింగం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లారీడ్రైవర్ నిర్లక్ష్యం.. యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

- ఇండికేటర్లు వేయకుండానే నడిరోడ్డుపై నిలిపిన లారీ
- వెనుకనుంచి ఢీకొట్టిన కారు..
- మృతుడిది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని



ఐనవోలు(వరంగల్): మసకచీకటిలో.. నడిరోడ్డుపై ఇండికేటర్స్ వేయకుండా ఆగిఉన్న లారీని.. వెనుకనుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని వరంగల్–ఖమ్మం రహదారి పంథిని గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంనుంచి వరంగల్ వైపు సిమెంట్ బస్తాలతో వెళ్తున్న లారీని పంథిని గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నడిరోడ్డుపై ఆపిన డ్రైవర్ ఇండికేటర్స్ వేయకుండానే లారీ దిగి వెళ్లాడు. అదే సమయంలో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చింతకింది శివసాయి(29) తన పనుల నిమిత్తం సొంత కారులో ఖమ్మంనుంచి వరంగల్ వైపునకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పంథిని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ ఫోకస్‌కు దారి కనిపించకపోవడంతో ఇండికేటర్స్ వేయకుండా రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో శివసాయి తల, శరీర భాగాలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మృతుడికి ఇద్దరు అక్కలు, అమ్మ, నాన్న ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చాయ్‌తో.. ఆర్‌సీబీ విజయోత్సవ వేడుక

- రోజంతా ఉచితంగా అమృతతుల్యా చాయ్ అందజేత


చాయ్ అందజేస్తున్న అమృతతుల్యా సెంటర్ నిర్వాహకుడు రఘు

మల్యాల: ఐపీఎల్‌లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, విరాట్ కోహ్లీ వీరాభిమాని ఉచితంగా చాయ్ పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన జంగం రఘు మల్యాల అడ్డరోడ్డుపై అమృతతుల్య చాయ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 400 చాయ్‌లు ఉచితంగా అందజేసి, సంబురాలు చేసుకున్నాడు. రాష్ట్ర ప్రణాళిక బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, వారి వెంట ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు ఉచితచాయ్‌ని ఆస్వాదించారు.

ధ్రువీకరణ ఉంటేనే దుకాణం

- పురుగుమందులు, ఎరువుల డీలర్లకు తప్పనిసరి
- విడతల వారిగా శిక్షణకు ప్రభుత్వం ఆదేశం
- ఫెసిలిటేటర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ అర్బన్: దుకాణాల్లో విరామం లేకుండా గడిపే డీలర్లు తరగతి గదిలో కూర్చోవాల్సిందే.. ఇక విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు లెక్కలతో కుస్తీ పట్టే వారంతా నిపుణుల బోధనలను వినాలిసిందే.. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం ప్రతీ డీలర్ వ్యవసాయ శాఖ నుంచి డీఏఈఎస్‌ఐ డిప్లొమా కోర్సు ధ్రువీకరణ పత్రం పొందాల్సిందేనని స్పష్టం చేసింది. లేదంటే వారికి విక్రయాలు చేసే అవకాశం ఉండదు. రైతు శిక్షణ కేంద్రం నేతృత్వంలో డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నారు. డీలర్లు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని రైతు శిక్షణ కేంద్రం డీడీ ఛత్రునాయక్ వివరించారు.

48 వారాలు.. నిపుణులతో బోధన

డీలర్లకు ఏడాది పాటు వారంలో ఒక రోజు ప్రతీ ఆదివారం శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని కృషిభవన్‌లో ఇచ్చే శిక్షణకు డీడీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. దుక్కుల నుంచి విత్తనాలు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, పురుగు మందులు వాటి దుష్పరిణామాలు, భూసార పరీక్షలు.. ఫలితం ఆధారంగా వాటికి అందాల్సిన పోషకాలు వంటి సమగ్ర అంశాలను వివరించనున్నారు. మిగతా 8 వారాలు క్షేత్రస్థాయి శిక్షణ ఉంటుంది. 48 వారాలు జరిగిన కోర్సుపై పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతీ పరీక్షలో ఉత్తీర్ణులైతేనే ధ్రువీకరణ పత్రం ఇస్తారు. శిక్షణ సమయంలో భోజన వసతి కల్పిస్తారు.

ఒక్కో బ్యాచ్‌కు 40మంది డీలర్లు

డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ టు ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్‌ఐ) డిప్లొమా కోర్సుకు లైసెన్స్ పొందిన విత్తన, క్రిమిసంహారక, ఎరువుల విక్రయ డీలర్ల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుదారు తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణుడై ఉండాలి. గెజిటెడ్ అధికారి సంతకంతో ప్రతిని జత చేయాలి. ఎంపికైన అభ్యర్థులు రూ.14వేలు డీడీ చెల్లించి, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌కు 40 మందిని ఎంపిక చేస్తారు.

ఫెసిలిటేటర్ నియామకానికి దరఖాస్తు గడువు 18

ఇందుకు ఫెసిలిటేటర్‌ను నియమించేందుకు రైతు శిక్షణ కేంద్రం ప్రకటన విడుదల చేసింది. బీఎస్సీ(అగ్రికల్చర్) లేదా ఎంఎస్సీ అగ్రికల్చర్ చదివి వ్యవసాయ శాఖ లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లేదా కేవీకేలో అనుభవం ఉన్న వారిని ఫెసిలిటేటర్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీరికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 18 గడువు విధించింది.

ఆగ్రహించిన గ్రామస్తులు.. మట్టి లారీల అడ్డగింత


కాల్వశ్రీరాంపూర్‌లో లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు


పొత్కపల్లిలో గ్రామస్తుల నిరసన

- పెగడపల్లిలో వ్యక్తిని ఢీకొన్న లారీ
- డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- ఓదెల మండలం పొత్కపల్లిలోనూ నిరసనలు

కాల్వశ్రీరాంపూర్/ఓదెల(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్/ఓదెల మండలాల్లో చెరువు మట్టి తరలిస్తున్న లారీలను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఓవర్‌లోడ్ లారీలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. దుమ్ము, ధూళితో ఊపిరి ఆడటం లేదని తెలిపారు. దుమ్ము, ధూళి లేవకుండా నీటిని చల్లించాలని, లేకుంటే అడ్డుకుంటామని లారీ డ్రైవర్లను హెచ్చరించి వదిలిపెట్టారు. కాగా, పెగడపల్లిలో ఓ లారీ అతివేగంగా వెళ్లి టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టడంతో అదే గ్రామానికి చెందిన పత్తి రాజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఆగ్రహించిన గ్రామస్తులు కాల్వశ్రీరాంపూర్‌లో లారీని ఆపి డ్రైవరుకు దేహశుద్ధి చేశారు. అదేవిధంగా ఓదెల మండలం పొత్కపల్లిలో మట్టి లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇందుర్తి చెరువు నుంచి సుల్తానాబాద్‌కు మట్టి తరలిస్తున్న లారీలతో దుమ్ము, ధూళి లేచి ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆరోపించారు. దుమ్ము లేవకుండా రోడ్లపై ట్రాక్టర్‌తో నీళ్లు చల్లిస్తామని బాధ్యులు చెప్పడంతో ఆందోళనను విరమించారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్, గ్రామస్తులు ఆనందం, కిషన్‌షేట్, ఇరుకుల్ల శ్రీనివాస్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

నిర్వాసితులతో సమావేశం నిర్వహించాలి


మాట్లాడుతున్న అమర్, చిత్రంలో వ్యాపారులు

వేములవాడ: వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు చేపట్టే రోడ్ల విస్తరణలో 243 మంది నిర్వాసితులతో అధికారులు సమావేశం నిర్వహించిన తర్వాతనే పనులు చేపట్టాలనని అమర్ కోరారు. వేములవాడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అమర్ మాట్లాడారు. హైకోర్టు స్టే ఉన్నా అధికారులు, వ్యాపారులను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. భూసేకరణలో భాగంగా వాల్యువేషన్ సక్రమంగా చేయడం లేదన్నారు. గతంలోనే రెండు బైపాస్‌రోడ్లులకు స్థానిక వ్యాపారులు తమ భూములను ఇచ్చారన్నారు. ఇలాంటి తరుణంలో మరోసారి రోడ్డు విస్తరణ అవసరం లేదని సమావేశంలో తీర్మానించారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ నిర్వాసితులతో సమావేశం నిర్వహించాలని కోరారు.

అగ్రిమెంట్ పేరుతో సైబర్ మోసం

- రూ.5.40 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన ప్రవీణ్ టాటా జూడో అగ్రిమెంట్ పేరుతో సైబర్ నేరగాళ్ల మోసానికి గురయ్యాడు. ప్రవీణ్ టాటా జూడో ఏజెన్సీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. సైబర్ నేరగాళ్లు అతని వ్యక్తిగత వివరాలు సేకరించారు. దరఖాస్తు ఫీజు పేరుతో మొదట రూ.49,500, అగ్రిమెంట్ పేరుతో రూ.4.90 లక్షలు వసూలు చేశారు. అగ్రిమెంట్ చేయాలని ఎన్నిసార్లు కోరినా స్పందించకపోవడంతో బాధితుడు సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

చిట్‌ఫండ్ ఎదుట బాధితుల ఆందోళన



కరీంనగర్‌క్రైం: నగరంలోని ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్ మేనేజర్ తాను వేసిన చిట్టీ ఎత్తుకొని ప్రభుత్వ ఉద్యోగులతో పూచీకత్తు పెట్టించుకొని కిస్తీలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తను పనిచేసే చిట్‌ఫండ్ ఎదుట బాధితులు బుధవారం ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన కె.రవికుమార్ ఒక చిట్‌ఫండ్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న గసికంటి మహేందర్, ఐరుగురాల నర్సయ్య అనే ప్రభుత్వ ఉద్యోగులతో పూచీకత్తు పెట్టించుకొని తాను వేసిన చిట్టీని తీసుకున్నాడు. చిట్టీ ఎత్తుకొని కట్టాల్సిన డబ్బులు కట్టకపోవడంతో పూచీకత్తు పెట్టిన వారికి కంపెనీ నుంచి నోటీసులు వచ్చాయి. దీనితో అతను ప్రస్తుతం పనిచేసే కోర్టు సమీపంలోని ప్రైవేట్ చిట్‌ఫండ్ కార్యాలయం వద్ద బాధితులు నిరసన తెలుపుతూ యాసిడ్ బాటిల్ పట్టుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని బాధితులను, రవికుమార్‌ను అక్కడి నుంచి పంపించివేశారు.

హత్యా.. ప్రమాదమా?

- అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి


గాదెం సాగర్(ఫైల్)


గోదావరిఖని: అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. స్థానిక గంగానగర్‌లో ఉంటూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–7లో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గాదెం సాగర్(30) మంగళవారం అర్ధరాత్రి స్థానిక బస్టాండ్ సమీప సమాధుల సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుని కడుపు, తలపై గాయాలుండటంతో ఎవరైనా దాడి చేసి చంపారా? లేక కిందపడి గాయాలపాలై మృతి చెందాడా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. నీతో మాట్లాడాల్సి ఉందని కొందరు ఫోన్‌చేసి అతిగా మద్యం తాగించి దాడిచేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఇటీవల ఓ పంచాయితీ కూడా జరిగినట్లుగా తెలుస్తోంది. అయితే తనపై దాడిచేసిన సమయంలో కాపాడాలంటూ అతని మిత్రులకు కూడా మెసేజ్ లు చేసినట్లుగా పంపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చేఅవకాశం ఉంది. సాగర్ బీఆర్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. సాగర్ మృతిని అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై భూమేశ్ తెలిపారు. కేసు విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ట్రైనీ ఎస్సై, కానిస్టేబుళ్లపై చర్యలు

కరీంనగర్‌క్రైం: సైదాపూర్ శివారులో గత నెల 8న వాహన తనిఖీ నిర్వహిస్తుండగా జరిగిన ఘటనపై ట్రైనీ ఎస్సై, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకున్నట్లు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ప్రకటించారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 8న సైదాపూర్ పోలీస్ స్టేషన్ ప్రొబెషనరీ ఎస్సై అగస్త్య భార్గవ్, కానిస్టేబుళ్లు ఆకాశ్, అజయ్ రోజువారీ విధుల్లో భాగంగా సైదాపూర్ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హుస్నాబాద్‌కు చెందిన బత్తుల మహేందర్ అనే వాహనదారుడిని ఆపి తనిఖీ చేయగా.. మహేందర్, పోలీసులకు గొడవ జరిగి ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ విషయంపై వాహనదారుడు మహేందర్ సీపీకి ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా ఆరోజు విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు ఆకాశ్, అజయ్‌పై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారికి చార్జ్ మెమో జారీ చేసి పోలీస్ స్టేషన్ విధుల నుంచి తప్పిస్తూ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ట్రైనీ ఎస్సై అగస్త్య భార్గవ్‌పై క్రమశిక్షణా చర్యల నిమిత్తం మల్టీ జోన్ ఐజీకి నివేదిక పంపించినట్లు సీపీ తెలిపారు.

కిడ్నాప్ కలకలం

- గల్ఫ్‌లో ఆర్థిక లావాదేవీల్లో వివాదం
- గూడూరులో కుటుంబ పెద్ద కిడ్నాప్
- కోరుట్లలో పట్టివేత
- పోలీసుల అదుపులో ఇద్దరు కిడ్నాపర్లు
- ఆలస్యంగా వెలుగుచూసిన వ్యవహారం


అపహరణకు గురైన మల్లయ్య


ఆందోళనలో మల్లయ్య కుటుంబీకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన వివాదం ఒకరి కిడ్నాప్‌నకు దారితీసింది. రెండు రోజుల క్రితం కిడ్నాప్ జరుగగా ఆలస్యంగా వెలుగు చూసింది. సంచలనం సృష్టించిన కిడ్నాప్ సంఘటన వివరాలు ఎస్సై గణేశ్, బాధితుల కథనం ప్రకారం. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన జంపెల్లి పర్శరాములు రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ కోనరావుపేట మండలానికి చెందిన వ్యక్తితో జరిగిన ఆర్థిక లావాదేవీలలో వివాదం ఏర్పడింది. ఈక్రమంలోనే ఏడాది క్రితం పర్శరాములు స్వగ్రామం గూడూరుకు వచ్చాడు. తిరిగి ఉపాధి కోసం మలేషియా వెళ్లాడు. అయితే పర్శరాములుకు తమకు మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని, ఆ డబ్బులు ఇవ్వాలంటూ కొందరు ఏడాది క్రితం తమను బెదిరించారని పర్శరాములు తల్లి మల్లవ్వ తెలిపింది. గత సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బెదిరించారని పేర్కొంది. ఈనేపథ్యంలోనే మంగళవారం ఉదయం తన భర్త మల్లయ్య కనిపించకుండా పోయాడని తెలిపింది. మల్లయ్య కోసం గాలించిన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై గణేశ్ సోమవారం అర్ధరాత్రి గూడూరుకు వచ్చిన వ్యక్తులపై ఆరా తీశారు. ప్రత్యేక బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో కిడ్నాపర్లు కోరుట్లలోని ఓ ఇంట్లో ఉన్నట్లు బుధవారం మధ్యాహ్నం కనిపెట్టారు. కిడ్నాపర్లు ఉన్న ఇంటిపై దాడి చేయగా.. ప్రధాన సూత్రధారులైన ఇద్దరు పరారైనట్లు సమాచారం. మల్లయ్యతోపాటు అక్కడే ఉన్న మరో ఇద్దరు కిడ్నాపర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మల్లయ్య క్షేమంగా ఉన్నాడని, వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. కాగా కిడ్నాపర్ల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని పర్శరాములు తల్లి మల్లవ్వ, భార్య గీత ఆరోపించారు. డబ్బు విషయంలో ఏర్పడిన వివాదం తమకు తెలియదన్నారు. పర్శరాములు తండ్రి మల్లయ్యను కిడ్నాప్ చేయడంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. దుబాయ్‌లో ఏం జరిగింది.. డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేస్తున్నామన్నారు.

యోగావాక్



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని రాంనగర్ ఆయుష్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో బుధవారం యోగావాక్ నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ యస్రబ్ సుల్తానా, డిప్యూటీ నోడల్ అధికారి డాక్టర్ శేఖర్ వాక్ ప్రారంభించారు. ఈ వాక్ రాంనగర్ ఆయుష్ ఆసుపత్రి నుంచి మార్క్ ఫెడ్ మైదానం వరకు కొనసాగింది. కరీంనగర్ జిల్లా ఆయుష్ ప్రోగ్రాం అధికారి జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ సదానందం, ఫార్మసిస్టులు మొహమ్మద్ మునీర్, విజయేందర్, రాజేశ్వర్, యోగా శిక్షకులు శ్యామల, రాజమొగిలి, రవీందర్, సునీత, రమ తదితరులు పాల్గొన్నారు

– కరీంనగర్ టౌన్

నాడు నేలరాలి.. నేడు మొలకెత్తి..



కరీంనగర్ మండలంలో యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికందే సమయంలో బలమైన ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. చామనపల్లి, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, ఇరుకుల్ల తదితర గ్రామాల్లోని వరిపంట గింజలన్నీ నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాడు నేలరాలిన ధాన్యం గింజలు ఇటీవల కురిసిన తొలకరి వర్షాలకు మొలకెత్తి నారుమడులను తలపిస్తున్నాయి. చెర్లభూత్కూర్‌లోని ఓ రైతు పొలంలో వరి గింజలు మొలకెత్తడంతో పచ్చగా మారింది.

– కరీంనగర్‌రూరల్

విజయదరహాసం



18 ఏళ్ల కలను రాయల్ చాలెంజర్ బెంగళూర్ టీం సాకారం చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఐపీఎల్ ఫైనల్‌లో పంజాబ్‌పై ఆర్‌సీబీ విజయం సాధించింది. దీంతో జిల్లావ్యాప్తంగా క్రికెట్ అభిమానుల, ఆర్‌సీబీ అభిమానులు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తా వద్ద యువత బాణాసంచా కాలుస్తూ సంబురాలు చేశారు. అదిరేటి స్టెప్పులు వేస్తూ చిందులు వేశారు. జై విరాట్.. జైజై విరాట్ అంటూ నినదించారు.

– కరీంనగర్‌స్పోర్ట్స్

క్లుప్తంగా

సుడా చైర్మన్‌ను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు



నరేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న వ్యాయామ విద్య ఉపాధ్యాయులు

కరీంనగర్‌స్పోర్ట్స్: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని బుధవారం జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. నరేందర్‌రెడ్డి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయ ప్రతినిధులు అంతడుపుల శ్రీనివాస్, కొమురోజు కృష్ణ, మూల మహేందర్‌రెడ్డి, కట్ట సంతోష్, కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి కంపెల్లి కీర్తి, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు దండి రవీందర్, మాజీ సర్పంచ్ మేడి అంజన్న, కుర్ర శశి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న కరీంనగర్‌రూరల్ పోలీసులు

కరీంనగర్‌రూరల్: సంవత్సరం కింద సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ రికవరీ చేసి బాధితుడికి కరీంనగర్‌రూరల్ పోలీసులు బుధవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. తీగలగుట్టపల్లి కాటా అజయ్‌కి చెందిన సెల్‌ఫోన్ జూన్ 2024లో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులు విచారణ నిర్వహించి ఆ మొబైల్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి రికవరీ చేసి సంబంధిత వ్యక్తికి బుధవారం అందజేసినట్లు సీఐ ఏ.నిరంజన్‌రెడ్డి తెలిపారు. సెల్‌ఫోన్ రికవరీకి కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజాను సీఐ అభినందించారు.

కార్పొరేషన్ డివిజన్ల డీలిమిటేషన్‌పై సందేహాలు

కరీంనగర్ టౌన్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల డీలిమిటేషన్‌పై అనేక సందేహాలు ఉన్నాయని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో లోగోడ ఉన్న 60 డివిజన్లను 66 డివిజన్లుగా విభజిస్తూ రూపొందించిన ముసాయిదాపై అనేక సందేహాలు, అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఇంటి నంబర్లు, హద్దులు ఏ ప్రాతిపదికన ఏర్పాటు చేశారో అర్థం కాకుండా గందరగోళంగా ఉందన్నారు. మున్సిపల్ అధికారులు రూపొందించిన ముసాయిదా జాబితాపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి ప్రత్యేక చొరవ తీసుకొని నగర ప్రజలందరికీ ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటసాగుపై అవగాహన

శంకరపట్నం: కాచాపూర్, గద్దపాక, కన్నాపూర్ గ్రామాలలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంటసాగుపై అవగాహన కల్పించారు. సాగులో సమస్యలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం గూర్చి రైతులకు వివరించారు.

దుస్తులు పంపిణీ



సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కూలీ పని చేసుకుని గుడిసె ప్రాంతాల్లో నివసించే నిరుపేద మహిళలు, పిల్లలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్‌తో పాటు విజయ్ కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నేపథ్యం.. శాస్త్రీయ నృత్యం

- మక్కువ చూపుతున్న చిన్నారులు
- వేసవి సెలవులు సద్వినియోగం

కరీంనగర్ కల్చరల్: చిన్నారులకు శాస్త్రీయ నృత్యాల్లో శిక్షణ ఇప్పించడంతో పాటు సంప్రదాయ విధానాలపై అవగాహన కల్పించే విధంగా తల్లిదండ్రులు అడుగులు వేస్తున్నారు. శాస్త్రీయ నృత్యం నేర్చుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. వేసవి సెలవుల్లో భాగంగా కరీంనగర్‌లోని బాలభవన్‌లో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థుల మంచి స్పందన వస్తోంది. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ తమలో ఉన్న కళలకు మరింత పదును పెడుతున్నారు. కొంతమంది మన సంప్రదాయ నృత్యం క్లాసికల్‌లో తర్ఫీదు పొందుతుండగా మరి కొంతమంది ఫోక్, వెస్ట్రన్, రకరకాల నృత్యాలు ఉన్నా క్లాసిక్ నృత్యంపై మక్కువ కనబరుస్తున్నారు.



విద్యార్థులకు నాట్యంలో తర్ఫీదు ఇస్తున్న శిక్షకురాలు సుహాసిని

నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

క్లాసికల్ డ్యాన్స్ అంటే ఇష్టం



ఏడో తరగతి చదువుతున్న. డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. సొంతంగా నేను బయట నేర్చుకోకుండా గతనెల నుంచి బాలభవన్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో శిక్షణ తీసుకుంటున్న. నాలాంటి వారికి చాలా ఉపయోగపడుతోంది.

– దర్శనాల జాహ్నవి, కరీంనగర్

సంతోషంగా ఉంది



సమ్మర్ క్యాంప్‌లో క్లాసికల్ నృత్యం నేర్చుకుంటున్న. కళాభారతిలో నిర్వహించిన అన్నమాచార్య జయంతి ప్రోగ్రాంలో పాల్గొన్న. మనకు అర్థమయ్యే తెలుగు భాషలో బోధించడం సౌకర్యంగా ఉంది. నృత్యంలో మంచి శిక్షణ ఇస్తున్నారు.

–అదవ శ్రీసహస్విని

వ్యాయామం అవుతుంది



క్లాసికల్ డ్యాన్స్ అంటే ఇష్టం. ఈ నృత్యం చేర్చుకోవడం వల్ల నాలో ఏకాగ్రతతో పాటు చక్కటి వ్యాయామం అవుతోంది. కలెక్టరేట్ ఆడిటోరియంగ్‌లో రెండు సార్లు, కళాభారతిలో ఒకసారి నృత్య ప్రదర్శన చేశా. మన సంప్రదాయాలను ప్రతిభించే ఈ నాట్యంలో తర్ఫీదు తీసుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

– జి. ప్రజ్ఞ సిద్ధి

మానసిక ప్రశాంతత



తెలుగు సంస్కృతి సంప్రదాయాలు తెలిపేలా ఉండే ఈ శాస్త్రీయ నృత్యంతో జ్ఞాపకశక్తితో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుంది. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి వాటిలో శిక్షణ తీసుకుంటే ఎంతో ఉపయోగం ఉంటుంది. ఈ నాట్యంలో సర్టిఫికెట్ కోర్సు చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేస్తాం.

– సుహాసిని, శాస్త్రీయ నృత్య శిక్షకురాలు

భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు



జూబ్లీనగర్ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ రాజేశ్

కరీంనగర్‌రూరల్: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ ఎన్.రాజేశ్ అన్నారు. బుధవారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ఈనెల 20 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ భూముల సమస్యలపై 65 మంది రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించి రసీదులను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వైశాలి, ఆర్‌ఐలు వాస్తవిక్‌గౌడ్, కనకరాజు, మాజీ సర్పంచ్ రుద్ర రాము, చల్లా లింగారెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు

- చామనపల్లి రైతువేదికలో అవగాహన సదస్సు

కరీంనగర్‌రూరల్: రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు వానాకాలం సీజన్ సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం కరీంనగర్ మండలం చామనపల్లి రైతువేదిక, ఈనెల 10న దుర్శేడ్ రైతువేదికలో శాస్త్రవేత్తలతో సదస్సు నిర్వహించేందుకు వ్యవసాయాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏరువాక కేంద్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఆయా గ్రామాల్లోని సదస్సుల్లో పాల్గొంటారు. వానాకాలం సీజన్‌లో సాగు చేసే పంటలు, సాగులో మెలకువలపై రైతులకు సలహాలు, సూచనలు అందిస్తారు. రసాయన ఎరువులను తక్కువగా వినియోగించడం, సాగునీరు ఆదా చేయడం, పంట మార్పిడి, సుస్థిర ఆదాయం పొందడం తదితర అంశాలపై పలువురు శాస్త్రవేత్తలు వివరించి రైతులకు అవగాహన కల్పిస్తారు. గురువారం చామనపల్లి రైతువేదికలో నిర్వహించే రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి రైతులందరూ హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.సత్యం కోరారు.

పూరీ కుర్మాలో ఈగ

- నగరంలోని ఓ హోటల్ నిర్వాకం
- పేపర్‌లో వేయించండని బల్దియా అధికారి సలహా



పూరీ కుర్మాలో వచ్చిన ఈగ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని హోటళ్లలో పరిశుభ్రత, ఆహార పదార్థాల్లో నాణ్యత ఎండమావే అని మరోసారి తేలింది. నగరంలోని బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో టిఫిన్‌లో ఈగలు రావడంతో మరోసారి హోటళ్లలో సుచి, శుభ్రతపై చర్చ మొదలైంది. బుధవారం నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన భాస్కర్, శ్రీనులు ఉదయం ఆ హోటల్‌లోని ఏసీ సెక్షన్‌కు టిఫిన్ చేసేందుకు వెళ్లారు. పూరీ ఆర్డర్ ఇవ్వగా, తెచ్చిన పూరీ కుర్మాలో చనిపోయిన ఈగలు దర్శనమివ్వడంతో వారు ఖంగుతిన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఈగే కదా అంటూ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

ఈగ వచ్చిందని పేపర్‌లో వేయించండి..

టిఫిన్‌లో ఈగలు రావడంతో సదరు వినియోగదారులు నగరపాలక సంస్థకు చెందిన ఓ ఉన్నతాధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి హోటల్‌పై చర్య తీసుకోవాల్సిన ఉన్నతాధికారి 'ఈగ వచ్చిందని పేపర్‌లో వేయించండి' అంటూ ఓ వెటకారపు సలహా ఇచ్చినట్లు బాధితులు ఆరోపించారు. హోటల్‌పై స్పందించని నగరపాలక సంస్థ అధికారిపై చర్యతీసుకోవాలని వారు కోరారు.

సమాచారం

జూలై 6న తెలుగు పద్య పఠన పోటీలు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జూలై 6న నిర్వహిస్తున్న తెలుగు పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి బుర్ర మధుసూదన్‌రెడ్డి, బొమ్మకంటి కిషన్, అనుముల దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వరకు చదువుతున్న బాలలు జూనియర్ విభాగంగా, ఇంటర్ ఆపై చదువుతున్న యువత సీనియర్ విభాగంగా విభజించి పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పిల్లలు, యువతలో తెలుగు భాష పద్యాలపై ఆసక్తి పెంచేందుకు నిర్వహిస్తున్న పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన పిల్లలు, యువత ఈనెల 5వ తేదీలోగా 9494680785, 7780659809 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

12వరకు పీజీ పరీక్ష ఫీజు గడువు

కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, సోషల్ వర్క్, ఎంబీఏ, ఎంసీఏ విభాగాల్లో రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు ఈనెల 12 తేదీ వరకు ఉందని యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సురేశ్‌కుమార్ తెలిపారు. రూ.300 అపరాధ రుసుముతో 17 తేదీ వరకు చెల్లించవచ్చని అన్నారు. 2016–17 నుంచి 2020–21 బ్యాక్‌లాగ్ అభ్యర్థులకు ప్రత్యేక అవకాశం ఉందని సూచించారు.

బాలసుబ్రమణ్యంకు నివాళి



బాలసుబ్రమణ్యం పాటలు ఆలపిస్తున్న గాయకులు

కరీంనగర్‌కల్చరల్: దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి పురస్కరించుకొని నగరంలోని కళాభారతిలో బుధవారం సంగీత, సాంస్కృతిక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. బాలు పాడిన పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోగుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, కోశాధికారి గొరవేని బాబు, ప్రోగ్రాం కన్వీనర్ తిప్పబత్తిని రవీందర్, వాయిద్యకారులు కాటబత్తిని శంకర్, అలీమ్ జున్ను తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని కోతిరాంపూర్‌లో వాటర్ లీకేజీ కొనసాగుతూనే ఉంది. అదివర్స్ స్కూల్ ప్రక్కన వాటర్‌లీకేజీ ఫౌంటేన్‌లో పోస్తోంది. ఆరు నెలలుగా ఈ లీకేజీ కొనసాగుతున్నా ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. లీకేజీని సరిచేయడంలో నగరపాలక సంస్థ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని అవలంభిస్తున్నారు. నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ చర్యలు తీసుకొని లీకేజీని సరిచేయాలి.

– ఎద్ల రమేశ్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకటేశ్వర్లు, డీఈ, సెల్ నం.89199 23123

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

తప్పుల తడకగా డివిజన్ల విభజన



మాట్లాడుతున్న చల్లా హరిశంకర్

కరీంనగర్: కరీంనగర్ మున్సిపల్ పరిధిలో డివిజన్ల పునర్విభజన(డీలిమిటేషన్)లో శాస్త్రీయతకు తూట్లు పడ్డాయని, ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులను సైతం అయోమయానికి గురి చేసేలా ముసాయిదా జాబితాను రూపొందించారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60 డివిజన్లను 66గా పెంచే ముసాయిదా శాస్త్రీయత లేకుండా రూపొందించారని, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా జాబితా తయారు చేసి ఐఏఎస్ అధికారులను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. డివిజన్ల తప్పుల తడక కుట్ర వెనక ఎవరున్నారో అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లో లేని ఓట్లను కలిపి చూపడం, బౌండరీల నిర్దేశంలో తప్పులపాలవడం, వంద ఫీట్ల రోడ్లు, 60 ఫీట్ల రోడ్లను హద్దులుగా తీసుకోవాల్సిన అవసరముండగా.. ఎక్కడా పాలో కాకపోవడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, సుధగోని మాధవికృష్ణ, ఏదుల రాజశేఖర్, నాంపల్లి శ్రీనివాస్, నక్క పద్మ కృష్ణ, సదానందచారి, బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, మాజీ సర్పంచులు మల్లారెడ్డి, సంపత్‌రావు, శ్రీనివాస్, రాజు, కిరణ్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

కరీంనగర్‌రూరల్: భూసారం పెంచడంతో పాటు అధిక దిగుబడి రావడంలో పచ్చిరొట్ట ఎరువులు కీలకపాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్ వ్యవసాయ పనులను ప్రారంభించిన రైతులందరూ ముందస్తుగా పచ్చిరొట్ట విత్తనాలను విత్తుకుంటున్నారు. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై జీలుగ, జనుము తదితర పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోంది. జీలుగ సాగు చేసే విధానం, ప్రయోజనాలపై వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది.

సాగు చేసే విధానం

- ఎకరానికి జీలుగ విత్తనాలు 12 కిలోల నుంచి 16 కిలోలు, జనుము 10 కిలోల నుంచి 12 కిలోలు, పిల్లి పెసర 6నుంచి 8కిలోలు చొప్పున చల్లుకోవాలి.
- వేసవి దుక్కి పూర్తికాగానే తొలకరి వర్షాలకు పొలమంతా చల్లాలి.
- పూతదశకు రాకముందే పొలమంతా నీళ్లు పెట్టి ట్రాక్టర్‌తో కలియదున్నాలి.
- భూమిలో మురగడానికి అవసరమైతే సింగిల్ సూపర్‌ఫాస్పేట్ ఎకరానికి 25 కిలోలు చల్లాలి.



ఇరుకుల్లలో జీలుగను ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

- పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసి పొలంలో కలియదున్నడంతో నేలకు కావాల్సిన సేంద్రియ పదార్థాలు లభిస్తాయి.
- వాతావరణంలోని నత్రజని, పచ్చిరొట్ట వేరు బుడి పెల్లో ఉన్న బ్యాక్టీరియా ద్వారా స్థిరీకరణ చెందుతోంది.
- మైక్రోఫోరా, మైక్రోఫనా వంటి పంటకు మేలు చేసే నేలకు సంబంధించిన జీవరాశులు పెరుగుతాయి.
- నత్రజని పెరగడంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతోంది.
- వేర్లు లోపలికి వెళ్లడంతో నేల గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.



క్వార్టర్ ఫైనల్లో భారత మహిళల ఆర్చరీ జట్టు

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నమెంట్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత క్రీడాకారులు రాణించారు. మహిళల కాంపౌండ్ విభాగంలో మధుర ధమాంగావ్‌కర్ (మహారాష్ట్ర), తనిపర్తి చికిత (తెలంగాణ), వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్)లతో కూడిన భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. కజకిస్తాన్, బ్రిటన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో భారత్ తలపడుతుంది. క్వాలిఫయింగ్‌లో భారత జట్టు ఓవరాల్‌గా 1777 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. మధుర 600 పాయింట్లతో నాలుగో స్థానంలో, చికిత 592 పాయింట్లతో 11వ స్థానంలో, జ్యోతి సురేఖ 585 పాయింట్లతో 19వ స్థానంలో నిలిచారు. పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ 572 పాయింట్లు స్కోరు చేసి 13వ స్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన అతాను దాస్ 570 పాయింట్లతో 17వ స్థానంలో, పార్థ్ సాలుంఖే 565 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా భారత్ 1707 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి రెండో రౌండ్‌కు అర్హత పొందింది.



బెంగళూరులోని విధాన సౌధ ఆవరణలో ఐపీఎల్ చాంపియన్ ఆర్‌సీబీ జట్టును అభినందిస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

‘ఈ విజయం మీ అందరిది’

- అభిమానులతో విరాట్ కోహ్లి
- బెంగళూరులో ఆర్‌సీబీ విజయోత్సవ వేడుక

సాక్షి, బెంగళూరు: తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తమ హోం గ్రౌండ్‌లో వేడుకలు జరుపుకుంది. బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జట్టు సభ్యులంతా పాల్గొని అభిమానులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ‘ఈ సాల కప్ నమ్దు’ అంటూ విరాట్ కోహ్లి తనదైన శైలిలో ఫ్యాన్స్‌లో జోష్ నింపాడు. ‘ఈ విజయం మీ అందరిదీ. అభిమానులు, ఈ నగరానికి చెందినవారు, కష్టాల్లోనూ జట్టుకు మద్దతునిచ్చిన వారందరికీ గెలుపులో భాగం ఉంది. ప్రపంచంలో ఏ ఫ్రాంచైజీ జట్టుకు కూడా ఇంతటి వీరాభిమానులు ఉండటం నేను ఎప్పుడూ చూడలేదు’ అని కోహ్లి వ్యాఖ్యానించాడు. సీజన్ ఆరంభం నుంచి జట్టులోని ఆటగాళ్లందరికీ తగిన బాధ్యతలు అప్పగించామని, ఇప్పుడు వారందరి ప్రదర్శనతోనే టైటిల్ విజయం ఖాయమైందని కెప్టెన్ రజత్ పాటీదార్ చెప్పాడు. అంతకుముందు ఆర్‌సీబీ టీమ్ సభ్యులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విధాన సౌధ వద్ద క్రికెటర్లకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం జరిగింది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సాంప్రదాయ రీతిలో వారిని సత్కరించారు. ఆర్‌సీబీ టీమ్ తమ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, 18 ఏళ్ల టైటిల్ కోసం పోరాడటం చిన్న విషయం కాదని ఆయన అన్నారు.

విజయాన్ని అలవాటుగా మార్చుకోవాలి...

ఒక్క టైటిల్ విజయంతో ఆర్‌సీబీ జట్టు ఆగిపోరాదని, వచ్చే ఏడాది కూడా ఇదే జోరును కొనసాగించి వరుసగా రెండో ఏడాది ట్రోఫీని సొంతం చేసుకోవాలని టీమ్ డైరెక్టర్ మొ బొబాట్ అన్నారు. ఫైనల్లో విజయం తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో సంబరాలు చేసుకుంటూ ఆయన టీమ్ సభ్యుల్లో మరింత స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేశారు. ‘ఈ అద్భుత విజయంలో అందరూ తమవంతు పాత్ర పోషించారు. దీని విలువ ఏమిటో రాబోయే రోజుల్లో ఇంకా మీకు అర్థమవుతుంది. గతంలో ఒక జట్టు వరుసగా రెండుసార్లు టైటిల్ గెలవడం రెండుసార్లు మాత్రమే జరిగింది. వచ్చే ఏడాది ఫైనల్ బెంగళూరులో జరుగుతుంది. అప్పుడు అక్కడా మనం ఉండాలంటే విజయాలను అలవాటుగా మార్చుకోవాలి. ఈ టైటిల్ మీలో గెలుపు ఆకలిని ఇంకా పెంచాలి’ అని బొబాట్ వ్యాఖ్యానించారు.

‘బౌలింగ్ వల్లే గెలిచాం’

ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ తొలిసారి గెలవడంలో బౌలర్లే ప్రధాన పాత్ర పోషించారని జట్టు హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ అన్నారు. వేలంలో కూడా మంచి బౌలర్లను సొంతం చేసుకోవడంపైనే దృష్టి పెట్టామని... గెలుపు దిశగా అక్కడే తమ తొలి అడుగు పడిందని ఫ్లవర్ వ్యాఖ్యానించారు. ‘పేరున్న బ్యాటర్లపై భారీ మొత్తాలు వెచ్చించడంకంటే గుర్తింపు ఉన్న బౌలర్లను ఎంచుకోవడం ముఖ్యమని భావించాం. తొలిరోజు వేలం ముగిశాక మాపై చాలా విమర్శలు వచ్చాయి. అయితే రెండో రోజు వేలంలో భువనేశ్వర్, కృనాల్, సుయాశ్ శర్మలను తీసుకున్నాం. వీరు ఎలాంటి ప్రభావం చూపించారో ఇప్పుడు కనిపిస్తోంది’ అని ఫ్లవర్ విశ్లేషించారు.


చిన్నస్వామి స్టేడియంలో అభిమానులకు ఐపీఎల్ ట్రోఫీని చూపుతున్న బెంగళూరు స్టార్ విరాట్ కోహ్లి, కృనాల్ పాండ్యా

భళా బొయిసన్...

- ప్రపంచ ఆరో ర్యాంకర్ ఆంద్రీవాపై సంచలన విజయం
- ఆడుతున్న తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనే సెమీఫైనల్‌కు అర్హత

పారిస్: టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో మరో సంచలనం నమోదైంది. ‘వైల్డ్ కార్డు’తో ఈ టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ 361వ ర్యాంకర్, ఫ్రాన్స్ ప్లేయర్ లూయి బొయిసన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అన్‌సీడెడ్ బొయిసన్ 7-6 (8/6), 6-3తో ప్రపంచ ఆరో ర్యాంకర్ మిరా ఆంద్రీవా (రష్యా)ను బోల్తా కొట్టించింది.


ఆంద్రీవా


బొయిసన్

తద్వారా 1989 తర్వాత కెరీర్‌లో ఆడుతున్న తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనే సెమీఫైనల్‌కు చేరుకున్న ప్లేయర్‌గా బొయిసన్ గుర్తింపు పొందింది. చివరిసారి 1989లో మోనికా సెలెస్ (యుగోస్లావియా), జెన్నిఫర్ కాప్రియాటి (అమెరికా) ఫ్రెంచ్ ఓపెన్‌లోనే ఈ ఘనత సాధించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)ను ఓడించిన బొయిసన్ క్వార్టర్ ఫైనల్లోనూ అదే జోరు కనబరిచింది. 2 గంటల 8 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 22 ఏళ్ల బొయిసన్ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా)తో బొయిసన్ తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ కోకో గాఫ్ 6-7 (6/8), 6-4, 6-1తో ఏడో సీడ్, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా)పై గెలిచింది.

సెమీస్‌లో అల్‌కరాజ్, సినెర్

పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సినెర్ 6-1, 7-5, 6-0తో అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)పై, అల్‌కరాజ్ 6-0, 6-1, 6-4తో 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా)పై విజయం సాధించారు. సెమీఫైనల్లో ఎనిమిదో సీడ్ ముసెట్టి (ఇటలీ)తో అల్‌కరాజ్ ఆడతాడు. జొకోవిచ్ (సెర్బియా), జ్వెరెవ్ (జర్మనీ) మధ్య చివరి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో రెండో సెమీఫైనల్లో సినెర్ తలపడతాడు.

థాయ్‌లాండ్‌తో భారత్ తొలి పోరు

న్యూఢిల్లీ: ఆసియా కప్ మహిళల హాకీ టోర్నీలో భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను థాయ్‌లాండ్‌తో ఆడనుంది. చైనాలోని హాంగ్జూ వేదికగా ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి 14 వరకు ఈ టోర్నీ జరగనుంది. గత పోటీల్లో కాంస్యం నెగ్గిన భారత జట్టు డిఫెండింగ్ చాంపియన్ జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్‌తో కలిసి పూల్ ‘బి’ నుంచి బరిలోకి దిగనుంది. ఆతిథ్య చైనా, కొరియా, మలేసియా, చైనీస్ తైపీ పూల్ ‘ఎ’లో ఉన్నాయి. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన రెండేసి జట్లు ‘సూపర్-4’కు అర్హత సాధించనున్నాయి. అందులో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ నిర్వహిస్తారు. ఈ మేరకు హాకీ ఇండియా బుధవారం వివరాలు వెల్లడించింది. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది జరగనున్న మహిళల హాకీ ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించనుంది. ‘ప్లేయర్ల ప్రదర్శనను అంచనా వేసేందుకు గ్రూప్ దశలోనే మాకు ప్రధాన ప్రత్యర్థి ఎదురుకానుంది. ఈ టోర్నీలో గెలిస్తే నేరుగా వరల్డ్ కప్‌లో పాల్గొనొచ్చు’ అని భారత మహిళల జట్టు కెప్టెన్ సలీమా టెటె పేర్కొంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


రష్మికా మందన్నా


షాహిద్ కపూర్

కామెడీ కాక్‌టైల్

బాలీవుడ్ ‘కాక్‌టైల్’ పార్టీలో చేరనున్నారట హీరోయిన్ రష్మికా మందన్నా. పన్నెండేళ్ల క్రితం బాలీవుడ్‌లో వచ్చిన రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ ‘కాక్‌టైల్’ ప్రేక్షకులను మెప్పించి, ఓ హిట్ ఫిల్మ్‌గా నిలిచింది. హోమీ అద్జానియా ఈ సినిమాకు దర్శకుడు. ఈ ‘కాక్‌టైల్’ సినిమాలో సైఫ్ అలీఖాన్, దీపికా పదుకోన్, దయానా పెంటీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘కాక్‌టైల్ 2’ను రూపొందించనున్నారట దర్శకుడు హోమీ. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని, ఈ ఏడాది అక్టోబరులో ఈ సినిమాను సెట్స్‌కు తీసుకువెళ్లాలని సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఈ సీక్వెల్‌లో షాహిద్ కపూర్, కృతీ సనన్, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా నటిస్తారని బాలీవుడ్ టాక్. ఈ సినిమాను దినేష్ విజన్ నిర్మిస్తారని, లవ్ రంజన్ కథను రెడీ చేస్తున్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఈ కథలో వినోదం-భావోద్వేగం అంశాలకు లవ్ రంజన్ పెద్ద పీట వేస్తున్నారట. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ‘కాక్‌టైల్ 2’ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.


కృతీ సనన్

అందాల రాక్షసి మళ్లీ వస్తోంది


లావణ్య, నవీన్ చంద్ర

నవీన్ చంద్ర, రాహుల్ రవీంద్రన్ హీరోలుగా, లావణ్యా త్రిపాఠి హీరోయిన్‌గా నటించిన ‘అందాల రాక్షసి’ చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమౌళి నిర్మించిన ఈ చిత్రం 2012 ఆగస్టు 10న విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని ఈ నెల 13న రీ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్రయూనిట్. ‘‘భిన్నమైన ప్రేమకథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయేలా ‘అందాల రాక్షసి’ని అద్భుతంగా తెరకెక్కించారు హను రాఘవపూడి’’ అని మేకర్స్ పేర్కొన్నారు.


విష్ణు, జెనీలియా

మరోసారి ఢీ

థియేటర్లలో ప్రేక్షకులకు మరోసారి వినోదాలు పంచనున్నారు విష్ణు మంచు. ఆయన హీరోగా, జెనీలియా హీరోయిన్‌గా శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన చిత్రం ‘ఢీ’. శ్రీహరి, బ్రహ్మానందం, సునీల్ ఇతర పాత్రల్లో నటించారు. మల్లిడి సత్యనారాయణ రెడ్డి నిర్మించిన ఈ సినిమా 2007 ఏప్రిల్ 13న విడుదలై ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో విష్ణు మంచు కామెడీ టైమింగ్‌కి మంచి పేరొచ్చింది. ఆయన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ‘ఢీ’ రేపు (శుక్రవారం) రీ రిలీజ్ అవుతోంది. ‘‘విష్ణు మంచు నుంచి వచ్చిన ఈ కామెడీ బ్లాక్ బస్టర్ సినిమాను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తుండటం హ్యాపీగా ఉంది. ఈ నెల 27న విడుదల కానున్న ‘కన్నప్ప’ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు విష్ణు.... ఈ చిత్రంతో సందడి చేసేకంటే ముందే ‘ఢీ’తో మరోసారి అందర్నీ నవ్వించనున్నారు’’ అని యూనిట్ పేర్కొంది.

కట్టప్ప తీర్పు


సత్యరాజ్

కట్టప్ప... ఈ పేరు వినగానే ‘బాహుబలి’ చిత్రం గుర్తొస్తుంది. ఈ సినిమాలో కట్టప్ప పాత్రలో తనదైన నటనతో ప్రేక్షకులను అలరించారు సత్యరాజ్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ‘కట్టప్ప జడ్జిమెంట్’. ధీరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హరీష్ ఉత్తమన్, మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు. తమిళంలో విజయం సాధించిన ఈ సినిమాని అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకటస్వామి ‘కట్టప్ప జడ్జిమెంట్’ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 13న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ‘‘పూర్తి మాస్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి తీర్పు ఇచ్చారో వెండితెరపై చూసి తెలుసుకోవాలి’’ అని రావూరి వెంకటస్వామి అన్నారు.

షూటర్ వస్తున్నాడు


అన్నపూర్ణమ్మ, శ్రీనివాసులు

రవిబాబు, సుమన్, రాశి, ఆమని, అన్నపూర్ణమ్మ, ఎస్తేర్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘షూటర్’. శ్రీ వెంకట సాయి ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్. శ్రీనివాసులు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ– ‘‘వాస్తవ ఘటనల నేపథ్యంలో ‘షూటర్’ని తెరకెక్కించాం. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలని కోరుతున్నాను’’ అన్నారు. ‘‘షూటర్ సూపర్ హిట్ కావాలి’’ అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దామోదర ప్రసాద్, నటి అన్నపూర్ణమ్మ, నటుడు ‘ఘర్షణ’ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: డ్రమ్స్ రాంబాబు, కెమేరా: డి. యాదగిరి.


‘హౌస్‌ఫుల్ 5’ పోస్టర్

సినిమా ఒకటి... క్లైమాక్స్‌లు రెండు

హిందీలో ‘హౌస్‌ఫుల్ 5’ చిత్రబృందం వినూత్న ప్రయోగం | వసూళ్లకు ఇదో కొత్త మార్గం

ఒకప్పుడు ప్రేక్షకులకు వినోదం అంటే థియేటర్స్‌లో సినిమాయే. కానీ అభివృద్ధి చెందిన సాంకేతికత వల్ల ప్రేక్షకులకు పలు రకాల వినోద మాధ్యమాలు (ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఓటీటీ వంటివి) ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రేక్షకులను థియేటర్స్‌కు తీసుకురావడం హీరోలు-దర్శక-నిర్మాతలకు పెద్ద సవాల్‌గా మారింది.

కథలో కొత్తదనం ఉంటే తప్ప స్టార్ హీరోల సినిమాలూ ఎక్కువ రోజులు థియేటర్స్‌లో ఆడే పరిస్థితులు లేవు ఇప్పుడు. ఇక రిపీట్ ఆడియన్స్ అన్న మాట దాదాపుగా కనుమరుగైపోతోంది. స్టార్ హీరోల సినిమాలకు సైతం రిపీట్ ఆడియన్స్ ఉండటం లేదు. ఎలాగూ నెల రోజులు తిరిగే లోపు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో సినిమా స్ట్రీమింగ్ ఉంటుందనేమో ప్రేక్షకులు నచ్చిన సినిమాను మరోసారి థియేటర్స్‌లో చూసేందుకు ఏమాత్రం సిద్ధపడటం లేదు. స్టార్ హీరోల ఫ్యాన్స్ అయితే రెండోసారి ప్రయత్నిస్తుండవచ్చు కానీ సగటు ప్రేక్షకుడు ఒకే సినిమాను థియేటర్స్‌లో రెండోసారి చూస్తున్న సందర్భాలు చాలా తక్కువైపోయాయన్నది మాత్రం వాస్తవం. ఇలాంటి పరిస్థితుల్లో సినిమా హీరోలు-దర్శక-నిర్మాతలు ఎప్పటికప్పుడు ఆడియన్స్‌ని ఆకర్షించే సరికొత్త వ్యూహాలను రచిస్తూనే ఉన్నారు. తాజాగా హిందీ చిత్రం ‘హౌస్‌ఫుల్ 5’ యూనిట్ ప్రేక్షకులను ఆకర్షించే ఓ సరికొత్త వ్యూహానికి ప్రణాళిక సిద్ధం చేసింది.

5ఏ అండ్ 5బీ

హిందీ చిత్రపరిశ్రమలో ఉన్న సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీస్‌లో ‘హౌస్‌ఫుల్’ ఒకటి. ఈ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటివరకు నాలుగు సినిమాలొచ్చాయి. ఐదో సినిమా ‘హౌస్‌ఫుల్ 5’ ఈ నెల 6న విడుదలకు సిద్ధమైంది. అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్, సంజయ్ దత్, ఫర్దీన్ ఖాన్, శ్రేయాస్ తల్పాడే, జాకీ ష్రాఫ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్... ఇలా ప్రముఖ తారలు ‘హౌస్‌ఫుల్ 5’ సినిమాలో నటించారు. తరుణ్ మన్సుఖాని దర్శకత్వంలో సాజిద్ నడియాద్‌వాలా ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమాని ‘హౌస్‌ఫుల్ 5ఏ, హౌస్‌ఫుల్ 5బీ’ అంటూ రిలీజ్ చేస్తున్నారు. కానీ... ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కావడం లేదు. ఒకే సినిమాకు రెండు డిఫరెంట్ క్లైమాక్స్‌లు ఉంటాయన్నమాట. అంటే... ‘హౌస్‌ఫుల్ 5ఏ’ సినిమాలో ఒక క్లైమాక్స్ ఉంటే, ‘హౌస్‌ఫుల్ 5బీ’లో మరో డిఫరెంట్ క్లైమాక్స్ ఉంటుంది. అలాగే ‘హౌస్‌ఫుల్ 5ఏ, హౌస్‌ఫుల్ 5బీ’... ఈ రెండు సినిమాలూ ఒకే రోజున విడుదలవుతున్నాయి. ఈ విషయాన్ని ఈ చిత్రంలో హీరోలుగా నటించిన అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్ ఇన్‌స్టాలో ఓ వీడియోతో అధికారికంగా ధ్రువీకరించారు. ‘‘పదిహేను సంవత్సరాలుగా ‘హౌస్‌ఫుల్ 5’ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ‘హౌస్‌ఫుల్ 5’ కూడా సిద్ధమైంది. ‘హౌస్‌ఫుల్ 5’ సినిమా రెండు డిఫరెంట్ క్లైమాక్స్‌లతో రాబోతోంది. మరి... మీరు ‘హౌస్‌ఫుల్ 5ఏ’ చూస్తారా? లేక ‘హౌస్‌ఫుల్ 5బీ’ చూస్తారా? లేదా రెండూ చూస్తారా?’’ అంటూ ఓ ఫన్నీ వీడియోను రిలీజ్ చేశారు అక్షయ్ అండ్ రితేష్. ఇదిలా ఉంటే... ‘హౌస్‌ఫుల్ 5’ సినిమా కథాంశం ఓ కిల్లర్‌ను కనుక్కునే నేపథ్యంలో సాగుతుంది. దీంతో ‘హౌస్‌ఫుల్ 5ఏ’లో కిల్లర్ ఒకరైతే, ‘హౌస్‌ఫుల్ 5బీ’లో కిల్లర్ మరొకరు ఉంటారట.

తొలి ఇండియన్ సినిమా!

కొన్ని సినిమాలు స్టార్టింగ్ నుంచి ఆకట్టుకున్నా క్లైమాక్స్‌లో మాత్రం ఆడియన్స్‌ను నిరాశపరుస్తాయి. కానీ ‘హౌస్‌ఫుల్ 5’ టీమ్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వారికి ఈ సమస్య ఉండకపోవచ్చు. ‘హౌస్‌ఫుల్ 5ఏ’ సినిమా చూసిన ఆడియన్స్ ‘హౌస్‌ఫుల్ 5బీ’ సినిమా క్లైమాక్స్ కోసం మళ్లీ ఆ సినిమాను చూసేందుకు థియేటర్స్‌కు వెళ్లొచ్చు. అలాగే ‘5బీ’ చూసినవాళ్లు ‘5ఏ’ క్లైమాక్స్ ఇంకా బాగుందని వింటే... ఆ వెర్షన్ చూడ్డానికి వెళ్లే అవకాశం ఉంది. ఇలా ప్రేక్షకుల్లో ‘హౌస్‌ఫుల్ 5’ సినిమా గురించి ఓ రకమైన చర్చ మొదలవుతుంది. ఈ చర్చ సినిమాకు మౌత్‌టాక్‌గా మారి, ప్రమోషన్‌కు ఉపయోగపడుతుంది. ఇదే జరిగితే థియేటర్స్‌కు వచ్చే ఆడియన్స్ సంఖ్య మెల్లిగా పెరుగుతుంది. వసూళ్లకు ఇదో కొత్త మార్గం అవుతుంది. రిపీట్ ఆడియన్స్‌తో థియేటర్లు హౌస్‌ఫుల్ అయితే... హౌస్‌ఫుల్ టీమ్ వ్యూహం సక్సెస్ అయినట్లే లెక్క. మరి... ఈ ‘హౌస్‌ఫుల్ 5’ టీమ్ స్ట్రాటజీ ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. ఇదిలా ఉంటే... రెండు డిఫరెంట్ క్లైమాక్స్‌లతో ఒకేసారి విడుదలవుతున్న తొలి భారతీయ చిత్రం ‘హౌస్‌ఫుల్ 5’ అంటూ బాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
261	78
80,998	24,620

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	19,467	▲	68
డోజోన్స్	42,590	▲	70
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,806	▲	19
డాక్స్	24,276	▲	185
షాంఘై	3,376	▲	14
నికాయ్	37,747	▲	301

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	84.07	87.75
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	114.12	119.06
€	యూరో	ధామస్‌కుక్	95.91	100.40
¥	జపాన్ యెన్ (100)	ధామస్‌కుక్	48.62	70.63
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	53.43	58.27
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	64.47	69.16
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	22.02	23.52
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	22.50	24.28
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	11.08	12.90

సేవల రంగానికి డిమాండ్ దన్ను



'మే' లో 58.8 పాయింట్లకు పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్

న్యూఢిల్లీ: డిమాండ్ మెరుగుపడటంతో దేశీయంగా సేవల రంగం మే నెలలో స్వల్పంగా పెరిగింది. సర్వీసెస్ సెక్టార్ పనితీరును ప్రతిబింబించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఏప్రిల్‌లో 58.7 పాయింట్లుగా ఉండగా మే నెలలో 58.8 పాయింట్లుగా నమోదైంది. పీఎంఐ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, 50కి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. అంతర్జాతీయంగా పటిష్టమైన డిమాండ్ నెలకొనడాన్ని సూచిస్తూ ఏప్రిల్ నుంచి కొత్తగా ఎగుమతులు పుంజుకోవడమనేది మే నెలలో సేవల రంగానికి సానుకూలాంశంగా నిల్చిందని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకానమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు. ఇండెక్స్‌కి సంబంధించిన సర్వే ప్రకారం ప్రకటనలు, డిమాండ్, ప్రస్తుత క్లయింట్ల నుంచి మళ్లీ ఆర్డర్లు రావడం వంటివి అంశాలు సర్వీసెస్ సెక్టార్ మెరుగ్గా రాణించేందుకు తోడ్పడ్డాయని భండారీ తెలిపారు.

కార్పొ బ్రీఫ్స్..

ఇండిజీన్ నుంచి వైదొలగిన కార్లయిల్

10.2 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కార్లయిల్ గ్రూప్ తాజాగా డిజిటల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ కంపెనీ ఇండిజీన్‌లో 10.2 శాతం వాటా విక్రయించింది. ఎన్‌ఎస్‌ఈ బల్క్‌డీల్ వివరాలు ప్రకారం షేరుకి రూ. 591–591.84 ధరల శ్రేణిలో 2.44 కోట్ల షేర్లు అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,447 కోట్లు. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, క్యాపిటల్ గ్రూప్, సొసైటీ జనరల్, ఈస్ట్‌బ్రిడ్జ్ గ్రూప్ తదితరాలు 4.42 శాతం వాటాకు సమానమైన 1.06 కోట్ల షేర్లను రూ. 627 కోట్లకు కొనుగోలు చేశాయి. ఈ నేపథ్యంలో ఇండిజీన్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 4 శాతం పతనమై రూ. 595 వద్ద ముగిసింది.

7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి మూడు గేమ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ కొత్తగా వరల్డ్ క్రికెట్ చాంపియన్స్ లీగ్, హార్స్ వరల్డ్ రైడ్, కేక్ మ్యాచ్ పేరిట మూడు గేమ్స్‌ను ప్రవేశపెట్టింది. దేశీయంగా రూపొందించిన ఈ ఉచిత గేమ్స్‌ను ప్లే స్టోర్, యాప్ స్టోర్, ఇండస్ యాప్‌స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గేమర్లకు అత్యుత్తమ మొబైల్ గేమింగ్ అనుభూతిని అందించేలా వీటిని తీర్చిదిద్దినట్లు సంస్థ ఎండీ ఎల్ ఎం శంకర్ తెలిపారు. అలాగే తమ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌రియల్‌గేమ్స్ డాట్‌కామ్‌ను కూడా ఆవిష్కరించినట్లు వివరించారు.

10 ఉత్పత్తులపై ఎస్‌ఎంఎస్ ఫార్మా కసరత్తు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ ఎస్‌ఎంఎస్ ఫార్మా అధిక వృద్ధి వ్యూహాలపై మరింత దృష్టి పెడుతోంది. వచ్చే 12–18 నెలల్లో 8–10 ఉత్పత్తులను ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో ఉంది. కొత్త ఉత్పత్తులు, కాంట్రాక్ట్ తయారీ కార్యకలాపాలపై రూ. 250 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. డైవర్సిఫైడ్ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో, వ్యయ నియంత్రణ చర్యలు, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం తదితర అంశాలు అధిక ఆదాయార్జన, లాభదాయకతకు తోడ్పడతాయని సంస్థ తమ వార్షిక నివేదికలో పేర్కొంది.



ఐపీవోకు 6 కంపెనీలు రెడీ

క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఆరు కంపెనీల ఐపీవో ప్రణాళికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌సహా డార్ఫ్–కెటల్ కెమికల్స్, విక్రమ్ సోలార్ తదితరాలు చేరాయి. ఈ ఆరు కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా ఉమ్మడిగా రూ. 20,000 కోట్లకుపైగా సమీకరించాలని ప్రణాళికలు వేశాయి. 2024 అక్టోబర్– 2025 జనవరి మధ్య సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. సెబీ అనుమతి పొందిన జాబితాలో ఏవన్ స్టీల్స్ ఇండియా, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్, శ్రీజి షిప్పింగ్ గ్లోబల్ సైతం ఉన్నాయి. గత నెలలో వచ్చిన ఐదు ఐపీవోలతో కలసి 2025లో ఇప్పటివరకూ 16 కంపెనీలు లిస్టింగ్ బాటలో సాగడం గమనార్హం!

- జాబితాలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్
- డార్ఫ్–కెటల్ కెమికల్స్, విక్రమ్ సోలార్

రూ. 12,500 కోట్లపై కన్ను



ఐపీవోలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా రూ. 10,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆఫర్ చేయనుంది. ఎన్‌బీఎఫ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను టైర్–1 మూలధన పటిష్టతకు వెచ్చించనుంది.

రూ. 5,000 కోట్లకు రెడీ



డార్ఫ్–కెటల్ కెమికల్స్ ఐపీవోలో రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని జారీ చేయనుంది. మరో రూ. 3,500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ మెనన్ ఫ్యామిలీ హోల్డింగ్స్ ట్రస్ట్ విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకోనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 829 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 333 కోట్లు అనుబంధ సంస్థలో పెట్టుబడికి వెచ్చించనుంది.

సోలార్ మాడ్యూల్ సంస్థ



ఐపీవోలో విక్రమ్ సోలార్ రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 17.45 మిలియన్ షేర్లను ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు విక్రయించనున్నాయి. ఐపీవో నిధుల్లో రూ. 793 కోట్లు అనుబంధ సంస్థ వీఎస్ఎల్ గ్రీన్ పవర్ పెట్టుబడి వ్యయాలకు కేటాయించనుంది. తద్వారా 3,000 మెగావాట్ల సోలార్ సెల్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది.

లాజిస్టిక్స్ సొల్యూషన్ల సంస్థ

షిప్పింగ్, లాజిస్టిక్స్‌సొల్యూషన్లు అందించే శ్రీజి షిప్పింగ్ గ్లోబల్ ఐపీవోలో భాగంగా 2 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ప్రధానంగా డ్రై బల్క్ కార్గోకు సేవలందించే కంపెనీ ఇష్యూ నిధుల్లో రూ. 289 కోట్లు సూపర్‌మ్యాక్స్ విభాగంలో సెకండరీ మార్కెట్ నుంచి డ్రై బల్క్ క్యారియర్స్ కొనుగోలుకి వెచ్చించనుంది. మరో రూ. 20 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది.

బంగారు ఆభరణ కంపెనీ

పబ్లిక్ ఇష్యూలో భాగంగా బంగారు ఆభరణాల తయారీ కంపెనీ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ 1.8 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధుల్లో రూ. 46 కోట్లు జైపూర్ యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. మరో రూ. 190 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 20 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది.

ఏవన్ స్టీల్స్ ఇండియా సై

ఐపీవోలో భాగంగా ఏవన్ స్టీల్స్ ఇండియా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 50 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ వన్యా స్టీల్స్‌లో పెట్టుబడులకు వినియోగించనుంది. తద్వారా మెషీనరీ కొనుగోలు, తయారీ సామర్థ్య విస్తరణ, విద్యుత్ యూనిట్ ఏర్పాటు, రుణ చెల్లింపులు చేపట్టనుంది.

ఏబీఎఫ్ఆర్ఎల్ నుంచి ఫ్లిప్‌కార్ట్ ఔట్

6 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ తాజాగా ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్(ఏబీఎఫ్ఆర్ఎల్) నుంచి వైదొలగింది. కంపెనీలోగల మొత్తం 6 శాతం వాటా విక్రయించింది. బ్లాక్‌డీల్స్ ద్వారా షేరుకి రూ. 79.5 ఫ్లోర్ ధరలో 7.31 కోట్ల షేర్లు అమ్మివేసింది. వీటి విలువ రూ. 583 కోట్లుకాగా.. మంగళవారం ముగింపు ధర రూ. 86తో పోలిస్తే 7.6 శాతం డిస్కౌంట్‌లో వాటా విక్రయించింది. ఈ ప్రభావంతో ఏబీఎఫ్ఆర్ఎల్ షేరు తాజాగా 11 శాతం పతనమైంది. రూ. 77 వద్ద నిలిచింది. 2020 అక్టోబర్‌లో ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ నుంచి రూ. 1,500 కోట్లు సమకూర్చుకుంటున్నట్లు ఏబీఎఫ్ఆర్ఎల్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

3 రోజుల నష్టాలకు చెక్

261 పాయింట్లు ప్లస్ • 80,998 వద్దకు సెన్సెక్స్ • నిఫ్టీ 78 పాయింట్లు అప్

ముంబై: ప్రధానంగా బ్లూచిప్ కౌంటర్లలో కొనుగోళ్ల కారణంగా దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సెన్సెక్స్ 261 పాయింట్లు పుంజుకుని 80,998 వద్ద ముగిసింది. 78 పాయింట్లు ఎగసిన నిఫ్టీ 24,620 వద్ద స్థిరపడింది. అయితే తొలుత లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు వెంటనే స్వల్ప నష్టాలలోకి ప్రవేశించినప్పటికీ తిరిగి కోలుకున్నాయి. ఆపై ట్రేడింగ్ గడిచేకొద్దీ బలపడ్డాయి. వెరసి ఇంట్రాడేలో సెన్సెక్స్ 350 పాయింట్లు జంప్‌చేసి 81,087ను తాకింది. నిఫ్టీ సైతం 24,644వరకూ బలపడింది. అంచనాలను మించిన యూఎస్ ఉపాధి గణాంకాలకు తోడు టారిఫ్‌లపై యూఎస్, చైనా వాణిజ్య చర్చలు సెంటిమెంటుకు జోష్‌నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు.



బ్లూచిప్స్ దన్ను

ఎన్‌ఎస్‌ఈలో మెటల్, ఆయిల్ రంగాలు 0.6 శాతం పుంజుకోగా.. రియల్టీ 0.7 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో ఎటర్నల్, జియో ఫైనాన్స్, ఇండస్‌ఇండ్, టాటా మోటార్స్, ఎయిర్‌టెల్, బీఈఎల్, టెక్ఎం, ఆర్ఐఎల్, టాటా కన్జూమర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3–1 శాతం మధ్య వృద్ధి చూపాయి. అయితే బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్, ఐషర్, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్, ఎల్అండ్‌టీ, టైటన్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ 1.6–0.5 శాతం మధ్య డీలా పడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.6 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,027 లాభపడగా.. 1,993 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా రూ. 1,076 కోట్లు, దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 2,567 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

లిస్టింగ్‌లో స్కోడా ట్యూబ్స్ జూమ్

స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, పైపుల తయారీ కంపెనీ స్కోడా ట్యూబ్స్ బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో ఇష్యూ ధర రూ. 140 వద్ద లిస్టయ్యింది. తదుపరి 5 శాతం జంప్‌చేసి రూ. 147 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 880 కోట్లను తాకింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-6-2025	
విశాఖ	535–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525–00
వరంగల్	527–00
రిటైల్ ధర	5.85

రూపాయి నేలచూపు

డాలరుతో మారకంలో 85.87కు

ముంబై: దేశీ కరెన్సీ రెండో రోజు డీలా పడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో రూపాయి 26 పైసలు క్షీణించి 85.87 వద్ద నిలిచింది. రూపాయి 85.69 వద్ద ప్రారంభమై 86.05 వరకూ పతనమైంది. మంగళవారం సైతం రూపాయి 22 పైసలు కోల్పోయి 85.61 వద్ద ముగిసిన విషయం విదితమే. వెరసి రెండు రోజుల్లో 48 పైసలు నష్టపోయింది. కాగా.. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 99.11కు చేరింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

జవహర్ నవోదయ పరీక్ష-2026

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ)లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష–2026కు నోటిఫికేషన్ విడుదలైంది. ఏటా ఈ ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తారు.

- » **అర్హత:** విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాలో నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి.
- » **వయసు:** దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్యలో జన్మించినవారై ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు 80 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, అర్థమేటిక్, లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. తెలుగు/ఇంగ్లిష్/హిందీ/మరాఠీ/ఉర్దూ/ఒరియా/కన్నడ మాధ్యమాలలో ప్రశ్నాపత్రం ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 29.07.2025.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 13.12.2025.
- » **ఫలితాల వెల్లడి తేది:** మార్చి 2026.
- » **వెబ్‌సైట్:** www.navodaya.gov.in/

ఇస్రో తిరువనంతపురంలో 83 పోస్టులు

తిరువనంతపురంలోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)లో.. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 83.
- » **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్–76, సైంటిఫిక్ అసిస్టెంట్–05, లైబ్రరీ అసిస్టెంట్ ఏ–02.
- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, ఆటోమొబైల్, సివిల్, రిఫ్రిజిరేషన్–ఏసీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్) డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.44,900 నుంచి రూ.1,42,400.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 18.06.2025.
- » **వెబ్‌సైట్:** https://www.isro.gov.in/

హెచ్‌పీసీఎల్‌లో 372 పోస్టులు

ముంబైలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 372.
- » **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, జూనియర్ ఎగ్జిక్యూటివ్(సివిల్), జూనియర్ ఎగ్జిక్యూటివ్(మెకానికల్), జూనియర్ ఎగ్జిక్యూటివ్ క్వాలిటీ కంట్రోల్, ఇంజనీర్(ఎలక్ట్రికల్), సీఏ, ఆఫీసర్(హ్యూమన్ రిసోర్స్), ఇంజనీర్(మెకానికల్), ఇంజనీర్(కెమికల్), ఆఫీసర్(ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్), మేనేజర్ (ఇన్‌స్ట్రుమెంటేషన్), ఇంజనీర్(సివిల్), జూనియర్ ఎగ్జిక్యూటివ్ (మెకానికల్), మేనేజీరియల్ పోస్టులు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీటెక్/బీఈ, డిప్లొమా, సీఏ, ఎంఏ, ఎంబీఏ/పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 45 ఏళ్లు ఉండాలి.
- » **ఎంపిక విధానం:** సీబీటీ/రాత పరీక్ష/నెట్ స్కోర్/టైపింగ్ టెస్ట్/గ్రూప్ టాస్క్ తదితర టెస్ట్‌ల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
- » **వెబ్‌సైట్:** https://hindustanpetroleum.com/

అడ్వాన్స్‌డ్.. ఐఐటీలతోపాటు మరెన్నో!

- » అడ్వాన్స్‌డ్ ర్యాంకుతో టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు
- » ఐఐఎస్సీ, ఐఐఎస్‌టీ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌ల్లో అడ్మిషన్స్

జేఈఈ అడ్వాన్స్‌డ్.. ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్! ఐఐటీల్లోని దాదాపు 18 వేల సీట్లకు ఏటా 2.5 లక్షల మంది పోటీపడతారు. దీంతో తీవ్ర పోటీ కారణంగా ఐఐటీల్లో సీటు దక్కని విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతుంటారు. ఇలాంటి విద్యార్థులు ఐఐటీలకు దీటుగా నిలుస్తున్న టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. అడ్వాన్స్‌డ్ ర్యాంకుతో అడ్మిషన్ సొంతం చేసుకోవచ్చు!! తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలు వెల్లడయ్యాయి. ఐఐటీలు, నిట్‌లు, ట్రిపుల్ఐటీలు, ఇతర జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలకు జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుతో ప్రవేశం కల్పించే ఐఐటీలకు దీటైన ఇన్‌స్టిట్యూట్స్‌పై ప్రత్యేక కథనం..



ఇంజనీరింగ్ స్పెషల్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్

సైన్స్ విభాగాల్లో నిపుణులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ఏర్పాటై.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న ఇన్‌స్టిట్యూట్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్– ఐఐఎస్సీ(బెంగళూరు). ఈ విద్యాసంస్థలో నాలుగేళ్ల వ్యవధిలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (రీసెర్చ్) కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులు బయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌ల్లో ఏదో ఒక సబ్జెక్ట్‌ను మేజర్‌గా ఎంచుకుని రీసెర్చ్ చేయొచ్చు. అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 120. అడ్వాన్స్‌డ్ 2025 ర్యాంకుతో ప్రవేశం పొందొచ్చు. ఇంటర్‌లో ఎంపీసీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి.

- ✧ **రీసెర్చ్ ఓరియెంటేషన్:** అకడమిక్స్‌లో భాగంగా రీసెర్చ్ దృక్పథంతో బోధన సాగించడం ఈ బీఎస్ డిగ్రీ ప్రత్యేకతగా చెప్పొచ్చు. ఫ్యాకల్టీ చేస్తున్న రీసెర్చ్‌లో విద్యార్థులు పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తారు. ఇండస్ట్రీ కొలాబరేషన్స్‌లో భాగంగా కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది.
- ✧ **ఆకర్షణీయ వేతనాలు:** ఐఐఎస్సీ బెంగళూరులో బీఎస్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు ఖరారవుతున్నాయి. ఐటీ కంపెనీలు మొదలు మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల వరకూ ఆఫర్లు అందిస్తున్నాయి. గత ఏడాది ప్లేస్‌మెంట్‌లో కనీస వార్షిక వేతనం రూ.6 లక్షలుగా.. గరిష్ఠ వార్షిక వేతనం రూ.11 లక్షలుగా నమోదైంది. ఉన్నత విద్య పరంగా పరిశోధన కోర్సుల్లో చేరొచ్చు.
- ✧ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 06.06.2025.
- ✧ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ug.iisc.ac.in/index.html

అంతరిక్ష కోర్సులకు.. ఐఐఎస్‌టీ

ఐఐటీలకు దీటైన మరో ప్రత్యామ్నాయ విద్యా సంస్థ.. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ స్పేస్ సైన్స్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ). అంతరిక్ష శాస్త్రంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు ఇస్రో ఆధ్వర్యంలో ఈ ఇన్‌స్టిట్యూట్ ప్రత్యేకంగా ఏర్పాటైంది.

- ✧ **బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సులు:** ప్రస్తుతం ఐఐఎస్‌టీలో నాలుగేళ్ల వ్యవధిలోని బీటెక్ ప్రోగ్రామ్‌లు, అయిదేళ్ల వ్యవధిలోని బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) బ్రాంచ్‌లు ఉన్నాయి. బీటెక్ కోర్సుల్లో సీట్లను జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు.
- ✧ **ఆర్థిక ప్రోత్సాహకాలు:** ఐఐఎస్‌టీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా లభిస్తున్నాయి. సెమిస్టర్ ఫీజు రూ.62,500 కాగా, కుటుంబ వార్షికాదాయం రూ.5లక్షలు లోపు ఉన్న వారికి ఈ ఫీజును రూ.20,850గా పేర్కొన్నారు. అదే విధంగా రూ.లక్ష లోపు కుటుంబ వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పూర్తిగా ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు కల్పిస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వేయిలోపు ర్యాంకు పొంది దరఖాస్తు చేసుకున్న వారిలో మొదటి అయిదుగురు విద్యార్థులకు మొదటి సంవత్సరం ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ఇలాంటి విద్యార్థులు మొదటి సంవత్సరంలో 9 జీపీఏ సాధిస్తే తర్వాత సంవత్సరాల్లో కూడా ఈ సదుపాయం కొనసాగుతుంది. అదే విధంగా ఒక సెమిస్టర్‌లో 9 జీపీఏ సాధించిన విద్యార్థులకు తర్వాత సెమిస్టర్‌లో ఫీజులో 50 శాతం మినహాయింపు ఇస్తారు.
- ✧ **ఇస్రోలో సైంటిస్ట్‌లుగా:** బీటెక్, డ్యూయల్ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి ఇస్రోలోనే సైంటిస్ట్/ఇంజనీర్‌గా కొలువులు ఖరారు చేస్తారు. వీరు తప్పనిసరిగా కనీసం 7.5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కూడా వీరికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- ✧ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 09.06.2025
- ✧ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్ :** www.iist.ac.in/

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)

పెట్రోలియం రంగంలో నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఏర్పాటైన విద్యాసంస్థ.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ). 2016లో విశాఖపట్నంలో నెలకొల్పిన ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ఐఐటీలు, ఐఐఎంలతో సమానంగా జాతీయ ప్రాముఖ్యం కలిగిన ఇన్‌స్టిట్యూట్‌గా (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) గుర్తింపు లభించింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రస్తుతం బీటెక్–పెట్రోలియం ఇంజనీరింగ్, బీటెక్–కెమికల్ ఇంజనీరింగ్, బీటెక్ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ ప్రోగ్రామ్‌లు, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి.

- ✧ **అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా బీటెక్ సీటు:** ఈ ఇన్‌స్టిట్యూట్‌లోని బీటెక్ ప్రోగ్రామ్ (పెట్రోలియం ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, కెమికల్ ఇంజనీరింగ్)లలో జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఈ సీట్ల భర్తీకి ఐఐపీఈ ప్రత్యేకంగా దరఖాస్తు ప్రక్రియ చేపడుతుంది. అభ్యర్థులు ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులు, అభ్యర్థుల ర్యాంకును పరిగణనలోకి తీసుకొని సీట్లను కేటాయిస్తారు.
- ✧ **కెరీర్ అవకాశాలు:** ఐఐపీఈ అనుసరిస్తున్న విధానాలు, కార్పొరేట్ రిలేషన్స్ కారణంగా విద్యార్థులకు కోర్సు పూర్తి చేస్తూనే ఎంఎన్‌సీ కంపెనీల్లో కొలువులు ఖాయమవుతున్నాయి. పెట్రోలియం రంగంలో హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్, గెయిల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ, అరబిందో ఫార్మా, యాక్సెంచర్ వంటి సంస్థలు క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించి రూ. లక్షల వేతనంతో కొలువులు ఖరారు చేస్తున్నాయి.
- ✧ **దరఖాస్తు విధానం:** త్వరలో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది.
- ✧ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** iipe.ac.in

ఆర్‌జీఐపీటీ

జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు మరో మంచి ప్రత్యామ్నాయం.. అమేథీలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్ జీఐపీటీ). పెట్రోలియం రంగంలోని పలు ప్రముఖ సంస్థల సహ భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ ఇన్‌స్టిట్యూట్‌కు కూడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ హోదా ఉంది. ఈ విద్యాసంస్థ ప్రస్తుతం నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌లు, అదే విధంగా ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు అందిస్తోంది. వీటిలో ప్రవేశానికి జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు అర్హులు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆ తర్వాత జేఈఈ మెయిన్ ర్యాంకర్లకు అవకాశం కల్పిస్తారు.

- ✧ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 15.06.2025
- ✧ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** rgipt.ac.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–టీచింగ్ ఆప్టిట్యూడ్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్– జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్


అమెరికాపై చైనా.. ‘ఆగ్రో టెర్రరిజం’

చైనా కమ్యూనిస్టు పార్టీ కుతంత్రమే

మిచిగాన్ యూనివర్సిటీలో ఇద్దరు చైనీయుల అరెస్ట్


- ధాన్యం దిగుబడిని చావుదెబ్బ తీసే శిలీంధ్రం అక్రమ రవాణా
- మిచిగాన్ యూనివర్సిటీలో పరిశోధనల కోసమేనన్న నిందితురాలు
- ఇది జాతి భద్రతకే ప్రత్యక్ష ముప్పు: ఎఫ్‌బీఐ డైరెక్టర్

ఆగ్రో టెర్రరిజానికి పాల్పడిన ఇద్దరు చైనీయులను అమెరికా పోలీసులు అక్కడి కాలమానం ప్రకారం మంగళవారం అరెస్ట్ చేయటంతో ప్రపంచ దేశాలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాయి. పంటలకు తీవ్రనష్టం కలిగించటం ద్వారా వ్యవసాయ, ఆహార భద్రతకు విఘాతం కలిగించే ఉగ్రవాద చర్యలను ఆగ్రో టెర్రరిజంగా చెబుతారు. అదే దురుద్దేశంతో ‘ఫ్యూసేరియం గ్రామినిరమ్’అనే ప్రమాదకరమైన శిలీంధ్రాన్ని అక్రమంగా, కుట్రపూరితంగా అమెరికాలోకి తెచ్చారన్న ఆరోపణపై చైనా పౌరులైన యుంకింగ్ జియాన్, ఆమె సన్నిహితుడు జున్‌యాంగ్ లియులను అమెరికా పోలీసులు అరెస్ట్ చేసి, విచారణ జరుపుతున్నారు. ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా కూడా చైనా నుంచే వ్యాప్తిలోకి వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఇటీవల అమెరికా.. చైనా నుంచి వస్తువుల దిగుమతిపై సుంకాలు అతి భారీగా పెంచిన నేపథ్యంలో తాజా ఆగ్రో టెర్రరిజం చర్య చర్చనీయాంశమైంది.



యుంకింగ్ జియాన్ చైనా కమ్యూనిస్టు పార్టీ విధేయురాలని, ఈ ప్రమాదకర శిలీంధ్రంపై చైనాలో పరిశోధన చేసిన ఆమెకు చైనా ప్రభుత్వం నిధులు ఇచ్చినట్లు కూడా ఆధారాలున్నాయని కాష్ పటేల్ తెలిపారు. ‘సహ నిందితుడైన ఆమె సన్నిహితుడు జున్‌యాంగ్ లియు కూడా చైనా యూనివర్సిటీలో ఇదే శిలీంధ్రంపైనే పరిశోధనలు చేస్తుండేవాడు. ఈ శిలీంధ్రంపై మిచిగాన్ యూనివర్సిటీలో పరిశోధనల కోసమే డెట్రాయిట్ మెట్రోపాలిటన్ ఎయిర్‌పోర్ట్ ద్వారా గత ఏడాది అక్రమంగా రవాణా చేసినట్లు లియు తొలుత బుకాయించినా, తర్వాత తప్పు అంగీకరించారని తెలిపారు. వీరిద్దరిపైనా కుట్ర, అమెరికాలోకి వస్తువుల స్మగ్లింగ్, తప్పుడు స్టేట్‌మెంట్లు, వీసా అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోదు చేశా’మని కాష్ పటేల్ తెలిపారు.

అమెరికా ఆహార వ్యవస్థను దెబ్బతీయటం ద్వారా తీవ్ర పరిణామాలు కల్పించి అమెరికా ప్రజల జీవితాలను, ఆర్థిక వ్యవస్థను పెనుప్రమాదంలోకి నెట్టాలన్న కుతంత్రంతో చైనా కమ్యూనిస్టు పార్టీ అనుక్షణం పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ దుర్బుద్ధితోనే పరిశోధకులను, ఇతరులను అమెరికా సంస్థల్లోకి పనిగట్టుకొని చొప్పిస్తోందని చెప్పటానికి ఇదొక ప్రబల నిదర్శనం అని కాష్ పటేల్ అన్నారు. ఈ కుతంత్రాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ఎఫ్‌బీఐ అవిశ్రాంతంగా కృషి చేస్తూనే ఉంటుందన్నారు. నష్టం జరగకముందే ఈ ముప్పును పసిగట్టడంలో డెట్రాయిట్ ఎఫ్‌బీఐ బృందం, కస్టమ్స్–సరిహద్దు భద్రతా దళాలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు.



ఆగ్రో టెర్రరిజం మూలాలు..

మధ్య ప్రాచ్యానికి చెందిన అస్సిరియన్ అనే జాతి వారు క్రీ.పూ. 660లోనే వ్యవసాయ సంబంధమైన ఉగ్రవాదచర్యకు తొలిసారి పాల్పడ్డారని చరిత్ర చెబుతోంది. ధాన్యపు పంటలను నాశనం చేసే ఎర్గోట్ అనే శిలీంధ్రాన్ని ప్రయోగించి శత్రువుల నీటి వనరులను అస్సిరియన్లు కలుషితం చేశారు. ఆధునిక కాలంలో తొలి ప్రపంచ యుద్ధంలో జర్మనీ గ్లాండర్స్, ఆంత్రాక్స్ క్రిములను శత్రువుల గుర్రాలపై ప్రయోగించింది. యూరప్‌లో శత్రు సేనలకు సరఫరా అయ్యే ధాన్యాగారాలపై ఈ ఫంగస్‌లను ప్రయోగించినట్టు చెబుతారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో.. బ్రిటన్‌లోని బంగాళా దుంపల పొలాలను ‘కొలరాడో పొటాటో బీటిల్స్’సాయంతో నాశనం బ్రిటన్ చేయాలని ప్రయత్నించింది. విమానం సాయంతో వీటిని పొలాల్లోకి విడిచిపెట్టింది.

ప్రమాదకరమైన ఫంగస్

‘ప్రమాదకరమైన జీవాయుధాన్ని అక్రమంగా దేశంలోకి తీసుకురావటం వ్యవసాయ సంబంధమైన ఉగ్రవాద చర్య. యావత్ జాతి భద్రతకే ఇది ప్రత్యక్ష ముప్పు’వంటిదని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ కాష్ పటేల్ ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ‘‘యుంకింగ్ జియాన్ అనే యువతి మిచిగాన్ యూనివర్సిటీలో పరిశోధనల కోసం ఫ్యూసేరియం గ్రామినిరమ్ అనే ప్రమాదకరమైన శిలీంధ్రాన్ని దేశంలోకి అక్రమంగా తీసుకువచ్చినట్లు భావిస్తున్నాం. గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ తదితర పంటల్లో ‘కంకి ఎండు తెగులు’ను కలిగించటం ద్వారా దిగుబడిని తీవ్రంగా నష్టపరిచే అత్యంత ప్రమాదకరమైన ఫంగస్ ఇది. ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల డాలర్ల మేర ఆర్థిక నష్టానికి కారణమవుతున్న ఈ శిలీంధ్రం.. పంటలను దెబ్బతీయటంతో పాటు మనుషులు, పశువుల తీవ్రమైన అనారోగ్య సమస్యలను సృష్టించగలదు’అని ఆయన పేర్కొన్నారు.

పాక్ ద్వారా మన దేశంలోకీ..

చైనా, పాకిస్తాన్ సరిహద్దుల ద్వారా భారత్‌కు కూడా ఆగ్రో టెర్రరిజం ముప్పు పొంచి ఉందన్న చర్చ జరుగుతోంది. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పత్రాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లో కనిపించిన ఒక ప్రమాదకర ఫంగస్ 2016లో పశ్చిమ బెంగాల్‌లోని 2 జిల్లాల్లోకి ప్రవేశించింది. గోధుమ పంటను నాశనం చేసే ఆ ఫంగస్‌ను ప్రభుత్వం సమర్థంగా నాశనం చేసింది. మూడేళ్ల పాటు గోధుమ పంట వేయకుండా ఆదేశాలు జారీచేసి, ఆ ఫంగస్ విస్తరించకుండా చేయగలిగింది. అంతకుముందు 2015లో పత్తి పంటను నాశనం చేసే ప్రమాదకర వైరస్ పాకిస్తాన్ నుంచి దక్షిణ పంజాబ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. దాదాపు మూడింట రెండొంతుల పత్తి పంట నాశనమైపోయింది. సుమారు 670 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. పంట నష్టాన్ని భరించలేక సుమారు 15 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

సాక్షి, స్పెషల్ డెస్క్

తెలంగాణ ఎఫ్‌ఎస్‌ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు

- ‘గవర్నమెంట్ ఎగ్జామినర్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్’గా చేసిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (టీజీఎఫ్‌ఎస్‌ఎల్)కి అరుదైన గుర్తింపు లభించింది. ఐటీ చట్టం–2000లోని సెక్షన్ 79ఏ కింద టీజీఎఫ్‌ఎస్‌ఎల్‌ను ‘గవర్నమెంట్ ఎగ్జామినర్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్’గా కేంద్ర ఐటీ, సమాచార మంత్రిత్వశాఖ గుర్తిస్తూ నోటిఫై చేసింది. ఈ విషయాన్ని టీజీఎఫ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ సాక్ష్యాల సేకరణ, నిర్ధారణ, విశ్లేషణలో టీజీఎఫ్‌ఎస్‌ఎల్ సామర్థ్యాన్ని, విశ్వసనీయతను ఇది మరింత పెంచుతుందన్నారు. ఈ గుర్తింపుతో టీజీఎఫ్‌ఎస్‌ఎల్‌కు దేశవ్యాప్తంగా కేసుల్లో ఎలక్ట్రానిక్ సాక్ష్యాల పరిశీలన, పరిశోధనతోపాటు తగిన ధ్రువీకరణ నివేదికలు ఇచ్చేందుకు చట్టబద్ధత లభించిందని పేర్కొన్నారు. టీజీఎఫ్‌ఎస్‌ఎల్ సమర్పించే ఆధారాలను దేశంలోని అన్ని కోర్టులు విశ్వసనీయమైనవిగా పరిగణనలోకి తీసుకోనున్నాయని ఆమె ప్రకటనలో వివరించారు. ప్రస్తుతం తమ సంస్థ నెలకు 50 కేసుల చొప్పున ఆధారాల విశ్లేషణతోపాటు అత్యంత సున్నితమైన, సంచలన కేసుల్లోనూ కీలకపాత్ర పోషిస్తోందన్నారు.

మొబైల్ మహారాణులు

రాష్ట్రంలో పురుషులను మించి మొబైల్ ఫోన్లు వాడుతున్న మహిళలు

- సొంతంగా ఫోన్లు అధికంగా ఉన్నది మాత్రం పురుషుల వద్దే
- మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ వినియోగం తెలంగాణలోనే ఎక్కువ
- రాష్ట్రంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ వినియోగిస్తున్న 63% మంది
- 26.4 శాతం మంది యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వాడకం
- కాంప్రహెన్సివ్ మాడ్యులార్ సర్వే–టెలికం 2025లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం స్మార్ట్‌గా దూసుకెళుతోంది. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ వినియోగం దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలోనే ఎక్కువగా ఉందని కాంప్రహెన్సివ్ మాడ్యులార్ సర్వే– టెలికం 2025లో వెల్లడైంది. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు శాఖ ఈ ఏడాదే ఈ సర్వే నిర్వహించింది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు, యూపీఐల ద్వారా నగదు చెల్లింపులు తెలంగాణలోనే ఎక్కువగా జరుగుతున్నాయని సర్వేలో తేలింది. మరో ఆసక్తికర విషయం ఏమిటంటే రాష్ట్రంలో పురుషులకంటే మహిళలే మొబైల్ ఫోన్లు ఎక్కువగా వాడుతున్నారు. సొంతంగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్న వారిలో కూడా మహిళలే ముందుండటం విశేషం. సర్వేలోని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది జనవరి–మార్చి మధ్య కాలంలో సర్వే నిర్వహించారు. దేశవ్యాప్తంగా 2,395 గ్రామీణ, 1,987 పట్టణ ప్రాంతాల్లో 34,950 కుటుంబాల్లోని 1,42,065 మంది అభిప్రాయాలు తీసుకున్నారు.
- 15–29 ఏళ్ల మధ్య వయస్కుల్లో 97.1 శాతం మంది సర్వే జరిపిన రోజు కంటే ముందు మూడు నెలల కాలంలో మొబైల్ ఫోన్ వినియోగించారు. ఇందులో 98 శాతం మంది పురుషులు, 96 శాతం మంది మహిళలు ఉన్నారు. 2022–23లో 96.4 శాతం మంది పురుషులు, 91.8 శాతం మంది మహిళలు మొబైల్ ఫోన్ వాడినట్టు వెల్లడైంది.
- తెలంగాణలో 98.3 శాతం మంది పురుషులు, 98.6 శాతం మంది మహిళలు మొబైల్ ఫోన్ వాడుతున్నారని తేలింది. రాష్ట్ర సగటు 98.4 శాతంగా నమోదైంది. మిజోరం, అండమాన్ నికోబార్, చండీగఢ్, లక్షద్వీప్‌లో 100 శాతం మంది మొబైళ్లు వాడుతున్నారు. అయితే, వాడుతున్న వారితో పోలిస్తే సొంతంగా మొబైల్ ఫోన్ ఉన్న వారి సంఖ్య తగ్గింది. తెలంగాణలో 87.7 శాతం మంది పురుషులు, 78.3 శాతం మంది మహిళలకు సొంతంగా ఫోన్లు ఉన్నాయని సర్వేలో వెల్లడైంది.
- దేశవ్యాప్తంగా 70 శాతం మంది ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. తెలంగాణలో 72.2 శాతం మంది ఇంటర్నెట్ వాడుతున్నారు. ఇందులో 79.9 శాతం మంది పురుషులు, 64.9 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇంటర్నెట్ వినియోగంలో దేశంలో చండీగఢ్ (94.6 శాతం), మిజోరం (92.7 శాతం)లు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.
- తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 51.9%, పట్టణ ప్రాంతాల్లో 77.3 శాతం మంది ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు జరుపుతున్నారని సర్వేలో వెల్లడైంది. అంటే సగటున 63.5 శాతం మంది ఆన్‌లైన్ బ్యాంకింగ్ వాడుతున్నారు. ఇందులో దేశసగటు 48.9 మాత్రమే ఉంది.
- తెలంగాణలో 26.4% (18.9 శాతం మంది గ్రామీణ, 32.3 శాతం పట్టణ) మంది యూపీ ఐల ద్వారా నగదు చెల్లింపులు జరుపుతుండగా, దేశవ్యాప్తంగా ఇది 18 శాతం ఉంది.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.



ఈస్ట్ లండన్‌లో వెన్నుపోటు దినం



లెస్టర్‌లో నల్లచొక్కాలు వేసుకొని, ప్లకార్డులు పట్టుకొనినిరసన కార్యక్రమం

విదేశాల్లోనూ వెన్నుపోటు దినం విజయవంతం

చంద్రబాబు ప్రభుత్వంపై ఏడాదిలో ప్రజా వ్యతిరేకత సుస్పష్టం: డాక్టర్ ప్రదీప్ చింతా

ప్రజలను 'వెన్నుపోటు' పొడిచిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమే: మలిరెడ్డి కిషోర్



సాక్షి, అమరావతి/జి.కొండూరు: ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వంపై తొలి ఏడాదిలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత వచ్చిందని, వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఇది సుస్పష్టంగా కనిపించిందని ఆ పార్టీ యూకే కమిటీ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా తెలిపారు. 30 ఏళ్లుగా చంద్రబాబు ఇలాగే ఎన్నికల సమయంలో మోసపు మాటలతో అమాయక తెలుగు ప్రజలను వంచిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు విదేశాల్లోనూ వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ ఆధ్వ ర్యంలో బుధవారం లండన్‌లో డా.ప్రదీప్ చింతా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు కదంతొక్కారు. లెస్టర్‌లో వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ కో కన్వీనర్ చలపతి సర్ప ఆధ్వ ర్యంలో.. నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు.

- ఈస్ట్ లండన్‌లో వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ కో కన్వీనర్ మలిరెడ్డి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఎన్ఆర్ఐల నుంచి విశేష స్పందన లభించింది. ''నీకు రూ.15 వేలు నీకు రూ.15 వేలు ఏదీ'', ''ఉచిత గ్యాస్ సిలిండర్లు అన్నారు ఎక్కడ?'', ''50 ఏళ్లకు పెన్షన్ ఏది బాబూ?'' ''రెడ్‌బుక్ రాజ్యాంగంతో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు'', ''ఉచిత బస్సు తుస్సు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 అన్నావ్.. ఆడపడుచులనూ మోసం చేశావ్..'' అంటూ ప్లకార్డులతో నినాదాలుచేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున తరలివచ్చి విజయంతం చేశారు.

జేబులు నింపుకోవడమే కూటమి కార్యక్రమం

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి సంవత్సరం పూర్తి అయినా ఏ ఒక్క హామీని కూడా అమలుచేయకుండా కూటమి నేతల జేబులు నింపుకొనే కార్యక్రమం చేపట్టిందని ప్రదీప్ చింతా దుయ్యబట్టారు. వికలాంగుల పింఛను నుంచి రైతన్నలకు అందించే సాయం వరకు, మహిళలకు ఫ్రీ బస్సు నుంచి తల్లికి వందనం వరకు ఏ ఒక్క హామీని నెరవేర్చక కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మలిరెడ్డి కిషోర్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచిన తర్వాత పథకాలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనన్నారు.ఎన్నికల ప్రచార సభల్లో ఒకరికి ముగ్గురు చొప్పున బాబు, పవన్, పురందరేశ్వరి చెప్పిన అబద్ధాన్ని పదేపదే చెప్పి ప్రజలను మోసం చేసి అధికారాన్ని చేపట్టి హామీలను నెరవేర్చకుండా ఆర్థిక విధ్వంసానికి పాల్పడుతున్నారని చలపతి సర్ప విమర్శించారు. కార్యక్రమంలో చల్లా మధు సూదన్ యాదవ్, ప్రణయ్ గడిమే, ఆనంద్ అక్కి దాసు, రామిరెడ్డి జయచంద్రారెడ్డి, చలపతి గుర్ర, యశ్వంత్ గరికపాటి, సాయి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.




అట్లాంటాలో వైఎస్సార్‌సీపీ అభిమానుల నిరసన

అట్లాంటాలో వెన్నుపోటు దినం

సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐలు, వైఎస్సార్ అభిమానులు, వైఎస్ జగన్ అభిమానులు అమెరికాలోని అట్లాంటాలో బుధవారం వెన్నుపోటు దినం నిరసనను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ''2019–24 మధ్య ఏ రంగంలోనైనా సమస్య ఏర్పడినప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం తక్షణం స్పందించింది. నిరంతరం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి చురుగ్గా నడిపించారు. సమస్యలను పరిష్కరించే దాక విశ్రమించలేదు. కూటమి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచనే చేయడం లేదు. ఎక్కడా ప్రజా సమస్యల గురించి మాట్లాడటం, వాటి పరిష్కారాన్ని చూపే ప్రయత్న చేయడం లేదు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు'' అని విమర్శించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హృదయం అద్దమనీ.. పగిలితే అతకదనీ..

వేధిస్తున్న బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్ • మహిళల కంటే పురుషుల్లో రెట్టింపు మరణాలు • అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ అధ్యయనంలో వెల్లడి



ఇష్టమైన వ్యక్తి చనిపోతే చూసి తట్టుకోలేక గుండె పట్టుకొని కూలిపోవడం వంటి దృశ్యాలు సినిమాల్లో చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి ఘటనలు నిజ జీవితంలో జరిగేవే అంటున్నారు వైద్య నిపుణులు. నిజ జీవితంలోనూ ప్రియమైన వ్యక్తుల అకాల మరణం, అనారోగ్యం పాలైన విషయం తెలుసుకున్న సందర్భాల్లో తీవ్ర ఒత్తిడి, దుఃఖం, ఆవేదన వెంటాడతాయని, ఇలాంటి ప్రతికూల భావోద్వేగాలు గుండె పనితీరుపై ప్రభావం చూపుతాయి. ఈ పరిస్థితినే బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్ అని పిలుస్తారని వారంటున్నారు. ఇంతకీ బ్రోకెన్ హార్ట్ అంటే ఏంటి? దాని పరిణామాలు మనిషి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి? సాక్షి, అమరావతి

టకోట్సుబో కార్డియో మయోపతి..

బ్రోకెన్ హార్ట్ ను వైద్య పరిభాషలో టకోట్సుబో కార్డియో మయోపతిగా పేర్కొంటారు. సాధారణంగా పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ సమస్య అధికం. అయితే మరణాల విషయంలో మహిళలతో పోలిస్తే పురుషుల్లోనే రెట్టింపు ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఈ విషయమై ఇటీవల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఓ జర్నల్‌ను ప్రచురించింది.

1.99 లక్షల మంది రోగులపై అధ్యయనం

2016–2020 మధ్యలో అమెరికాలో 1,99,890 బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్ మరణాలు సంభవించాయి. వీటిపై పరిశోధకులు సుదీర్ఘ అధ్యయనం చేశారు. ఈ క్రమంలో పురుషుల్లో మరణాల రేటు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మొత్తం మరణాల రేటు 6.5 శాతంగా నమోదుకాగా, పురుషుల్లో 11.2, మహిళల్లో 5.5 శాతం మరణాలు సంభవించాయని అధ్యయనంలో వెల్లడించారు.

ఆ వయస్కులవారికే అధికం

సాధారణంగా బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్ ప్రభావం 61 ఏళ్లు పైబడినవారిపైనే అధికం. 31–45 సంవత్సరాల వయసు గల వారితో పోలిస్తే 46–60 సంవత్సరాల వారిలో సమస్య 2.6 నుంచి 3.25 రెట్లు ఎక్కువ. టకోట్సుబో కార్డియో మయోపతి అనేది ప్రతికూల భావోద్వేగం, తీవ్రఒత్తిడితో కూడిన గుండె జబ్బు అని పరిశోధకులు వెల్లడించారు.

సమస్య తలెత్తితే..

బ్రోకెన్ హార్ట్ కారణంగా..గుండెలో కొంత భాగం తాత్కాలికంగా పెద్దదిగా మారుతుంది. రక్త ప్రసరణ నిలిచిపోతుంది. గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కనిపిస్తాయి.

భావోద్వేగ మద్దతు అవసరం




కావాల్సినవాళ్లు, అత్యంత ఆప్తులు దూరమైన సందర్భాల్లో కొందరు తీవ్ర భావోద్వేగానికి గురవుతుంటారు. అలాంటి సందర్భాల్లో కొన్ని సార్లు గుండెపోటు సంభవిస్తుంది. ఇలాంటివారికి భావోద్వేగపరమైన మద్దతు అందించాలి. ఒత్తిడి నుంచి బయటపడేలా సహకారం అందించాలి.

– డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సల నిపుణుడు, జీజీహెచ్, కర్నూలు

భద్రతకు 'డ్యామే'జ్

శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ గాలికి.. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సిఫార్సులు బుట్టదాఖలు

- ఎప్రాన్‌కు దిగువన ధ్వంసమైన కాంక్రీట్ సిలిండర్ల పునరుద్ధరణ చేపట్టని ప్రభుత్వం
- వరద వచ్చేలోగా గ్యాలరీల్లో లీకేజీల అడ్డుకట్టకు గ్రౌటింగ్ చేయాలన్న సూచనా పెడచెవినే..
- వర్షాలు ముంచుకొస్తున్న వేళ స్పిల్‌వే దిగువన రోడ్డు, కుడి గట్టు, కొండవాలు షార్ట్ క్రీటింగ్ పనులకు రూ.31.40 కోట్లతో అనుమతి



సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టు భద్రతను ప్రభుత్వం గాలికొదిలేసిందని సాగు నీటిరంగ నిపుణులు, అధికారవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాజెక్టు భద్రతకు తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీఅథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) సిఫార్సులను ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ప్లంజ్‌పూల్(భారీ గొయ్యి) స్పిల్ వైపు విస్తరించకుండా ఏప్రాన్‌కు చివరన వేసిన కాంక్రీట్ సిలిండర్లు వరద ఉద్ధృతికి ధ్వంసమయ్యాయి. వరద వచ్చేలోగా వాటిని పునరుద్ధరించాలని ఎన్‌డీఎస్‌ఏ పదేపదే సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. స్పిల్ వే గ్యాలరీల్లో లీకేజీలకు అడ్డుకట్టవేయడానికి గ్రౌటింగ్ చేయాలన్న సూచననూ బుట్టదాఖలు చేసింది. ఇక ప్రాజెక్టుకు శాశ్వత భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై తీవ్ర జాప్యం చేస్తూ వస్తోంది.

ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అసహనం

ప్రాజెక్టు భద్రతపై ఈ ఏడాదిమార్చి 6న ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్.. మే 31లోగా ప్లంజ్ పూల్, స్పిల్ వేకు మరమ్మతులు చేయాలని ఏపీ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గత నెల 28–29న శ్రీశైలం ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనిల్ జైన్ తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులు చేయక పోవడాన్ని ఆక్షేపించారు. వరద వచ్చేలోగా ఏప్రాన్‌కు చివరన ధ్వంసమైన కాంక్రీట్ సిలిండర్లను పునరుద్ధరించాలని.. స్పిల్ వే గ్యాలరీల్లో లీకేజీలను అడ్డకట్ట వేయడానికి గ్రౌటింగ్ చేయాలని ఆదేశించారు. ప్లంజ్ పూల్‌ను శాశ్వతంగా పూడ్చడానికి.. ప్రాజెక్టుకు శాశ్వతంగా మరమ్మతులు చేయడానికి చేయాల్సిన అధ్యయనాలపై సూచనలు చేశారు. కానీ.. ప్రభుత్వం ఆ పనులను చేపట్టలేదు. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో స్పిల్ వే దిగువన రోడ్డు, కుడి గట్టు పనులకు రూ.25 కోట్లు.. కుడి వైపు, ఎడమ వైపు కొండవాలు జారకుండా షార్ట్ క్రీటింగ్ చేయడానికి రూ.5.90 కోట్లు వెరసి రూ.31.40 కోట్లు మంజూరు చేస్తూ గురువారం సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పనులకు టెండర్లు పిలవాలని కర్నూల్ సీఈని ఆదేశించడం గమనార్హం.

2009 వరదకు భారీ నష్టం

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం 1963లో ప్రారంభమై 1984లో పూర్తయింది. 1975–76లో ప్రాజెక్టు స్పిల్ వే దిగువన గేట్ల నుంచి వరద ప్రవాహం పడే(బకెట్) ప్రాంతం కోతకు గురై భారీ గుంత(ప్లంజ్ పూల్) ఏర్పడినట్లు అప్పట్లో నిపుణుల కమిటీ గుర్తించింది. ఆ కమటీ సూచన మేరకు ఎప్రాన్‌ను నిర్మించినా ఫలితం కనిపించలేదు. మళ్లీ ఆ కమిటీ సూచన మేరకు 1984–85లో ఎప్రాన్‌కు రక్షణగా కాంక్రీట్ సిలిండర్లతో కటాఫ్ వేశారు. అది కూడా వరద ఉద్ధృతికి కోతకు గురైంది. కృష్ణా నదికి 19 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా శ్రీశైలం ప్రాజెక్టును నిర్మించారు. కానీ.. 2009, అక్టోబర్ 2న ఏకంగా 25.5 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 271.8 మీటర్లు కాగా, వరదల సమయంలో 273.25 మీరట్లకు పెరిగిపోవడంతో స్పిల్ వే గేట్లపైన వరద ప్రవాహం ప్రవహించింది. ఈ బీకర వరద 78 గంటలపాటు పోటెత్తడంతో ప్లంజ్ పూల్ మరింత పెద్దగా మారింది. ప్రాజెక్టు స్పిల్‌వే దిగువన ఏప్రాన్ నుంచి 50 మీటర్ల నుంచి 220 మీటర్ల దూరంలో 120 మీటర్ల లోతుతో ప్లంజ్ పూల్ విస్తరించింది. ఈ భారీ ప్లంజ్ పూల్ స్పిల్‌వే పునాది దిగువకు విస్తరిస్తోందేమోనని ఎన్‌డీఎస్ఏ కమిటీ అనుమానం వ్యక్తం చేసింది.

వెన్నుపోటుపై సామాన్యుడి నిరసన గళం

ఉచిత బస్సు ఊసేలేదు..



టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదవుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయోజనం ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా నేడు దాని ఊసేలేదు. ఎప్పుడు కల్పిస్తారో చెప్పే నాథుడు లేకుండాపోయారు. ప్రజలను మోసం చేసేలా హామీలు ఇవ్వటం మంచిది కాదు.

– పత్తిపాటి అన్నమ్మ, గండ్రాయి, జగ్గయ్యపేట మండలం, ఎన్టీఆర్ జిల్లా

చంద్రబాబు పేదలను పీడించుకు తింటున్నాడు..

అధికారంలోకి రాగానే 3 లక్షల మంది సామాన్య ఉద్యోగులను తొలగించి చంద్రబాబు వారి కడుపు కొట్టాడు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు రూ.10వేలు ఇస్తానని చెప్పి తీరా అధికారంలోకి రాగానే వారిని శాశ్వతంగా తొలగించాడు. లబ్ధిదారుల ఇళ్లకు రేషన్ చేరేవేసే ఎండీయు వాహనాలను రద్దుచేసి వారికి అన్యాయం చేశాడు. ఒక రాక్షసుడిలా పేదలను పీడించుకు తింటున్నాడు. ఈ ప్రభుత్వం ఈవీఎంలతో గెల్చిన అడ్డదారి ప్రభుత్వం. ఐదేళ్లు అధికారంలో ఉండటం కష్టమే.

– ఈదర గోపీచంద్, సోషల్ యాక్టివిస్టు, నరసరావుపేట, పల్నాడు జిల్లా

ఏడాదిలో ఒక్క పథకం అమలుకాలేదు..



కూటమి నాయకులు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు, ఇతర అనేక పథకాలపై హామీలిచ్చారు. ఏడాది పూర్తయినా ఒక్క పథకం కూడా అమలుచేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలను నిలిపివేశారు. మాలాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో ప్రతినెలా ఏదో ఒక సంక్షేమ పథకంతో ఆర్థికంగా ఆదుకోవడం జరిగేది.

– మారోజు గణేష్, భీమవరం

నిరుద్యోగులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు..



కూటమి పార్టీలు సూపర్ సిక్స్ సహా 143 హామీలిచ్చాయి. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఇప్పటికీ ఒక్క హామీని నెరవేర్చలేదు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలిస్తామన్నారు. నిరుద్యోగులకు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం హామీలు అమలుచేయనందుకు నిరసనగా నేను ఈరోజు 'వెన్నుపోటు దినం' ర్యాలీలో పాల్గొన్నా. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– ఇనకొల్లు శ్రీనివాసరావు, కొండపి, ప్రకాశం జిల్లా

అన్ని వర్గాలను నిలువునా మోసం చేశారు..



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యం. సూపర్ సిక్స్ పేరిట అలవికాని హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజల్ని నిలువునా మోసం చేశారు. ప్రజాద్రోహిగా మిగిలిన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమ కేసులతో జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేశారు. ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారు.

– కంతమణి రమేష్, కొవ్వూరు, తూర్పుగోదావరి జిల్లా

రైతులను పచ్చిమోసం చేశారు..



రైతులకు రూ.20 వేలు రైతుభరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక ఏడాది ఎగ్గొట్టారు. ఇంత పచ్చిగా మోసం చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది. ఏడాదికాలంగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మద్దతు ధర సక్రమంగా అందలేదు. ధాన్యం కొనుగోలు పూర్తిగా చేయలేదు. వడ్డీ రాయితీ ఇవ్వలేదు. ఇలా అన్ని విధాలా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసింది.

– మద్దు కృష్ణ, రావులవలస, నరసన్నపేట నియోజకవర్గం, శ్రీకాకుళం జిల్లా

మాట ఇస్తే జగన్‌లా చేయాలి..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్నివర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి ఐదేళ్ల పాలనలో చివరివరకు ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందిస్తూనే ఉన్నారు. అధికారమే పరమావధిగా కూటమి పార్టీలు అమలుచేయలేని హామీలు గుప్పించి ఏడాది గడవక ముందే చేతులెత్తేశాయి. ప్రపంచంలో మాట ఇస్తే మడం తిప్పని నాయకుడు జగనే అని మరోమారు రుజువైంది.

– తమ్మిన కూర్మారావు, తగరపువలస, విశాఖ జిల్లా

బాబు చెప్పినవన్నీ చేయాల్సిందే..



చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ప్రచారంతో ఇచ్చిన హామీలు అమలుచేయాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. కూటమి నేతలు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు. రాష్ట్ర ప్రజలకు మరోసారి వెన్నుపోటు పొడిచారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీతలా భావించి, చెప్పినవన్నీ చేశారు. చంద్రబాబు కూడా అదే చెప్పినవన్నీ చేయాల్సిందే.

–గొల్లోరి బాబూరావు, వయ్యా గ్రామం, డుంబ్రిగుడ మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

చంద్రబాబు మా నోట్లో మన్నుకొట్టారు..



చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేస్తే ఒక్క హామీ నెరవేర్చలేదు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ పథకాలన్నింటినీ రద్దుచేసి మా నోట్లో మన్నుకొట్టారు. ఎంతమంది పిల్లలుంటే అన్ని రూ.15వేలు ఇస్తామని చెప్పి ఏడాదైనా ఇవ్వలేదు. మేలో ఇస్తామని, ఆ తర్వాత జూన్‌లో ఇస్తామని చెప్పారు. అయితే, పాఠశాలలు ప్రారంభమవుతున్నా తల్లికి వందనం పథకం ఊసేలేదు.

– రఫీక్, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం, కర్నూలు జిల్లా

వైఎస్ కుటుంబం నిబద్ధత ప్రజలకు అర్థమైంది..




అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి చంద్రబాబు సీఎం అయ్యాడు. గత ప్రభుత్వం కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అందిస్తాడని ప్రజలు నమ్మి ఆయనకు ఓటేశారు. కానీ, గెలిచి ఏడాదైనా ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారు. చెప్పిన మాట నిలబెట్టుకోవటంలో వైఎస్ కుటుంబం నిబద్ధతగా ఉంటుందని ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోంది. అందుకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్నా.

– శంకర్‌నాయక్, రిటైర్డ్ ఉద్యోగి, నంద్యాల

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు..



కూటమి ఏడాది పాలన దారుణంగా ఉంది. ప్రజలకు ఒక్క మంచి పనిచేసిన దాఖలాలేదు. విద్య, వైద్య రంగాలు అస్తవ్యస్తంగా మారాయి. మహిళలకు సూపర్‌సిక్స్ అంటూ ఆశ చూపి ఒక పథకం కూడా అమలుచేయకుండా దారుణంగా పాలన సాగిస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినం నిర్వహించడం సబబే. సాధారణ ప్రజలు కూటమి పాలనపై ఆగ్రహంతో ఉన్నారు. – పవన్, పీజీ విద్యార్థి, తిరుపతి




రామ శయ్య



చరిత్ర చెక్కిన రామాయణం

చిత్రకూటం

మధ్యప్రదేశ్‌లోని సత్నాజిల్లాలో గల చిత్రకూటం ప్రకృతి సౌందర్యానికే కాదు... ఎందరో రుషుల తపోదీక్షకు కేంద్రంగా ఉంది. అత్రి, అనసూయ, మార్కండేయుడు వంటి ముని పుంగవులు, గురువులకే గురువు దత్తాత్రేయుడు వంటి వారు తపస్సు ఆచరించేందుకు ప్రశాంతమైనప్రదేశం కోసం అన్వేషిస్తూ, ఈ ప్రాంతానికి వచ్చేసరికి ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి మైమరచిపోయి, పర్ణశాలలు నిర్మించుకుని, ఇక్కడి మందాకినీ నదిలో స్నానమాచరించి, నది ఒడ్డునే తపస్సు చేసుకున్నట్లు స్థలపురాణం చెబుతోంది.


మధ్యప్రదేశ్ అడవులలో ఉత్తరప్రదేశ్ సరిహద్దులలో ఉన్న ఈ పవిత్రస్థలిలో ప్రతి కొండా, గుట్టా, రాయీ రప్పా, చెట్టూ పుట్టా, వాగూ వంకా, తీర్థమూ జలపాతమూ... ఇలా ప్రతి ఒక్కటీ కూడా సీతారామ లక్ష్మణులు, వారి దాసుడైన హనుమంతుడి పేర్లతోనే ముడి పడి ఉంటాయి. కేవలం జీవంలేని ప్రదేశాలే కాదు.. ఇక్కడ జీవం పోసుకున్న ప్రతి వారి పేర్లలో సీతా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు, హనుమంతుడూ ఉంటారు. వారి పిలుపులు కూడా రామ్ రామ్ అనే ఉంటాయి. తమకు తారసపడిన ప్రతి వారినీ రామ్ అనే పిలవడం వీరి ఆచారం. కొండగుహలన్నీ రామనామ జపంతో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. కొన్ని పెద్ద పెద్ద బండరాళ్లమీద సీతమ్మ చీరలు ఆరవేసుకున్నట్లుగా... రామయ్య శయనించినట్లుగా... లక్ష్మణుడు సేదదీరినట్లుగా... హనుమంతుడు గంతులు వేసినట్లుగా ఆనవాళ్లుంటాయి.

అంతర్వాహినిగా గుప్తగోదావరి: మందాకినీ నదితోపాటూ యమునా నది కూడా ఇక్కడికి దాపులలోనే ఉంది. ఇక్కడ అడుగుపెట్టిన పాదచారులకు తన చల్లని స్పర్శతో, గలగల శబ్దాలతో అంతర్వాహినిగా ప్రయాణిస్తూ ఓ గోదావరీ పాయ గుప్తగోదావరిగా పేరు తెచ్చుకుంది.

రామ్‌ఘాట్: మందాకినీ నది ఒడ్డున గల ఈ స్నానఘట్టంలోనే రాముడు రోజూ స్నానం చేసేవాడట. రామలక్ష్మణులు స్నానం చేసి వస్తున్నట్లుగా తులసీదాసు తన మనోనేత్రాలతో దర్శించాడట. అందుకే దీనిని తన రామచరిత్ మానస్‌లో రామ్ ఘాట్ అని ప్రత్యేకంగా పేర్కొన్నాడు.







రామ్ ఘాట్

కామద్గిరి: మందాకినీ నది పరిక్రమ చేసే భక్తులు ఇక్కడ గల రామాలయాన్ని సందర్శించి, మొక్కులు మొక్కుకుంటారు. ఎందుకంటే కామదనాథుడనే పేరుగల రాముడు కోరిన కోరికలు తీర్చే వేల్పుగా ప్రసిద్ధిపొందాడు. ఇక్కడే అనేక ఆలయాలున్నాయి.

భరత్ మిలాప్: తన అన్నగారు ఇక్కడ ఉన్నాడని తెలుసుకున్న భరతుడు వేలాదిమంది సైనికులను, పరివారాన్ని వెంటబెట్టుకుని వచ్చి, రాముణ్ణి కలిసిన ప్రదేశమిది. రాముణ్ణి భరతుడు కలిసిన ప్రదేశం కాబట్టి, భరత్ మిలాప్ అనే పేరొచ్చింది. ఇక్కడ భరతుడికి చిన్న మందిరం ఉంది.

జానకి కుండ్: రాముడు స్నానం చేసిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే సీతాదేవి స్నానం చేసేదట. అందుకే ఈ ఘట్టానికి జానకి కుండ్ అనే పేరొచ్చింది.

సతీ అనసూయ ఆశ్రమం: అత్రి మహాముని పత్ని, సతీ అనసూయా దేవి ఇక్కడ ఆశ్రమం ఏర్పరచుకుని బ్రహ్మ విష్ణు పరమేశ్వర స్వరూపమైన దత్తాత్రేయుడిని, ఆయన సోదరులను సాకిందట. సీతారాములు వనవాసానికి వచ్చినప్పుడు అనసూయాశ్రమాన్ని సందర్శించారట. అప్పుడు అనసూయ సీతకు పాతివ్రత్య ధర్మాలను బోధించడంతోపాటు, రకరకాల లేపనాలను, రుచిగల పండ్లను, చీరలను కానుకగా ఇచ్చిందట.


మందాకిని నది

హనుమాన్ ధార: చిత్రకూటానికి 25 కిలోమీటర్ల దూరంలో, సముద్రమట్టానికి 3000 కిలోమీటర్ల ఎత్తున ఉన్న ఈ ప్రదేశానికి చేరాలంటే కనీసం రెండువేల మెట్లను ఎక్కవలసిందే! ఎంతో ప్రయాసకు ఓర్చి ఇక్కడ వరకు వచ్చిన వారి అలసట, మార్గాయాసం అంతా తీరిపోయేలా పురాతన హనుమద్విగ్రహం దర్శనమిస్తుంది. ఎక్కడినుంచి పడుతోందో తెలియని విధంగా నిత్యం జలధార పడుతూ, విగ్రహాన్ని అభిషేకిస్తుంటుంది.

రామశయ్య: సీతారామలక్ష్మణులు తాము శయనించేందుకు వీలుగా ఒక పెద్ద చెట్టునీడన గల రాతిప్రదేశాన్ని శయ్యలా చెక్కారట. ఈ రాతిపరుపు పైనే సీతారాములు శయనించేవారట. వారు ఇక్కడ సేదదీరేవారనడానికి గుర్తుగా సీతారామలక్ష్మణుల ముగ్గురి విగ్రహాలూ దర్శనమిస్తాయి. దీనికే రామశయ్య అని పేరు వచ్చింది.

స్ఫటిక శిల: సీతారాములు కూర్చున్న ఒక రాతితిన్నెకే స్ఫటిక శిల అని పేరు. సీతారాముల పాదముద్రలు ఈ శిలపై మెరుస్తూ కనిపిస్తాయి.

ఉత్సవాలు... పర్వదినాలు: చిత్రకూటంలో ప్రతి అమావాస్యకూ పెద్ద ఉత్సవం జరుగుతుంది. ఇంకా దసరా, దీపావళి, సంక్రాంతి, హోలీ, ఉగాది వంటి అన్ని హిందూ సంప్రదాయ పండుగలప్పుడూ ప్రత్యేకమైన పూజలు, ఉత్సవాలు జరుగుతుంటాయి.

భోజన, వసతి సదుపాయాలు: చిత్రకూటాన్ని సందర్శించే యాత్రికుల కోసం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ పర్యాటక మంత్రిత్వ శాఖలవారు విడివిడిగా అందుబాటు ధరలలో భోజన, వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఇవి గాక ప్రైవేటుగా బడ్జెట్ హోటళ్లు కూడా ఉన్నాయి.

– డి.వి.ఆర్.

ఎలా చేరుకోవాలంటే...

విమాన మార్గం: చిత్రకూటానికి దగ్గరలో గల ఏర్‌పోర్ట్ ఖజురాహోనే. అయితే ఇక్కడినుంచి దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో గల చిత్రకూటానికి వెళ్లాలంటే మాత్రం మళ్లీ బస్సు లేదా రైలుప్రయాణం తప్పదు మరి. వారణాసి, జబల్పూర్ విమానాశ్రయాలయితే ఇంకా దూరం.

రైలు ద్వారా: ఢిల్లీ, ఆగ్రా, అలహాబాద్, వారణాసి వంటి ప్రధాన నగరాలనుంచి రైలు ద్వారా కార్వి




రైల్వేస్టేషన్‌కు చేరుకోవచ్చు. అక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని చిత్రకూటానికి ప్రైవేటు వాహనాలుంటాయి.

రోడ్డు మార్గం: అలహాబాద్, సత్నా, పన్నా, బండాల నుంచి చిత్రకూటానికి మంచి రోడ్డుమార్గం ఉంది. బస్సులు లేదా ప్రైవేటు వాహనాలలో చేరుకోవచ్చు.

● నిర్మల వాణి

అంతర్ముఖ ప్రేమానందం

భగవంతుడంటే ప్రేమ అని మనం ఎన్నోసార్లు విన్నాం. ప్రేమ అంటే ఏమిటో ఎందరో అవతార మూర్తులు, అవతార పురుషులు వారి వారి మార్గాలలో విశదీకరించారు. దానిని ఎంతగా వర్ణించి విశదీకరించినప్పటికీ ప్రేమను అనుభూతి చెందకుండా దాని ఆనందాన్ని పొందలేరు. ఆ ప్రేమను అనుభూతి చెందడం, దానిని అర్థం చేసుకోవడమే ఉత్తమమైన మార్గం. మనలో ఆ ప్రేమను ఆస్వాదించి ప్రకటించగల యంత్రాంగాన్ని భగవంతుడే మనలో పొందుపరిచాడు. ఇది మనలో ఉన్న మిక్కిలి సూక్ష్మమైన, సున్నితమైన యంత్రాంగం. అటువంటి ప్రేమప్రకాశమే ఆనందం. మిగిలినది ఏదీ మనకు ఆనందాన్ని ఇవ్వలేదు. హృదయాల్లో అనుభూతి చెందుతున్న ప్రేమ మాత్రమే ఆనందాన్ని ఇవ్వగలదు. కాబట్టి ఒక ప్రేమించే వ్యక్తి ఒక ఆలోచించే వ్యక్తికన్న వెయ్యిరెట్లు ఉన్నతుడు.



మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థ లేక యంత్రాంగం మనలో ఏడుపొరలుగా పనిచేస్తుంది. ఈ పొరల ఉపరితలం మీద ఆనంద తరంగాలు ఉప్పొంగి మెదడు అనే ఒడ్డుకు చేరుకొని ఆనందమనే బుడగలుగా ఏర్పడతాయి. కాని అక్కడ మన మెదడు హేతుబద్ధమైన శిలలా ఉంటే ఈ బుడగలు ఎందుకూ పనికి రాకుండా కరిగిపోయి ఆ రాయి మీద ఏ ప్రభావాన్నీ చూపలేవు. ఈ ఏడు పొరలే మనలోని శక్తి కేంద్రాలు. వాటినే చక్రాలు అని అంటాము. అదే మన శరీరంలో మన కంటికి కనపడని కేంద్రీయ నాడీ వ్యవస్థ. ఇప్పుడు మనలోని ఈ అంతర్గత సూక్ష్మ వ్యవస్థ లోని ఈ శక్తికేంద్రాలను గురించి కొంత విశదంగా తెలుసుకుందాం.

మొదటిది మూలాధార చక్రం

మొట్టమొదటి శక్తి కేంద్రమైన మూలాధార చక్రం మనలోని విసర్జనావయవాల మీద ప్రభావం చూపుతుంది. మనలో విసర్జన ప్రక్రియ సరిగా జరిగినపుడు మనం ఎంతో ఉపశమనం పొందుతాం. ఇది చాలా ప్రాథమికమైన విషయం. అయితే ఆ ఉపశమనం మనకి ఒక రకమైన ఆనందాన్ని, సంతోషాన్ని ఇస్తుంది. ఇది చాలా స్థూలమైన చిన్న విషయంగా చెప్పబడుతుంది కానీ ఆ ఆనందం పొందడం చాలా ముఖ్యమైనది. కానీ ఈ ఆనందం మిగిలిన ఎన్నో లోతైన, సున్నితమైన వాటివలన కలిగే ఆనందాన్ని అధిగమించకుండా ఉండాలంటే మనం అ స్వచ్ఛతను కలిగి ఉండాలి. అదే మనలో వుండాల్సిన మొట్టమొదటి గుణం.


శ్రీ మాతాజీ నిర్మలాదేవి

స్వచ్ఛత అనేది ఎవరిలోనైనా కావాలనుకుంటే వచ్చేది కాదు. అది అంతర్గతంగా నిర్మితమై ఉండాలి. కానీ సహజ యోగ సాధనతో మూలాధారాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా స్వచ్ఛతను వృద్ధి చేసుకోవచ్చు.

స్వాధిష్ఠాన చక్రం

ఇక రెండవ పొర సృజనాత్మకత వలన కలిగే ఆనందం. అదే స్వాధిష్ఠాన చక్రం. కొంతమంది దేనినైనా సృష్టించాలని చాలా ఆరాట పడుతూంటారు. ఏదో ఒక పుస్తకాన్నో, లేక ఏదైనా కళాత్మకమైన దాన్నో సృష్టించడం చాలా ముఖ్యమని వారు అనుకుంటారు. ఈ సృజనాత్మకతకు కనుక హేతుబద్ధమైన మెదడు తోడైతే అప్పుడు అలాంటి వారు తామే అందరికన్నా గొప్పవారమని గర్వ పడుతూ వుంటారు. ఎందుచేతనంటే వారు తాము చేసే పనులన్నింటి సత్ఫలితాలు వస్తున్నాయని, తన గొప్పతనం వలననే విజయం చేకూరుతోందని భావిస్తారు. ప్రతిదాన్నీ హేతువాదంతో చూస్తారు. అయితే అది సరైన ఆలోచన కాదు. ఈ రెండవపొరని అధిగమించాలంటే నిర్విచార స్థితిలోనికి వెళ్ళాలి. మీ అవగాహన ప్రకాశవంతమైనపుడు మీరు నిర్విచార స్థితిలోకి వెళతారు. అపుడు మీరు ఏమి సృష్టించినా దానిని కేవలం గమనిస్తారంతే. నిర్విచారమైన ఎరుకలో మీరు దేన్ని చూసినా, ఏమి సృష్టించినా దాన్ని ఆనందించగలుగుతారు. ఎటువంటి ఆలోచనలూ లేని స్థితికి వెళతారు. ఈ గుణం మనలోనే వున్న శ్రీ బ్రహ్మ దేవ సరస్వతి తత్వాన్ని జాగృత పరచడం వలే సాధ్యమవుతుంది.

– డా. పి. రాకేష్

(అంతర్గత సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థ గురించి శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనం ఆధారంగా)

● భక్తితత్త్వం

నాకిన్ని కష్టాలా...?

భక్తుడు తన జీవితంలో అనేక పరీక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది!!...

భగవంతుడు తనకు సన్నిహితంగా ఉన్నవారిని అనేక రకాలుగా పరీక్షిస్తుంటాడు!!...

'కష్టాలు, నష్టాలు, దుఃఖాలు, అవమానాలు... ఇవన్నీ ఆ పరీక్షలో భాగాలే! వాటిని ఒకటి తరువాత మరొకటి ఇస్తూ ఉంటాడు 'నన్ను అట్టే అంటిపెట్టుకుని ఉంటాడా! లేదా విసుగుతో నన్ను దూరం చేసుకుంటాడా?' అని అయన చూస్తూ ఉంటాడు!!...

ఒకసారి పరీక్షలో ఉత్తీర్ణులం అయ్యాక మరొక పరీక్ష ఉండటం... లేక పోవడం ఆయన ఇష్టం...

కానీ ఒకసారి విఫలం అయ్యాక మాత్రం మళ్ళీ పరీక్ష పెట్టడం జరగదు!



ఎందుకంటే అప్పటికే మన సామర్థ్యం అయనకు తెలిసిపోతుంది కనుక, ఈ విషయం మనం చక్కగా గ్రహించి కష్ట నష్టాలు వచ్చినపుడు దైవాన్ని నిందించక, మరువక, విడువక ఆయనపై విశ్వాసంతో సహనం వహించాలి.

అప్పుడే అయన తన అనుగ్రహాన్ని పుష్కలంగా అందిస్తాడు!!...

ఎలా వచ్చిన కష్ట నష్టాలు అలా పోతాయి.

అయితే మన విశ్వాసం, సహనం ఎలా ఉండాలంటే పరీక్ష పెట్టీ పెట్టీ ఆయనే విసుగు చెందిపోవాలి...

అంతేకానీ నేను రోజూ పూజలు, అభిషేకాలు చేస్తున్నాను, నాకు ఈ పని కావాలి, ఆ పని జరగాలి, లేకపోతే ఎందుకు అని అనుకోరాదు.

అంతా బాగున్నప్పుడు అదంతా మన వల్లే అనుకుని పొంగిపోయి, సౌఖ్యాలు కలుగనపుడు మాత్రం దైవాన్ని నిందించటం తగదు, దానికంటె మనలో విశ్వాస లోపం ఎక్కడైనా ఉందేమో చూసుకోవాలి.

కొన్నిసార్లు అంతా బాగానే ఉన్నట్లు అనిపించవచ్చును, కానీ ఎక్కడో ఏదో మూలన చిన్న సందేహం మిగిలిపోయిందేమో అని చూసుకోవాలి.

పాత్రలో నీరంతా బయటకు పోవడానికి పాత్రంత రంధ్రం అవసరం లేదు...

చిన్న రంధ్రం ఉంటే చాలు పాత్రలో నీరంతా బయటకు పోవడానికి, కనుక ఆ చిన్న రంధ్రం ఎక్కడుందో కనుక్కుని దానిని మూసివేయడానికి ప్రయత్నం చేయాలి.

అంతేకాని నిందిస్తూ కూర్చోకూడదు.

దైవనింద వల్ల మరింత పాపం చుట్టుకుంటుంది తప్ప సమస్యలు తీరిపోవు! విశ్వాసమే అసలైన పరిష్కారాన్ని ఇస్తుంది.

● సువార్త

సమాధాన పడితేనే శాంతి

మానవుని జీవితంలో ఎన్నో ఆటంకాలు, అవరోధాలు, అవమానాలు వస్తాయి. ఉదాహరణకు కరువు వచ్చినప్పుడు ఇస్సాకు తన స్వయిష్టంతో గెరారులో నివసించడానికి వెళ్ళాడు. 'ఇక ఐగుప్తుకు వెళ్ళవద్దు. ఇక్కడే నివసించి, వీరి మధ్య పరదేసిగా వుండు, నిన్ను ఆశీర్వదిస్తానని' ముందే దేవుడు చెప్పాడు. ఇస్సాకును చూసిన ఫిలిష్తీయులకు అసూయ కలిగింది. అసూయ బహు భయంకరమైన లక్షణం. ఇస్సాకు తండ్రియైన అబ్రహాముకు అబీమెలుకు రాజునకు



తవ్విన బావుల విషయంలో ఒప్పందం జరిగింది. ఫిలిష్తీయులు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించి, తవ్విన బావులు పూడ్చేశారు. కానీ అబీమెలుకు-నీవు మాకంటే బహు బలం గలవాడవు, వెళ్ళిపొమ్మని ఇస్సాకుతో చెప్పాడు. పూడ్చిన బావులు కుమారుడైన ఇస్సాకు తిరిగి తవ్వించాడు. తవ్వించిన బావులు తిరిగి ఇస్తానన్నాడు. అయినా ఫిలిష్తీయులు తిరిగి పూడ్చివేశారు. లోకమంటే నేత్రాశ, జీవపు డంబం, శరీరేచ్ఛ. ఇస్సాకు దాసులు లోయ ప్రాంతానికి వెళ్ళి తవ్వగా జలలు గల నీళ్లబావి దొరికింది. తిరిగి ఫిలిష్తీయులు జగడమాడి ఆ నీళ్లు మావే అని అన్నారు. అతడు అక్కడి నుండి వెళ్ళి మరియొక బావి తవ్వించాడు.

ఇప్పుడు వారు జగడమాడలేదు. అప్పుడు యెహోవా ప్రత్యక్షమై 'నేను నీ తండ్రి దేవుడను, నేను నీకు తోడై వున్నానని చెప్పాడు. అప్పుడతడు బలిపీఠం కట్టించి దేవుని నామమున ప్రార్థన చేశాడు. తర్వాత అక్కడ బావి తవ్వారు. విందు అతడు చేయగా అన్నపానములు పుచ్చుకుని వెళ్ళారు. ఆ బావికి 'బెయర్షబా' అని పేరు పెట్టారు. దాని అర్థం 'ప్రయాణం'. ఇప్పటికీ యూదులు 7 బావులను ఆ ప్రాంతానికి వెళుతూ దర్శించుకున్నట్లు బైబిల్ లో వున్నది. మానవులు ఈర్ష్యను, అసూయను జయించాలంటే దేవుని ప్రార్థించాలి, స్తుతించాలి. సమాధానపడితేనే శాంతి (ఆదికాండము 26:12 – 33).

– కోట చంద్రపాల్

ధర్మ సందేహం

పంచామృతం, పంచగవ్యాలు అని దేనిని అంటారు?

ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పంచదార, వీటిని పంచామృతం అని, ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, ఆవు పేడ, ఆవు మూత్రం... ఈ అన్నింటినీ కలిపి పంచగవ్యములు అనీ అంటారు.



తీర్థాన్ని మూడుసార్లు తీసుకుంటారు. ఎందుకు?

తొలితీర్థం శరీర శుద్ధికి, శుచికి, రెండవ తీర్థం ధర్మ, న్యాయ ప్రవర్తనకు, మూడవ తీర్థం పవిత్రమైన పరమేశ్వరుని పరమ పదం కోసం తీసుకుంటారు.

త్యాగాల పండుగ

● ఇస్లాం వెలుగు

సాధారణంగా పండుగలంటే తిని తాగి, భౌతికంగా పొందే తాత్కాలిక సంతోషం అనుకుంటారు. కాని అదొక అద్వితీయమైన, అనిర్వచనీయమైన, అలౌకిక ఆత్మానందం. రమజాన్ తరువాత బక్రీద్ రూపంలో మరో అద్భుత అవకాశం మనల్ని వరించింది. దీన్నిసద్వినియోగం చేసుకోవాలి. పుణ్యకార్యాలు ఆచరించి అత్యంత శ్రేష్ఠ సామగ్రి అయిన 'తఖ్వా'(దైవభీతి)ను హృదయాల్లో ప్రతిష్ఠించుకోవాలి. జీవితం సార్థకం కావాలంటే పరమ ప్రభువు ఆదేశాలను తు. చ. తప్పక పాటించాలి. అందుకే పరమ దయాళువైన అల్లాహ్ మనకోసం కొన్ని వసంత రుతువుల్ని ప్రసాదించాడు. అందుకని ఈ రుతువులో కరుణామయుని దయను పొందే నిమిత్తం కష్టపడాలి. వీలయినన్ని ఆరాధనలు చేయాలి. నఫిల్ ఉపవాసాలు పాటించాలి. ముఖ్యంగా 'అరఫా' రోజా పాటించాలి. దానధర్మాలు చేయాలి. అల్లాహ్ ప్రీతిని, ప్రసన్నతను పొందే ప్రయత్నం చేయాలి.

నిజానికి జిల్ హజ్ పదవ తేదీన జరుపుకొనే బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ. హజ్రత్ ఇబ్రాహీమ్ , హజ్రత్ ఇస్మాయిల్ అలైహిముస్సలాంల త్యాగాలను స్మరించుకునే త్యాగోత్సవం. ఈ పర్వదినం మనకిచ్చే మరో సందేశం ఏమిటంటే, సమాజాన్ని కలుపుకు పోకుండా, సాటి ప్రజల పట్ల ప్రేమ, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోకుండా ఏ సంతోషమయినా, ఎంతటి ఆనందమైనా పరిపూర్ణం కాజాలదు. ఏ సంతోష కార్యమైనా సమాజంతో పంచుకోవాలని, కేవలం మన గురించి మాత్రమే కాకుండా సంఘం గురించి, సమాజం గురించి ఆలోచించాలని చెబుతుంది పండుగ.



ప్రతి ఒక్కరూ తమస్థాయి, స్తోమతకు తగినట్లు ఈద్ జరుపుకుంటారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు జిల్ హజ్జ్ నెలలో 'హజ్ 'యాత్రకు వెళతారు. అంతటి స్థోమత లేనివారు ఇళ్ళవద్దనే ఖుర్బానీలు ఇస్తారు. అదికూడా లేనివారు రెండు రకతుల నమాజ్ ఆచరించినా దయామయుడైన అల్లాహ్ హజ్, ఖుర్బానీలు ఆచరించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఆయన తన దాసుల చిత్తశుద్ధిని, సంకల్పాన్ని మాత్రమే చూస్తాడు. ఆయనకు ధనరాశులు, రక్తమాంసాల అవసరం ఎంత మాత్రం లేదు. కనుక సర్వకాల సర్వావస్థల్లో చిత్తశుద్ధితో కూడిన సత్కర్మలు ఆచరించాలి. పేదసాదల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాల్లో వారిని ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. ఆనందంలో వారినీ భాగస్వాములను చేయాలి. అప్పుడే నిజమైన పండుగ. తన అవసరాలను త్యజించి దైవప్రసన్నత కోసం ఇతరుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పేదే ఈ త్యాగాల పండుగ. మంచికోసం మానవ సంక్షేమం కోసం, ధర్మం కోసం, ధర్మసంస్థాపన కోసం ఎంతోకొంత త్యాగం చెయ్యాలన్న సందేశం ఇందులో ఉంది.

(శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా...)

సాక్షి ప్లస్
గురువారం । 5-6-2025

- మూడు జట్లను ఐపీఎల్ ఫైనల్‌కు చేర్చిన ఏకైక కెప్టెన్
- బ్యాటింగ్‌లోనూ అసాధారణ ప్రదర్శన
- భవిష్యత్తు భారత సారథిగా మన్ననలు

శ్రేయస్ అయ్యర్... సారథిగా సూపర్

ధోనీ మాదిరిగా వ్యూహరచనలో మేటి... కోహ్లి తరహాలో దూకుడులో ఘనాపాటి... రోహిత్‌ను అనుకరిస్తున్నట్లు అనిపించినా... అతడికి అతడే సాటి! 'అతడి చేయి పడితే రాయి కూడా రత్నంలా మెరుస్తుంది'... అన్న రీతిలో దశాబ్ద కాలానికి పైగా 'ప్లే ఆఫ్స్' మొఖం చూడని జట్టును తుదిపోరుకు చేర్చిన ఘనుడతడు! ఐపీఎల్ చరిత్రలో మరే సారథికి సాధ్యం కాని విధంగా మూడు వేర్వేరు జట్లను తుదిపోరుకు తీసుకెళ్లిన మొనగాడతడు! అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ జట్టును నడిపించడంలో నేర్పరి అతడు! మనం ఇంతసేపు చెప్పుకున్నది... ఈసారి ఐపీఎల్ ట్రోఫీ గెలవకపోయినా తన నాయకత్వ చతురతతో అందరి మనసులు గెలిచిన పంజాబ్ కింగ్స్ సారథి శ్రేయస్ అయ్యర్ గురించే!!

ధోనీ, రోహిత్ కూడా కెప్టెన్‌లుగా మూడు కంటే ఎక్కువ ఐపీఎల్ ఫైనల్స్ ఆడినా... ఆ ఇద్దరూ ఒకే జట్టును నడిపించారు. కానీ గత ఐదేళ్లలో అయ్యర్ మూడు వేర్వేరు ఫ్రాంచైజీలకు తుదిపోరు మజా చూపాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు ఆడిన ఏకైక ఫైనల్ శ్రేయస్ సారథ్యంలోనే కాగా... పదేళ్ల విరామం అనంతరం గతేడాది కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ముచ్చటగా మూడో కప్పు అందించింది కూడా అయ్యరే. పంజాబ్‌కు ట్రోఫీ కట్టబెట్టలేకపోయినా... సారథిగా మాత్రం సూపర్ సక్సెస్ అయ్యాడు. 'బాధ్యత సగం మాత్రమే పూర్తయింది. వచ్చే ఏడాది తప్పక కప్పు గెలుస్తాం' అని ఫైనల్ అనంతరం ధీమా వ్యక్తం చేసిన అయ్యర్... భారత జట్టు భవిష్యత్తు నాయకత్వంపై భరోసా పెంచుతున్నాడు!!



సాక్షి, క్రీడావిభాగం

2024 ఐపీఎల్ ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుచేసి... కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టు మూడోసారి కప్పు కైవసం చేసుకుంది. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ట్రోఫీ అందుకున్నా... ఆ సమయంలో భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ కేకేఆర్ జట్టు మెంటార్‌గా ఉండటంతో క్రెడిట్ అంతా అతడికే దక్కింది. తదనంతర పరిణామాల్లో గంభీర్ టీమిండియా హెడ్‌కోచ్‌గా ఎదగగా... సమర్థ నాయకుడిని కేకేఆర్ వేలానికి వదిలేసింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా జట్టు... ఈసారి లీగ్ దశ దాటలేకపోవడమే గాక... పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంటే... వేలంలో భారీ ధర పెట్టి శ్రేయస్‌ను దక్కించుకున్న పంజాబ్ రెండోసారి రన్నరప్‌గా నిలిచింది. ఈ ఒక్క ఉదాహరణ చాలు శ్రేయస్ సారథ్య సామర్థ్యాన్ని వివరించేందుకు. దేశవాళీ మ్యాచ్‌లు ఆడకుండా నిర్లక్ష్యం వహించినందుకు బీసీసీఐ కాంట్రాక్టు కోల్పోవడం... అపార ప్రతిభ ఉన్నా ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక కాకపోవడం ఇవన్నీ పక్కన పెడితే... అతడిలో గొప్ప నాయకుడు ఉన్నాడని తాజా ఐపీఎల్ నిరూపించింది.

ఆటగాడిగా అదుర్స్...

ఈ సీజన్‌లో 17 మ్యాచ్‌లాడిన శ్రేయస్ 50.33 సగటుతో 604 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆరో స్థానంలో నిలిచాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి 175.07 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. అతడి గణాంకాలను అంకెల్లో కొలవడం కష్టమే! సీజన్ ఆరంభంలో గుజరాత్‌తో జరిగిన పోరులో సెంచరీకి సమీపించినా... జట్టు ప్రయోజనాలకే పెద్దపీట వేయడంతోనే అయ్యర్ తీరు అందరినీ ఆకట్టుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 19 ఓవర్లు ముగిసేసరికి 220 పరుగులు చేసింది. అయ్యర్ 42 బంతుల్లో 97 పరుగులు చేసి సెంచరీకి సమీపించాడు. చివరి ఓవర్‌లో స్ట్రయికింగ్‌లో ఉన్న శశాంక్ సింగ్ దగ్గరకు వెళ్లి 'నా శతకం గురించి ఆలోచించకు. జట్టు కోసం వీలైనన్ని ఎక్కువ పరుగులు చేయి' అని దిశానిర్దేశం చేశాడు. ఆ ఓవర్ మొత్తం ఆడిన శశాంక్ 23 పరుగులు రాబట్టగా... అయ్యర్ అజేయంగా నిలిచాడు. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడతాడనే గుర్తింపును మరింత పెంచుకుంటూ... ఈసారి మిడిల్ ఓవర్స్‌లో భారీ షాట్లతో విరుచుకుపడి పరుగులు రాబట్టాడు. అందుకే సీజన్ మొత్తంలో 43 ఫోర్లే కొట్టిన అయ్యర్... 39 సిక్స్‌లతో అత్యధిక సిక్స్‌లు కొట్టిన వారి జాబితాలో నికోలస్ పూరన్ (40) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.

ముంబైపై అసమాన పోరాటం

ఇక క్వాలిఫయర్-2లో ముంబై ఇండియన్స్‌పై శ్రేయస్ ఆడిన ఇన్నింగ్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. బుమ్రా యార్కర్లను ఎదుర్కొనేందుకు మహామహులు ఇబ్బంది పడుతున్న తరుణంలో అతడు దాన్ని షార్ట్‌థర్డ్ మ్యాన్ దిశగా తరలించిన తీరు చూసి తీరాల్సిందే. ఆశలే లేని స్థితిలో అద్భుత పోరాటం కనబర్చిన ఈ ముంబైకర్... జట్టును ఒంటిచేత్తో ఫైనల్‌కు చేర్చాడు. 'అయ్యర్ అవుట్ అయినప్పుడే... పంజాబ్ పరాజయం ఖాయమైంది' బెంగళూరుతో ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా ప్రతి ఒక్కరి నోట వినిపించిన మాట ఇదే. అంతలా అభిమానుల నమ్మకాన్ని సంపాదించుకున్న శ్రేయస్... చేతి వరకు వచ్చిన కప్పు చేజారుతున్నా కాస్త కూడా చలించలేదు. చిరకాల కల నెరవేరడంతో ప్రపంచ మేటి ఆటగాడు విరాట్ కోహ్లి చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడుస్తుంటే... . సుదీర్ఘ కాలం ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించినా.. జట్టును విజేతగా నిలపలేకపోయిన ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ వంటి దిగ్గజ ప్లేయర్లు సంబరాల్లో భాగమైపోయారు. ఇక ఆర్‌సీబీ అభిమానుల ఆనందానికైతే అవధులే లేవు! తన చుట్టూ ఇంత జరుగుతున్నా కనీసం ముఖ కవళికల్లో సైతం మార్పు కనబడని అయ్యర్ నింపాదిగా వచ్చే ఏడాది చూసుకుందాం అన్నట్లు ముందుకు సాగిపోయాడు.

భవిష్యత్తు వన్డే కెప్టెన్!

మైదానం బయట నుంచి పాంటింగ్ జట్టును తీర్చిదిద్దితే... ఆ వ్యూహాలను గ్రౌండ్‌లో ఆచరణలో పెట్టడంలో అయ్యర్ విజయవంతమయ్యాడు. బౌన్సీ పిచ్‌పై కైల్ జెమీసన్‌తో బ్యాక్ ఆఫ్ ది లెంత్ బంతులు వేయించడం... ముంబైతో మ్యాచ్‌లో వైడ్ యార్కర్లు వేసే విధంగా విజయ్ కుమార్ వైశాఖ్‌కు దిశానిర్దేశం చేయడం... అవసరమైనప్పుడు 'నకల్ బాల్స్' వేసే విధంగా ప్రోత్సహించడం ఇలా... ఒకటా రెండా సీజన్ ఆసాంతం శ్రేయస్ కెప్టెన్సీలో తనదైన పదును చూపాడు. క్వాలిఫయర్-2లో శశాంక్ సింగ్ నిర్లక్ష్యంతో రనౌట్ అయిన సందర్భంలో సారథిగా అతడిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అయ్యర్... ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్ వంటి యువ ఆటగాళ్లను పెద్దన్నలా వెన్నుతట్టి ప్రోత్సహించాడు. ఐపీఎల్ జరుగుతున్న సమయంలోనే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ కోసం భారత జట్టును ఎంపిక చేయగా... అందులో అయ్యర్ పేరు లేకపోవడం చూసి పంజాబ్ కోచ్ పాంటింగ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. అయినా దాన్ని పెద్దగా పట్టించుకోని శ్రేయస్... గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు 'నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించు... ఫలితం గురించి ఆలోచించకు' అన్న రీతిలో ఐపీఎల్‌పైనే దృష్టి పెట్టాడు. ప్రస్తుతం టెస్టు, టి20 జట్లలో రెగ్యులర్ ఆటగాడు కాని 30 ఏళ్ల అయ్యర్... వన్డేల్లో మాత్రం రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత నాయకత్వ రేసులో ముందు నిలవడం ఖాయమే!

ఒక ఇంటివాడు కానున్న కుల్దీప్

స్నేహితురాలు వంశికతో ఘనంగా నిశ్చితార్థం



లక్నో: టీమిండియా క్రికెటర్ కుల్దీప్ యాదవ్ ఒక ఇంటివాడు కానున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశికతో బుధవారం కుల్దీప్ నిశ్చితార్థం జరిగింది. లక్నో వేదికగా జరిగిన ఈ వేడుకకు ఇరువురి కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు హాజరయ్యారు. వారి సమక్షంలో కుల్దీప్, వంశిక ఉంగరాలు మార్చుకున్నారు. భారత ఆటగాడు రింకూ సింగ్ సహా పలువురు స్థానిక క్రికెటర్లు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈనెల 20 నుంచి ఇంగ్లండ్‌తో జరగనున్న ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌కు కుల్దీప్ భారత జట్టుకు ఎంపికయ్యాడు. ఈ పర్యటన అనంతరం అతడి వివాహం జరగనుంది. తాజాగా ముగిసిన ఐపీఎల్ 18వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన కుల్దీప్ యాదవ్ 14 మ్యాచ్‌లాడి 24.07 సగటుతో 15 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఈ చైనామన్ స్పిన్నర్ జాతీయ జట్టు తరఫున 13 టెస్టుల్లో 56 వికెట్లు, 113 వన్డేల్లో 181 వికెట్లు, 40 టి20ల్లో 69 వికెట్లు పడగొట్టాడు.

గాయత్రి-ట్రెసా జోడీ శుభారంభం

మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు నిరాశ ● ఇండోనేసియా ఓపెన్ టోర్నీ

జకార్తా: ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-14, 22-20తో పొలీనా బురోవా-యెవెనియా కాంటెమిర్ (ఉక్రెయిన్) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 34 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తొలి గేమ్‌ను అలవోకగా సొంతం చేసుకోగా... రెండో గేమ్‌లో గట్టిపోటీ ఎదురైంది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో యుకీ ఫుకుషిమా-మయు మత్సుమోటో (జపాన్)లతో గాయత్రి-ట్రెసా తలపడతారు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్; తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల; అశిత్ సూర్య-అమృత జోడీలు తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టగా... సతీశ్ కుమార్ కరుణాకరన్-ఆద్య వరియత్ ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. సతీశ్-ఆద్య జోడీ 15-21, 21-16, 21-17తో యె హోంగ్ వె-నికోల్ గొంజాలెస్ చాన్ (చైనీస్ తైపీ) జంటపై విజయం సాధించింది. రుత్విక-రోహన్ 14-21, 9-21తో యుచి షిమోగామి-సయాక హొబారా (జపాన్) చేతిలో, అశిత్-అమృత 15-21, 9-21తో మాడ్స్ వెస్టెర్‌గార్డ్-క్రిస్టిన్ బుష్ (డెన్మార్క్) చేతిలో, తనీషా-ధ్రువ్ 11-21, 21-16, 14-21తో టాంగ్ జి చెన్-ఈ వె తో (మలేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు.



కిరణ్ జార్జి ఓటమి

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత పోరాటం ముగిసింది. తొలి రోజు మంగళవారం లక్ష్య సేన్, ప్రణయ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... రెండో రోజు బుధవారం కిరణ్ జార్జి కూడా తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. ప్రపంచ మాజీ చాంపియన్ లో కీన్ యె (సింగపూర్)తో జరిగిన మ్యాచ్‌లో కిరణ్ జార్జి 20-22, 9-21తో ఓడిపోయాడు.

కరువానాపై అర్జున్ విజయం

- నకమురా చేతిలో గుకేశ్ ఓటమి
- ఆధిక్యంలో కోనేరు హంపి



స్టావెంజర్: నార్వే ఓపెన్ చెస్ టోర్నీలో భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ జోరుకు బ్రేక్ పడగా... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత నంబర్‌వన్ ఇరిగేశి అర్జున్ అద్భుత విజయంతో టైటిల్ రేసులోకి వచ్చాడు. ఎనిమిదో రౌండ్‌లో తమిళనాడుకు చెందిన 19 ఏళ్ల గుకేశ్ 50 ఎత్తుల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకమురా (అమెరికా) చేతిలో ఓటమి పాలయ్యాడు. మరోవైపు ప్రపంచ మూడో ర్యాంకర్ అర్జున్ 71 ఎత్తుల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)ను బోల్తా కొట్టించాడు. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతోన్న ఈ టోర్నీలో మరో రెండు రౌండ్‌లు మిగిలి ఉన్నాయి. క్లాసికల్ గేమ్‌లోనే విజయం సాధిస్తే 3 పాయింట్లు లభిస్తాయి. ఒకవేళ క్లాసికల్ గేమ్ 'డ్రా'గా ముగిస్తే విజేతను నిర్ణయించేందుకు అర్మగెడాన్ గేమ్‌ను నిర్వహిస్తారు. క్లాసికల్ గేమ్‌ను 'డ్రా' చేసుకొని, అర్మగెడాన్ గేమ్‌లో గెలిస్తే 1.5 పాయింట్లు లభిస్తాయి. క్లాసికల్ గేమ్‌ను 'డ్రా' చేసుకొని, అర్మగెడాన్ గేమ్‌లో ఓడిపోతే 1 పాయింట్ దక్కుతుంది. క్లాసికల్ గేమ్‌లో ఓడిపోతే ఎలాంటి పాయింట్లు లభించవు. ఎనిమిదో రౌండ్ ముగిశాక కరువానా 12.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. 12 పాయింట్లతో కార్ల్‌సన్ రెండో స్థానంలో, 11.5 పాయింట్లతో నకమురా, గుకేశ్ సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు. 10.5 పాయింట్లతో అర్జున్ ఐదో స్థానంలో, వె యి (చైనా) 8 పాయింట్లతో చివరిదైన ఆరో స్థానంలో ఉన్నారు.

ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 13.5 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. ఎనిమిదో రౌండ్ గేమ్‌లో హంపి 58 ఎత్తుల్లో సారా ఖాదెమ్ (స్పెయిన్)ను ఓడించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి 37 ఎత్తుల్లో ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌పై సంచలన విజయం సాధించింది.



ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్



మూడో వన్డేలోనూ ఓడిన వెస్టిండీస్

లండన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన చివరిదైన మూడో వన్డేలో హ్యారీ బ్రూక్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 40 ఓవర్లలో 9 వికెట్లకు 251 పరుగులు చేసింది. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (71 బంతుల్లో 70; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), గుడకేశ్ మోతీ (54 బంతుల్లో 63; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), అల్జారీ జోసెఫ్ (29 బంతుల్లో 41; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించడంతో విండీస్ గౌరవప్రద స్కోరును సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 3 వికెట్లు తీయగా... సాఖిబ్ మెహమూద్, బ్రైడన్ కార్స్, మాథ్యూ పాట్స్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ లక్ష్యాన్ని 40 ఓవర్లలో 246 పరుగులుగా నిర్ణయించారు. ఇంగ్లండ్ ధనాధన్ ఆటతీరుతో కేవలం 29.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు జేమీ స్మిత్ (28 బంతుల్లో 64; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), బెన్ డకెట్ (46 బంతుల్లో 58; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. వీరిద్దరు అవుటయ్యాక జో రూట్ (49 బంతుల్లో 44; 1 ఫోర్), హ్యారీ బ్రూక్ (36 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), జోస్ బట్లర్ (20 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) లాంఛనాన్ని పూర్తి చేశారు. జేమీ స్మిత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించగా... జో రూట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం దక్కింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ శుక్రవారం మొదలవుతుంది.

థాయ్‌లాండ్ చేతిలో భారత్ ఓటమి

బ్యాంకాక్: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ క్వాలిఫయింగ్ పోటీలకు ముందు థాయ్‌లాండ్‌తో ఆడిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు పరాజయం పాలైంది. బుధవారం జరిగిన పోరులో భారత్ 0-2 గోల్స్‌తో థాయ్‌లాండ్ చేతిలో ఓడింది. భారత్ తరఫున ఒక్క గోల్ కూడా నమోదు కాకపోగా... థాయ్‌లాండ్ తరఫున బెంజమిన్ డేవిస్ (8వ నిమిషంలో), పొరామెట్ అర్జ్‌విలై (59వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. ప్రపంచ 99వ ర్యాంకర్ థాయ్‌లాండ్‌తో గత రెండు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన ప్రపంచ 127వ ర్యాంకర్ భారత్ అదే ప్రదర్శన పునరావృతం చేయలేకపోయింది. 2019 ఆసియా కప్‌లో 4-1తో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసిన భారత్... కింగ్స్ కప్‌లో 1-0తో గెలుపొందింది. భారత స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రీ 24వ నిమిషంలో కొట్టిన చక్కటి హెడర్‌ను థాయ్‌లాండ్ గోల్‌కీపర్ సరానోన్ సమర్థవంతంగా అడ్డుకున్నాడు. 40వ నిమిషంలో అభిషేక్ కొట్టిన షాట్ గోల్ పోస్ట్‌కు కాస్త దూరం నుంచి వెళ్లగా... 80వ నిమిషంలో లాలిన్‌జులా చాంగ్టె కొట్టిన బంతి కూడా లక్ష్యాన్ని చేరలేదు. పలుమార్లు భారత్‌కు గోల్ చేసే అవకాశాలు వచ్చినా... ఫినిషింగ్ లోపంతో వాటిని పూర్తిచేయలేకపోయింది. మరోవైపు డిఫెన్స్‌లోనూ ఆకట్టుకోలేకపోయిన భారత ఆటగాళ్లు... ప్రత్యర్థికి సులువుగా గోల్ చేసే అవకాశం ఇచ్చి పరాజయం పాలయ్యారు. ఆసియా కప్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భాగంగా ఈ నెల 10న హాంకాంగ్‌తో భారత్ తలపడనుంది.



మళ్లీ 'రింగ్'లోకి పకియావ్



లాస్ ఏంజెలిస్: రాజకీయాలకు స్వస్తి పలికి... మళ్లీ 'రింగ్'లోకి అడుగు పెడుతున్నానని ఫిలిప్పీన్స్‌కు చెందిన దిగ్గజ ప్రొఫెషనల్ బాక్సర్ మ్యానీ పకియావ్ ప్రకటించాడు. 46 ఏళ్ల పకియావ్ ఎనిమిది వేర్వేరు వెయిట్ కేటగిరీల్లో 12 సార్లు ప్రపంచ టైటిల్స్ సాధించాడు. 2016 నుంచి 2022 వరకు ఫిలిప్పీన్స్‌లో సెనెటర్‌గా ఉన్న పకియావ్ ఆ తర్వాత దేశాధ్యక్ష పదవి కోసం పోటీపడి మూడో స్థానంలో నిలిచాడు. జూలై 19న లాస్ వేగస్‌లో ప్రపంచ బాక్సింగ్ కౌన్సిల్ చాంపియన్ మరియో బారియోస్ (అమెరికా)తో పకియావ్ తలపడతాడు. ఈ బౌట్‌లో పకియావ్ గెలిస్తే వరల్డ్ వెల్టర్ వెయిట్ (67 కేజీలు) టైటిల్ నెగ్గిన అతి పెద్ద వయస్కుడిగా చరిత్ర సృష్టిస్తాడు. 1995లో ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో అడుగు పెట్టిన పకియావ్ ఇప్పటి వరకు 72 బౌట్‌లలో పోటీపడి 62 బౌట్‌లలో గెలిచాడు. ఇందులో 39 'నాకౌట్' విజయాలు ఉన్నాయి. 8 బౌట్‌లలో ఓడిపోగా, 2 బౌట్‌లు 'డ్రా'గా ముగిశాయి.

అతి విశిష్ట సేవా మెడల్లు



లెఫ్టినెంట్ జనరల్లు భవనీశ్ కుమార్, సద్నా ఎస్.నాయర్, రాజేశ్ పుష్కర్, పుష్పేంద్ర పాల్‌సింగ్



రియర్ అడ్మిరల్ మనీశ్ శర్మ, మేజర్ జనరల్లు ఖలీద్ జకీ, రాజేశ్ సేఠీ, ఏడీజీబీఆర్ జార్జి పి.చెరియన్



బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పరమ విశిష్ట సేవా మెడల్లు అందుకుంటున్న లెఫ్టినెంట్ జనరల్లు మనోజ్‌కుమార్ కటియార్, అమర్‌దీప్‌సింగ్ ఔజ్లా, దినేశ్‌సింగ్ రాణా, ధీరజ్ సేథ్

కొరియా సారథికి సవాళ్ల స్వాగతం

రాజకీయ అస్థిరతను పారద్రోలి సుస్థిర పాలనపై దృష్టి

ఉత్తర కొరియాతో శత్రుత్వం తగ్గించుకునేందుకు కృషి

అమెరికా, జపాన్‌లతో సత్సంబంధాల బలోపేతం దిశగా అడుగులు

దక్షిణ కొరియాలో నెలల తరబడి కొనసాగుతున్న రాజకీయ సంక్షోభాన్ని, అధికార అస్థిరతకు చరమగీతం పాడుతూ అధికార పగ్గాలు చేపట్టబోతున్న నూతన అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌కు ఎన్నో సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. ఉత్తర కొరియాతో చిరకాల వైరానికి స్వస్తి పలికి చర్చలు, దౌత్యంతో కొరియా ద్వీపకల్పంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పుతానని బుధవారం మ్యుంగ్ ఉద్ఘాటించారు. దేశంలో అసమానతలను పారద్రోలి అవినీతిపై యుద్ధం చేస్తానని ఆయన అన్నారు. దేశంలో మార్షల్ లా విధించి చివరకు పదవీచ్యుతుడైన యూన్ సుక్ యోల్ స్థానంలో అధ్యక్ష పీఠంపై ఆసీనులైన మ్యుంగ్ దేశాన్ని ఏ స్థాయిలో జనరంజకంగా పాలిస్తారనే అంచనాలు, విశ్లేషణలు ఫలితాలు వెలువడిన వెనువెంటనే వెల్లువెత్తాయి. దాడికి రంకెలేస్తున్న ఉ.కొరియాతో మైత్రి, అమెరికా, జపాన్ మిత్రదేశాలతో సత్సంబంధాల మెరుగు, ఆర్థికవ్యవస్థను ఉరకలెత్తించడం, ట్రంప్‌తో దిగుమతి టారిఫ్‌ల పోరులో నెగ్గడంసహా ఎన్నో అంశాలను మ్యుంగ్ ఏపాటి సమర్థవంతంగా పరిష్కారాల దిశగా లాక్కొస్తారనే మీమాంస సగటు ద.కొరియన్ పౌరుడిలో మొదలైంది.

ఆర్థికాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి

కొన్ని నెలలుగా కుదేలైన ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడంపై తొలుత మ్యుంగ్ దృష్టిసారించనున్నారు. రాజకీయ అస్థిరత కారణంగా తమ పెట్టుబడులకు రక్షణ కరువవుతుందనే అనుమానాలు ఎక్కువవడంతో విదేశీ పెట్టుబడులు తగ్గిపోయాయి. దీనికితోడు వినియోగదారుల వినిమయం సైతం బాగా తగ్గిపోయింది. యువతకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. ట్రంప్ ద.కొరియాపై అధిక టారిఫ్‌ల మోత మోగిస్తాననడం సైతం దేశానికి శరాఘాతమైంది. వీటన్నింటికీ మ్యుంగ్ పరిష్కారాలు వెతకాల్సి ఉంది. ట్రంప్ విధించిన కొత్త పన్నుల అమలుకు 90 రోజుల విరామ గడువు జూలై 9వ తేదీతో ముగుస్తుంది. ఈలోపు ట్రంప్‌తో మ్యుంగ్ చర్చలు జరిపి టారిఫ్‌ల భారాన్ని తగ్గించుకోవాల్సి ఉంది. మరోవైపు తమ దేశంలో తిష్టవేసిన 28,000 మంది అమెరికన్ సైనికులకు జీతాలు, ఆయుధాలు మాత్రమే ట్రంప్ సర్కార్ సమకూర్చుతుంది. మిగతా సకల సౌకర్యాల ఖర్చు ద.కొరియానే భరిస్తోంది. ఈ భారం తగ్గించాల్సిన బాధ్యత ఇప్పుడు మ్యుంగ్ భుజస్కంధాలపై పడింది.

ఉత్తర కొరియాతో దోస్తీకీ సై

కొరియా ద్వీపకల్పంలో శాంతిస్థాపనే ధ్యేయంగా మ్యుంగ్ తానే ఒక అడుగు ముందుకేయాల్సి ఉంది. తమపై అమెరికా వేలాడదీసిన ఆర్థిక ఆంక్షల కత్తిని తొలగించేదాకా చర్చలు ఉండబోవని గతంలోనే ఉ.కొరియా తెగేసి చెప్పింది. ఈనేపథ్యంలో అమెరికాతో దౌత్యం నెరిపి నార్త్‌కొరియాను నేస్తంగా మార్చుకోవాల్సిన బాధ్యత సైతం మ్యుంగ్‌పై ఉంది. సంప్రతింపుల మార్గాన్ని తెరుస్తానని బుధవారం మ్యుంగ్ ప్రకటించారు. మాజీ మంత్రి లీ జోంగ్ సియోగ్‌ను నిఘా చీఫ్‌గా నియమించారు. ఈయనకు గతంలో ఉ.కొరియాతో ద్వైపాక్షిక, శాంతి చర్చలు జరిపిన అపార అనుభవం ఉంది. ఉ.కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్‌తో శిఖరాగ్ర భేటీ వెంటనే సుసాధ్యంకాకపోయినా భవిష్యత్తులో నేరుగా మంతనాలకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు మ్యుంగ్ చెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఉ.కొరియా భారీగా సైనిక,ఆయుధ సాయం చేసిన నేపథ్యంలో రష్యా ద్వారా దౌత్యం జరిపేందుకు సైతం మ్యుంగ్ ప్రయత్నించే వీలుంది.

త్రైపాక్షిక సంబంధాల బలోపేతం

అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థను తమ భూభాగంలో నెలకొల్పడం ద్వారా ఇరు కొరియాల మధ్య అమెరికా కయ్యాన్ని పెంచుతోందని మ్యుంగ్ గతంలో పలుమార్లు ఆరోపించారు. అమెరికా, జపాన్‌లంటే మ్యుంగ్‌కు అస్సలు నచ్చదని గతంలో చాలా సార్లు వార్తలొచ్చాయి. ఇప్పుడీ అపవాదును పోగొట్టుకుని 'వాషింగ్టన్-సియోల్-టోక్యో' త్రైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి చేస్తానని మ్యుంగ్ చెప్పారు. చైనా, రష్యాలతోనూ ఘర్షణాత్మక వైఖరులను మ్యుంగ్ విడనాడాల్సిన తరుణం ఆసన్నమైంది. మ్యుంగ్‌తో త్వరలోనే ద్వైపాక్షి చర్చలు జరుపుతానని జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా బుధవారం చెప్పారు. దీంతో జపాన్‌తో సత్సంబంధాలు మరింత మెరుగయ్యే వీలుంది. టారిఫ్‌లు పెంచుతానన్న ట్రంప్‌తో నేరుగా మాట్లాడే నేతలేక గత కొద్దివారాలుగా ద.కొరియా తెగ ఇబ్బందులు పడింది. కొత్తగా అధికారం చేపట్టిన మ్యుంగ్ తక్షణం ట్రంప్‌తో చర్చలు జరిపి టారిఫ్‌ల భారం తగ్గించాల్సి ఉంది.

సొంతింటి ప్రక్షాళన..

మార్షల్ లా తదనంతర పరిణామాల్లో విపక్ష పీపుల్ పవర్ పార్టీపై కక్ష తీర్చుకోకుండా మ్యుంగ్ సంయమనం పాటించాల్సిన తరుణమిది. గత మూడేళ్లు అధికారంలో ఉన్న పీపీపీ పార్టీపై అక్రమ కేసులు బనాయిస్తూపోతే దేశంలో మళ్లీ నిరసనలు, ఆందోళనలు మొదలై శాంతిభద్రతల పరిరక్షణ పెద్ద సమస్యగా మారొచ్చు. ఇది మ్యుంగ్‌కు కొత్త తలనొప్పులు తేవొచ్చు. రాజకీయ కక్ష సాధింపు విషయంలో మ్యుంగ్ వైఖరి ఇంకా తెలియాల్సి ఉంది. విపక్ష పార్టీల నేతలపై దేశంలో తిరుగుబాటు వంటి తీవ్రమైన అభియోగాల్లో శిక్షలు పడే వీలుండటంతో నిరసనలు జరిగే వీలుంది. వీటిని మ్యుంగ్ ఏ స్థాయిలో ఎదుర్కొంటారో చూడాలి. యూన్ మార్షల్ లా ఘటనపై సమగ్ర దర్యాప్తునకు మాత్రం ఆదేశిస్తానని మ్యుంగ్ చెప్పారు.

శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని మోదీ

ద.కొరియా నూతన అధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన మ్యుంగ్‌కు భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అయ్యేందుకు మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని మోదీ తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు.

–సాక్షి నేషనల్ డెస్క్



భార్య కిమ్ హియాతో నూతన అధ్యక్షుడు జే మ్యుంగ్

పేద కార్మికుడి నుంచి పగ్గాలు చేపట్టేదాకా..

60 ఏళ్ల మ్యుంగ్ 14 ఏళ్ల వయసులో పేదరికంలో మగ్గిపోతూ పరిశ్రమలో బాలకార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించారు. మ్యుంగ్ సియోల్ నగర దగ్గర్లోని ఆండోంగ్ పర్వతమయ గ్రామంలో 1963 డిసెంబర్ 8న జన్మించారు. వాళ్ల తల్లిదండ్రుల ఏడుగురు సంతానంలో మ్యుంగ్ ఐదోవాడు. మ్యుంగ్ తండ్రి పట్టణంలో దుకాణాల సముదాయాలను శుభ్రం చేసేవారు. సామూహిక స్నానాల గదుల వద్ద తల్లి రుసుములను వసూలుచేస్తూ జీవించేవారు. మ్యుంగ్ అక్రమంగా బాలకార్మికునిగా ఆభరణాల తయారీ పరిశ్రమలో, రిఫ్రిజిరేటర్ల అసెంబ్లీ విభాగాల్లో సైతం పనిచేశాడు. ఆ సమయంలో ఫ్యాక్టరీ మెషీన్‌లో పడి ఎడమ చేయి మణికట్టును పూర్తిగా కోల్పోయారు. దీంతో పనిచేయడం కుదరక మళ్లీ చదువు బాటపట్టాడు. 1986లో చుంగ్‌అంగ్ ప్రైవేట్ లా వర్సిటీలో న్యాయపట్టా సాధించారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు మానవహక్కుల కేసులను వాదిస్తూ మంచి లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2005లో రాజకీయాల్లో చేరారు. సామాజిక ఉదారవాద ఊరీ పార్టీలో చేరారు. 2010లో సియాంగ్నమ్ నగర మేయర్‌గా గెలుపొందారు. 2018లో అతిపెద్ద గియోంగీ ప్రావిన్స్‌కు గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2021 అక్టోబర్‌లో కొద్దిలో డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష పదవిని కోల్పోయినా ఏడాది తిరిగేలోపే పార్టీ పగ్గాలు చేపట్టారు. 2024 జనవరిలో బుసాన్ సిటీలో ప్రజాకార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఒక ఆగంతకుడు మెడపై పొడిచి చంపబోయాడు. సర్జరీ తర్వాత ఈయన కోలుకున్నారు. తాజాగా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు.

గజరాజు దొంగ షాపింగ్

- సూపర్‌మార్కెట్‌లోకి దూరి స్నాక్స్‌ను లాగించిన అడవి ఏనుగు
- థాయిలాండ్‌లో ఘటన
- ఏనుగు 'షాపింగ్ బిల్లు'చెల్లించిన వన్యప్రాణి సంరక్షణా సంఘం

బ్యాంకాక్: థాయిలాండ్‌లో ఒక అడవి ఏనుగు అమాంతం సూపర్‌మార్కెట్‌లోకి దూసుకొచ్చి ఎలాంటి బీభత్సం సృష్టించకుండా తనకేం కావాలో అవి మాత్రమే తినేసి నెమ్మదిగా వెళ్లిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నఖోన్ రాట్చసీమా ప్రావిన్సులో ఈ ఘటన జరిగింది. ఈ దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. దుకాణం ఉన్న ప్రాంతం ఖవో ఏఈ జాతీయవనానికి దగ్గర్లో ఉంది. ఈ నేషనల్‌పార్క్‌లో అడవి ఏనుగులు ఎక్కువ. వాటిల్లో కొన్ని అడవి నుంచి బయటికొచ్చి తిరుగుతుంటాయి. అలా తిరిగే ఏనుగుల్లో 27 ఏళ్ల మగ ఏనుగు ప్లాయీ బియాంగ్ లేక్ కూడా ఒకటి. ఈ ఏనుగు తరచూ అదే ప్రాంతంలో సంచరిస్తున్నా ఎవరికీ ఎప్పుడూ ఎలాంటి హానీ తలపెట్టలేదు. అయితే జూన్ రెండో తేదీన ఈ ఏనుగు హఠాత్తుగా ఖంప్లోయీ కకావూ అనే మహిళకు చెందిన ఒక సూపర్ మార్కెట్లోకి దూరింది. అప్పుడు అక్కడే కౌంటర్ వద్ద ఉన్న మహిళా యజమాని ఒక్కసారిగా భయపడిపోయి అరిచి దుకాణంలోపలికి పరుగెత్తింది. సాధారణంగా అడవి మదపుటేనుగులు పట్టరాని ఆవేశంతో సమీప ప్రాంతాలను నాశనంచేస్తాయి. కానీ బియాంగ్‌లేక్ ఏనుగు మాత్రం ఎంతో ప్రశాంతంగా కనిపించింది. కేవలం అక్కడ ఉన్న మిఠాయిలను మాత్రమే తినాలని నిర్ణయించుకుంది. ఎదురుగా ఎన్నో రకాల తినుబండారాలు కనిపిస్తున్నా డీప్ రిఫ్రిజిరేటర్‌ను పక్కకు తోసేసిమరీ స్వీట్లు పెట్టిన చోటుకొచ్చింది. నెమ్మదిగా ఒక్కో స్వీట్ ప్యాకెట్‌ను గుటకాయస్వాహా చేసింది. ఇలా దాదాపు పది ప్యాకెట్లను తినేసింది. ఎలాగూ దాడి చేశాంకదా అదేదో పూర్తిగా సరిపోతుందని అనుకుందేమో. తర్వాత అరటి పండ్లను అమాంతం మింగేసింది. తర్వాత వేరుసెనగపట్టీలను కకకరా నమిలేసింది. తర్వాత నెమ్మదిగా వెళ్లిపోయింది. ''భయంతో లోపలికి పరుగెత్తా. తర్వాత ధైర్యం చేసుకుని పో పో అని ఎంత అరిచినా అది నా మాటను పట్టించుకోలేదు. ఈ ఏనుగును బయట చాలా సార్లు చూశా. మా దుకాణం ముందు నుంచి చాలా సార్లు వెళ్లిందిగానీ ఎప్పుడూ ఇలా 'షాపింగ్'చేయలేదు''అని దుకాణం యజమాని బియాంగ్ లేక్ చెప్పారు. ఏనుగు దుకాణంలో దూరిన వార్త తెల్సి అటవీశాఖ సిబ్బంది వచ్చి దానిని అక్కడి నుంచి తరిమేశారు. అయితే షాపులో ఏనుగు లూటీ వార్త తెలిసి ఒక వన్యప్రాణి సంరక్షణ సంఘం ప్రతినిధులు మా దుకాణానికి వచ్చారు. ఏనుగు షాపింగ్ చేసి బిల్లు చెల్లించకుండా వెళ్లిందని తెలిసింది. ఇదిగోండి ఆ బిల్లు అమౌంట్ అని నష్టపరిహారం 800 థాయ్ బాత్‌లను వాళ్లు చెల్లించివెళ్లారు''అని దుకాణయజమానురాల నవ్వుతూ చెప్పారు.

సూర్యుడినే గెంటేస్తాయా?

- సౌరవ్యవస్థకు పెనుముప్పుగా మిల్కీవే, ఆండ్రోమెడా గెలాక్సీల తాడనం!
- తాజా అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్: సౌర కుటుంబం మొత్తానికి ఆవాసంగా ఉన్న పాలపుంత గెలాక్సీ కొన్ని లక్షల కాంతి సంవత్సరాల తర్వాత సూర్యుడిని గెంటేస్తుందని తాజా అధ్యయనంలో తేలింది. పాలపుంత గెలాక్సీ సమీపంలోనే ఆండ్రోమెడా గెలాక్సీ ఉంది. ఈ రెండింటి మధ్య ఆకర్షణ పెరుగుతుండటంతో ఒకదానితో మరోటి ఢీకొనడమో, విలీనం కావడంతో తథ్యమని దాదాపు వందేళ్ల క్రితమే ఖగోళ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అయితే ఈ సంయోగ ప్రక్రియకు మన సౌరకుటుంబానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని తాజాగా కనుగొన్నారు. ప్రణయ భీకర వేగంతో రెండు గెలాక్సీలు ఢీకొన్నప్పుడు జనించే బలాలు ఊహకందనంత శక్తివంతంగా ఉంటాయి. ఈ బలాలు ఏకంగా గెలాక్సీల్లోని నక్షత్రాలను సైతం చిన్న రాళ్లలాగా దూరంగా విసిరివేయగలవు. ఈ బలాలే మన సూర్యునికి బద్ధశత్రువుగా మారనున్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. గెలాక్సీలు ఢీకొన్నప్పుడు సూర్యుడు తన కక్ష్య నుంచి దూరంగా విసిరివేయబడతాడని, దీంతో ఏకంగా గెలాక్సీ నుంచి గెంటివేతకు గురౌతాడని శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. సూర్యుడు తన కక్ష్యను కోల్పోయినప్పుడు భూమి వంటి గ్రహాల ఉనికే ప్రశ్నార్థకంగా మారనుంది. బలాల తీవ్రతకు విసురుగా దూరంగా వెళ్లే క్రమంలో సూర్యుడు తనతోపాటు తన చుట్టూ ఉండే గ్రహాలను లాగేసుకుంటూ వెళ్లితే సరేసరి. అలా జరగకపోతే గ్రహాలన్నీ చెల్లాచెదురుకావడమో, శాశ్వతంగా కక్ష్యలను కోల్పోయి అనాథలుగా మారడమో ఖాయమని అధ్యయనకారులు అంచనావేస్తున్నారు. నాసా వారి హబుల్ స్పేస్ టెలిస్కోప్, యురోపియన్ స్పేస్ ఏజెన్సీ వారి గియా స్పేస్ టెలిస్కోప్‌ల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించడంతో ఈ మేరకు అంచనాకొచ్చామని వాళ్లు తెలిపారు. సంబంధిత అధ్యయన వివరాలు నేచర్ ఆస్ట్రోనమీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

వేయి కోట్ల ఏళ్ల తర్వాత..!

''వచ్చే 10 బిలియన్ సంవత్సరాల తర్వాత ఈ ఢీకొనే ప్రక్రియ జరగొచ్చు. నేరుగా ఢీకొనే అవకాశాలు 50 శాతమే. సుళ్లు తిరుగుతూ సంయోగం జరిగే అవకాశాలూ ఉన్నాయి. ఇలా 22 భిన్న అవకాశాలను పరిశీలించాం. పొరుగు గెలాక్సీలుగా సంచరించే అవకాశం కూడా ఉంది. ఢీకొంటే మాత్రం జరిగే విధ్వంసంలో మన సూరీడు దూరంగా వెళ్లిపోయే వీలుంది''అని ఈ పరిశోధనలో ముఖ్య రచయిత టిల్ సవాలా చెప్పారు. మరో నాలుగైదు బిలియన్ సంవత్సరాల తర్వాత సూటిగా ఢీకొనే అవకాశాలు సైతం 2 శాతం ఉన్నాయని సవాలా వెల్లడించారు.

అయోధ్య రామాలయం అద్భుతం

బాలరాముడిని దర్శించుకున్న ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్



మస్క్ సోదరి, తండ్రి

అయోధ్య: టెక్నాలజీ దిగ్గజం, స్పేస్ ఎక్స్, టెస్లా సంస్థల అధినేత ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్ బుధవారం ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరాన్ని దర్శించుకున్నారు. భారతీయ సంప్రదాయ కుర్తా పైజామా ధరించి, గర్భాలయంలో బాలరాముడికి ప్రత్యేక పూజలు చేశారు. రామాలయ దర్శనం మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందని ఆనందం వ్యక్తంచేశారు. తాను ఇప్పటిదాకా చేసిన పనుల్లో ఇది చాలా గొప్ప అని చెప్పారు. ఈ ఆలయం చాలా అందంగా ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఇది అద్భుతమైన దేవాలయం అవుతుందని వెల్లడించారు. అయోధ్యలో హనుమాన్ గార్హీ ఆలయాన్ని కూడా ఎరోల్ మస్క్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎరోల్ మస్క్ వెంట కుమార్తె అలెగ్జాండ్ర మస్క్ కూడా ఉన్నారు. ఎరోల్ మస్క్ రాక సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వోటెక్ రెన్యూవబుల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు ఎరోల్ మస్క్ గ్లోబల్ అడ్వైజర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఈ నెల 1న ఇండియాకు వచ్చారు. 6వ తేదీ దాకా ఇక్కడే పర్యటిస్తారు.

కటకటాల్లో కమ్మటి విందు!

- కఫేగా మారిన పురాతన పోలీస్‌స్టేషన్
- మేఘాలయలో విరగబడుతున్న జనం



సోహ్రా 1885 రెస్టారెంట్ ఇదే



లాకప్ లోపల డైనింగ్ హాల్

సోహ్రా (మేఘాలయ):

మూడో నంబర్ లాకప్‌లో పిలుస్తున్నారు వెళ్లు...

ఏడో నంబర్ సెల్‌లో వాళ్లకు ఏం కావాలో చూడు...

యజమాని పురమాయింపులు. ఆ మేరకు కస్టమర్లకు కోరిన వంటకాలను క్షణాల మీద అందించే స్టివార్డ్‌లు. లాకప్పులేమిటి, వాటిలో కస్టమర్లు, స్టివార్డులు ఏమిటని ఆశ్చర్యపోకండి. ఇదంతా కఫేగా రూపాంతరం చెందిన ఓ పురాతన పోలీస్‌స్టేషన్ తాలూకు వర్ణన! మేఘాలయలో ఈస్ట్ ఖాసీ హిల్స్‌లోని సోహ్రా పట్టణంలో 1885 నాటి భవనంలో ఏర్పాటైన ఈ వినూత్న కఫే టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారిపోయింది. ఇప్పుడు రాష్ట్రమంతటా ఎవరి నోట విన్నా దీన్ని గురించిన ముచ్చట్లే! ఈ భవనం బ్రిటిష్ హయాంలో నిర్బంధ కేంద్రంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం పోలీస్‌స్టేషన్‌గా మారింది. రాష్ట్రంలోకెల్లా అతి పురాతన భవనం ఇదే. ఈ హెరిటేజ్ బిల్డింగ్‌ను చక్కని హోటల్‌గా మారిస్తే ఎలా ఉంటుందా అన్న ఆలోచన నాటి డీఎస్పీ వివేక్‌కు వచ్చింది. పురాతన కట్టడం, అందులోనూ పోలీస్ స్టేషన్ కావడంతో ఆ వినూత్న వాతావరణాన్ని ఆస్వాదించేందుకు జనం విరగబడతారన్న ఆయన భావించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దానితో ఏకీభవించింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌ను యుద్ధ ప్రాతిపదికన నిర్మించిన కొత్త భవనంలోకి మార్చేశారు. పాత భవనంలో కఫే నిర్మాణానికి, నిర్వహణకు రెండేళ్ల కింద బిడ్లు పిలిస్తే బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. భవన నిర్మాణాన్ని, పురాతన లుక్‌ను ఎక్కడా మార్చకుండా కేవలం చిన్న చిన్న మార్పులు మాత్రమే చేశారు. గోడలు, పురాతన ఫ్లోరింగ్, కటకటాలతో పాటు అన్నింటినీ వీలైనంత వరకూ యథాతథంగా ఉంచేయడం విశేషం. పోలీస్‌స్టేషన్‌గా ఉండగా వాడిన బ్రిటిష్ కాలం నాటి వస్తువులన్నింటినీ చక్కని అలంకరణ సామగ్రిగా మార్చేశారు. లాకప్‌లను అందమైన డైనింగ్ ఏరియాలుగా తీర్చిదిద్దారు. ఆ కాలం నాటి ఫైర్‌ప్లేస్‌ను కూడా అందమైన మరమ్మతులతో ఆకర్షణీయంగా తయారు చేశారు. అలా చూస్తుండగానే పూర్తిగా భిన్నమైన లుక్కుతో, 100 మంది సీటింగ్ సామర్థ్యంతో కూడిన కఫే సిద్ధమైపోయింది. దీనికి కావాల్సిన డిజైన్‌ను ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరిన ఓ యువ పారిశ్రామికవేత్తే స్వయంగా అందజేశారు! పట్టణం పేరు, కట్టడం తాలూకు పురాతనత్వం రెండూ ప్రతిఫలించేలా దీనికి 'సోహ్రా 1885' అని వినూత్నంగా పేరు పెట్టి మే 22న ఘనంగా ప్రారంభించారు. కటకటాల్లో కోరిన రుచులు ఆస్వాదించడమనే ఆలోచన ఆహారప్రియుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. దాంతో ఊహించినట్టుగానే ఈ కఫేకు తొలి రోజు నుంచే విపరీతంగా పోటెత్తుతున్నారు. చూస్తుండగానే ఇది పెద్ద పర్యాటక ఆకర్షణగా కూడా మారుతోంది. అన్నట్టూ, దీనిపై వచ్చే లాభాలను పూర్తిగా పోలీసుల సంక్షేమానికే వెచ్చించనుండటం విశేషం!

పంజాబ్ యూట్యూబర్ జస్బీర్ సింగ్ అరెస్టు

పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్నట్లు ఆరోపణలు

చండీగఢ్: భారత రహస్య సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేసిన వ్యవహారంలో మరో వ్యక్తిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే అరెస్టయిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ జ్యోతి మల్హోత్రాతో అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెబుతున్నారు. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని, గూఢచర్యం చేస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న పంజాబ్ యూట్యూబర్ జస్బీర్ సింగ్ బుధవారం అరెస్టు చేశారు. పాకిస్తాన్ నిఘా ఏజెంట్లతో అతడు సంప్రదింపులు జరుపుతున్నట్లు గుర్తించారు. జస్బీర్ సింగ్‌కు పాక్ నిఘా అధికారి షకీర్‌తో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అలాగే ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో కూడా సంబంధాలు కొనసాగించినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో జరిగిన పాకిస్తాన్ జాతీయ దినోత్సవ వేడుకలకు అతడు హాజరైనట్లు అధికారులు తెలిపారు. 2020, 2021, 2024లో జస్బీర్ సింగ్ పాకిస్తాన్‌కు వెళ్లొచ్చినట్లు అధికారులు గుర్తించారు. జస్బీర్ సింగ్ ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ విభాగానికి పంపించారు. అందులో పాకిస్తాన్‌కు సంబంధించిన కాంటాక్ట్ నంబర్లు బయటపడినట్లు సమాచారం. అతడు 'జాన్‌మహల్ వీడియో' అనే యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నాడు. 11 లక్షల మందికిపైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. పర్యాటకం, వంటలకు సంబంధించిన వీడియోలు పోస్టు చేస్తుంటాడు.

విచక్షణా గ్రాంటులు అంటే ఏమిటి?

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

పరిపాలనా సంబంధాలు

కేంద్ర, రాష్ట్రాల మధ్య సాధారణ పరిస్థితుల్లో ఉండే పరిపాలనా సంబంధాల గురించి విస్తృతంగా IXవ భాగంలో 256 నుంచి 263 వరకు ప్రకరణల్లో పొందుపరిచారు. ఈ సంబంధాలనే మునిసిపల్ సంబంధాలు అని కూడా అంటారు. దైనందిన పరిపాలన అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుంది.

ప్రకరణ 256 ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కార్యనిర్వహణాధికారాలను పార్లమెంటు చేసిన చట్టాలకు లోబడి వినియోగించాలి. దీని కోసం రాష్ట్రాలకు కొన్ని పరిపాలనా ఆదేశాలను కేంద్రం జారీ చేయొచ్చు.

ప్రకరణ 257 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహణ అధికారాలను కేంద్రం నియంత్రించవచ్చు. రాష్ట్రాలు వాటి అధికారాలను వినియోగించుకునే సందర్భంలో అవి కేంద్ర ప్రభుత్వ అధికారాలను ప్రశ్నించే విధంగా ఉండకూడదు. రైల్వేలు, టెలికమ్యూనికేషన్లు తదితర కేంద్ర ప్రభుత్వ ఆస్తులను రాష్ట్రాలు పరిరక్షించాలి. వాటి పరిరక్షణకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది.

ప్రకరణ 258 ప్రకారం సంబంధిత రాష్ట్ర గవర్నర్ అంగీకారంతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని పాలనా విధులను షరతులతో లేదా షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి బదలాయించవచ్చు.

ప్రకరణ 258ఎ ప్రకారం కేంద్ర ప్రభుత్వ సమ్మతితో (షరతులతో లేదా షరతులు లేకుండా) రాష్ట్ర ప్రభుత్వ పాలనా విధులను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర గవర్నర్ బదలాయించవచ్చు. ప్రకరణ 258ఎ లోని అంశాలను 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 259ని 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 260 ప్రకారం భారత ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా భారత్ బయట ఉన్న భూభాగాల పరిపాలనను చేపట్టవచ్చు.

ప్రకరణ 261 ప్రకారం దేశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు జారీ చేసిన ధ్రువపత్రాలు, పబ్లిక్ రికార్డులను న్యాయతీర్పులపై నమ్మకం ఉంచి గౌరవించాలి.

నదీ జలాల వివాదాలు..

ప్రకరణ 262(1) ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాలు, నదీ లోయలకు చెందిన జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి పార్లమెంటు ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 262(2) ప్రకారం నదీ జలాల వినియోగానికి సంబంధించి ఫిర్యాదులను లేదా వివాదాలను విచారించే అధికారం సుప్రీంకోర్టు లేదా



మరేదైనా న్యాయస్థానం పరిధి నుంచి మినహాయిస్తూ చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. 1956లో పార్లమెంటు అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తారు.

అంతర్రాష్ట్ర మండలి:

ప్రకరణ 263 ప్రకారం భారత రాష్ట్రపతి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవచ్చు. దీనికి హోదారీత్యా ప్రధానమంత్రి అధ్యక్షులుగా ఉంటారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల పాలకులు ఇందులో సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర వివాదాలకు సంబంధించిన అంశాలను విచారణ చేసి సలహాలు ఇస్తారు. అంతర్రాష్ట్ర మండలిని మొదటిసారిగా 1990లో ఏర్పాటు చేశారు.

ఆర్థిక సంబంధాలు

రాజ్యాంగంలోని 12వ భాగంలో 264 నుంచి 300 వరకు ఉన్న ప్రకరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక, ఆస్తుల ఒప్పందాలు మొదలైన అంశాల గురించి ప్రస్తావించారు.

పన్నుల విభజన

కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల విధింపునకు సంబంధించి కచ్చితమైన విభజన చేశారు. కేంద్రం పరిధిలోకి వచ్చే పన్నులు:

- వ్యవసాయేతర ఆదాయంపై పన్ను
- ఎగుమతి, దిగుమతి సుంకాలు
- పొగాకుపై ఎక్సైజ్ సుంకం
- కార్పొరేషన్ పన్ను
- మూలధన విలువపై పన్ను
- వ్యవసాయేతర ఎస్టేట్‌లపై పన్ను
- వారసత్వ పన్ను
- అంతర్రాష్ట్ర రవాణా పన్ను
- స్టాక్ మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజ్ పన్ను
- చెక్కులు, ప్రామీసరి నోట్లు, బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, ఇన్సూరెన్స్ పాలసీల బదిలీలపై పన్ను
- వార్తా పత్రికలపై అమ్మకం పన్ను, ప్రకటనలపై పన్ను
- అంతర్రాష్ట్ర వ్యాపారంలో విధించే అమ్మకం పన్ను
- అంతర్రాష్ట్ర వాణిజ్యంలో సరకులపై విధించే పన్ను
- సర్వీసులపై పన్ను
- వ్యవసాయేతర భూముల వారసత్వ బదలాయింపు పన్ను

రాష్ట్ర జాబితాలో 45 నుంచి 63 వరకు ఉన్న ఎంట్రీలు, 66వ అంశంతో కలిపి మొత్తం 20 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించవచ్చు. అవి:

- భూమి శిస్తు
- వ్యవసాయ భూములపై వారసత్వ పన్ను
- స్థిరాస్తులపై పన్ను (భూములు, భవనాలు)
- మద్యపానంపై పన్ను
- విద్యుత్ వినియోగం, అమ్మకంపై పన్ను
- ప్రకటనలపై పన్ను
- మోటారు వాహనాలపై పన్ను
- టోల్ టాక్స్
- కస్టడీ పన్నులు
- కేంద్ర జాబితాలోని డాక్యుమెంట్లు మినహా మిగతా వాటిపై స్టాంపు డ్యూటీ
- వ్యవసాయ ఆదాయంపై పన్ను
- వ్యవసాయ భూములపై ఎస్టేట్ పన్ను
- ఖనిజాలపై పన్ను
- స్థానిక ప్రాంతాల్లోకి రవాణా అయ్యే వస్తువులపై పన్ను (ఆక్ట్రాయ్)
- వాణిజ్య పన్ను
- రోడ్డు, జల రవాణాలపై పన్ను
- పశువులపై పన్ను
- వృత్తి పన్ను
- వినోదపు పన్నులు
- రాష్ట్ర జాబితాలోని అంశాలకు చెందిన ఫీ

ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ నంబర్లు 35, 44, 47లలో ఉన్న అంశాలపై పార్లమెంటు, రాష్ట్ర శాసన

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

శాఖలు పన్నులు విధించవచ్చు. అవి:

- యాంత్రిక శక్తి ఆధారంగా పనిచేసే వాహనాలపై పన్ను
- స్టాంప్ డ్యూటీస్
- మూడో జాబితాలో పేర్కొన్న వాటిపై వసూలు చేసే ఫీ

అవశిష్ట పన్నులు: కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో పేర్కొనని అంశాలపై కేంద్రం పన్నులు విధించవచ్చు. అవి:
- బహుమతి పన్ను
- సంపద పన్ను
- వ్యయ పన్ను

ప్రకరణ 265 ప్రకారం చట్టబద్ధత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పన్నులు విధించరాదు. అయితే ఫీ వసూలు చేయవచ్చు.

ప్రకరణ 266 ప్రకారం కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ పద్దులు ఉంటాయి.

కేంద్ర సంఘటిత నిధిలోకి కేంద్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను, రుణాలను జమ చేస్తారు. అదేవిధంగా రాష్ట్ర సంఘటిత నిధిలోకి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను జమ చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పద్దుల్లోకి ప్రజల పొదుపు మొత్తాలను జమ చేస్తారు. ఉదా: ప్రావిడెంటు ఫండ్, పోస్టల్ సేవింగ్స్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పొదుపు పత్రాల ద్వారా వచ్చిన మొత్తం.

ప్రకరణ 267(1) ప్రకారం కేంద్ర ఆగంతుక నిధి, రాష్ట్ర ఆగంతుక నిధి ఉంటాయి. ఊహించని ఖర్చులను ముఖ్యంగా.. ప్రకృతి వైపరీత్యాల ద్వారా జరిగిన నష్టం, ఖర్చులను భరించడానికి రాష్ట్రపతి, గవర్నర్ పేరుతో ఆగంతుక నిధిని నిర్వహిస్తారు. పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభల ఆమోదానికి లోబడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిధులను నిర్వహిస్తాయి.

కేంద్ర ఆగంతుక నిధిని 1957లో భారత ఆగంతుక నిధి చట్టం ద్వారా ఏర్పాటు చేశారు.

ప్రకరణ 268: కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల విభజన: కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు సంబంధించి మౌలిక రాజ్యాంగంలో ప్రస్తావించిన అంశాలకు భారీ మార్పులు చేశారు.

2000లో 80వ, 2003లో 88వ రాజ్యాంగ సవరణల ద్వారా ఈ మార్పులు చేశారు.

10వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 80వ రాజ్యాంగ సవరణ చేశారు. దీని ప్రకారం కేంద్రానికి వచ్చిన పన్నుల వాటాలో 29 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలి. ఈ పద్ధతినే 'ప్రత్యామ్నాయ నిధుల బదిలీ' అంటారు. ఇది 1996 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ద్వారా కేంద్ర పన్నులైన కార్పొరేషన్ టాక్స్, ఎక్సైజ్ సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా ఉంటుంది.

2004లో 88వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 266(ఎ)లో సర్వీస్ టాక్స్ అంశాన్ని చేర్చారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రాలు పంచుకుంటాయి.

ప్రకరణ 268 ప్రకారం కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకుంటాయి. ఉదాహరణలు:

- బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్
- చెక్కులు
- ప్రామిసరీ నోటు
- బీమా పాలసీ బదలాయింపు
- కంపెనీ షేర్ల బదలాయింపు
- ఆల్కహాల్ ఆధారంగా తయారు చేసిన ఔషధాలు
- టాయ్‌లెట్ సంబంధ వస్తువులపై ఎక్సైజ్ డ్యూటీలు, స్టాంపు డ్యూటీలు

ప్రకరణ 268ఎ ప్రకారం సర్వీస్ టాక్స్ కేంద్ర ప్రభుత్వమే విధిస్తుంది. దీన్ని కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

ప్రకరణ 269 ప్రకారం కేంద్రం విధించి, కేంద్రమే వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయించే పన్నులు: అంతర్రాష్ట్ర రవాణాలో జరిగే వస్తువుల అమ్మకం, కొనుగోలుపై విధించే పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయిస్తుంది.

ప్రకరణ 270 ప్రకారం కొన్ని పన్నులను కేంద్రమే విధించి, కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలు చేసిన మొత్తం కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజిస్తారు. ఉదా: వ్యవసాయేతర ఆదాయపన్ను, సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర జాబితాలో ప్రస్తావించని ఇతర పన్నులు.

ప్రకరణ 271 ప్రకారం కొన్ని పన్నులపై సర్‌చార్జీలు: పార్లమెంటు ఒక చట్టం ద్వారా ప్రకరణ 269, 270లలో ప్రస్తావించిన పన్నులపై సర్‌చార్జీలు విధించొచ్చు.

ప్రకరణ 272లో ఉన్న అంశాలను 2000లో 80వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 273 ప్రకారం అసోం, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు జనుము, జనుము ఆధారిత ఎగుమతి సుంకాలకు సంబంధించి ప్రత్యామ్నాయ గ్రాంటులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.

ప్రకరణ 274 ప్రకారం రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల విషయంలో పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి పూర్వానుమతి అవసరం.

ప్రకరణ 275 (1) ప్రకారం సహాయ నిధులు (Grantinaid): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రత్యేక అవసరాల అభివృద్ధి కోసం సహాయక నిధులను ఇస్తుంది. ఇవి రెండు రకాలు..

1. చట్టబద్ధ గ్రాంటులు, 2. విచక్షణ గ్రాంటులు.

చట్టబద్ధ గ్రాంటులు అంటే ఆర్థిక సహాయం అవసరమైన రాష్ట్రాలకు మాత్రమే పార్లమెంటు ఒక చట్టం ద్వారా కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు సాధారణ అవసరాలు, ప్రత్యేక అవసరాలకు (ఉదా: ఎస్సీ, ఎస్టీల సంక్షేమం) నిధులు ఇస్తుంది.

ప్రకరణ 275(1)(ఎ) ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఉన్న గిరిజన ప్రాంతాల్లో సహాయక గ్రాంట్లు మొత్తం ఆ రాష్ట్రానికే చెల్లిస్తారు.

ప్రకరణ 275(2) ప్రకారం ఆర్థిక సంఘం సలహా మేరకు రాష్ట్రపతి సహాయక గ్రాంట్లను సంబంధిత అధికారులకు మంజూరు చేస్తారు. దీనికి సంబంధించి పార్లమెంటుకు శాసనం చేసే అధికారం కూడా ఉంది.

ప్రకరణ 276 ప్రకారం వ్యక్తి, వ్యాపారం, ఉపాధి అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వాలు వ్యక్తులపై రూ. 2500లకు మించకుండా వృత్తి పన్ను విధించవచ్చు.

ప్రకరణ 279 ప్రకారం పన్నుల ద్వారా వసూలైన ఆదాయాన్ని నికర ఆదాయంగా నిర్ణయిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ దీనికి సంబంధించి నికర ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తారు.

ప్రకరణ 280 ప్రకారం ఆర్థిక సంఘం ఉంటుంది. భారత రాష్ట్రపతి ప్రతి అయిదేళ్లకు ఆర్థిక సంఘాన్ని ఏర్పరుస్తారు. ఇందులో ఒక చైర్మన్, నలుగురు సభ్యులుంటారు. ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనపై సిఫారసులు చేస్తుంది.

ప్రకరణ 281 ప్రకారం ఆర్థిక సంఘం తన సిఫారసులను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ఆ నివేదికను పార్లమెంటు ముందు ఉంచుతారు.

ప్రకరణ 282 ప్రకారం ప్రజా సౌకర్యార్థం ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రణాళికా సంఘం సిఫారసు మేరకు పార్లమెంటు నిధులు ఇస్తుంది. వీటిని 'విచక్షణా గ్రాంటులు' అంటారు.

ప్రకరణ 285 ప్రకారం కేంద్ర ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించరాదు.

ప్రకరణ 286 ప్రకారం సరకుల క్రయ విక్రయాలకు సంబంధించిన పన్ను విధింపుపై పరిమితులు ఉంటాయి. రాష్ట్రం వెలుపల జరిగే వస్తువుల క్రయ విక్రయాలు,

భారతదేశంలో దిగుమతి, ఎగుమతి చేసే వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు విధించకూడదు.

ప్రకరణ 287 ప్రకారం విద్యుత్‌పై పన్ను మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 292 ప్రకారం దేశంలో లేదా విదేశాల్లో కేంద్రం రుణాలు తీసుకోవచ్చు.

ప్రకరణ 293 ప్రకారం రాష్ట్రాలకు దేశం లోపల మాత్రమే రుణాలను తీసుకునే అధికారం ఉంది.

పాఠశాలలో జాతీయ పండగలు నిర్వహించడంలోని ఉద్దేశం?

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుత విద్యా విధానం దేనికి ప్రాధాన్యం ఇస్తుంది?
   1) పాఠ్యపుస్తకాలు 2) క్రీడాంశ విధానం
   3) పని అనుభవం 4) పరీక్షలు
2. తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాలకు ఆహ్వానించడం వల్ల కలిగే ప్రయోజనం?
   1) వారు తమ పిల్లల కార్యక్రమాలు చూసి ఆనందిస్తారు
   2) వారు పాఠశాల కార్యక్రమాల గురించి తెలుసుకుంటారు
   3) పాఠశాలకు సమాజంతో సంబంధం ఏర్పడుతుంది
   4) పాఠశాల పనితీరును పరిశీలించ గలుగుతారు
3. ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఇచ్చే ఇంటి పని (హోమ్ వర్క్) ఏవిధంగా ఉండాలి?
   1) సులభంగా చేయగలమనే భావన కలిగించేదిగా ఉండాలి
   2) ఆలోచనలను పెంచేవిధంగా ఉండాలి
   3) ఇతరులపై ఆధారపడేట్లు చేసేదిగా ఉండాలి
   4) కష్టతరమైన వాటినే ఇవ్వాలి
4. పాఠశాలలో జాతీయ పండగలు నిర్వహించడంలోని ఉద్దేశం ఏమిటి?
   1) జాతీయభావాన్ని పెంపొందించడం
   2) సామూహికంగా పనిచేయడాన్ని అలవరచడం
   3) పాఠశాలకు సమాజంతో సంబంధాన్ని ఏర్పరచడం
   4) ఒకరినొకరు అభినందించుకోవడాన్ని నేర్పించడం
5. బాలికలు చదువును మధ్యలోనే మానేయడానికి ప్రధాన కారణం ఏమిటి?
   1) ఆర్థిక స్తోమత లేకపోవడం
   2) తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకపోవడం
   3) బాలికలకు విద్య అనవసరం అనే భావన
   4) చిన్న వయసులోనే పెళ్లి చేయడం
6. ఉపాధ్యాయుడి సామర్థ్యం దేనిపై ఆధారపడుతుంది?
   1) క్రమశిక్షణ 2) బోధనా పద్ధతులు
   3) మూర్తిమత్వం 4) నైపుణ్యం
7. ప్రాథమిక పాఠశాలల్లో బోధనా వసతులు, పాఠశాల అవసరాలు ఏ కార్యక్రమం కింద సమకూరుతున్నాయి?
   1) రాజీవ్ విద్యా మిషన్
   2) సర్వశిక్షా అభియాన్
   3) ఆపరేషన్ బ్లాక్‌బోర్డు 4) ఏదీకాదు
8. ఆపరేషన్ బ్లాక్ బోర్డు ముఖ్య ఉద్దేశం?
   1) పాఠశాలల్లో కనీస అవసరాల కల్పన
   2) ఉపాధ్యాయుల నియామకం
   3) మధ్యాహ్న భోజన పథకం అమలు
   4) విద్యార్థులందరికీ ఉపాధి కల్పన
9. విద్యార్థిగా మీరు ఎక్కడ గడపడానికి ఇష్టపడతారు?
   1) మైదానంలో 2) లైబ్రరీలో
   3) తరగతి గదిలో 4) పైవన్నీ
10. ఉపాధ్యాయుడిగా మీరు ఎలాంటి విద్యార్థులను అభిమానిస్తారు?
    1) వినయ, విధేయతలతో నడచుకునేవారిని
    2) అల్లరిచేస్తూ సరదాగా గడిపేవారిని
    3) ఎల్లప్పుడూ చదువుకునేవారిని
    4) అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే వారిని
11. ఒక పని చేసేటప్పుడు కొన్ని ఆటంకాలు ఎదురైతే మీరు ఏం చేస్తారు?
    1) పని పూర్తిగా ఆపేస్తాను
    2) పని తాత్కాలికంగా ఆపేస్తాను
    3) ఆలోచిస్తాను
    4) ఆటంకాలను అధిగమించి పని పూర్తి చేస్తాను
12. మీరు ఒక గణిత సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా సమస్యను త్వరగా సాధించలేకపోతే ఏం చేస్తారు?
    1) విసుగుచెంది మానేస్తాను
    2) ఆలోచిస్తూ కూర్చుంటాను
    3) ఇతరుల సహాయంతో సాధించడానికి ప్రయత్నిస్తాను
    4) రేపటికి వాయిదా వేస్తాను
13. ఒక విద్యార్థి నిరంతరం తన కొంటె చేష్టలతో తరగతిని ఆటంకపరుస్తుంటే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేయాలి?
    1) అతడి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయాలి
    2) ఆ విద్యార్థికి తరగతిలో క్రమశిక్షణ నిర్వహణ బాధ్యతను అప్పగించాలి
    3) ఆ విద్యార్థిని పట్టించుకోకూడదు
    4) తరగతి గది నుంచి ఆ విద్యార్థిని బయటకు పంపించాలి
14. కిందివాటిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సరైన అవగాహన ఉండటానికి దోహదపడే అంశం ఏది?
    1) విద్యార్థులు తమ పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని ఉపాధ్యాయులు అడగడం
    2) ఉపాధ్యాయులు విద్యార్థుల్లో భయభ్రాంతులను కలుగజేయడం
    3) ఉపాధ్యాయులు విద్యార్థులకు సాయం చేసే మార్గదర్శకులుగా ఉండి వారి పట్ల కలుపుగోలుతో ప్రవర్తించడం
    4) ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను సూచించడం



15. ఒక చర్చలో మీరు భాగస్వాములైతే..?
    1) ఇతరులు చెప్పేది జాగ్రత్తగా వింటాను
    2) నేను చెప్పేది ఇతరులు వినేటట్లు జాగ్రత్త పడతాను
    3) చర్చలో పాల్గొనను
    4) ఆలోచిస్తూ కూర్చుంటాను
16. విద్యార్థి పాఠశాలలో గ్రంథ పఠనం చేయడంపై ఉపాధ్యాయుడిగా మీ అభిప్రాయం?
    1) దాని వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుంది
    2) విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుంది
    3) విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందుతుంది
    4) పైవన్నీ
17. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను సరిగా అంచనా వేయగలిగిన వారెవరు?
    1) తల్లిదండ్రులు 2) స్నేహితులు
    3) అధ్యాపకులు 4) పరీక్షకులు
18. ప్రస్తుత విద్యా విధానంలో కనిపించే ప్రధానమైన లోపమేమిటి?
    1) నిరుద్యోగం పెరగడానికి కారణం అవుతోంది
    2) జాతీయ సమగ్రతాభావాన్ని కలిగించడం లేదు
    3) సత్ప్రవర్తనను పెంపొందించడం లేదు
    4) స్వయం పోషకత్వానికి ఉపయోగ పడటం లేదు
19. కొంత మంది విద్యార్థులు మధ్యలోనే బడి మానేస్తున్నారు. దీనికి ఒక కారణం?
    1) తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం
    2) పుస్తకాలు సకాలంలో లభించకపోవడం
    3) విద్యార్థులకు బడిలో పాఠాలు అర్థం కాకపోవడం
    4) పాఠశాల వాతావరణం ఆకర్షణీయంగా లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత
20. తెలివైన విద్యార్థులుగా ఎవరిని పేర్కొంటాం?
    1) ఎల్లప్పుడూ విశ్రాంతి లేకుండా చదువుకునేవారు
    2) పరీక్షల్లో ఎక్కువ మార్కులు సంపాదించేవారు
    3) విద్యపై ఇష్టం చూపేవారు
    4) తమ విజ్ఞానాన్ని నిత్యజీవితంలో ఉపయోగించుకునేవారు
21. క్రమశిక్షణ లక్ష్యం ఏమిటి?
    1) విద్యార్థుల్లో ఐకమత్యాన్ని కలిగించడం
    2) విద్యార్థులను నియమబద్ధులుగా తయారుచేయడం
    3) విద్యార్థుల్లో భయం కలిగించడం
    4) విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడటం
22. విద్యార్థుల ప్రవర్తనపై ప్రభావం కలిగించేది?
    1) నైతిక విద్యాబోధన
    2) తల్లిదండ్రుల పెంపకం
    3) పాఠశాల వాతావరణం
    4) ఉపాధ్యాయుల ఆదర్శం
23. ఉపాధ్యాయులకు ఏది అవసరం?
    1) క్రమశిక్షణ 2) సహనం
    3) గ్రంథాలయ పఠనం
    4) మంచి కంఠస్వరం
24. విద్యార్థులకు రాజకీయాలు బోధించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?
    1) పరిపాలనా విధానం గురించి తెలుసుకుంటారు
    2) వారు రాజకీయల్లో చురుగ్గా పాల్గొంటారు
    3) పార్టీలకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటారు
    4) మంచి నాయకత్వ లక్షణాలను సంపాదిస్తారు
25. మీరు తరగతి గదిలో బోధించే సమయంలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ఆశిస్తారా?
    1) అవసరం లేదు 2) సమయం వృథా
    3) విద్యార్థులందరూ పాల్గొనేలా చూస్తాను
    4) తెలివైనవారిని మాత్రమే ఆమోదిస్తాను
26. విద్యార్థులకు స్వేచ్ఛ ఎందుకివ్వాలి?
    1) దానివల్ల వారిలో క్రమశిక్షణ పెరుగుతుంది
    2) వారికి ఆటలాడుకునే సమయం ఎక్కువగా లభిస్తుంది
    3) వారిలోని అంతర్గత శక్తులు వ్యక్తమవుతాయి
    4) వారు స్వేచ్ఛగా మాట్లాడగలుగుతారు
27. పాఠశాల సక్రమ నిర్వహణలో ఎవరి పాత్ర ప్రాముఖ్యమైంది?
    1) విద్యార్థి 2) ఉపాధ్యాయుడు
    3) ప్రధానోపాధ్యాయుడు
    4) విద్యాశాఖ అధికారి
28. గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మీరు గ్రామానికి ఏం చేస్తారు?
    1) గ్రామస్థులకు పరిశుభ్రత అలవాటు చేస్తాను
    2) నైతిక విద్యను బోధిస్తాను
    3) నిరక్షరాస్యత తొలగిస్తాను
    4) వయోజనులకు విద్య నేర్పిస్తాను
29. నైతిక విద్య ముఖ్య ఉద్దేశం ఏమిటి?
    1) మంచి పౌర లక్షణాలను పెంపొందించడం
    2) ఆదర్శ వ్యక్తిత్వాన్ని పెంపొందించడం
    3) ధార్మిక దృష్టిని కలుగజేయడం
    4) నైతిక విలువలను సృష్టించడం
30. ఉపాధ్యాయుడి ముఖ్య కర్తవ్యం ఏమిటి?
    1) విద్యార్థులు క్రమశిక్షణ పాటించేలా చేయడం
    2) విద్యార్థులను మానసికంగా అభివృద్ధి చేయడం
    3) బోధనా ప్రావీణ్యాన్ని మెరుగుపరచుకోవడం
    4) విద్యార్థులతో పలుమార్లు అభ్యాసం చేయించడం

సమాధానాలు

1) 3;	2) 3;	3) 2;	4) 1;
5) 2;	6) 2;	7) 2;	8) 1;
9) 4;	10) 4;	11) 4;	12) 3;
13) 1;	14) 3;	15) 1;	16) 4;
17) 3;	18) 4;	19) 4;	20) 4;
21) 2;	22) 4;	23) 1;	24) 1;
25) 3;	26) 3;	27) 3;	28) 3;
29) 1;	30) 3;		

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ జమ్మూలో నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ జమ్మూలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
- **పోస్టుల వివరాలు:** బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-01, మెడికల్ ఫిజిసిస్ట్-01, చైల్డ్ సైకాలజిస్ట్-01, క్లినికల్ సైకాలజిస్ట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ(బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), ఎంఎస్సీ, ఎంఏ, ఎంఫిల్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 19.06.2025.
- **వెబ్‌సైట్:** aiimsjammu.edu.in/

దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ 30 ఇంజనీర్ పోస్టులు

కచ్‌లోని దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ.. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ సైట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ సైట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-16, జూనియర్ సైట్ ఇంజనీర్(మెకానికల్)-14.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.05.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.49,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 05.06.2025.
- **వెబ్‌సైట్:** https://www.deendayalport.gov.in/

ఇందిరా పాయింట్ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం- భౌగోళిక స్వరూపాలు

విశాల భారతదేశ భౌగోళిక స్వరూప విశిష్టత, వైవిధ్యం, వాటి ముఖ్య లక్షణాలను ఈ పాఠంలో నేర్చుకుంటారు. వివిధ భౌగోళిక స్వరూపాల ఉనికి అక్కడి ప్రజలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో విద్యార్థులు అవగాహన చేసుకోగలుగుతారు. భౌగో ళిక దృగ్విషయాలు, భారతదేశంలోని వాతావరణ మార్పులకు, భారతీయుల జీవనానికి కావాల్సిన అవసరాలను తీర్చడానికి ఎలా దోహదపడుతున్నాయో ఈ పాఠ్యాంశం ద్వారా వివరణాత్మకంగా తెలుసుకోవచ్చు.

ముఖ్యాంశాలు

భారతదేశ ఉనికి

- భారతదేశం పూర్తిగా ఉత్తరార్ధ గోళంలో ఉంది. 8°4' నుంచి 37°6' ఉత్తర అక్షాంశాల మధ్య 68°7' నుంచి 97°25' తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది.
- భారత ప్రామాణిక కాలమానాన్ని (ఐఎస్‌టీ) నిర్ధారించడానికి అలహాబాద్ (ఉత్తరప్రదేశ్) నుంచి వెళ్లే 82°30' తూర్పు రేఖాంశాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. గ్రీనిచ్ (లండన్) ప్రామాణిక కాలానికి (GMT- Greenwich Mean Time) ఐఎస్‌టీ 5 గంటల 30 నిమిషాలు ముందు ఉంటుంది.
- తూర్పు చివరన ఉన్న ఇంఫాల్ (మణిపూర్)లో సూర్యోదయమైన 80 నిమిషాల తర్వాత పశ్చిమ చివరన అహ్మదాబాద్(గుజరాత్)లో సూర్యోదయం అవుతుంది.
- ప్రపంచ భూభాగమంతా రెండు ప్రధాన భూఖండాల నుంచి ఏర్పడింది. అవి.. అంగారా భూమి (లారేషియా), గోండ్వానా భూమి. భారత ద్వీపకల్పం గోండ్వానా భూభాగానికి చెందింది.
- హిమాలయాలు 20 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి. ఆది మానవులు రెండు లక్షల ఏళ్లక్రితం భూమిపై ఆవిర్భవించారు.

ముఖ్య భౌగోళిక స్వరూపాలు

1) హిమాలయాలు 2) గంగా-సింధు నది మైదానం 3) ద్వీపకల్ప పీఠభూమి 4) తీరప్రాంత మైదానాలు 5) ఎడారి ప్రాంతం 6) దీవులు.

హిమాలయాలు

ఇవి పడమర నుంచి తూర్పునకు 2400 కి.మీ. పొడవున వ్యాపించి ఉన్నాయి. వీటిలో సమాంతరంగా ఉండే మూడు పర్వత శ్రేణులున్నాయి. అవి.. ఉన్నత హిమాలయాలు (హిమాద్రి శ్రేణి), నిమ్న హిమాలయాలు (హిమాచల్ శ్రేణి), బాహ్య హిమాలయాలు (శివాలిక్ శ్రేణి).

గంగా- సింధు నది మైదానం

గంగా-సింధు మైదాన ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించారు. అవి.. పశ్చిమ భాగం, మధ్య భాగం, తూర్పు భాగం.

ద్వీపకల్ప పీఠభూమి

ఈ ప్రాంతాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించారు. అవి.. మధ్య ఉన్నతభూములు, దక్కన్ పీఠభూమి.



తీరప్రాంత మైదానాలు

వీటిని రెండు భాగాలుగా వర్గీకరించారు. అవి.. పశ్చిమ తీర మైదానం (అరేబియా సముద్ర తీర ప్రాంతం). తూర్పు తీర ప్రాంతం (బంగాళాఖాతం తీరం).

ఎడారి ప్రాంతం

థార్ ఎడారి (రాజస్థాన్).

దీవులు

భారత దేశంలో రెండు ద్వీప సమూహాలున్నాయి. అవి..అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవులు

కీలక పదాలు- నిర్వచనాలు

జీవనది: వేసవిలోనూ ఎండిపోకుండా ఏడాది పొడవునా ప్రవహించే నది. **ఉదా:** గంగా, యమునా నదులు.

ద్వీపకల్పం: మూడు వైపులా నీరు ఉండి ఒకవైపు భూభాగంతో ఉండే భూస్వరూపం. **ఉదా:** భారతదేశం.

కోరల్: కోరల్ అనే ఆంగ్ల పదానికి పగడం అని అర్థం. ఇది సముద్రాల్లో జీవించే కీటకం. ఈ పగడపు కీటకాలు కాల్షియం కార్బోనేట్‌ను గ్రహించి తమ కర్పరాలను నిర్మిస్తాయి. ఇవి గుంపులు గుంపులుగా నివసిస్తూ ఒకదానికొకటి పెనవేసుకొని పగడపు దిబ్బలను ఏర్పరుస్తాయి. ఈ దిబ్బలను ప్రవాళ భిత్తికలని పిలుస్తారు. ఇవి సముద్రంపైకి ఉబ్బివచ్చి దీవులుగా ఏర్పడుతాయి. **ఉదా:** లక్షదీవులు

డూన్: హిమాచల్ శ్రేణి (నిమ్న హిమాలయాలు), శివాలిక్ శ్రేణి (బాహ్య హిమాలయాలు)ల మధ్య ఉండే లోయలను స్థానికంగా డూన్ అని పిలుస్తారు.

ఉదా: డెహ్రాడూన్, కోట్లీడూన్, పాట్లీడూన్.

అంగారా భూమి: ప్రస్తుతమున్న ఉత్తరఅమెరికా, యూరప్, ఆసియా ఖండాలు 20 కోట్ల సంవత్సరాల క్రితం ఒక్కటిగానే కలిసి ఉన్న భూభాగంగా ఉండేది. దీన్ని అంగారా భూమి (లారేషియా)గా పిలిచేవారు. ఇది టెథిస్ సముద్రానికి ఉత్తరంగా ఉండేది.

గోండ్వానా భూమి: ప్రస్తుతమున్న దక్షిణఅమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా ఖండాల భూభాగంతో పాటు ఇండియా, మలేషియాలాంటి దక్షిణాసియా ప్రాంతాలన్నీ ఒకే భూభాగంగా ఉండేవి. ఈ భూ భాగాన్ని గోండ్వానా భూమి అనేవారు. ఇది టెథిస్ సముద్రానికి దక్షిణంగా ఉండేది.

శివాలిక్ శ్రేణి: దక్షిణ హిమాలయ పర్వతాలను బాహ్య హిమాలయాలుగా పిలుస్తారు. వీటిని శివాలిక్ పర్వతశ్రేణి అంటారు. ఈ శ్రేణి జమ్ముకశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు అవిచ్ఛిన్నంగా వ్యాపించి ఉంది. వీటి సగటు ఎత్తు 900 మీ. నుంచి 1100 మీ. ఉంటుంది.

పూర్వాంచల్ పర్వతాలు: భారతదేశానికి తూర్పున ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న హిమాలయాలను పూర్వాంచల్ పర్వతాలు అంటారు. ఈ పర్వతాలు అవక్షేప శిలలు, ఇసుకతో ఏర్పడ్డాయి. వీటిని స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు.

ఉదా: పాట్‌కాయ్ కొండలు (నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్), ఖాసీ కొండలు (మేఘాలయ).

ఇందిరా పాయింట్: భారతదేశ దక్షిణ చివరి సరిహద్దును ఇందిరా పాయింట్‌గా పిలుస్తారు. ఇది నికోబార్ దీవుల దక్షిణ చివరన ఉంది.

అంతర్వేది: రెండు నదుల మధ్య ఉండే మైదాన ప్రాంతాన్ని అంతర్వేది అంటారు. ఇది సారవంతమైన భూభాగం. పూర్వం ఇలాంటి ప్రాంతాలపై అధికారం పొందడానికి రాజుల మధ్య యుద్ధాలు జరిగేవి.

ప్రశ్నలు-సమాధానాలు

1. కింది పేరాను చదివి భారతదేశ శీతోష్ణస్థితి, హిమాలయాల గురించి వ్యాఖ్యానించండి.

హిమాలయాల వల్ల శీతోష్ణస్థితి అనేక విధాలుగా ప్రభావితమవుతుంది. ఇవి భారతదేశ ఉత్తర సరిహద్దులో రక్షణ కవచంగా ఉండి తీవ్ర చలికాలంలో మధ్య ఆసియా నుంచి వచ్చే చల్లటి గాలులను అడ్డుకుంటాయి. వేసవిలో వర్షాలకు, పశ్చిమ కనుమలు దాటిన తర్వాత ఉన్న ప్రాంతంలో రుతుపవన శీతోష్ణస్థితికి హిమాలయాలే కారణం. ఇవి లేకపోతే ఉత్తర ప్రాంతం పొడిగా ఉండేది.

జ: ఒక ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఒక క్రమ పద్ధతిలో ఉండే వాతావరణ పరిస్థితులను శీతోష్ణస్థితిగా పిలుస్తారు. ఉష్ణోగ్రత, వర్షపాతం, పీడనం, పవనాలు, ఆర్ద్రత మొదలైన భౌతికాంశాల సగటు స్థితులను శీతోష్ణస్థితి వివరిస్తుంది. వివిధ ప్రదేశాల్లోని శీతోష్ణస్థితి లక్షణాల్లోని తేడాలను నిర్ణయించడంలో మనదేశ వైశాల్యం, వివిధ భౌగోళిక స్వరూపాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనవి హిమాలయ పర్వతాలు.

హిమాలయ పర్వతాలు జమ్ముకశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు భారతదేశ ఉత్తర సరిహద్దుగా సుమారు 2400 కి.మీ. పొడవున వ్యాపించి ఉన్నాయి. శీతాకాలంలో మధ్య ఆసియా నుంచి వీచే అతి శీతల పవనాలు ఉత్తర మైదానాల్లోకి ప్రవేశించకుండా హిమాలయాలు అడ్డగించి ఉత్తర భారతాన్ని చలి నుంచి కాపాడుతున్నాయి. వేసవిలో మైదానాల్లో వర్షం కురవడానికి, పశ్చిమ కనుమల తూర్పు, ఈశాన్య భాగాల్లోనూ రుతుపవన శీతోష్ణస్థితికి హిమాలయాలే కారణం. రుతుపవన శీతోష్ణస్థితి లేకుంటే భారతదేశం ఉష్ణమండల ఎడారిగా మారి ఉండేది. అంతే కాకుండా హిమాలయాల్లోని హిమానీ నదాల నుంచి ప్రవహించే జీవనదుల వల్ల ఉత్తర మైదానాలు సారవంతంగా మారాయి. దీంతో అక్కడ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ విధంగా హిమాలయాల వల్ల భారత శీతోష్ణస్థితి అనేక విధాలుగా ప్రభావితం అవుతోంది.

2. భారతదేశ ప్రధాన భౌగోళిక విభజనలు ఏవి? హిమాలయ ప్రాంత భౌగోళిక పరిస్థితులతో ద్వీపకల్ప పీఠభూమిని పోల్చండి?

జ: భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని ఆరు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు.

1. హిమాలయాలు 2. గంగా - సింధు మైదానం 3. ద్వీపకల్ప పీఠభూమి 4. తీరప్రాంత మైదానాలు 5. ఎడారులు 6. దీవులు.

హిమాలయ ప్రాంతం, ద్వీపకల్ప పీఠభూమికి మధ్య ఉన్న పోలికలు, తేడాలు:

- ఉత్తర భారతదేశ ఉత్తర భాగంలో హిమాలయ పర్వతాలున్నాయి. ఇవి సుమారుగా 5 లక్షల చ.కి.మీ. విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నాయి. భారత ఉత్తర మైదానాలకు దక్షిణంగా ఉన్న పీఠభూమిని ద్వీపకల్ప పీఠభూమిగా పిలుస్తారు. 16 లక్షల చ.కి.మీ. వైశాల్యం ఉన్న ఈ పీఠభూమి విశాలమైన దేశంలో అతిపెద్ద నైసర్గిక స్వరూపం.
- హిమాలయాలు సముద్ర మట్టానికి సరాసరి 600 నుంచి 6100 మీటర్ల ఎత్తు ఉండగా, ద్వీపకల్ప పీఠభూమి 600 నుంచి 900 మీటర్ల సాధారణ ఎత్తుతో క్రమరహితంగా ఉంది.
- హిమాలయాల్లో జన్మించిన గంగా, సింధు, బ్రహ్మపుత్ర నదులు, వాటి ఉపనదులు జీవనదులుగా ప్రవహిస్తూ ఉత్తర భారతదేశాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయి. ద్వీపకల్ప పీఠభూమిలో ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, నర్మద, తపతి లాంటి ముఖ్యనదులు ద్వీపకల్ప పీఠభూమిని సంపన్నం చేస్తున్నాయి.
- హిమాలయాల దక్షిణ భాగంలో గంగా - సింధు మైదానాలు ఉన్నాయి. ఇక్కడి సారవంతమైన నేలలు పలు పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ద్వీపకల్ప పీఠభూమిని ఆనుకొని పశ్చిమ, తూర్పు భాగాల్లోనూ తీర మైదానాలున్నాయి. ఈ మైదానాల్లోని సాగు భూమి వ్యవసాయానికి అత్యంత అనుకూలం.
- ఈ రెండు ప్రాంతాల్లోని భౌగోళిక నిమ్నోన్నతాలు అక్కడ రుతుపవన వర్షపాతం కురవడానికి దోహదపడుతున్నాయి.
- హిమాలయ ప్రాంతంలో దాల్, ఊలార్, కుమావున్, సోమర్ లాంటి ప్రముఖ సరస్సులున్నాయి. చిల్కా, పులికాట్, కొల్లేరు, అష్టముడి లాంటి సరస్సులు ద్వీపకల్ప పీఠభూమిలో ప్రధానమైనవి.

ఈ రెండు ప్రధాన భౌగోళిక స్వరూపాలు అనేక రకాలుగా భారతదేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి.

3. ప్రపంచ పటాన్ని పరిశీలించి భారతదేశ ఉనికిని గురించి క్లుప్తంగా రాయండి.



జ: భారతదేశ ఉనికి

- ఆసియా ఖండ దక్షిణ భాగంలో భారతదేశం ఉంది. భూమధ్య రేఖకు ఉత్తరంగా ఉన్న భారతదేశం ఉత్తరార్థ, పూర్వార్థ గోళాల్లో విస్తరించి ఉంది.
- భారతదేశం భౌగోళికంగా 8°4' నుంచి 37°6' ఉత్తర అక్షాంశాలకు, 68°7' నుంచి 97°25' తూర్పు రేఖాంశాల మధ్య ఉంది.
- మూడువైపులా సముద్రం ఉండి ఒక వైపు భూభాగ సరిహద్దు ఉన్న భారతదేశాన్ని ద్వీపకల్పంగా పరిగణిస్తారు.
- ఇది అక్షాంశాల పరంగా ఉత్తర దక్షిణాలుగా 30 డిగ్రీల పొడవున, అలాగే రేఖాంశాల పరంగా కూడా తూర్పు పడమరలుగా అన్నే డిగ్రీల వెడల్పున వ్యాపించి ఉంది.
- భారతదేశ భూభాగాలైన అండమాన్ నికోబార్, లక్షదీవులు ప్రధాన భూభాగానికి దూరంగా విసిరేసినట్లు ఉన్నాయి.

4. అంతస్థలీయ ప్రవాహం అంటే ఏమిటి?

జ: ఎడారుల్లో ప్రవహించే నది లేదా కాలువల్లోని నీరు సముద్రానికి చేరకుండా సరస్సుల్లోకి ప్రవహించి అక్కడి ఇసుకలోకి ఇంకి అంతర్గతంగా ప్రవహిస్తుంది. ఈ ప్రవాహాలను అంతస్థలీయ ప్రవాహాలు అంటారు.

ఉదా: థార్ ఎడారిలోని లూనీ ప్రవాహం.

5. టెరాయి అంటే ఏమిటి?

జ: సచ్ఛిద్రంగా ఉండే బాభర్ ప్రాంతం కింది నుంచి చిన్న చిన్న నదులు, వాగులు ప్రవహించి కొద్ది దూరంలో బయటికి వచ్చి ప్రవహిస్తాయి. అప్పుడు ఆ ప్రాంతంలో చిత్తడి నేలలు ఏర్పడతాయి. ఈ చిత్తడి ప్రాంతాన్ని టెరాయి అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో తప్పుగా జతపర్చినది?

ఎ) జమ్ముకొండలు- జమ్ముకశ్మీర్
బి) మిష్మీకొండలు- అరుణాచల్‌ప్రదేశ్
సి) కొచ్చార్- అసోం
డి) పాట్కాయ్- ఉత్తరప్రదేశ్

2. కింది ఏ పర్వతాల్లో ఊటీ ఉంది?

ఎ) మహదేవ్ కొండలు బి) నీలగిరి
సి) ఆరావళి డి) అన్నామలై

3. సిమ్లా, నైనిటాల్, ముస్సోరి వంటి వేసవి విడిది స్థావరాలు ఏ ప్రాంతంలో ఉన్నాయి?

ఎ) ఉన్నత హిమాలయాలు
బి) నిమ్న హిమాలయాలు
సి) శివాలిక్ శ్రేణి డి) నీలగిరి

4. ఆరావళి పర్వతాల వర్షచ్ఛాయ ప్రాంతంలో ఉన్న ఎడారి?


ఎ) సహారా బి) థార్
సి) అటకామా డి) సోన్

5. కింది వాటిలో సింధు నది ఉపనది?

ఎ) గండక్ బి) కోసీ
సి) రావి డి) బెట్వా

సమాధానాలు

1) డి; 2) బి; 3) బి; 4) బి; 5) సి.



Command that fixes the minor errors..

1. A technique used by codes to convert an analog signal into a digital bit stream is known as:
a) Pulse code modulation
b) Pulse stretcher
c) Query processing
d) Queue management
e) None of these

2. The most important or powerful computer in a typical network is:
a) desktop b) network client
c) network server
d) network station
e) my computer

3. In MS word what is the short curt of Ctrl + L?
a) Left Align b) Left Indent
c) Increase Left Margin
d) Decrease Left Margin
e) None

4. Which of the following can NOT be used to create parallel style column?
a) Format Tabs
b) Table Insert Table
c) Insert Textbox
d) Format Columns
e) None of these

5. An Internet standard for transferring files is known as:
a) IRC b) Telnet c) FTP
d) WAIS e) None of these

6. Another name for electronic cash or e-cash, the Internet equivalent to traditional cash, is:
a) Cybercast and analog cash
b) Digital cash and cybercom
c) Carders and cybercash
d) Cybercast and digital cash
e) None of these

7. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction:
a) B2C b) C2C c) G2C
d) B2B e) None of these

8. The command that fixes the minor errors of the disk:
a) Error.fix b) Scandisk
c) Chkdsk d) Defrag
e) None of these

9. What is a LAN that has one or more dedicated computers and all others act as recipients?
a) Peer-to-peer model
b) Client/server model
c) P-to-p model
d) Ring network e) None

10. If a computer has a(n) ______ port, it does not need a NIC.
a) Internet b) Ethernet
c) Intranet d) Broad band
e) None of these

11. Microprocessors as switching devices are used for which generation computers?
a) First Generation
b) Second Generation
c) Third Generation
d) Fourth Generation
e) None of these

12. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
a) Extended Binary Coded Decimal Interchange Code
b) Extended Bit Code Decimal Interchange Code
c) Extended Bit Case Decimal Interchange Code
d) Extended Binary Case Decimal Interchange Code
e) None of these

13. Storage capacity of magnetic disk depends on:
a) Tracks per inch of surface
b) Bits per inch of tracks
c) Disk pack in disk surface
d) All of abovee) None of these

14. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is:
a) Memory b) Buffer
c) Accumulator d) Address
e) None of these

15. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ________.
a) Internal modem
b) External modem
c) PC Card modem
d) Wireless modem e) None

16. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
a) ISDN b) Microwave
c) Cable modem d) DSL
e) None of these

17. The rules for exchanging data between computers are called
a) Interconnections
b) Synchronous packages
c) Protocols
d) Data transmission synchronization
e) None of these

18. ______ is the process of breaking down information sent or transmitted across the Internet into small parts called packets.
a) Protocol b) Bandwidth
c) Reformatting d) Identification
e) None of these

19. Relocation bits used by relocating loader are specified (generated) by
a) Relocating loader itself
b) Linker
c) Assembler or translator
d) Macro processor
e) None of these

20. Which of the following scheduling objectives should be applied to the following: the system should attempt to create a mix thus at will keep most devices busy
a) to be fair
b) to balance resource utilization
c) to obey priorities
d) to be predictable e) none

21. A task in a blocked state
a) is executable
b) is running
c) must still be placed in the run queues
d) is waiting for same temporarily unavailable resources
e) none of these

22. The higher versions of the operating systems are so written that programs designed for earlier versions can still be run. What is it called?
a) Upgradability
b) Upward mobility
c) Universality
d) upward compatibility
e) none of these

23. IP address is currently
a) 4 bytes long
b) available in plenty
c) 6 bytes long
d) not assigned as it is all used up
e) none of these

24. Internet data is broken up as
a) Fixed length packets
b) Variable length packets
c) Not packetized
d) 64 bytes packets
e) None of these

25. The packets of an internet message
a) take a predetermined path
b) take a path based on packet priority
c) go along different paths based on path availability
d) take the shortest path from source to destination
e) none of these

26. By an intranet we mean
a) a LAN of an organization
b) a Wide Area Network connecting all branches of an organization
c) a corporate computer network
d) a network connecting all computers of an organization and using the internet protocol
e) none of these

27. The part of machine level instruction, which tells the central processor what has to be done, is
a) Operation code b) Address
c) Locator d) Flip-Flop
e) Register

28. Which of the following systems software does the job of merging the records from two files into one?
a) Security software
b) Utility program
c) Networking software
d) Documentation system
e) None of these

29. Fork is
a) The dispatching of a task
b) The creation of a new job
c) The creation of a new process
d) Increasing the priority of a task
e) None

30. Computer is free from tiresome and boardroom. We call it
a) Accuracy b) Reliability
c) Diligence d) Versatility
e) None of these

31. CD-ROM is a
a) Semiconductor memory
b) Memory register
c) Magnetic memory
d) All the above
e) None of these

32. To produce high quality graphics (hardcopy) in colour, you would want to use a/n
a) RGB monitors b) Plotter
c) Ink-jet printer
d) Laser printer e) None

33. Which of the following IC was used in third generation of computers?
a) SSI b) MSI c) LSI
d) Both a and b
e) None of these

34. On which of the following sites can you set up your email account:
a) www.hotmail.com
b) www.gre.org c) www.linux.org
d) www.syvum.com e) none

35. The acronym NOS refers to the :
a) Operating system on the clients
b) Network order system, or topology
c) Operating system of the network
d) network architecture
e) none of these

36. the most common network strategies are ________
a) star, ring, bus, hierarchical
b) terminal, peer-to-peer, client server
c) topology, protocol, architecture
d) host, client, terminal
e) none of these

Answers

1) a; 2) c; 3) a; 4) d; 5) c; 6) d; 7) b; 8) c; 9) b; 10) b; 11) d; 12) a; 13) d; 14) b; 15) c; 16) d; 17) c; 18) c; 19) b; 20) b; 21) d; 22) d; 23) a; 24) b; 25) c; 26) d; 27) a; 28) b; 29) c; 30) c; 31) d; 32) b; 33) d; 34) a; 35) c; 36) a.